సురభారతీ సాంస్కృతిక గ్రంథమాల : నవమ కుసుమము

సురభారతీ సంస్కృత గ్రంథపునర్ముద్రణమాల : చతుర్థ కుసుమము

సంపాదకుడు :

డా॥ పుల్లెల శ్రీరామచంద్రుడు

శివానన్దలహరి - సౌన్దర్యలహరి

ఆంధ్ర టీకా తాత్పర్యములు

కీ॥శే॥ డా॥ దివాకర్ల వేంకటావధాని
M.A. Ph.D

సురభారతీ సమితి

హైదరాబాదు - 500 007.

శివానన్దలహరి - సౌన్దర్యలహరి
ప్రథమ ముద్రణము 1981
కాపీలు - 1000
పునర్ముద్రణము 2000
కాపీలు - 1000

Sivanandalahari
and
Saundaryalahari
First Edition 1981
Copies : 1000
Second Edition 2000
Copies : 1000

వెల: రూ. 60 - 00

Price Rs. 60 - 00

కాపీలకు :
కార్యదర్శి :
సురభారతీ సమితి,
ఉస్మానియా యూనివర్సిటీ కాంపస్,
హైదరాబాదు - 500 007.

For Copies :
Secretary,
Surabharati Samiti
Osmania University Campus.
Hyderabad - 500 007.

All Rights Reserved

ముద్రణ :
ఆర్.కె. ప్రింటర్స్,
11-2-1124,
గవర్నమెంట్ గరల్స్ హైస్కూల్ ప్రక్కన,
నాంపల్లి, హైదరాబాదు - 29
ఫోన్ నం : 321 41 33

Printed at :
R.K. Printers
11-2-1124,
Near Govt. Girls' Highschool,
Nampally, Hyderabad -29
Phone No : 321 41 33

మలిపలుకు
పునర్ముద్రణకు

భాగ్యనగరంలో, 1970వ సంవత్సరంలో ఆవిర్భవించిన సురభారతీ సమితి సంస్కృతభాషా ప్రచారంకోసం సర్వవిధాలా ప్రయత్నం చేస్తూన్నది. హైదరాబాదు - సికిందరాబాదు నగరాలలో సంస్కృతం క్లాసులు నడిపించడము, అప్పుడప్పుడు పండితుల సమావేశాలు ఏర్పాటుచేయడము, విద్యార్థులలో వ్యాసరచన పోటీలు జరిపించడము- సంస్కృతగ్రంథాలయాన్ని నడిపించడము వంటి కార్యక్రమాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహాయంతోటీ, సంస్కృత భాషాభిమానుల అండ దండలతోటీ నిర్వహిస్తూన్నది. ఈ మధ్య కొన్ని సంస్కృతగ్రంథాలను, తెలుగు ప్రతిపదార్థతాత్పర్యాలతో, తెలుగులిపిలో, ప్రచురించే కార్యక్రమం కూడా సమితి చేపట్టింది. దీనివల్ల దేవనాగరీలిపితో అంతగా పరిచయం లేనివారు కూడా లాభం పొందడానికి అవకాశం ఉంటుందని సమితి అభిప్రాయం.

కొంత కాలంక్రితం శ్రీ తిరుపతి తిరుమల దేవస్థాన కార్యనిర్వాహకులు హిందూమత- సంస్కృతులు ప్రతిఫలించే సంస్కృత గ్రంథాలను ప్రచురించడం కోసం, మంచి ఔదార్యంతో, సమితికి యాభైవేల రూపాయలు విరాళంగా ఇచ్చారు. ఏ గ్రంథాలను ప్రచురిస్తే బాగుంటుందో నిర్ణయించవలసినదిగా సమితి ఒక సలహాసంఘాన్ని నియమించింది. ఆ సంఘం సలహాప్రకారం ఈ క్రింది గ్రంథాలను ప్రచురించాలనీ సమితి కార్యదర్శియైన డా॥ పుల్లెల శ్రీరామచంద్రుడుగారి సంపాదకత్వం క్రింద పన్నెండు గ్రంథాలు ప్రచురించాలని సమితి నిర్ణయించింది.ఆ నిర్ణయం ప్రకారం విదురనీతి, రామాయణంలోని రత్నాలు, సామాన్య ధర్మములు, శాంతిపర్వములోని సూక్తులు, ఈశ ఐతరేయ కఠోపనిషత్తులు, శ్రీ కృష్ణకర్ణామృతము, భాగవతములోని రత్నాలు, ఆర్య అనే ఎనిమిది గ్రంథాలు ప్రచురించడం జరిగింది.

ఈ గ్రంథమాలలో నవమకుసుమంగా డా॥ దివాకర్ల వెంకటావధానిగారు (Retired Professor & Head of the Dept. of Telugu,Osmania University) రచించిన ఆంధ్ర ప్రతిపదార్థ తాత్పర్యాలతో " **శివానందలహరి - సౌందర్యలహరులు**"

1981లో మొదటి సారిగా ప్రకటింప బడినాయి. ప్రస్తుతం 2000లలో పునర్ముద్రణలో చతుర్థకుసుమంగా ముద్రింపబడుచున్నది.

ఈ లహరులు ఆదిశంకరుల రచనలుగా లోకప్రసిద్ధి పొందినవి. వీటిలో ఒకటి శివపారమ్యాన్ని బోధిస్తే రెండవది శక్తి పారమ్యాన్ని బోధిస్తూన్నది. శివ శక్తుల సంబంధం విడదీయరాని సంబంధం అని వాస్తవానికి వారిరువురికీ భేదం లేదనీ తంత్ర శాస్త్రజ్ఞులు చెపుతారు. ఇద్దరి పారమ్యాన్నీ బోధించే రెండు స్తోత్రాలు రచించడం ద్వారా శంకరాచార్యులు కూడ ఈ అభేద సిద్ధాంతమునే సూచిస్తున్నారు. శివానందలహరి చక్కని రూపకాలంకారాలతో , శ్రవణమాత్రం చేతనే భక్తుల హృదయాలలో ఆనందాన్ని అంకురింప చేసే మృదుమధుర శైలిలో వ్రాయబడిన స్తోత్రరత్నం.

పైకి కేవలం స్తోత్రంవలె కనబడే సౌందర్యలహరిలో తంత్ర శాస్త్రానికి సంబంధించిన ఎన్నో విషయాలు నిక్షిప్తమై ఉన్నాయని విజ్ఞులు చెపుతారు. ఒక్కొక్క శ్లోకం ఒక్కొక్క మహామంత్రమట. మనం "సౌందర్యలహరి" అని చెప్పేదానిలో వాస్తవానికి రెండు లహరులు ఉన్నాయి. మొదటి 41 శ్లోకాలకి 'ఆనందలహరి' అనీ రెండవ భాగానికి 'సౌందర్యలహరి' అని పేర్లు. సౌందర్య లహరిలో పాఠభేదాలను అనుసరించి 59 లేదా 60 శ్లోకాలు ఉన్నాయి . సౌందర్యలహరి (మొత్తం) అతి గంభీరమైన తాంత్రిక గ్రంథం అని చెప్పవచ్చును. అందుచేతనే దీనికి 36 వ్యాఖ్యానాలు ఉన్నాయి. ఇందులో ఉన్న మరొక విశేషం ఏమిటనగా – తాంత్రిక విషయాల పరిచయం లేనివారు కూడా ఇందులో ఉన్న కవితా సౌందర్యాన్ని ఆస్వాదించి ఆనందించవచ్చు. ఆంధ్ర పాఠకలోకం ఇతర ప్రచురణలను వలెనే ఈ లహరీ ద్వయాన్ని యితోధికంగా ఆదరించ గలదని సురభారతీ సమితి ఆశిస్తూన్నది.

హైదరాబాదు

అల్లాడి కుప్పుస్వామి
సురభారతీ సమిత్యధ్యక్షులు
ఆంధ్రప్రదేశ మహోన్నత న్యాయాలయ ప్రధాన
న్యాయమూర్తులు (రిటైర్డ్)

శ్రీ

శివానంద లహరి

శ్లో॥ కలాభ్యాం చూడాలంకృతశశికలాభ్యాం నిజతపః
ఫలాభ్యాం భక్తేషు ప్రకటితఫలాభ్యాం భవతు మే,
శివాభ్యా మస్తోక త్రిభువన శివాభ్యాం హృది పున
ర్భవాభ్యా మానంద స్ఫురదనుభవాభ్యాం నతిరియమ్. 1

అ. కలాభ్యాం = సాదాఖ్యచంద్రకళాస్వరూపులును, చూడా, అలంకృత, శశి, కలాభ్యాం = తలలయం దలంకరింపఁబడిన చంద్రుని యొక్క రేఖలు కలవారును; నిజ, తపః, ఫలాభ్యాం = తమ తమ తపస్సులకు ఫలములైనవారును, భక్తేషు = భక్తులయందు; ప్రకటిత, ఫలాభ్యాం = ప్రకటింపఁబడిన ఫలములు కలవారును, అస్తోక, త్రిభువన, శివాభ్యాం = అధికముగా ముల్లోకములకును, మంగళ మెవరివలన కలుగునో అట్టివారును, హృది = హృదయమందు, పునః, భవాభ్యాం = మాటిమాటికిని ఉదయించు (తోచు) వారును; ఆనంద, స్ఫురత్, అనుభవాభ్యాం = ఆనందముయొక్క ప్రకాశించు అనుభూతికలవారును (ఆనందమయులును). అగు, శివాభ్యాం = శివాశివులిరువురికిని, మే = నాయొక్క ఇయం = ఈ, నతిః = నమస్కారము, భవతు = అగుఁగాక. ఈశ్లోకమున రెండేసి విశేషణముల చివర అర్థభేదమున్నను రెండేసి అక్షరముల పునరావృత్తి ఉండుటచే యమకాలంకారము.

తా. సాదాఖ్య చంద్రకళాస్వరూపులును, కేశములందలంకరింపఁబడిన చంద్రకళ కలవారును, ఒండొరుల తపస్సునకు ఫలముగా దాంపత్యమును పొందిన వారును, భక్తుల కభీష్టఫలము లొసంగువారును, ముల్లోకములకును అధిక మంగళము నొసంగు వారును, ధ్యానముచేయువారి హృదయములందు మాటిమాటికిని సాక్షాత్కరించు వారును, నిత్యానందము ననుభవించువారును అగు శివపార్వతులకీ నా నమస్కారమగుఁగాక !

శ్లో॥ గళంతీ శంభో ! త్వచ్చరిత సరితః కిల్బిషరజో
దళంతీ ధీకుల్యాసరణిషు పతంతీ విజయతామ్,
దిశంతీ సంసార భ్రమణ పరితాపోప శమనం
వసంతీ మచ్చేతో హ్రదభువి శివానందలహరీ. 2

అ. శంభో = శివా; త్వత్, చరిత, సరితః= నీచరిత్ర మనెడు నదినుండి; గళంతీ = జాఱుచున్నట్టియు, కిల్బిష, రజః = పాపమనెడు ధూళిని, దళంతీ = అడచుచున్నట్టియు, ధీ, కుల్యా, సరణిషు = మానవుల బుద్ధులనెడు కాలువల మార్గములందు, పతంతీ = పడుచున్నట్టియు, సంసార భ్రమణ, పరితాప ఉపశమనం = జననమరణరూప సంసారమునందు పరిభ్రమించుట వలని సంతాపమునకు ఉపశాంతిని, దిశంతీ = ఇచ్చుచున్నట్టియు, మత్చేతః, హ్రద, భువి = నాచిత్తమనెడు మడుగు ప్రదేశమునందు, వసంతీ = నిల్చున్నదియు; అగు శివ, ఆనందలహరీ = శివుని దర్శించుట లేక ధ్యానించుట వలనకలుగు ఆనందమను ప్రవాహము, విజయతామ్ = జయము పొందుఁగాక ! అలం. రూపకము.

తా. ఓ శివా! నీచరిత్ర మనెడు నదినుండి ప్రవహించుచున్నట్టియు; పాపములనెడు దుమ్మును కడిగివేయుచున్నట్టియు, భక్తుల బుద్ధులనెడు కాలువలదారులందు పడుచునట్టియు, జననమరణరూపమైన సంసారమునందు పరిభ్రమించుట వలని సంతాపమున కుపశాంతి కూర్చునట్టియు, (మోక్షమొసంగునట్టియు) నా చిత్తమనెడు మడుగునందు నిల్చియుండునట్టియు, శివుని ధ్యానదర్శనములచే కలుగు ఆనందమనెడి ప్రవాహము విజయము పొందుగాక ! (పెంపొందు, గాక!)

శ్లో॥ త్రయీవేద్యం హృద్యం త్రిపురహర మాద్యం త్రినయనం
జటాభారోదారం చలదురగహారం మృగధరం,
మహాదేవం దేవం మయి సదయభావం పశుపతిం
చిదాలంబం సాంబం శివ మతివిడంబం హృది భజే. 3

అ. త్రయీ, వేద్యం = ఋగ్యజుస్సామములనెడు, మూడువేదములచే నెఱుగఁదగిన వాడును; హృద్యం = హృదయమున కింపైనవాడును; త్రి, పుర, హరం = త్రిపురుడను రాక్షసుని సంహరించినవాడును (బంగారము, వెండి, ఇనుము అనులోహములచే

మయునిచే నిర్మింపఁబడిన మూడు పురములు త్రిపురములు, వానికధిపతి త్రిపురాసురుడు. ఆ త్రిపురములను శివుడు దహించెను. త్రిపురములను ధ్వంసముచేసినవాడును), ఆద్యం = అన్నిటికిని ఆదియైనవాడును, త్రి, నయనం = మూడునేత్రములు కలవాడును, జటా, భార, ఉదారం = జడల బరువుచే నున్నతుడును (గంభీరుడును), చలత్, ఉరగ హారం = కదలుచున్న పాములు హారములుగాఁ గలవాడును; మృగ, ధరం = లేడిని ధరించినవాడును, మహాదేవం = దేవదేవుడును (మహాదేవుడను పేరుగలవాడును), దేవం = ప్రకాశించువాడును (పరబ్రహ్మస్వరూపుడును), మయి = నాయందు, స, దయ, భావం = దయతోఁగూడిన హృదయముకలవాడును, పశుపతిం = జీవులందఱికి నధిపతియు; చిత్, ఆలంబం = జ్ఞానమున కాధారమైనవాడును, స, అంబం = జగన్మాతయగు పార్వతితోఁగూడినవాడును; అతి, విడంబం = లయకారుడును, అగు, శివం = పరమశివుని, హృది = హృదయమందు, భజే = భజింతును. ఇందు ప్రతిపాదమునందలి మూడేసి విశేషణముల కంత్యానుప్రాసము కలదు.

తా. మూడువేదములచే తెలియదగినవాడును, హృదయమునకు ప్రీతి పాత్రుడును, త్రిపురాసురుని సంహరించినవాడును, అన్నిటికిని ఆదియైనవాడును, ముక్కంటియు, పెద్దజటాజూటముచే గంభీరుడును, కదలుచున్న పాములు హారములుగా గలవాడును, లేడిని ధరించువాడును, మహాదేవనామముడును, పరబ్రహ్మస్వరూపుడును, నాయందు దయతోఁగూడిన హృదయముకలవాడును, జీవుల కధిపతియు, జ్ఞానమున కాధారమైనవాడును, తల్లియైన పార్వతి సగముమేనఁగల వాడును, లయకారుడును అయిన పరమశివుని భజింతును.

శ్లో॥ సహస్రం వర్తంతే జగతి విబుధాః క్షుద్రఫలదాః
న మన్యే స్వప్నే వా తదనుసరణం తత్కృత ఫలమ్,
హరిబ్రహ్మాదీనా మపి నికటభాజా మసులభం
చిరం యాచే శంభో! శివ ! తవ పదాంభోజ భజనమ్. 4

అ. జగతి = జగము నందు. క్షుద్ర, ఫల, దాః = స్వల్పములైన ఫలముల నొసంగు; విబుధాః = దేవతలు, సహస్రం = వేలకొలది; వర్తంతే = వర్తించుచున్నారు; (ఉన్నారు. కాని) స్వప్నే = స్వప్నమందు కూడ; తత్, అనుసరణం = వారి ననుసరించుట, వా = కాని, తత్, కృత, ఫలం = వారిచ్చు ఫలమును కాని, న, మన్యే = స్మరింపను,

శంభో = ఓ శంభూ, శివ = ఓ శివా, నికట భాజాం = సామీప్యమును పొందిన, హరి, బ్రహ్మ, ఆదీనాం, అపి = విష్ణువు బ్రహ్మ మొదలగు వారికి కూడ, అసులభం = సుఖముగా లభింపని, తవ = నీ యొక్క , పద, అంభోజ, భజనం = పద్మముల వంటి పాదముల భజించుటను, సేవను, చిరం = శాశ్వతముగా; యాచే = యాచింతును.

తా. ఓ శంభూ, మహాదేవా ! జగమున స్వల్పఫలముల నొసంగు దేవతలు వేల కొలదిగా నున్నారు. వారి ననుసరించుటకాని వారిచ్చు ఫలమును కాని కలయందు కూడ స్మరింపను. నీ సమీపమందే నివసించు విష్ణువు, బ్రహ్మ మొదలగు వారికి కూడ తేలికగా లభింపని నీపాదపద్మముల సేవను శాశ్వతముగా వేడుదును. ఇతర దేవతలు క్షణికములైన భోగాది ఫలముల నొసంగుదురు. నీ వొక్కడవే అపునరావృత్తి యైన మోక్షము నొసంగ గలవాడవు. అందుచే వారిచ్చు ఫలమును కోరక నీ పాదపద్మముల సేవనే యాచింతును.

శ్లో॥ స్మృతౌ శాస్త్రే వైద్యే శకున కవితా గానఫణితౌ
పురాణే మంత్రే వా స్తుతి నటన హాస్యేష్వ చతురః
కథం రాజ్ఞాం ప్రీతి ర్భవతి మయి కోఽహం పశుపతే !
పశుం మాం సర్వజ్ఞ ! ప్రథితకృపయా పాలయ విభో ! 5

అ. సర్వజ్ఞ = సర్వము నెఱింగిన ఓ శివా; స్మృతౌ = స్మృతియందును, శాస్త్రే = శాస్త్రము నందును; వైద్యే = వైద్యము నందును; శకున, కవితా, గాన ఫణితౌ = శకున శాస్త్రము నందును, కవిత్వము నందును. సంగీతవిధానము నందును; (ఫణితి అనగా వాగ్మితయను నర్థము కూడ కలదు.) పురాణే = పురాణ పఠన మందును, మంత్రే = మంత్ర ప్రయోగమందును, వా = లేక; స్తుతి, నటన, హాస్యేషు = స్తోత్ర పాఠము నందును, అభినయము నందును, హాస్య ప్రసంగము నందును, (అహం = నేను) అచతురః = నిపుణుడనుకాను, మయి = అట్టి నాయందు, రాజ్ఞాం = రాజులకు ; ప్రీతిః = ప్రేమ, ఆసక్తి; కథం = ఎట్లు, భవతి = కలుగును ? పశుపతే, విభో = పశువులకు (జీవులకు) అధిపతి వైన ఓ ప్రభూ ! అహం = నేను, కః = ఎవడను ? పశుం = పవువు నైన ; మాం = నన్ను; ప్రథిత, కృపయా = అధికమైన దయతో; పాలయ = పాలింపుము.

తా. సర్వము నెఱింగిన వాడవును, పశువుల కధిపతివియు, ప్రభుడవును అగు

ఓ శివా; స్మృతియందుకాని, శాస్త్రమునందుకాని, వైద్యమునందు కాని, శకున శాస్త్రమునందు కాని, కవిత్వమందు కాని, సంగీత విధానమునందు కాని, వాగ్వాదమునందు కాని, పురాణపఠనమందు కాని, మంత్రప్రయోగమందు కాని, స్తోత్ర పాఠమునందు కాని, నటనకళ యందు కాని, హాస్యప్రసంగము నందు కాని, నేను నేర్పరిని కాను. అట్టి నా యందు రాజుల కెట్లు ప్రీతి కలుగును ? అసలు నే నెవడను ? పశువను, నీవు పశుపతివి. పశువునైన నన్ను ప్రకటితమైన దయతో కాపాడుము.

శ్లో॥ ఘటో వా మృత్పిండోఽప్యణు రపి చ ధూమోఽగ్ని రచలః
పటో వా తంతు ర్వా పరిహరతి కిం ఘోరశమనమ్,
వృథా కంఠక్షోభం వహసి తరసా తర్కవచసా
పదాంభోజం శంభో ర్భజ పరమ సౌఖ్యం వ్రజ సుధీః. 6

అ. సుధీః = ఓ (తర్క శాస్త్ర) పండితుడా ! ఘటః, వా = కుండకాని, మృత్, పిండః, అపి = మట్టిముద్ద కాని, అణుః = అణువు కాని; అపి, చ = మఱియు, ధూమః = పొగకాని, అగ్నిః = అగ్నికాని, అచలః = పర్వతముకాని, పటః, వా = వస్త్రము కాని; తంతుః, వా = దారము కాని; ఘటపటవహ్ని ధూమాచలాదులు తార్కికులు వాదము లందు వాడు పదములు; ఘోర, శమనం = భయంకరుడైన యముని (మృత్యువును); పరిహరతి, కిం = తొలగించునా యేమి ? తరసా = తీవ్రమైన, వేగవంతమైన; తర్క , వచసా = తర్క శాస్త్రమునకు సంబంధించిన వాక్కుచే; కంఠ, క్షోభం = కంఠ శోషను; వృథా = వ్యర్థముగా, వహసి = వహించుచున్నావు; శంభో = శివునియొక్క ; పద, అంభోజం = పద్మము వంటి పాదమును; భజ = సేవింపుము; పరమ, సౌఖ్యం = అత్యున్నతమైన సౌఖ్యమును, (మోక్షమును) వ్రజ= పొందుము.

తా. ఓ తర్కపండితుడా ! ఘటముకాని, మట్టిముద్దకాని, అణువుకాని, పొగకాని, అగ్నికాని, పర్వతముకాని, వస్త్రముకాని, దారముకాని నీవు వాదము నందు వాడుచుండు నీ పదము లేవి కాని భయంకరమృత్యువును తొలగింపఁగలవా ? తొలగింపలేవు. అందుచే తీవ్రమైన యీ తర్క వాక్కుచే వ్యర్థముగా కంఠ శోషకలిగించు కొనుచున్నావు. దయాసముద్రుడైన శివుని పాదపద్మమును భజింపుము. పరమోత్కృష్టమైన మోక్ష సౌఖ్యమును పొందుము. శాస్త్రవాదముల వలనఁగాక పరమేశ్వరపాదపద్మ భజనము వలననే మానవత్వమునకు సార్థక్యము కలిగించు మోక్షానందము లభించునని భావము.

శ్లో॥ మన స్తే పాదాబ్జే నివసతు వచఃస్తోత్రఫణితౌ
కర శ్చాభ్యర్చాయాం శ్రుతిరపి కథాకర్ణనవిధౌ,
తవ ధ్యానే బుద్ధి ర్నయనయుగళం మూర్తివిభవే
పరగ్రంథా న్కైర్వా ! పరమశివ ! జానే పరమతః. 7

అ. పరమశివ = పరమేశ్వరా, మనః = నామనస్సు, తే = నీ యొక్క, పాద అబ్జే = పద్మములవంటి పాదమునందు, నివసతు = ఉండుఁగాక. వచః = వాక్కు, స్తోత్ర ఫణితౌ = నీస్తోత్రపఠనమందు, ఉండుఁగాక. కరః, చ = నాచేయియును; అర్చాయాం = నీ పూజయందు; ఉండుఁగాక. శ్రుతిః = అపి = చెవి కూడ, కథా ఆకర్ణనవిధౌ = ఈ కథలను విను క్రమమునందు, ఉండుఁగాక. బుద్ధిః = నా బుద్ధి, తవ = నీయొక్క, ధ్యానే = ధ్యానము చేయుటయందు, ఉండుఁగాక. నయన యుగళం = నాకను దోయి, మూర్తి విభవే = నీ మూర్తి వైభవమును దర్శించుటయందు ఉండుఁగాక ! నా సర్వేంద్రియములును ఈ విధముగా నీయందే లగ్నములై యుండ, అతః పరం = ఇంతకంటె వేఱుగా; పర గ్రంథాన్ = ఇతరములైన శాస్త్రాదిగ్రంథములను; కైః వా = వేనితో, జానే = తెలిసికొందును ?

తా. పరమేశ్వరా ! నా మనస్సు నీ పాదపద్మమునందును, నా వాక్కు నీ స్తోత్రపాఠమునందును, నాచేయి నీ సేవయందును, నాచెవి నీ కథలను వినుటయందును, నా బుద్ధి నిన్ను ధ్యానించుటయందును, నా కనుదోయి నీ మూర్తివైభవమును దర్శించుటయందును మగ్నమై యుండుఁగాక ! అట్లవి ఉండుచో నేనంతకంటె వేఱుగా నితర శాస్త్ర గ్రంథాదుల నే యింద్రియములతో నెఱుంగుదును ? నా యింద్రియములన్నియు భవత్సేవా కథాకర్ణన ధ్యానములందే లగ్నములై యుండ నేనింక వేనితో నితర గ్రంథములను తెలిసికొనుటకు యత్నింతుననియు, నా గ్రంథాంతరములందుకూడ నీతత్త్వమే ప్రతిపాదింపఁబడి యుండును కావున వాని నెఱుగవలసిన అవసరమే యుండదనియు భావము.

శ్లో॥ గభీరే కాసారే విశతి విజనే ఘోరవిపినే
విశాలే శైలే చ భ్రమతి కుసుమార్థం జడమతిః,
సమర్ప్యైకం చేతస్సరసిజ ముమానాథ ! భవతే
సుఖే నావస్థాతుం జన ఇహ న జానాతి కి మహో ! 8

అ. ఉమానాథ = ఓ పార్వతీపతీ ! జడ మతిః = మందబుద్ధియైన మానవుడు, కుసుమ అర్ధం = పూవులనిమిత్తము, గభీరే = అగాధమైన, కాసారే = తటాక మందు, విశతి = చొచ్చును, విజనే = జనరహితమైన, ఘోరవిపినే = భయంకరమైన అడవియందును, విశాలే = విస్తీర్ణమైన, శైలే వా = పర్వతమందును, భ్రమతి = తిరుగును. ఏకం = ఒకటైన (ప్రధానమైన), చేతః సరసిజం = హృదయమనెడి పద్మమును, భవతే = నీకొఱకు, సమర్ప్య = సమర్పించి, ఇహ = ఈ లోకమందు, సుఖేన = సుఖముతో, అవస్థాతుం = ఉండుటకు, జనః = జనుడు, కిం = ఎందుకు న జానాతి = ఎఱుగడో! అహో = ఆశ్చర్యము !

తా. ఓ పార్వతీ పతీ ! మందబుద్ధియైన జనుడు నిన్ను, పూజించుటకు పూవుల నిమిత్తం లోతైన తటాకములందు దిగును. నిర్జనమైన భీకరారణ్యము నందును పెద్ద పర్వతమునందును పరిభ్రమించును. అతడు తనలోనే యున్న ప్రధానమైన ఒక్క హృదయ పద్మమును నీకై సమర్పించి యీ లోకమున సుఖముగానుండుట యెందుల కెఱుంగడో కదా ! ఇది ఆశ్చర్యకరము. హృదయము భగవదర్పితమైనచో బాహ్యాడంబరములైన పుష్పాదులతో పనిలేదని భావము.

శ్లో॥ యథా బుద్ధి శ్శుక్తౌ రజత మితి, కాచాశ్మని మణిః
జలే పైష్టే క్షీరం, భవతి మృగతృష్ణాసు సలిలం,
తథా దేవభ్రాంత్యా భజతి భవదన్యం జడజనో
మహాదేవేశం ! త్వాం మనసి చ న మత్వా పశుపతే ! 9

అ. పశుపతే = జీవులకు ప్రభువైన, ఓశివా ! జడ జనః = మందుడైన నరుడు, యథా = ఏవిధముగా, శుక్తౌ = ముత్తెపు చిప్పయందు, రజతం ఇతి = వెండి అనియు, కాచ, అశ్మని = గాజురాతి యందు, మణిః, ఇతి = మణి అనియు, పైష్టే = పిండితో కూడిన, జలే = నీటియందు, క్షీరం ఇతి = పాలనియు, మృగతృష్ణాసు = ఎండమావులయందు, సలిలం ఇతి = నీరనియు, బుద్ధిః = భ్రాంతితో కూడినబుద్ధి, భవతి = అగునో, తథా = ఆ విధముగనే, మహాదేవ ఈశం = దేవదేవుడవైన, త్వాం = నిన్ను, మనసి చ = మనస్సునందును, న మత్వా = తలంపక, దేవ భ్రాంత్యా = దేవుడను భ్రమతో, భవత్ అన్యం = నీకంటె నితరుని, చ భజతి = సేవించును. చ అను అవ్యయముచే మనస్సునందే కాక యితరేంద్రియములచే కూడ భావింపక అని ఊహింపవచ్చును.

తా. ఓ పశుపతీ ! మందబుద్ధియైన నరుడు ముత్తెపు చిప్పను చూచి వెండియనియు, గాజుపూసనుచూచి మణియనియు, పిండికలిపిన నీటిని చూచి పాలనియు, ఎండమావులను చూచి నీరనియు బుద్ధియందు భ్రాంతిపడునట్లు దేవదేవుడైన నిన్ను మనస్సునందు తలఁపక నీకంటె అన్యుని దేవుడని భ్రమించి భజించుచుండును. ఇతరదేవతలు స్వల్పకామములను పూరింపవచ్చును కాని మోక్షము నీఁజాలరు. వారిని పూజించినచో నైహికవాంఛలే యీడేరును కాని పరమార్థము లభింపదు.

శ్లో॥ నరత్వం దేవత్వం నగ వన మృగత్వం మశకతా
పశుత్వం కీటత్వం భవతు విహగత్వాది జననం,
సదా త్వత్పాదాబ్జ స్మరణ పరమానందలహరీ
విహారాసక్తం చే ద్ధృదయ మిహ కిం తేన వపుషా. 10

అ. నరత్వం = మానవత్వము, దేవత్వం = దేవతాత్వము, నగ వన మృగత్వం[1] = పర్వతత్వము అరణ్యత్వము, మృగత్వము, (లేడితనము) మశకతా = దోమతనము, పశుత్వం = పశువు తనము, కీటత్వం = పురుగుతనము, విహగత్వ ఆది జననం = పక్షిత్వము మొదలగు పుట్టుక, భవతు = అగుఁగాక, హృదయం = చిత్తము, సదా = ఎల్లప్పుడును, త్వత్ , పాద. అబ్జ, స్మరణ, పరమ, ఆనంద లహరీ, విహార, ఆసక్తం, చేత్ = నీ పద్మములవంటి పాదముల స్మరించుట వలనఁగలుగు ఉత్కృష్టమైన ఆనందమనెడి ప్రవాహమునందు ఆసక్తిగలది అయినచో, ఇహ = ఈలోకమున, తేన, వపుషా = పైన పేర్కొనఁబడిన నరత్వాది శరీరముచేత, కిం = ఏమి ? ఏజన్మ లభించిన నేమినష్టము ?

తా. నాకు నరుడుగా, దేవతగా, పర్వతముగా, అడవిగా, లేడిగా, దోమగా, పశువుగా, పురుగుగా, పక్షి మొదలైనవిగా పుట్టుక కలుగవచ్చును. నే నే రూపమున జన్మించినను శివా ! హృదయమెల్లప్పుడును పద్మములవంటి నీ పాదముల స్మరించుట వలన, గలుగు మహానంద ప్రవాహమున ఓలలాడునదగుచో నాకు పైవానిలో దేని జన్మము లభించిన నేమి ? నాకే జన్మము కలిగినను నీ పాదారవిందముల స్మరించుట వలని ఆనందము లభించుచో ధన్యత్వము కలుగునని భావము.

---

1. నగ వనమృగత్వం = కొండలమీదను వనములలోను నివసించు మృగముగా అగుట అనికూడ అర్థము.

శ్లో॥ వటు ర్వా గేహీ వా యతి రపి జటీ వా తదితరో
నరో వా యః కశ్చి ద్భవతు భవ ! కిం తేన భవతి,
యదీయం హృత్పద్మం యది భవదధీనం పశుపతే !
తదీయ స్త్వం శంభో ! భవసి భవభారం చ వహసి. 11

అ. భవ = శివా, వటుః, వా = బ్రహ్మచారిగాని,, గేహీ, వా = గృహస్థుడు కాని, యతిః వా = సన్యాసికాని జటీ, వా = జటాధారికాని, తత్, ఇతరః నరః, వా = పైవారికంటె అన్యుడైన మానవుడుకాని యః, కః, చిత్ = ఎవరోఒకడు, భవతు = అగు గాక! తేన = అట్లగుటచే, కిం = ఏమి, భవతి = అగును ? ఏమి నష్టము లేక విశేషము కలదు ? పశుపతే = ఓ పశుపతీ, శంభో = శివా, యదీయం = ఎవరికిసంబంధించిన, హృత్, పద్మం = పద్మమువంటి హృదయము, భవత్, అధీనం, యది = నీఅధీనమైనది (నీయందాసక్తి కలది) అగుచో, త్వం = నీవు, తదీయః = ఆతనికి సంబంధించిన వాడవు, భవసి = అగుదువు, భవ; భారం, చ = అతని సంసార (జన్మ) భారమును, వహసి = వహింతువు.

తా. శివా, నరుడు బ్రహ్మచారికాని గృహస్థుడుకాని, సన్యాసికాని, జడదారి కాని తదన్య ప్రవృత్తి కలవాడుకాని యెవరోయొకరు కావచ్చును. అందువలన విశేషమేమియులేదు. ఓ పశుపతీ, శంభూ! ఎవరి హృదయపద్మము నీయందు తత్పరమగునో నీవు వారివాడవగుదువు. అంతేకాదు, వారి సంసార (జన్మ) భారమంతయు వహింతువు. నరు డే ఆశ్రమమునందున్నను శివపరాధీనచిత్తుడగుచో అతని భారమునంతను అతడే వహించును.

శ్లో॥ గుహాయాం గేహే వా బహి రపి వనే వాద్రిశిఖరే
జలే వా వహ్నౌ వా వసతు వసతేః కిం వద ఫలమ్,
సదా యస్యై వాంతఃకరణ మపి శంభో ! తవ పదే
స్థితం చే ద్యోగోఽసౌ స చ పరమయోగీ స చ సుఖీ. 12

అ. శంభో = శివా; (నరుడు) గుహాయాం = కొండగుహయందుకాని; గేహే, వా = గృహమునందుకాని, బహిః, అపి = బయటకాని; వనే, వా = అడవియందు కాని; అద్రి శిఖరే = పర్వతాగ్రమునందు కాని; జలే, వా = నీటి యందు కాని, వహ్నౌ, వా = అగ్ని యందు కాని, వసతు = నివసించు గాక; వసతేః = అట్లువసించుట వలన;

వాసస్థలము వలన; కిం, ఫలమ్ = ఏమిప్రయోజనమో; వద = చెప్పుము, సదా = ఎల్లప్పుడును; యస్య = ఎవని యొక్క; అంతః కరణం, అపి = హృదయము కూడ; తవ = నీయొక్క, పదే, ఏవ = పాదము నందే; స్థితం చేత్ = ఉన్నదగుచో; అసౌ = అదే; యోగః = మహాయోగము; సః, చ = వాడే; పరమ, యోగీ = మహాయోగి; సః, చ = వాడే; సుఖీ= సుఖవంతుడు.

తా. శివా ! మానవుడు కొండగుహయందు కాని, యింటియందు కాని, బయట అడవియందు కాని, కొండ కొన యందుకాని, నీటి యందుకాని అగ్ని యందు కాని నివసింపవచ్చును. వసించుచోటు వలన ఏమి ప్రయోజనమో తెల్పుము. వాని హృదయ మెల్లప్పుడును నీ పాదపద్మాసక్తమై యుండుచో అదే యోగము. అతడే మహాయోగి. అతడే సౌఖ్యవంతుడు. హృదయమందలి భక్తి ప్రధానము కాని, వసించు స్థలము ప్రధానము కాదని భావము.

శ్లో॥ అసారే సంసారే నిజభజనదూరే జడధియా
భ్రమంతం మా మంధం పరమకృపయా పాతు ముచితం,
మదన్యః కో దీన స్తవ కృపణ రక్షాతినిపుణః
త్వదన్యః కో వా మే త్రిజగతి శరణ్యః పశుపతే ! 13

అ. పశుపతే = పశుపతివగు శివా ! నిజ భజన, దూరే = నీ భజనకు దూరమైన; అసారే = సారమేలేని; సంసారే = సంసారమందు; జడ, ధియా = మంద బుద్ధితో; భ్రమంతం = పరిభ్రమించుచున్న ! అంధం = గ్రుడ్డివానిని; మాం = నన్ను; పరమ, కృపయా = అత్యంతదయతో, పాతుం = రక్షించుట; ఉచితం = తగును; తవ = నీకు; మత్, అన్యః = నాకంటె నితరుడు, దీనః = దీనుడు (రక్షింపఁ దగిన వాడు) కః = ఎవడు? మే = నాకు; త్రిజగతి = ముల్లోకము లందును; త్వత్, అన్యః = నీ కంటె ఇతరుడు, కృపణ, రక్షా, అతి, నిపుణః = దీనులను రక్షించుట యందు మిక్కిలి నేర్పరియైన, శరణ్యః = శరణు చొరఁదగినవాడు, రక్షకుడు, కః, వా = ఎవరు?

తా. పశుపతీ ! నీ భజనకు దూరమైనదియు, సారహీనమైనదియు అగు సంసారమందు పరిభ్రమించు గ్రుడ్డిని, నన్ను అత్యంతదయతో రక్షించుట తగును. ఏలయన నీకు నాకంటె రక్షించుటకు దగిన దీనుడిం కెవడున్నాడు ? మఱి నాకో నీ కంటె దీనులను రక్షించుటయందు మిక్కిలి నేర్పరియైన రక్షకుఁడింకెవడున్నాడు ? నే నత్యంత దీనుడను.

నీవు దీన రక్షణమందత్యంతనిపుణుడవు. అందుచే నన్ను రక్షింపుము.

శ్లో॥ ప్రభుస్త్వం దీనానాం ఖలు పరమబంధుః పశుపతే !
ప్రముఖ్యోఽహం తేషా మపి కిముత బంధుత్వ మనయోః
త్వయైవ క్షంతవ్యా శ్శివ ! మదపరాధాశ్చ సకలాః
ప్రయత్నా త్కర్తవ్యం మదవన మియం బంధుసరణిః. 14

అ. పశుపతే శివ = పశుపతివైనశివా, త్వం = నీవు, దీనానాం = దీనులకు, ప్రభుః = అధిపతియు, పరమ, బంధుః, ఖలు = అత్యంత భాంధవుడవునుకదా, అహం = నేను, తేషాం అపి = ఆ దీనులలో కూడా, ప్రముఖ్యుః = మిక్కిలి ప్రధానుడను, అనయోః = ఇరువురికి, బంధుత్వం = చుట్టఱికము, కిం, ఉత = మఱేమి కాషలయును ? సకలాః = సర్వమైన, మత్, అపరాధాః = నానేరములును, త్వయా, ఏవ = నీ చేతనే, క్షంతవ్యాః = క్షమింపఁదగినవి. అందుచే, మత్, అవనం = నా యొక్క రక్షణము, ప్రయత్నాత్ = ప్రయత్నమువలన (గట్టిగాయత్నించి), కర్తవ్యం = చేయవలసియున్నది. ఇయం = ఇది, బంధు, సరణిః = చుట్టఱికపుపద్ధతి.

తా. పశుపతివైనశివా, నీవు దీనులకు దగ్గఱిచుట్టమువైన విభుడవుకదా? నేనట్టి దీనులలో అగ్రగణ్యుడను. మనయిరువురికి ఇంతకంటె చుట్టఱికమేమి కాలయును ? నానేరములన్నియు నీచేతనే క్షమింవఁదగినవి. అందుచే నారక్షణము ప్రయత్నపూర్వకముగా చేయవలసియున్నది. ఇది చుట్టఱికపు క్రమము, బంధువు చేయవలసిన విధానము.

శ్లో॥ విరించి ర్దీర్ఘాయుర్భవతు భవతా తత్పరశిర
శ్చతుష్కం సంరక్ష్యం స ఖలు భువి దైన్యం లిఖితవాన్,
విచారః కో వా మాం విశదకృపయా పాతి శివ ! తే
కటాక్షవ్యాపారః స్వయమపి చ దీనావనపరః 15

అ. శివ = శంకరా! విరించిః = బ్రహ్మ ! దీర్ఘ, ఆయుః = దీర్ఘమైన ఆయుర్దాయముకలవాడు; భవతు = అగుఁగాక ! తత్, పర, శిరః, చతుష్కం = అతని ఇతరములైన (ఐదుతలలుండగా దక్షాధ్వరధ్వంన సమయమున నీవు ఒకతలను త్రుంచివేయగా మిగిలిన) నాలుగుతలలును, సంరక్ష్యం = లెస్సగారక్షింపఁదగినవి (చతుష్కం

ఏకవచనము కావున సంరక్ష్యం అని ఏకవచనము ప్రయోగింపఁబడినది) సః = అతడు, భువి = భూమియందు (భూనివాసులైన నావంటి వారి నొసళ్ళు యందు), దైన్యం = దీనత్వము, లిఖితవాన్ = వ్రాసినవాడాయెను. అందువలన, విచారః = సందేహము, శంక, కః = వా = ఏమికలదు ? స్వయం అపి చ = తనంతతానే, దీన, అవన, పరః= దీనులను రక్షించుట యందాసక్తిగల, తే = నీయొక్క, కటాక్ష, వ్యాపారః = కడకంటి చూపుల ప్రసారము, విశద, కృపయా = తెల్లనైన దయతో, మాం = నన్ను, పాతి = రక్షించును.

తా. శివా ! బ్రహ్మ చిరాయువగుఁగాక. నీవు త్రుంచివేయగా మిగిలిన అతని మస్తక చతుష్టయము రక్షింపఁదగినది. అతడేకదా భూమిపైనున్న మానవుల ఫాలభాగములందు దీనత్వమును వ్రాసియున్నాడు. దానివలన దుఃఖముకాని శంక కాని యేమియులేదు. ఏలయన తనంత తానే దీనులను రక్షించుటయందు తత్పరమైన నీక్రీఁగంటి చూపులప్రసారము నన్నధికదయతో రక్షించును. అతడునొసట దైన్యము వ్రాయుటచేతనే కదా నీకడకంటి చూపులను బడయు భాగ్యముకలుగుచున్నది. అందుచే నతడు చిరాయువై యుండుగాక !

శ్లో। **ఉపేక్షా నోచేత్ కిం న హరసి భవ ద్ధ్యానవిముఖాం**
దురాశాభూయిష్ఠాం విధిలిపి మశక్తో యది భవాన్,
శిర స్తద్వైధాత్రం న నఖలు[1] సువృత్తం పశుపతే!
కథం వా నిర్యత్నం కరనఖముఖేనైవ లులితం. 16

అ. పశుపతే = పశుపతీ ! ఉపేక్షా = అశ్రద్ధ, నో, చేత్ = లేకయున్నచో, భవత్, ధ్యాన, విముఖాం = నీధ్యానమునకు దూరమైన, దురాశా, భూయిష్ఠాం = దురాశతోకూడిన, విధి, లిపిం = (భవద్ధ్యానవైముఖ్యము, దురాశాపరత్వము అని నానొసట వ్రాయఁబడిన) బ్రహ్మవ్రాతను, (అక్షరములను), కిం = ఎందుకు, న, హరసి = తొలగింపవు. భవాన్ = నీవు, అశక్తః , యది = అసమర్థుడవైనచో, అసమర్థుడనందువేని, న, న,ఖలు = కాదుకాదుసుమా! అట్టినయెడల, తత్ = ఆ, సువృత్తం = నాల్గుతలల నడుమచక్కగా కూర్పఁబడిన, వైధాత్రం = బ్రహ్మకు సంబంధించిన, శిరః = తల, నిర్యత్నం = యత్నములేకుండ నే (అవలీలగా) కర, నఖ, ముఖేన, ఏవ = చేతి గోటికొనచేతనే, కథం, వా = ఎట్లుగా, లులితం = త్రుంచివేయబడినది.

---

[1] నఖైः లూయతే ఇతి = నఖలు, ననఖలు "గోళ్లచే ఛేదింప శక్యముకానిది" అని కూడ అర్థము చెప్పుదురు.

తా. పశుపతీ ! నీకు నాయెడ ఉపేక్షాభావమే లేనియెడల నీధ్యానము నెడ వైముఖ్యము కలిగియుండునట్లును, దురాశతోకూడి యుండునట్లును బ్రహ్మ నా నొసట వ్రాసిన వ్రాతను ఎందుకు తొలగింపవు ! నీవు అసమర్థుడనందువేని కాదు కాదుసుమా ! ఏలయన నిజముగా నశక్తుడ వైనచో నాల్గుతలల నడుమ దృఢముగా నిబద్ధమైన ఆ బ్రహ్మతల అయత్నముగా నవలీలగా నీ చేతిగోటి కొనతోడనే యెట్లు త్రుంచివేయఁబడినది ? బ్రహ్మతలనే త్రుంచివేసిన నీ కతని వ్రాతను తుడిచివేయుట క్లేశకరముకాదు. అందుచే భవధ్ధ్యానవైముఖ్య దురాశాపరత్వరూపమైన బ్రహ్మవ్రాతను తొలగింపుమని భావము.

శ్లో॥ ఫలాద్యా పుణ్యానాం మయి కరుణయా వా త్వయి విభో!
ప్రసన్నేఽపి స్వామిన్ ! భవ దమల పాదాబ్జ యుగళం,
కథం పశ్యేయం మాం స్థగయతి నమ స్సంభ్రమజుషాం
నిలింపానాం శ్రేణి ర్నిజ కనక మాణిక్య మకుటైః. 17

అ. విభో = ప్రభూ ! స్వామిన్ = స్వామీ, శివా, పుణ్యానాం = నేనొనరించిన పుణ్యములయొక్క, ఫలాత్, వా = ఫలములవలనకాని, మయి = నాయందలి, కరుణయా వా = నీ దయవలన కాని, త్వయి = నీవు , ప్రసన్నే, అపి = అనుగ్రహము కలవాడవైనను, భవత్, అమల, పాద, అబ్జ యుగళం = నీ పవిత్రమైన పద్మములవంటి పాదముజంటను, నేను, కథం = ఎట్లు ? పశ్యేయం = చూడజాలుదును ? ఏలయన, నమః, సంభ్రమ, జుషాం = నీకు నమస్కారము చేయుట యందు వేగిరపాటుపొందుచున్న, నిలింపానాం = దేవతలయొక్క, శ్రేణిః = వరుస, నిజ, కనక, మాణిక్య , మకుటైః = తమ బంగారముతోడను రత్నము తోడను గూడిన కిరీటములచే, మాం = నన్ను, స్థగయతి = కప్పివేయుచున్నది.

తా. ప్రభూ ! స్వామీ ! శివా ! నేనాచరించిన పుణ్యఫలము వలనకాని, నీకు నాయందుగల దయవలన కాని నీవు నాయందనుగ్రహముకల వాడవైనను నీ పవిత్ర పాదపద్మయుగళమును నేనెట్లు చూడఁగలను ? నీకు నమస్కారము చేయుటకై తొందరపడుచున్న దేవతలగుంపు రత్నములు పొదిగిన స్వర్ణమయములైన తమ కిరీటములచే నన్ను కప్పివేయును. దేవతలు గుంపుగుంపులుగావచ్చి యెప్పుడును నీ పాదములపై తమ రత్న స్వర్ణకిరీటములు మోపి సాష్టాంగనమస్కారము లొనరించుటకు తొందరపడుచుందురు. ఆ కిరీటములు నాదృష్టులనడ్డగించుటచే నేను నీ పాదపద్మములను జూడఁజాలను.

శ్లో॥ త్వ మేకో లోకానాం పరమ ఫలదో దివ్యపదవీం
వహంత స్త్వన్మూలాం పున రపి భజంతే హరిముఖాఃˌ
కియద్వా దాక్షిణ్యం తవ శివ ! మదాశా చ కియతీ
కదా వా మద్రక్షాం వహసి కరుణా పూరిత దృశా. 18

అ. శివ = పరమేశ్వరా, లోకానాం = లోకములకు (దేవతాదులకు) త్వం, ఏకః = నీ వొకడవే, పరమ, ఫల, దః = ఉత్కృష్టమైన ఫలమునిచ్చువాడవు. త్వత్, మూలాం = నీవుకారణముగాఁగల, దివ్య, వదవీం = దేవతాపదవిని, వహంతః = పొందుచున్నవారైనను, హరి, ముఖాః = ఇంద్రుడు (విష్ణువు) మొదలైనవారు, ఇతోధికమైన యున్నతిని పొందుటకై, పునఃˌ అపి = తిరిగి తిరిగి, భజంతే = నిన్ను సేవించుచుందురు, తవ = నీయొక్క, దాక్షిణ్యం = దయ, కియత్, వా = ఎంతటిదో ! మత్, ఆశా, చ = నా ఆశయును, కియతీ, వా = ఎంతటిదో ! కదా, వా = ఎప్పుడు, కరుణా, పూరిత, దృశా = దయతోనిండిన చూపుతో, మత్, రక్షాం = నారక్షణమును, వహసి = భరింతువో.

తా. శంకరా! ముల్లోకములకును నీవొక్కడవే ఉత్కృష్టఫలము నిచ్చు వాడవు. నీవుకారణముగాఁగల ఇంద్రత్వ విష్ణుత్వాది దివ్యపదవులను పొందుచున్నవారైనను విష్ణు బ్రహ్మేంద్రాదులంతకంటెను ఉన్నతతరమైన మోక్షఫలమును పొందుటకై మరలమరల నిన్ను సేవించుచునే యుందురు. మఱి నావిషయమేమగునో తెలియకున్నది. నీ దయ యెట్టిదో నా ఆశ యెట్టిదో ? దయాపూర్ణమైన చూపుతో నన్ను రక్షించు భారము నెప్పుడు వహింతువో ?

శ్లో॥ దురాశాభూయిష్ఠే దురధిపగృహద్వారఘటకే
దురంతే సంసారే దురితనిలయే దుఃఖజనకే,
మదాయాసం కిం న వ్యపనయసి కస్మోపకృతయే
వదేయం ప్రీతి శ్చేత్తవ ఖలు కృతార్థా వయమపి. 19

అ. దురాశా, భూయిష్ఠే = దురాశతోనిండినదియు, దురధిప, గృహ, ద్వార, ఘటకే = దుర్మార్గులైన ప్రభువుల భవనద్వారములందు నిల్పునదియు; దురంతే = చెడ్డఅంతముకలదియు; అనంతమైనదియు; దురిత, నిలయే = పాపములకు నిధానమైనట్టియు; దుఃఖ, జనకే = దుఃఖముకలిగించునట్టియు; సంసారే = సంసారమందు;

మత్, ఆయాసం = నాశ్రమను; కిం = ఎందుకు; న, వ్యపనయసి = పోఁగొట్టవు ? కస్య = ఎవరియొక్క; ఉపకృతయే = ఉపకారముకొఱకు? (కశబ్దమునకు బ్రహ్మయనునర్థముకూడకలదు. అప్పుడు బ్రహ్మయొక్క యుపకారముకొఱకు అనియు చెప్పవచ్చును. బ్రహ్మ నా నొసట నట్లు వ్రాసెను. కావున నతని వ్రాత సఫలము చేయుటకా అని భావము). ఇయం = ఇది; తవ = నీకు; ప్రీతిః చేత్ = ప్రియమైనచో; వద = చెప్పుము; వయం, అపి = మేముకూడ; కృతార్థాః, ఖలు = ధన్యులమే కదా!

తా. శివా ! దురాశాపూరితమును, దుష్టులైన ప్రభువుల భవనముల ద్వారములందు నిలబడునట్లు చేయునదియు, అసౌఖ్యకరమైనదియు, (అంతము లేనిదియు) పాపములకు నిలయమైనదియు, దుఃఖము కలిగించునదియు నగు సంసారమునందుపడియున్న నా క్లేశము నెందుకు తొలగింపవు ? ఎవరి యుపకారము కొరకు ? (బ్రహ్మదేవుని మేలునకా) ఇది నీకు ప్రీతికరమైనచో చెప్పుము. మేము కూడ కృతార్థులమగుదుము. నీ ప్రీతియే మాకు ధన్యత చేకూర్చునని భావము.

శ్లో॥ సదా మోహాటవ్యాం చరతి యువతీనాం కుచగిరౌ
నట త్యాశాశాఖా స్వటతి ఝటితి స్వైరమభితః,
కపాలిన్ ! భిక్షో! మే హృదయకపి మత్యంత చపలం
దృఢం భక్త్యా బద్ధ్వా భవ ! భవదధీనం కురు విభో ! 20

తా. భవ = శివా, (నా హృదయమనుకోతి) సదా = ఎల్లప్పుడును, మోహఅటవ్యాం = మోహమనునడవియందు, చరతి = సంచరించును. యువతీనాం = జవ్వనులయొక్క, కుచ, గిరౌ = స్తనమనుపర్వతమందు, నటతి = నటించును. ఆశా, శాఖాసు = ఆశ లనుకొమ్మలందు; అభితః = అంతటను, ఝటితి = వేగముగా, స్వైరం = స్వేచ్ఛగా, అటతి = తిరుగును. (మనస్సునకు మర్కటమునకును సమానలక్షణములు చెప్పఁబడినవి). కపాలిన్ = బ్రహ్మకపాలముచేతఁగలవాడా, భిక్షో = ఆదిభిక్షూ, విభో = ప్రభూ, అత్యంత, చపలం = మిక్కిలి చంచలమైన, మే = నా యొక్క, హృదయ, కపిం = హృదయమను కోతిని, దృఢం = దృఢముగా గట్టిగా, భక్త్యా = భక్తి (యనుత్రాటి) తో, బద్ధ్వా = బంధించి, భవత్, అధీనం = నీయధీనము (నీ యదుపులోనున్నదానిని) కురు = చేయుము.

తా. శివా, ప్రభూ నా హృదయ మనుమర్కటము సంతతము మోహ మను

నడవియందు సంచరించును. తరుణులస్తనము లను పర్వతములందు నాట్యముచేయును. ఆశ లనుకొమ్మలయందంతటను స్వేచ్ఛగను వేగముగను పరిభ్రమించును. ఓ కపాలీ, ఆదిభిక్షూ ! మిక్కిలి చంచలమైన నా హృదయ మనుకోతిని దృఢముగా భక్తితో బంధించి నీకు స్వాధీనమైన దానినిగా చేసికొనుము. నా మనస్సు చంచలమైన కోతి వంటిది. స్థిరత్వములేక అటునటు చలించుచుండును. దానిని భక్తిభరితము చేసి నీయధీనము కావించుకొనుము. నీవా భిక్షకుడవు. బ్రహ్మపుట్టె నీచేత కలదు. దానికి తోడు నా మనస్సనెడి కోతిని కూడ నీతో త్రిప్పుకొన్నచో నీకు భిక్షయు లభించును. నాకు భక్తిచే భవత్సాన్నిధ్యమును చేకూరును. అలం. రూపకము.

శ్లో॥ ధృతి స్తంభాధారాం దృఢగుణనిబద్ధాం సగమనాం
విచిత్రాం పద్మాఢ్యాం ప్రతిదివస సన్మార్గఘటితాం
స్మరారే ! మచ్చేతః స్ఫుటపటకుటీం ప్రాప్య విశదాం
జయ స్వామిన్ ! శక్త్యా సహ శివగణై స్సేవిత విభో ! 21

అ. స్మర, అరే = మన్మథునకు శత్రువైన ఓ శివా ! ధృతి, స్తంభ, ఆధారాం = ధైర్యమను స్తంభ మాధారముగాఁగలదియు, దృఢ, గుణ, నిబద్ధాం = దిట్టమైన (స్థిరమైన) గుణములనెడి త్రాళ్లచే కట్టఁబడినదియు, సగమనాం = గతితోకూడినదియు (ఎక్కడికైనను పోవునదియు) పటకుటిపక్షమున ఎక్కడికైనను తీసికొని పోవుటకనువైనదియు, విచిత్రాం = ఆశ్చర్యకరమైనదియు, చిత్రవర్ణముకలదియు, పద్మ, ఆఢ్యాం = పద్మమువలె సంపన్నమైనదియు, పద్మాకారచిత్రములచే సుందరమైనదియు, ప్రతి, దివస, సత్, మార్గ, ఘటితాం = ప్రతిదినమును ఉత్తమమైన మార్గమున కూర్పఁబడినదియు (నిత్యముత్తమ మార్గమున సంచరించునట్లు చేయఁబడినదియు) ప్రత్యహము యోగ్యమగు విధమున. [1]నేర్పుఁబడినదియు, విశదాం = నిర్మలమైనదియు, అగు,మత్, చేతః, స్ఫుట, పట, కుటీం = నాచిత్తమనెడి వికసించు వస్త్ర కుటీరమును (డేరాను), ప్రాప్య = పొంది, శివ, గణైః = ప్రమథగణములచే, సేవిత = సేవింపబడునట్టి, విభో = ప్రభూ, స్వామిన్ = దేవా, శక్త్యా, సహ = శక్తియైన పార్వతితోఁ గూడ, జయ = విరాజిల్లుము, అలం. రూపకము.

ఆ. ఈశ్లోకమున చిత్తము పటకుటీరముతో పోల్పబడినది. ఓ మదనాంతకా,

---

[1]డేరా కావున "మంచిమార్గ (మధ్య) మున నిర్మింపబడినది" అనికూడ అర్థము

శివా, ధైర్యమనుస్తంభ మాధారముగాఁగలదియు, స్థిరములైన గుణములనెడి త్రాళ్ళచే కట్టఁబడినదియు, ఎక్కడికైన పోవునదియు (తీసికొనిపోవుటకు వీలైనదియు), ఆశ్చర్యకరమైనదియు (చిత్రవర్ణములతో కూడినదియు) పద్మమువలె సుందరమైనదియు (పద్మాకారచిత్రములచే నుందరమైనదియు), ప్రతిదినము ఉత్తమమార్గమున నుంచఁబడునదియు (యోగ్యవిధమున నేర్పఱుపఁబడునదియు) నిర్మలమైనదియు (ధవళవస్త్రనిర్మితమును) అగు నాచిత్త మనువికసించు దేరాను పొంది ప్రమథగణ సేవితుడవైన ప్రభూ, దేవా ! శక్తియైన పార్వతితో కూడ విరాజిల్లుము. నాచిత్తము నీవు నివసించుటకు సుఖకరముగా నుండును కావున గణసేవితుడవై పార్వతితోకూడ నందు నివసింపుమని భావము.

శ్లో॥ ప్రలోభాద్యై రర్థాహరణపరతంత్రో ధనిగృహే
ప్రవేశోద్యుక్తస్సన్ భ్రమతి బహుధా తస్కరపతే !
ఇమం చేతశ్చోరం కథ మిహ సహే శంకర ! విభో !
తవాధీనం కృత్వా మయి నిరపరాధే కురు కృపామ్. 22

అ. తస్కర, పతే = దొంగలకునాయకుడా ("తస్కరాణాం పతయే నమః" నమకము) శంకర = శివా, విభో = ప్రభూ, నాచిత్తమనుదొంగ, ప్రలోభ, ఆద్యైః = అధికమైనలోభము మున్నగు నాశాకారణములగు గుణములచే, అర్థ, అపహరణ పరతంత్రః = ధనమును హరించుట యందాసక్తుడై, ధని, గృహే = ధనముకల వారి గృహమందు, ప్రవేశ, ఉద్యుక్తః, సన్ = ప్రవేశించుటకు సిద్ధమై, బహుధా = పలువిధముల; భ్రమతి = పరిభ్రమించుచున్నాడు; ఇమం = ఈ; చేతః, చోరం = చిత్తమనుదొంగను; ఇహ = ఇచ్చట ; కథం = ఎట్లు; సహే = సహింతును ? ఆ దొంగను; తవ, అధీనం = నీకధీనమైనవానిని ; కృత్వా = చేసి; నిరపరాధే = నేరములేని; మయి = నాయందు; కృపాం = దయను, కురు = చేయుము, అలం, రూపకము.

తా. దొంగలకధిపతివైన ప్రభూ ! శివా ! నా చిత్త మనుచోరుడు అధికలోభాదులచే ప్రేరితుడై ధనమును హరించుట యందాసక్తికలవాడై ధనికుల గృహమందు చొచ్చుటకు సిద్ధుడై పలువిధముల కొట్టుమిట్టాడుచున్నాడు. ఈ నా చిత్తమనుచోరుని నేనెట్లు సహింతును ? నీవు తస్కరపతివి కావున నతనిని స్వాధీనము కావించుకొని నిర్దోషినైన నాయందు

దయచూపుము. నా మనస్సు మోహప్రేరితమైన పరధనాదులను హరింప యత్నించుచున్నది. నేనెట్లు సహింతును ? నీవు దానిని నీయధీన మొనరించుకొని దోషరహితుడ నైన నాయందు దయచూపుము.

శ్లో॥ కరోమి త్వత్పూజాం సపది సుఖదో మే భవ విభో !
విధిత్వం విష్ణుత్వం దిశసి ఖలు తస్యాః ఫల మితి,
పున శ్చ త్వాం ద్రష్టుం దివి భువి వహన్ పక్షిమృగతా
మదృష్ట్వా తత్ఖేదం కథ మిహ సహే శంకర విభో !. 23

అ. విభో = ప్రభూ ! శంకర, విభో = స్వామీ శివా ! త్వత్, పూజాం = నీ పూజను, కరోమి = చేయుదును, సపది = వెంటనే; మే = నాకు; సుఖదః = మోక్షసుఖమునిచ్చువాడవు; భవ = అగుము; తస్యాః = ఆపూజకు; ఫలం, ఇతి = ఫలమని; విధిత్వం = బ్రహ్మత్వమును, విష్ణుత్వం = విష్ణుత్వమును; దిశసి, ఖలు = తప్పకయీయవచ్చును; కానిఅందువలన లాభమేమి ? పునఃచ = అప్పుడుకూడమరల; త్వాం = నిన్ను, ద్రష్టుం = చూచుటకు, దివి = ఆకసమునందును, భువి = భూమియందును, క్రమముగా, పక్షి, మృగతాం = పక్షిత్వమును, మృగత్వమును, హంసత్వమును, వరాహత్వమును, వహన్ = పొందుచు, అదృష్ట్వా = నిన్ను చూడజాలక, ఇహ = ఇచ్చట, తత్ఖేదం = ఆ దుఃఖమును, కథం = ఎట్లుగా (కథమివ అని పాఠాంతరము) సహే = సహింతును. పూర్వము శివలింగము యొక్క ఆద్యంతములను చూడగోరి విష్ణువు వరాహావతారమును బొంది భూమిలోనికిని, బ్రహ్మ హంసరూపమును బొంది ఆకాశమునకును వెళ్ళిరి. కాని కనుగొనజాలక పోయిరి. అందుచే విష్ణుత్వ బ్రహ్మత్వములను పొందినను శివా ! నిన్ను సమగ్రముగా చూచుట సాధ్యముకాదు. కావున వానిని నీవిచ్చిననూ లాభమేమి ?

తా. ప్రభూ ! శంకరా నీపూజనొనరింతును, వెంటనే మోక్షసుఖప్రదుడవు కమ్ము. ఒకవేళ ఆ పూజకు ఫలమని బ్రహ్మత్వమును విష్ణుత్వమును నీవు తప్పక యీయవచ్చును. అందువలన లాభమేమి ? అప్పుడు కూడ మరల నిన్ను చూచుటకై ఆకసమున హంసత్వమును భూమితో వరాహత్వమును పొందుచు నిన్ను చూడజాలక ఆ దుఃఖమునెట్లు సహింతును ? అందుచే నాకు విష్ణుత్వబ్రహ్మత్వము లక్కఱలేదు.

వెంటనే మోక్షసౌఖ్యము నొసంగును (భూమా వై సుఖం – శ్రుతి).

శ్లో॥ కదా వా కైలాసే కనకమణిసౌధే సహగణై
ర్వసన్ శంభోరగ్రే స్ఫుటఘటిత మూర్ధాంజలిపుటః,
"విభో, సాంబ, స్వామిన్, పరమశివ, పా"హీతి నిగదన్
విధాత్రూణాం కల్పాన్ క్షణ మివ వినేష్యామి సుఖతః. 24

అ. కైలాసే = శివుని నివాసమైన కైలాసమున, కనక మణి సౌధే = బంగారముతోడను మణులతోడను నిర్మింపబడిన మేడయందు, శంభోః = శివుని యొక్క, అగ్రే = ముందు, స్ఫుట, ఘటిత, మూర్ధ, అంజలి, పుటః = స్పష్టముగా కూర్పఁబడిన శిరసునందలి దొన్నెవంటి దోసిలికలవాడనై, గణైః, సహ = ప్రమథగణములతోకూడ, వసన్ = నివసించుచు, విభో = ప్రభూ ! సాంబ = పార్వతితోఁగూడినదేవా ! స్వామిన్ = స్వామీ ! పరమశివ = పరమశివా ! పాహి = రక్షింపుము, ఇతి = అని, నిగదన్ = వచించుచు, విధాత్రూణాం, కల్పాన్ = బ్రహ్మలకల్పములను, (కల్పము = బ్రహ్మయొక్క దినము లేక 1000 యుగములు = మానవుల 4320 లక్షల సంవత్సరములు). క్షణం, ఇవ = ఒక్క క్షణము వలె, సుఖతః = సుఖముతో, కదా, వా = ఎప్పుడు, వినేష్యామి = గడపఁగలనో కదా !

తా. కైలాసగిరియందు బంగారముతోడను రత్నములతోడను నిర్మింపఁబడిన ప్రాసాదమున శివునిముందు స్థిరముగా కూర్పఁబడిన తలయందలి దోసిలికలవాడనై, ప్రమథగణములతో కూడ వసించుచు – " ప్రభూ ! సాంబా ! స్వామీ ! పరమశివా ! నన్ను రక్షింపుమ"ని పల్కుచు బ్రహ్మకల్పములను కూడ నొక్కక్షణమువలె సుఖముతో నెప్పుడు గడపఁగల్గుదునో కదా! శివుని సన్నిధానమున నున్నచో బ్రహ్మకల్పములు కూడ క్షణమువలెఁగడచిపోవుననియు తనకట్టి యదృష్టమెప్పుడు లభించుననియు కవి భావము.

శ్లో॥ స్తవై ర్బ్రహ్మాదీనాం, జయ ! జయ ! వచోభిర్నియమినాం
గణానాం కేళీభి, ర్మదకలమవోక్షస్య కకుది,
స్థితం నీలగ్రీవం త్రినయన ముమాశ్లిష్ట వపుషం
కదా త్వాం పశ్యేయం కరధృతమృగం ఖండపరశుమ్. 25

అ. బ్రహ్మ, ఆదీనాం బ్రహ్మ మొదలైన వారియొక్క, స్తవైః = స్తుతుల తోడను, నియమినాం = మునులయొక్క, జయ , జయ, = జయింపుము జయింపుము అను, వచోభిః = వాక్కులతోడను, గణానాం = ప్రమథ గణములయొక్క, కేళీభిః = క్రీడలతోడను వినోదించుచు, మద, కల, మహోక్షస్య = మదముచే అంకె లిడుచున్న వృషభముయొక్క, ककుది = మూపురమునందు, స్థితం = ఉన్నట్టియు, నీల, గ్రీవం = నల్లని కంఠము కలిగి నట్టియు, త్రినయనం = మూడు కన్నులు కలిగినట్టియు, ఉమా, ఆశ్లిష్ట, వపుషం = పార్వతిచే కౌగిలించు కొనబడిన శరీరము కలిగి నట్టియు, కర, ధృత, మృగం = చేతి యందు ధరింపఁబడిన లేడి కలిగి నట్టియు, ఖండపరశుం = (ఇది శివునికి పర్యాయపదము) శత్రువుల నెల్ల ఖండించు గొడ్డలి కలిగి నట్టియు, త్వాం = నిన్ను, కదా = ఎప్పుడు, పశ్యేయం = చూడఁజాలుదును ?

తా. బ్రహ్మాదులస్తుతులతోడను, మునుల జైజై వాక్యములతోడను, ప్రమథుల క్రీడావినోదములతోడను వినోదించుచు మదముచే, అంకెవేయుచున్న వృషభేంద్రుని మూపురముపై నున్నట్టియు, నల్లనికంఠముకలిగి నట్టియు, మూడు కన్నులు కలిగి నట్టియు, పార్వతిచే నాలింగితమైన దేహము కలిగి నట్టియు, చేత లేడిని ధరించి నట్టియు, శత్రువుల సంహరించు గొడ్డలి కలిగి నట్టియు నిన్నెప్పుడు చూడఁజాలుదును ? ఇది కవికి శివ దర్శనము నందుఁగల ఔత్సుక్యమును, సంభ్రమమును సూచించుచున్నది.

శ్లో॥ కదా వా త్వాం దృష్ట్వా గిరిశ ! తవ భవ్యాంఘ్రియుగళం
గృహీత్వా హస్తాభ్యాం శిరసి నయనే వక్షసి వహన్,
సమాశ్లిష్యాఘ్రాయ స్ఫుట జలజ గంధాన్ పరిమళా
నలభ్యాం బ్రహ్మాద్యై ర్ముద మనుభవిష్యామి హృదయే. 26

అ. గిరిశ = కైలాసగిరియందు శయనించు శివా, త్వాం = నిన్ను, దృష్ట్వా = చూచి, తవ = నీయొక్క, భవ్య, అంఘ్రి, యుగళం = శుభమైన పాదముల జంటను, హస్తాభ్యాం = రెండు చేతులతో, గృహీత్వా = గ్రహించి, శిరసి = తల యందు, నయనే = కంటియందు, వక్షసి = ఱొమ్మునందు, వహన్ = వహించు వాడనై, సమాశ్లిష్య = కౌగిలించుకొని, స్ఫుట, జలజ, గంధాన్ = వికసించిన పద్మముయొక్క వాసన వంటివాసనగల, పరిమళాన్ = ఆ పాదములసౌరభములను, ఆఘ్రాయ = మూర్కొని,

బ్రహ్మ ఆద్యైః = బ్రహ్మమున్నగు వారిచే, అలభ్యాం = పొంద శక్యముకాని, ముదం = ఆనందమును, హృదయే = హృదయమందు, కదా = ఎప్పుడు, అనుభవిష్యామి = అనుభవింపఁగలను ?

తా. ఓ శివా ! నిన్ను దర్శించి నీ శుభ పాదయుగ్మమును తల యందును నేత్రము నందును బొమ్మునందును వహించువాడ నై కౌగిలించుకొని వికసించిన పద్మము యొక్క వాసన వంటి వాసనకల తత్సౌరభములను మూర్కొని బ్రహ్మాది దేవతలకుఁగూడ పొంద శక్యము కాని ఆనంద విశేషమును హృదయమందెప్పుడనుభవింపఁగలనో కదా !

శ్లో॥ కరస్థే హేమాద్రౌ గిరిశ ! నికటస్థే ధనపతౌ
గృహస్థే స్వర్భూ జామర సురభి చింతామణి గణే,
శిరఃస్థే శీతాంశౌ చరణ యుగళస్థేఽఖిలశుభే
కమర్థం దాస్యేఽహం భవతు భవదర్థం మమ మనః. 27

అ. గిరిశ = శివా ! హేమ, అద్రౌ = బంగారు కొండ (మేరుపర్వతము శివుని విల్లు) కర, స్థే = చేతియందుండఁగా, ధన, పతౌ = కుబేరుడు, (శివుని మిత్రుడు) నికట, స్థే = సమీపమునందుండగా (కుబేరుడుత్తర దిక్పతి, శివుడీశాన్య దిక్పతి) స్వర్, భూజ, అమర, సురభి, చింతామణి, గణే = కల్పవృక్షముల యొక్కయు దేవతాధేనువులైన కామధేనువులయొక్కయు, చింతామణుల యొక్కయు, సముదాయము (ఇవన్నియు కోరిన కోరికలను తీర్చునట్టివి) గృహ, స్థే = ఇంటియందుండగా, శీత, అంశౌ = చల్లని కిరణములుగల చంద్రుడు, శిరః, స్థే = తలయందుండగా, అఖిల, శుభే, = సమస్తమంగళములును, చరణ, యుగళ, స్థే = పాదయుగళము నందుండగా, అహం = నేను; కం అర్థం= ఏధనమును, నీకు, దాస్యే = ఈయగలను? అన్నియు నీకధీనములై యే యున్నవి. అందుచే, మమ = నాయొక్క, మనః మనస్సు, భవత్, అర్థం = నీనిమిత్తము, భవతు = అగుఁగాక!

తా. శివా! నీచేతియందు బంగారు కొండ కలదు. నవనిధులకు నధిపతియైన కుబేరుడు నీ చెంతకలడు. కల్పవృక్ష కామధేను చింతామణి సమూహములు నీ యింటనే కలవు. చల్లని కిరణములు గల చంద్రుడు నీ తలయందు కలడు. సర్వమంగళములును నీపాదయుగళమున కలవు. ఇవన్నియు నీకే యుండగా అంతకధికముగా నేను నీ

కేధనము నీయఁగలను. నీదగ్గఱలేని దొక్కటి కలదు. అది నామనస్సు, దానిని నీ కొసంగెదను. అది నీ నిమిత్తమగుఁగాక! నా మనస్సు నీయందు నిల్పెదనని భావము.

శ్లో॥ సారూప్యం తవ పూజనే, శివ ! మహాదేవేతి సంకీర్తనే
సామీప్యం, శివభక్తిధుర్య జనతా సాంగత్య సంభాషణే.
సాలోక్యం, సచరాచరాత్మక తనుధ్యానే భవానీపతే !
సాయుజ్యం, మమసిద్ధ, మత్రభవతి స్వామిన్ కృతార్థో స్మ్యహమ్. 28

అ. భవానీ, పతే = పార్వతీపతీ; స్వామిన్ = దేవా; తవ = నీయొక్క, పూజనే = పూజించుటయందు, సారూప్యం = తన్మయత్వముచే నేను కూడ, నీ రూపమునే పొందుటచే సారూప్యముక్తియు, శివ = శివా, మహాదేవ = మహాదేవా ! ఇతి = అని సంకీర్తనే = నీ నామములనార్తితో కీర్తించునప్పుడు నీవు నాయెదుట నిలిచినట్లగుటచే, సామీప్యం = నేను నీ సమీపమున నుండుట యను సామీప్యముక్తియు, శివ, భక్తి, ధుర్య, జనతా, సాంగత్య, సంభాషణే = శివ భక్తిని వహించు జనుల సమూహముతోడి సాహచర్యముతోఁగూడిన సంభాషణము నందు, సాలోక్యం = ప్రపంచమంతయు కైలాసముగనే కనఁబడుటచే నీతో సమానలోకమున నుండుట యను సాలోక్యముక్తియు, స, చర, అచర, ఆత్మక, తను, ధ్యానే = జంగమ స్థావర వస్తు రూపమైన నీ శరీరమును ధ్యానించుట యందు, సాయుజ్యం = అంతయు నీవే యైన సృష్టి యందలి యంశమునగుటచే నీలో కలసి యుండుట యను సాయుజ్యముక్తియు, అత్ర = ఇచ్చట, మమ = నాకు, సిద్ధం = లభించినది. భవతి = అగుచున్నది. (అత్ర భవతి = పూజ్యుడవైన నీయందు, సాయుజ్యమనియు చెప్పవచ్చును,) అహం = నేను, కృతార్థః = ధన్యుడను, అస్మి = అగుచున్నాను.

ఆ. పార్వతీ పతీ, స్వామీ ! నీ పూజయందు సారూప్యముక్తియు, శివ ! మహాదేవ ! అని నామసంకీర్తన మొనరించుట యందు సామీప్యముక్తియు, శివభక్తి వహించు జనుల సమూహముతోడి సాహచర్యముతోఁ గూడిన సంభాషణమందు సాలోక్యముక్తియు, జంగమ స్థావరరూపకమైన నీతనువును ధ్యానించుట యందు సాయుజ్యము క్తియు నాకిచట సిద్ధించిన దగుచున్నది. నేను ధన్యుడనైతిని స్వామీ ! భవత్భాజన సంకీర్తములచేతను భక్తుల సాంగత్యసంభాషణములచేతను స్థావర జంగమాత్మక భవత్తనుధ్యానము చేతను నాకిచ్చటనే నాలుగు విధములైన ముక్తియు సిద్ధించినది. నేను ధన్యుడనైతిని.

శ్లో॥ త్వత్పాదాంబుజ మర్చయామి పరమం త్వాం చింతయా మ్యన్వహం
త్వామీశం శరణం వ్రజామి, వచసా త్వామేవ యాచే, విభో !
దీక్షాం మే దిశ చాక్షుషీం సకరుణాం దివ్యైశ్చిరం ప్రార్థితాం
శంభో ! లోకగురో ! మదీయ మనస స్సౌఖ్యోపదేశం కురు. 29

అ. శంభో = శంభూ ! లోక, గురో = జగద్గురూ ! విభో = ప్రభూ ! త్వత్, పాద, అంబుజం = నీ పద్మమువంటి పాదమును, అర్చయామి = ఆరాధింతును, పరమం = పరమపురుషుడవైన, త్వాం = నిన్ను, అన్వహం = ప్రతిదినమును, చింతయామి = ధ్యానింతును, ఈశం = ప్రభువవైన, త్వాం = నిన్ను, శరణం, వ్రజామి = శరణు పొందుదును, విభో = ప్రభూ ! వచసా = వాక్కుచే, త్వాం, ఏవ = నిన్నే, యాచే = అర్థింతును, దివ్యైః = దేవతలచే, చిరం = చిరకాలము, ప్రార్థితాం = ప్రార్థింపబడిన, స, కరుణాం = దయతో గూడిన, చాక్షుషీం = దృష్టులకు సంబంధించిన, దీక్షాం = దీక్షను, దృగ్దీక్షను, కరుణాకటాక్షప్రసారమును, దిశ = ఇమ్ము, మదీయ, మనసః = నామనస్సునకు, సౌఖ్య, ఉపదేశం = సౌఖ్యముగ నుండునట్లు ఉపదేశమును, కురు = చేయుము, గురువు ముందు దీక్షనొసంగి తరువాత నుపదేశమొసంగును.

తా. శంకరా, జగద్గురూ, ప్రభూ !నేను నీ పాదపద్మము నారాధించుచున్నాను. ప్రతిదినము పరమపురుషుడవైన నిన్ను ధ్యానించుచున్నాను. ఈశ్వరుడవైన నిన్ను శరణుపొందుచున్నాను. వాక్కుచే నిన్నే యాచించుచున్నాను. దేవతలచే చిరకాలము ప్రార్థింపబడిన కరుణతోఁ గూడిన దృగ్దీక్షనొసంగుము. (కరుణా కటాక్షములను ప్రసరింపఁజేయుము) తరువాత సౌఖ్యముగను ప్రశాంతముగను ఉండునట్లు నామనస్సున కుపదేశము చేయుము.

శ్లో॥ వస్త్రోద్ధూతవిధౌ సహస్రకరతా, పుష్పార్చనే విష్ణుతా
గంధే గంధవహాత్మ తాన్న పచనే బర్హిర్ముఖాధ్యక్షతా,
పాత్రే కాంచనగర్భ తాస్తి మయి చే ద్బాలేందు చూడామణే
శుశ్రూషాం కరవాణి తే పశుపతే ! స్వామిన్ ! త్రిలోకీగురో ! 30

అ. బాల, ఇందు, చూడా, మణే = లేతచంద్రుడు కేశములయందుమణిగా

కలవాడా ! శశికళాశేఖరా ! పశుపతే = పశుపతీ ! త్రిలోకీ, గురో = జగత్త్రయగురూ ! వస్త్ర, ఉద్ధూత, విధౌ = వస్త్రములచే నిన్ను తుడుచుకార్యమునందు (లేక నీ వస్త్రములను దులుపుకార్యమున), సహస్ర, కరతా = (వేయి కిరణములుకలవాడు సూర్యుడు) సూర్యత్వమును, పుష్ప, అర్చనే = పూవులతో పూజించుట యందు, విష్ణుతా = విష్ణుత్వమును, గంధే = గంధసమర్పణమునందు, గంధ, వహ, ఆత్మతా = (గంధవహుడు వాయువు వాయురూపత్వమును, అన్న పచనే = అన్నము వండుటయందు, బర్హిః, ముఖ, అధ్యక్షతా = (బర్హిర్ముఖులనగా దేవతలు, దేవతాధ్యక్షుడింద్రుడు బర్హిర్ముఖుడనగా అగ్నిఅను నర్థముకూడనున్నది) ఇంద్రత్వమును , పాత్రే = పాత్రమునర్పించుటయందు, కాంచన, గర్భతా = (హిరణ్యగర్భుడు బ్రహ్మ) బహ్మత్వమును, మయి = నా యందు, అస్తి , చేత్ = ఉన్నయెడల, తే = నీకు, శుశ్రూషాం = సేవను, కరవాణి = చేయగలను. షోడశోపచారములందు కొన్ని యిందు చెప్పఁబడినవి. ఒక్కొక్క ఉపచారమున ఒక్కొక్క రూపము కావలయును, అప్పుడు నీ సేవ సరిగా చేయఁజాలుదును. ఆ రూపములు నాయందు లేవుకావున నేను యథోచితముగా నీకుపచారములొనర్పఁజాలను, నమస్కారము మాత్రము చేయఁగలను, సహస్రకరత్వాదిపదము లిందు సాభిప్రాయములు.

తా. చంద్రశేఖరా ! పశుపతీ, త్రిజగద్గురూ, నీలింగమును వస్త్రములతో తుడుచువ్యాపారమున (లేక నీబట్టల నుదుకువ్యాపారమున) సూర్యత్వమును, పుష్పపూజావిషయమున విష్ణుత్వమును, గంధసమర్పణమున వాయురూపత్వమును, అన్నము వండుట యందింద్రత్వమును (అగ్నిత్వమును) పాత్ర నర్పించుట యందు హిరణ్యగర్భత్వమును నాయందున్న యెడల నీకు సరిగా సేవ చేయఁగలను. అవిలేవు కావున చేయఁజాలను. నమస్కారము మాత్రమొనరిఁపగలను.

శ్లో॥ నాలం వా, పరమోపకారక మిదం త్వేకం పశూనాం పతే !
పశ్యన్ కుక్షిగతాన్ చరా చరగణాన్, బాహ్యస్థితాన్ రక్షితుం,
సర్వామర్త్య పలాయనౌషధ మతిజ్వాలాకరం భీకరం
నిక్షిప్తం గరళం గళేన గిళితం *నోద్గీర్ణమేవ త్వయా*. 31

గళే నిక్షిప్తం = కంఠంలో ఉంచబడిన, విషము, న గిళితం = మ్రింగ బడలేదు... అనికూడా అర్థము చెప్పవచ్చును. 'పశ్యన్ ' అనే పదానికి వాక్యంలో సరిగా అన్వయం కుదురుటలేదు. "దృష్ట్వా" అన్న పాఠం ఉన్నచో బాగుండెడిది.

అ. పశూనాంపతే = పశుపతీ , శివా, కుక్షిగతాన్ = కడుపునుపొందియున్న (కడుపులోనున్న) చర, అచర, గణాన్ = జంగమస్థావర వస్తుసమూహములను, బాహ్య సిత్థాన్ = బయటనున్న దేవతాదులను, పశ్యన్ = చూచుచు, రక్షితుం = లోపలను బయటను ఉన్న వారందరిని రక్షించుటకు, సర్వ, అమర్త్య పలాయన, ఔషధం = ఎల్లదేవతల పాఱిపోవుట కౌషధమైనట్టియు (దేవతల నందఱిని పరుగెత్తునట్లు చేయునట్టియు) అతి జ్వాలా, ఆకరం = గొప్పమంటలకు నిధానమైనట్టియు, భీకరం = భయంకరమైనట్టియు, గరళం = హాలాహలవిషము, త్వయా = నీచేత, గళేన = కంఠముచే, గిళితం = మ్రింగఁబడినదై, నిక్షిప్తం = అచ్చటనే ఉంచఁబడినది. న, ఉద్గీర్ణం, ఏవ = బైటకుమియఁబడి యుండలేదు, పరమ, ఉపకారకం = మిక్కిలి ఉపకారమును కలిగించు, ఇదం, ఏకం = ఈ ఘనకార్యమొక్కటే, న, అలం, వా = నీ మహాదేవత్వమును చాటుటకు చాలదా ?

తా. పశుపతీ, కడుపులోనున్న జంగమ స్థావరములను, బయటనున్న దేవతాదులను చూచుచున్న వాడవై మ్రింగినచో లోపలనున్నవారును ఉమిసినచో బైటనున్న దేవతలును నశింతురని దయదలచి వారిని రక్షించుటకు ఎల్లదేవతాదులను పోఱిపోవునట్లు చేసినదియు, పెద్ద మంటలతో కూడినదియు భయంకరమైనదియునగు విషము నీచే కంఠముచే మ్రింగఁబడి అందే ఉంచఁబడినది. బైటకుమియఁబడియుండలేదు. కుక్షిగతలోకములకును బహిస్థితదేవతాదులకును మహోపకారకమైన యీఘనకార్యమొక్కటి చాలదా నీ దయను మహాదేవత్వమును చాటుటకు ?

శ్లో॥ జ్వాలోగ్ర స్సకలామరాతిభయదః క్ష్వేళః కథం వా త్వయా
దృష్టఃు, కించ కరే ధృతః కరతలే, కిం పక్వజంబూఫలం,
జిహ్వాయాం నిహితశ్చ సిద్ధఘుటికా వా, కంఠదేశే ధృతః
కిం తే నీలమణి ర్విభూషణ మయం, శంభో ! మహాత్మన్ వద. 32

అ. మహాత్మన్, శంభో = మహానుభావుడవైనశివా, జ్వాలా, ఉగ్రః = మంటలచే భయంకరమైనదియు, సకల, అమర, అతి, భయదః = ఎల్లవేల్పులకును మిక్కిలి భయము కలిగించునదియు, అగు, క్ష్వేళః = విషము, త్వయా = నీచే, కథం , వా = ఎట్లుగా, దృష్టఃు = చూడఁబడినది, కిం, చ = మఱియు, కరే = చేతియందును, కరతలే = అఱచేతియందును, కథం, వా = ఎట్లుగా, ధృతః = ధరింపఁబడినది ? అది, పక్వ,

జంబూఫలం, కిం = పండిననేరేడుపండాయేమి ? జిహ్వాయాం = నాలుకమీద ; నిహితః = ఉంచఁబడినది, వా = లేక, కిం, సిద్ధ, ఘుటికా = సిద్ధులుపయోగించు రసఘుటికయా ? కంఠ, దేశే = కంఠప్రదేశమందు, భృతః = ఉంచఁబడినది, అయం = ఆవిషము, తే = నీకు, భూషణం = అలంకారమైన, నీల, మణిః, కిం = నీలమాణిక్యమా ఏమి, వద = చెప్పుము.

తా. మహాత్మా, శివా, మంటలచే భయంకరమైనదియు, ఎల్లవేల్పులకును భయముకలిగించునదియునగు విషము నీచే నెట్లు చూడఁబడినది ? చూచుటయే కష్టముకాఁగా అది చేతియందును అంతేకాక అఱచేతియందును ఎట్లుంచుకొనబడినది ? అదేమి సిద్ధులుపయోగించు రసఘుటికయా ? నీకఁఠమందు ధరింపఁబడినది. అది నీకలంకారమైన యింద్ర నీలమాణిక్యమా ? తెల్పుము.

శ్లో॥ నాలం వా సకృదేవ ! దేవ భవతః సేవా నతిర్వా నుతిః
పూజా వా స్మరణం కథా శ్రవణ మప్యాలోకనం మాదృశాం,
స్వామి ! న్నస్థిర దేవతానుసరణాయాసేన కిం లభ్యతే;
కా వా ! ముక్తి రితః కుతో భవతి చే త్కిం ప్రార్థనీయం తదా. 33

ఆ. దేవ = మహాదేవా ! స్వామిన్ = స్వామీ ! మాదృశాం = నావంటి వారికి సకృత్, ఏవ = ఒక్కమాఱైనను, భవతః = నీయొక్క, సేవా, వా = సేవకాని, నతిః వా = నమస్కారముకాని, నుతిః, వా = సుత్తికాని, పూజా, వా = పూజకాని, స్మరణం, వా = స్మరించుటకాని, కథా, శ్రవణం, అపి = నీ కథల వినుట యైనను, ఆలోకనం, వా = చూచుటయైనను, న, అలం, వా = చాలదా ? అస్థిర, దేవతా, అనుసరణ, ఆయాసేన = అనిత్యులైన దేవతల ననుసరించుట వలని శ్రమచే, కిం, లభ్యతే = ఏమి పొందఁబడును ? ఇతః, కుతః = ఇంతకంటె మఱెక్కడ , కా, వా, ముక్తిః = ఏ మోక్షము, భవతి = కలుగును ? భవతి, చేత్ = కలుగునెడల, తదా = అప్పుడు, కిం = ఏది, ప్రార్థనీయం = ప్రార్థింపఁదగినది ?

తా. మహాదేవా ! స్వామీ ! నావంటి వారికి ఒక్క మాఱైనను నీ సేవ కాని నమస్కారము కాని, స్తుతికాని పూజకాని, స్మరణముకాని, నీ కథలను వినుట కాని, నిన్ను చూచుట కాని మోక్షలాభమునకు చాలదా ? అనిత్యులైన ప్రళయకాల మందు నశించు దేవతల ననుసరించుట వలని శ్రమచే నేమి లభించును ? నీ సేవాదుల

వలన కంటె మఱెక్కడ నేముక్తి కలుగును? కలుగదు. కలుగు నెడల నప్పుడు ప్రార్థింపఁతగినది మఱేమున్నది. మోక్షముకంటె నధికతరమైనదీ లేదు. అది మాదృశులకు నీ సేవాదులవలననే లభించును కాని అనిత్యులైన దేవతల నారాధించుటచే కలుగదు.

శ్లో॥ కిం బ్రూమ స్తవ సాహసం పశుపతే ! కస్యాస్తి శంభో ! భవ
ద్ధైర్యం, చేదృశమాత్మనస్థితిరియం చాన్యైః కథం లభ్యతే ?
భ్రశ్య ద్దేవగణం త్రస న్మునిగణం నశ్యత్ప్రపంచం లయం
పశ్యన్ నిర్భయ ఏక ఏవ విహరత్యానంద సాంద్రో భవాన్. 34

అ. పశుపతే = పశుపతీ ! శంభో = శివా, తవ = నీ యొక్క, సాహసం = సాహసమును, కిం బ్రూమః = ఏమని చెప్పుదుము ? ఈదృశం = ఇటువంటి, భవత్ ధైర్యం, చ = నీ ధైర్యము కూడ, కస్య = ఎవనికి, అస్తి = కలదు ? ఇయం = ఈ, ఆత్మనః = నీ యొక్క (ఆత్మ యొక్క) స్థితిః, చ = పరిస్థితి కూడ, అన్యైః = ఇతరులచే, కథం = ఎట్లు, లభ్యతే = పొందఁబడును ? భ్రశ్యత్, దేవగణం = నశించుచున్న దేవతల సముదాయముకలదియు, త్రసత్, మునిగణం = భయపడుచున్న మునులసమూహము కలదియు, నశ్యత్, ప్రపంచం = నశించుచున్నలోకము కలదియు, అగు, లయం = ప్రళయమును, పశ్యన్ = చూచుచు, నిర్భయః = భయము లేనివాడవై, భవాన్ = నీవు, ఏకః, ఏవ = ఒక్కడవే, ఆనంద, సాంద్రః = మహానందముతో నిండినవాడవై, విహరతి = విహరింతువు. (భవచ్ఛబ్దముమధ్యమ పురుషార్థకమైనను ప్రథమపురుషమునకు చెందినదే) ప్రళయకాలమున దేవతలు కూడ నశింతురు. సర్వమును సంక్షోభము నొందును. పరమశివుడు డొక్కడే ఆనందముతో విహరించుచుండును.

ఆ. పశుపతీ ! శంకరా ! నీసాహసమేమని వర్ణింతును ? ఇట్టి ధైర్యము కూడ నీకు తప్ప మఱెవ్వరికి కలదు ? నీ (ఆత్మయొక్క) స్థితి సైతమితరులచే నెట్లు పొందబడును. నశించుచున్న దేవతలు కలదియు, భయ మందుచున్న ముని సమూహములు కలదియు, రూపఱి పోచున్న సర్వ జగత్తు కలదియు నగు ప్రళయమును చూచుచు భయమేమియు లేనివాడవై నీ వొక్కడవే అమందానందపరిపూర్ణుడవై విహరింతువు.

శ్లో॥ యోగక్షేమధురంధరస్య సకలశ్రేయః ప్రదోద్యోగినో
దృష్టాదృష్ట మతోపదేశకృతినో బాహ్యాంతరవ్యాపినః,

సర్వజ్ఞస్య దయాకరస్య భవతః కిం వేదితవ్యం మయా
శంభో ! త్వం పరమాంతరంగ ఇతి మే చిత్తే స్మరా మ్యన్వహమ్. 35

అ. శంభో = శివా ! యోగ, క్షేమ, ధురంధరస్య = భక్తుల యోగక్షేమముల భారమును వహించునట్టియు (అలభ్యలాభో యోగః స్యాత్ క్షేమో లబ్ధస్య పాలనమ్) సకల, శ్రేయః, ప్రద, ఉద్యోగినః = వారికన్ని శుభములను చేకూర్చుటకు ప్రయత్నించు నట్టియు, దృష్ట, అదృష్ట, మత, ఉపదేశ, కృతినః = ఇహపర సౌఖ్యములను కలిగించు హితము నుపదేశించుట యందు నేర్పిరివియు, బాహ్య, అంతర' వ్యాపినః = బయటను లోపలను వ్యాపించి యున్నట్టియు, సర్వజ్ఞస్య = అన్నియు నెరిగి నట్టియు (సర్వజ్ఞాన పరిపూర్ణుడవు) దయా, ఆకరస్య = దయకు నిదానమైనట్టియు, భవతః = నీకు, మయా = నాచేత, కిం = ఏమి, వేదితవ్యం = తెలుపఁ దగినది, కలదు ? త్వం= నీవు, పరమ, అంతరంగః, ఇతి = నాకు మిక్కిలి ఆత్మీయుడవని,* మే = నాయొక్క , చిత్తే = చిత్తమందు, అను, అహం = ప్రతి దినమును, స్మరామి = స్మరింతును.

తా. శివా ! భక్తుల (సర్వజగముల) యోగక్షేమముల భారమును వహించునట్టియు, ఎల్ల (సర్వజగములకు) శుభములను సమకూర్చుటకు యత్నించునట్టియు, ఐహికా ముష్మిక సౌఖ్యమొసంగు హితము నుపదేశించుట యందు నిపుణుడవును బయటను లోనను వ్యాపించియుండునట్టియు* (సర్వాంతర వ్యాపివియు) సర్వజ్ఞుడవును, దయానిధియు నైన నీకు నేను తెల్పవలసినదేమి కలదు ? నీవు నాకు పరమాప్తుడవని చిత్తమునందు ప్రతిదినమును స్మరించుచుందును.

శ్లో॥ భక్తో భక్తిగుణావృతే ముదమృతాపూర్ణే ప్రసన్నే మనః
కుంభే సాంబ తవాం ఘ్రిపల్లవయుగం సంస్థాప్య సంవిత్ఫలం,
సత్త్వం మంత్ర ముదీరయన్ నిజశరీరాగారశుద్ధిం వహన్
పుణ్యాహం ప్రకటీకరోమి రుచిరం కల్యాణమాపాదయన్. 36

అ. సాంబ = పార్వతితోకూడిన శివా, (అహం = నేను) భక్తః = భక్తుడనై, భక్తి, గుణ, ఆవృతే = భక్తి యనెడి దారముచే చుట్టబడినదియు, ముద్, అమృత, అపూర్ణే = సంతోషమనెడి నీటితోనిండినదియు, ప్రసన్నే = పవిత్రమైనదియు, ప్రసాదగుణముతో

* "అంతర్యామివని" అనికూడ అర్థము.

కూడినదియు, మనః, కుంభే = మనస్సనెడి కలశమునందు, సంవిత్, ఫలం = జ్ఞానమేఫలముగాఁగల, తవ = నీయొక్క, అంఘ్రి, పల్లవ, యుగం = పాదములనెడి చిగురాకుల జంటను, సంస్థాప్య = స్థాపించి, (సంవిత్, ఫలం అను దానికి జ్ఞానమనెడి కొబ్బరి కాయను అనియైన చెప్పనగును లేక మంత్రమునకు విశేషణముగా నైన చెప్పనగును) సత్త్వం = శుద్ధసత్త్వరూపమైన, మంత్రం = నీ మంత్రమును, ఉదీరయన్ = ఉచ్చరించుచు, నిజ, శరీర, అగార, శుద్ధిం = నా దేహమనెడి గృహముయొక్క శుద్ధిని, వహన్ = వహించుచు, రుచిరం = ప్రకాశమానమగు, కళ్యాణం = మంగళమును, ఆపాదయన్ = కలిగించుచున్నవాడనై, పుణ్య, అహం = పుణ్యాహవాచనము, ప్రకటీకరోమి = వ్యక్తముచేయుచున్నాను. పుణ్యాహవాచనము శుద్ధికర్మము. అదిచేయునపుడు భక్తితో కలశములకు దారము చుట్టి అందు నీరుపోసి పైని మామిడిచిగుళ్ళుంచి మంత్రముల నుచ్చరించుచు గృహశుద్ధికావించి మంగళము పొందుదురు. అలం. రూపకము.

తా. సాంబ ! శివా ! నేను భక్తుడనై భక్తియను దారముతో చుట్టఁబడినదియు సంతోషమను జలముతో నిండినదియు పవిత్రమైనదియు నగు నామనస్సనెడి కలశమందు జ్ఞానమే ఫలముగాఁగల నీ పాదములనెడి మామిడి చిగురాకుల జంటను స్థాపించి సత్త్వరూపమైన మంత్రము నుచ్చరించుచు నాదేహమనెడి గృహముయొక్క శుద్ధి నావహించుచు ప్రకాశమానమైన మంగళమును కలిగించు కొనుచు పుణ్యాహవాచనమును ప్రకటించుచున్నాను.

శ్లో॥ ఆమ్నాయాంబుధిమాదరేణ సుమనస్సంఘాస్సముద్యన్మనో
మంథానం దృఢభక్తిరజ్జుసహితం కృత్వా మథిత్వా తతః,
సోమం కల్పతరుం సుపర్వసురభిం చింతామణిం ధీమతాం
నిత్యానందసుధాం నిరంతర రమాసౌభాగ్య మాతన్వతే. 37

అ. సుమనః సంఘాః = పండితుల (దేవతల) సమూహములు, సముద్యత్, మనః, మంథానం = ప్రకాశించు మనస్సనెడి కవ్వమును, దృఢ, భక్తి, రజ్జు, సహితం = స్థిరమైన భక్తి యనెడు త్రాటితో కూడిన దానినిగా, కృత్వా = చేసి, ఆదరేణ = ప్రీతితో, ఆమ్నాయ, అంబుధిం = వేదము లనెడి సముద్రమును, మథిత్వా = త్రచ్చి, తతః = అందుండి, ధీమతాం = బుద్ధిమంతులకు, సోమం = చంద్రుని , (పార్వతితోఁగూడినశివుని) కల్ప, తరుం = కల్పవృక్షమును, సుపర్వ, సురభిం =

దేవతలకామధేనువును, చింతామణిం = కోరికలిచ్చు చింతారత్నమును, నిత్య, ఆనంద, సుధాం = శాశ్వతమైన ఆనందమనెడి అమృతమును, నిరంతర, రమా, సౌఖ్యం = అవిచ్ఛిన్నమైన లక్ష్మీయనెడి (వలని) సౌఖ్యమును, ఆతన్వతే = వ్యాపింపఁజేయుచున్నారు. కలిగించుచున్నారు. అలం. రూపకము.

తా. దేవతలు మున్ను క్షీరసముద్రమును చిలికి కల్పవృక్షమును కామధేనువును, లక్ష్మిని, అమృతమును పొంది ఆనందము నందియుండిరి. స్వాముల వారా యుపమానమును గ్రహించి యీశ్లోకమును రచించి యున్నారు. పండితుల సముదాయములు తమప్రకాశించు మనస్సనెడి కవ్వమును స్థిరమైన భక్తియనెడు త్రాటితోకూడిన దానినిగా నొనరించి వేదములనెడి సముద్రము నాదరముతో త్రచ్చి అందుండి చంద్రుడనెడు సాంబశివుని, కల్పవృక్షమును, కామధేనువును, చింతారత్నమును, శాశ్వతమైన బ్రహ్మానందమనెడి అమృతమును అవిచ్ఛిన్నలక్ష్మీసౌఖ్యమును (మోక్ష లక్ష్మీసౌభాగ్యమును) బుద్ధిమంతులకు పంచి యిచ్చుచున్నారు. వేదములను త్రచ్చగా శివరూపము విదితమగుటయు నానందలాభము కలుగుటయు సంభవించునని భావము

శ్లో॥ ప్రాక్పుణ్యాచల మార్గదర్శిత సుధామూర్తిః ప్రసన్న శ్శివ
స్సౌమ్యస్సద్గణ సేవితో మృగధరః పూర్ణ స్తమోమోచకః,
చేతః పుష్కరలక్షితో భవతి చే దానందపాథోనిధిః
ప్రాగల్భ్యేన విజృంభతే సుమనసాం* వృత్తిస్తదా జాయతే. 38

అ. ప్రాక్, పుణ్య, అచల, మార్గ, దర్శిత, సుధా, మూర్తిః = పూర్వపుణ్యమనెడి స్థిరమైన మార్గముచే చూపఁబడిన అమృతస్వరూపుడును, (తూర్పునెడి పవిత్ర పర్వతపు త్రోవ యందు గోచరించు అమృత మయుడైన చంద్రుడును,) ప్రసన్నః = అనుగ్రహముతో (ప్రసాదగుణముతో) కూడినవాడును, సౌమ్యః = శాంతుడును; సత్, గణ, సేవితః = సజ్జనసమూహములచే (నక్షత్ర గణములచే) సేవింపబడినవాడును; మృగ, ధరః = లేడిని ధరించినవాడును (మృగాంకుడును, చంద్రుని యందలి మచ్చ లేడియని అందురు) పూర్ణః = సర్వ సంపూర్ణుడును. సర్వవ్యాపియైన బ్రహ్మమును (షోడశకళాసంపూర్ణుడును) తమః, మోచకః = తమోగుణమును (చీకటిని) విడిపించువాడును; అగు; శివః = మంగళస్వరూపుడైన శివుడు; (శుభకరుడైన చంద్రుడు) చేతః పుష్కర, లక్షితః = పద్మము

* చంద్రుడు ఓషధీశుడు గాన "సుమనసాం" అనగా 'పుష్పములకు' అనికూడ అర్థము.

వంటిచిత్తమునందు (చిత్తమనెడి ఆకాశమందు) చూడఁబడినవాడు; భవతి, చేత్ = అగుచో, ఆనంద, పాథః నిధిః = అనందమనెడి సముద్రము, ప్రాగల్భ్యేన = మహత్త్వముతో (పూర్ణత్వముతో) విజృంభతే = విజృంభించును. (చంద్రు డుదయింపగనే సముద్రము ప్పొంగును. శివుడు మనోగోచరుడుకాగానే ఆనంద సముద్రముప్పొంగును) తదా = అప్పుడు, సుమనసాం = సజ్జనులకు, పండితులకు, వృత్తిః = జీవనోపాధి, జీవితఫలమైన మోక్షము, జాయతే = కలుగును , అలం. శ్లేషానుప్రాణితమైన రూపకము.

తా. పూర్వపుణ్యమనెడి స్థిరమైన మార్గముచేఁజూపబడిన అమృతరూపుడును (పవిత్రమైన తూర్పు కొండపై గోచరించిన అమృతమయుడును) అనుగ్రహముతో కూడినవాడును (నిర్మలుడును) సౌమ్యుడును (చల్లనివాడును) సజ్జన (నక్షత్ర) సమూహములచే సేవింపఁబడినవాడును, లేడిని ధరించినవాడును (మృగాంకుడును) పరిపూర్ణుడును (షోడశకళాప్రపూర్ణుడు) తమోగుణమును (చీకటిని) పొగొట్టువాడును, అగుశివుడు (శుభంకరుడైన శివుడు) చిత్తపద్మమున (చిత్తమనెడి ఆకాశమున) చూడఁబడుచో ఆనందమనెడి సముద్రమువ్వెత్తుగా నుప్పొంగును. అప్పుడు సజ్జనులకు (పండితులకు) జీవనోపాధి (జీవనోపాధి జీవితఫలమైన మోక్షము) కలుగును.

శ్లో॥ ధర్మో మే చతురంఘ్రిక స్సుచరితః పాపం వినాశం గతం
కామక్రోధమదాదయో విగళితాః కాలస్సుఖావిష్కృతః.
జ్ఞానానంత్య మహౌషధి స్సుఫలితా కైవల్యనాథే సదా
మాన్యే మానసపుండరీకనగరే రాజావతంసే స్థితే. 39

అ. కైవల్య, నాథే = కైవల్యమునకు, మోక్షమునకు, నధిపతియు; మాన్యే = పూజ్యుడును, అగు రాజ,అవతంసే = చంద్రుడాభరణముగాగల శివుడు (రాజశ్రేష్ఠుడు), మానస, పుండరీక, నగరే = పద్మమువంటి మనస్సనెడి పురమునందు, సదా = ఎల్లప్పుడును, స్థితే = ఉండగా (పరిపాలించుచుండగా) మే = నాకు, సు,చరితః = బాగుగా నాచరింపబడిన, ఉత్తమమైన, ధర్మః = ధర్మము, చతుర్, అంఘ్రికః = నాల్గు పాదములు కల్గినది అయినది. (ధర్మము నాల్గుపాదములతో నడచుచున్నది) పాపం = పాపము, వినాశం, గతం = వినాశనముపొందినది, కామ, క్రోధ, మద, ఆదయః = కామము, కోపము, మదము మొదలగు అంతఃశత్రువులు, విగళితాః = రాలిపోయినవి. కాలః = కాలము, సుఖ, ఆవిష్కృతః = సుఖముతోఁగడచుచున్నది జ్ఞాన, ఆనంత్య, మహా, ఓషధిః = జ్ఞానముతో

గూడిన శాశ్వతము (మోక్షము)* అనెడి ఓషధి, సుఫలితా = బాగుగా ఫలించినది, జ్ఞానానందమహోషధిః అని పాఠాంతరము. శివుడను రాజశేఖరుడు నా హృదయ నగరమును పరిపాలించు చుండగా సర్వసౌఖ్యములును కలిగినవి. ఇంక దుర్భిక్షమెక్కడిదని భావము. అలం. రూపకము.

తా. పూజ్యుడును మోక్షాధిపతియునైన చంద్రశేఖరుడు (చక్రవర్తి) పద్మమువంటి నామనోనగరమును సర్వదా పాలించుచుండగా నాకు ధన్యమైన ధర్మధేనువు నాల్గుపాదములతో నడచుచున్నది. పాపము నశించినది. కామక్రోధమదమాత్సర్యాదులగు నంతఃశత్రువులు పారిపోయిరి. కాలము సుఖముగా గడచుచున్నది. జ్ఞానముతోఁగూడిన మోక్షమనెడి గొప్పఓషధి (మూలిక) బాగుగా ఫలించినది. నా మనోనగరము సుభిక్షముగా సాగుచున్నది. దుర్భిక్షము లేనేలేదు. శివుడు మనస్థితుడగుచో నే క్లేశమునుండదని భావము.

శ్లో॥ ధీయంత్రేణ వచోఘటేన కవితాకుల్యోపకుల్యాక్రమై
రానీతైశ్చ సదాశివస్య చరితాంభోరాశి దివ్యామృతైః,
హృత్కేదార యుతాశ్చ భక్తికలమా స్సాఫల్య మాతన్వతే
దుర్భిక్షాన్మమ సేవకస్య భగవన్ ! విశ్వేశ ! భీతిః కుతః. 40

అ. భగవన్, విశ్వేశ = సర్వైశ్వర్యసంపన్నుడవైన ఓ జగదీశ్వరా; ధీ, యంత్రేణ = బుద్ధియనెడు యంత్రముచే (ఏతముచే) వచః, ఘటేన = స్తోత్ర వచనమనెడి కుండతో; కవితా, కుల్యా, ఉపకుల్యా, క్రమైః = కవిత్వమనెడి కాలువలయు, పిల్లకాలువలయు, వరుసలచే; ఆనీతైః = తీసికొనిరాబడిన, సదాశివస్య = పరమేశ్వరుడవైన నీయొక్క; చరిత, అంభఃరాశి, దివ్య అమృతైః = చరిత్ర మనెడి సముద్రమునందలి యోగ్యములైన నీళ్ళచే; హృత్, కేదార, యుతాః, = హృదయమనెడి పంటపొలములతోఁ గూడిన (పొలములయందున్న); భక్తి, కలమాః = భక్తియనెడి వరిపైరులు; సాఫల్యం = సఫలత్వమును; ఆతన్వతే = పొందును; అప్పుడు; సేవకస్య = సేవకుడనైన; మమ = నాకు ! దుర్భిక్షాత్ = కఱవునుండి; భీతిః = భయము; కుతః = ఎందుకు (కలుగును) అలం, రూపకము.

తా. భగవంతుడవైన జగదీశ్వరా ! బుద్ధియనెడు నీళ్ళుతోడు యంత్రముచే,

* జ్ఞాన్ము యొక్క అనంతత్వము, అనగా అనంతజ్ఞానము అనికూడ చెప్పవచ్చును.

స్తోత్రవచనములనెడి కుండతో, కవిత్వమనెడి కాలువలయు పిల్లకాలువలయు మార్గములద్వారా పైకి తోడబడిన పరమేశ్వరుడవైన నీయొక్క చరిత్రమనెడి సముద్రము నందలి మంచిజలములతో హృదయక్షేత్రములందు మొలచు భక్తి యనెడి వరిపైరులు సఫలత్వమును పొందును. అట్టియెడ సేవకుడనైన నాకిఁక కఱవువలన భయమెక్కడిది ? పరమేశ్వరుని చరిత్రమును స్తుతించుభక్తి హృదయమందుండుచో మానవుల కే లోపము కాని భయము కాని కలుగదని భావము.

శ్లో॥ పాపోత్పాత విమోచనాయ రుచి రైశ్వర్యాయమృత్యుంజయ
స్తోత్ర ధ్యాన నతి ప్రదక్షిణ సప ర్యాలోక నాకర్ణనే,
జిహ్వాచిత్త శిరోంఘ్రి హస్తనయన శ్రోత్రైరహం ప్రార్థితో
మా మాజ్ఞాపయ త న్ని రూపయ మువూర్మామేవ మా మేఽవచః. 41

అ. మృత్యుం, జయ = మృత్యువును జయించిన పరమేశ్వరా ! పాప, ఉత్పాత, విమోచనాయ = పాపములనుండియు, ఉపద్రవముల నుండియు విడిపించుటకొఱకును; రుచిర, ఐశ్వర్యాయ = ప్రకాశమానమైన ఐశ్వర్యము కొఱకును; అహం = నేను; జిహ్వా, చిత్త, శిరః, అంఘ్రి, హస్త, నయన, శ్రోత్రైః = నాలుక, హృదయము, శిరస్సు పాదములు, చేతులు, నేత్రములు, చెవులు అను వానిచే; క్రమముగా, స్తోత్ర, ధ్యానతి, ప్రదక్షిణ, సపర్యా, ఆలోకన, ఆకర్ణనే = స్తుతించుటయందును, ధ్యానించుటయందును, నమస్కరించుటయందును ప్రదక్షిణముచేయుట యందును, సేవచేయుటయందును, చూచుటయందును, వినుట యందును; ఈ కార్యములుచేయుట కొఱకు; ప్రార్థితః = ప్రార్థింపఁబడితిని; మాం = నన్ను; ఆజ్ఞాపయ - ఆజ్ఞాపింపుము; ముహుః = మాటిమాటికిని; మాం, ఏవ = నన్ను గూర్చియే; తత్ = నాకర్తవ్యమును; నిరూపయ = నిర్ణయించి చెప్పుము; మే = నాకు; అవచః = మాటాడలేకుండుట; మా = కాకుండుఁగాక ! అలం. క్రమము.

తా. మృత్యుం జయుడవైన శంకరా ! పాపముల (నుండియు) వలనఁ గలుగు నుపద్రవములనుండి (యు) విడిపించుట కొఱకు, ఉజ్జ్వలమైన ఐశ్వర్యము కొఱకును నేను నాలుక, చిత్తము, తల, పాదము, చేతులు, నేత్రములు, చెవులు అను నింద్రియములచే వరుసగా నిన్ను స్తుతించుటకు, ధ్యానించుటకును, నమస్కరించుటకును, వలగొనుటకు, సేవించుటకును, చూచుటకును, వినుటకును ప్రార్థింపబడితిని. నన్నాజ్ఞాపింపుము.

మాటిమాటికిని నాకర్తవ్యమును నిర్దేశించి చెప్పుము. నాకు మాత్ర మెప్పుడును వాగభావము కలుగకుండుగాక !

శ్లో॥ గాంభీర్యం పరిఖాపదం, ఘనధృతిః ప్రాకార, ఉద్యద్గుణ
స్తోమ శ్చాప్తబలం, ఘనేంద్రియచయో ద్వారాణి దేహస్థితః,
విద్యా వస్తు సమృద్ధి రిత్యఖిలసామగ్రీసమేతే సదా
దుర్గాతి ప్రియ ! దేవ ! మామక మనోదుర్గే నివాసం కురు. 42

అ. దుర్గా, అతి, ప్రియ, దేవ = దుర్గాదేవికతిప్రియుడవైన స్వామీ (దుర్గములందత్యంత ప్రీతిగల స్వామీ') నాదేహమందొకదుర్గమున్నది. దానికి; గాంభీర్యం = గాంభీర్యమే; పరిఖా, పదం = అగడ్త; ఘన, ధృతిః = గొప్ప ధైర్యమే; ప్రాకారః = చుట్టునున్న ప్రహరి; ఉద్యత్, గుణ, స్తోమః, చ = ప్రకాశించు గుణములసముదాయమే; ఆప్తబలం = మిత్రమై (పొందబడిన) సైన్యము; ఘన, ఇంద్రియ, చయః = గొప్పయింద్రియముల సముదాయమే; ద్వారాణి = ద్వారములు; విద్యా, వస్తు సమృద్ధిః = విద్య యనెడి వస్తువులసమృద్ధి; ఇతి = మొదలైన, అఖిల, సామగ్రీ సమేతే = సర్వసామగ్రితో, గూడిన; దేహ, స్థితే* = శరీరమందున్న, మామక, మనః, దుర్గే = నామస్సనెడికోటయందు; సదా = ఎల్లప్పుడును; నివాసం = నివాసమును; కురు = చేయుము. అలం రూపకము.

తా. దుర్గావల్లభుడవైన స్వామీ ! నా దేహమందొక దుర్గమున్నది. దానికి గాంభీర్యమే అగడ్త. అధిక ధైర్యమే ప్రహరి. ప్రకాశించు సద్గుణసముదాయమే మిత్రసైన్యము. గొప్ప యింద్రియముల సముదాయమే ద్వారములు. విద్యయనెడి వస్తువుల సమృద్ధి మొదలైన సర్వసామగ్రితో కూడిన ఆ నామనస్సనెడి కోటయందు సర్వదా నివాస మొనరింపుము. దుర్గమునకుండ వలసిన సామగ్రి యంతయు మనస్సునకు కూడ చెప్పబడినది.

శ్లో॥ మాగచ్ఛస్వ మితస్తతో గిరిశ ! భో మయ్యేవ వాసం కురు
స్వామి ! న్నాదికిరాత ! మామక మనః కాంతార సీమాంతరే,
వర్తంతే బహుశో మృగా మదజుషో మాత్సర్య మోహాదయ
స్తాన్హత్వా మృగయావినోదరుచితా లాభం చ సంప్రాప్స్యసి. 43

* "దేహస్థితః " అను పాఠాంతరములో అది "ఇంద్రియచయః" కు విశేషణము.

అ. భోఆది, కిరాత; స్వామిన్ = మొదటికిరాతుడవైన ఓస్వామీ; (కిరాతార్జునీయమున స్వామి కిరాతుడై అర్జునునితో పోరాడెను) గిరిశ = కైలాసగిరి యందు శయనించువాడా ! త్వం = నీవు; ఇతః, తతః = ఇచ్చటికిని అచ్చటికిని; మా, గచ్ఛ: = వెళ్లకుము; మయి, ఏవ = నాయందే; వాసం = నివాసమును; కురు = చేయుము; మామక, మనః, కాంతార , సీమ, అంతరే = నా మనస్సనెడి అటవీ ప్రదేశము నడుమ; మద, జుషః = మదముతో ఆనందించు[1] (మత్తిల్లిన); మాత్సర్య, మోహ, ఆదయః = మచ్చరము, మోహము మొదలైన; మృగాః = మృగములు, బహుశః = అనేకములుగా; వర్తంతే = వర్తిల్లుచున్నవి. (తిరుగుచున్నవి); తాన్ = వానిని; హత్వా = చంపి; మృగయా, వినోద, రుచితా, లాభం చ = వేటయనెడి వినోదమందలి ప్రీతియొక్క లాభమునుగూడ, సంప్రాప్స్యసి = పొందగలవు అలం. రూపకము; పరికరము.

తా. కైలాస గిరియందు శయనించు ఆది కిరాతుడవైన స్వామీ ! నీ విచ్చటికిని అచ్చటికిని తిరుగకుము. నాయందే నివసింపుము. దాని వలన రెండు లాభములు కలవు. నీవు మాటిమాటికి నచ్చటికి నిచ్చటికి తిరుగవలసిన అవసరముండదు. నా మనస్సనెడి అడవి మధ్యమున మాత్సర్యము మోహము మొదలైన వన్యమృగములనేకములుగా తిరుగుచున్నవి. వానిని సంహరించి నీవు కిరాతుడ వగుటచేత వేట యనెడి వినోదమందలి ప్రీతిని పొందవచ్చును. స్వామీ ! నీవు నాహృదయమున నివసించి కామక్రోధలోభ మోహమదమాత్సర్యము లను నరిషడ్వర్గమును తొలగించి నన్ను సత్త్వసంపన్నునిగా నొనరింపుమని భావము.

శ్లో॥ కరలగ్న మృగః కరీంద్ర భంగో
ఘనశార్దూల విఖండనోఽస్తజంతుః,
గిరిశో విశదాకృతిశ్చ చేతః
కుహరే పంచముఖోఽస్తి మే కుతో భీః. 44

అ. కర, లగ్న, మృగః = చేతియందున్న లేడికలవాడును, కరి, ఇంద్ర, భంగః = గజేంద్రధ్వంసముచేసినవాడును (గజాసురసంహారియు) ఘన, శార్దూల, విఖండనః = గొప్ప వ్యాఘ్రమును ఖండించినవాడును (వ్యాఘ్రాసురుని చంపి తత్ చర్మమును ధరించినవాడును) అస్త, జంతుః = నశింపచేయబడిన జంతువులు కలవాడును

1. మదమును పొందిన

(సమస్తజీవులతోఁగూడిన ప్రపంచమును లయము చేసివాడును,) గిరి, శః = శ్రీశైల పర్వతము పై శయనించినవాడును. విశద, ఆకృతిః, చ = ధవళమైన ఆకారము గలవాడును అగు, పంచముఖః = శివుడను సింహము, చేతః + కు హరే = హృదయమను గుహయందు, అస్తి = ఉన్నాడు (ఉన్నది), మే = నాకు, భీః = భయము కుతః = ఎక్కడిది ? ఈ శ్లోకమునందలి విశేషణములు సింహమునకు కూడా వర్తించును. సింహముకాలియందున్న లేడి కలది. గజేంద్రమును సంహరించినది. వ్యాఘ్రమును ఖండించినది, జంతువుల నన్నింటిని నశింపజేసినది. కొండగుహలలో శయనించునది (ప్రకాశించు) స్పష్టమైన ఆకారము గలది. వెడల్పైన ముఖము గలది.

తా. చేతియందున్న మృగముగలవాడును, గజాసురుని సంహరించిన వాడును. గొప్ప వ్యాఘ్రాసురుని ఖండించి ఆతని చర్మమును ధరించిన వాడును, సమస్తజీవప్రపంచమును లయముచేయు వాడును, శ్రీశైలగిరియందు శయనించువాడును, తెల్లని ఆకారముగలవాడును, అగు పంచాననుడు (శివుడు) సింహము నాహృదయమనెడి గుహయందున్నాడు (దున్నది) నాకింక భయమెక్కడిది? సింహమున్నచోటికితర జంతువులు రావు, కావున భయముండదు. శివుడు హృదయమందున్న దుశ్చింతలవలన భయముండదు.

శ్లో॥ ఛందశ్శాఖి శిఖాన్వితైర్ద్విజవరైస్సంసేవితే శ్వాశతే
సౌఖ్యాపాదిని ఖేదభేదిని సుధాసారైః ఫలైర్దీపితే,
చేతః పక్షిశిఖామణే ! త్యజ వృథా సంచార మన్యై రలం
నిత్యం శంకర పాదపద్మయుగళీ నీడే విహారం కురు. 45

అ. చేతః, పక్షి, శిఖామణే ! = మనస్సనెడి ఓ పక్షిశ్రేష్ఠమా; ఛందః , శాఖి, శిఖా; అన్వితైః = వేదమనెడి చెట్టుయొక్క అగ్రభాగముతో కూడిన – అగ్రభాగమునందున్న (వేదములయొక్క అంతములైన ఉపనిషత్తులతో కూడిన) ద్విజ, వరైః = పక్షిశ్రేష్ఠములచే, 'బ్రాహ్మణశ్రేష్ఠులతో') సంసేవితే = సేవింపబడినదియు; శాశ్వతే = స్థిరమైనట్టిదియు, సౌఖ్య, ఆపాదిని = సుఖమును కలిగించునట్టిదియు (మోక్షసౌఖ్యమందించు నట్టిదియు) సుధా, సారైః = అమృతముయొక్క సారమువంటి సారముగల, ఫలైః = పండ్లతో, దీపితే = ప్రకాశించునట్టియు, (అమృతానందఫలశోభితమైనట్టియు) శంకర, పాద, పద్మ; యుగళీనీడే = శివునియొక్క పద్మములవంటిపాదముల జంటయనెడి గూటియందు, నిత్యం = ఎల్లప్పుడును, విహారమ్ = విహారము (సంతోషముతో కూడిన నివాసమును) కురు =

చేయుము; వృథా, సంచారం = వ్యర్థమైన పరిభ్రమణము; త్యజ = విడువుము, అన్యైః = ఇతరములతో, అలం = చాలును, (ఇతరములతో ప్రయోజనములేదని భావము) అలం. రూపకము, శ్లేష.

తా. మనస్సనెడి ఓ పక్షి శ్రేష్ఠమా ! వేదమనెడి వృక్షాగ్రమున నున్నట్టి పక్షిశ్రేష్ఠములచే సేవింపబడినదియు వేదాంతములైన ఉపనిషత్తులతో గూడిన బ్రాహ్మణ వర్యులచే సేవింపబడునట్టియు,స్థిరమైనట్టియు సౌఖ్యమును కల్గించునట్టియు, దుఃఖమును తొలగించునట్టియు, అమృత, సారములైన ఫలములతో నొప్పారునట్టియు (అమృత ప్రాయమైన మోక్షానందముతో ప్రకాశించునట్టియు) శివుని పాదపద్మ యుగమనెడి గూటియందు సర్వదా విహారమొనరింపుము. వ్యర్థమైన పరిభ్రమణమును విడువుము. ఇతరములతో నీకేమిపని ?

శ్లో॥ ఆకీర్ణే నఖరాజికాంతివిభ వైరుద్యత్సుధావైభవై
రాధౌతేఽపి చ పద్మరాగ లలితే హంసవ్రజై రాశ్రితే,
నిత్యం భక్తి వధూగణైశ్చ రహసి స్వేచ్ఛా విహారం కురు
స్థిత్వా మానసరాజహంస ! గిరిజానాథాంఘ్రి సౌధాంతరే. 46

అ. మానస, రాజహంస = మనస్సనెడి ఓ రాజహంసా ! నఖ, రాజి, కాంతి, విభవైః = గోళ్ళవరుసల కాంతి సంపదలచే, ఆకీర్ణే = నిండినదియు, ఉద్యత్, సుధా, వైభవైః = పైకిస్రవించు అమృతపు సంపదలచే (ప్రకాశించు సున్నపు కాంతులచే) ఆధౌతే = మిక్కిలి తెల్లనిదియు (కడుగబడినదియు), అపి, చ = మఱియు, పద్మరాగ, లలితే = కెంపులతో సుందరమైనట్టిదియు, (పద్మముల యొక్క కెంపువర్ణములచే సుందరమై నట్టిదియు) హంసవ్రజైః = పరమహంస సమూహములచే (హంసల సముదాయములచే) ఆశ్రితే = ఆశ్రయింపబడినదియు అగు, గిరిజా, నాథ; అంఘ్రి, సౌధ, అంతరే = పార్వతి యొక్క భర్తయైన శివుని పాదములనెడి మేడ లోపలిభాగమున, స్థిత్వా = ఉండి, రహసి = ఏకాంతమునందు; భక్తి, వధూ, గణైః, చ = భక్తియనెడి స్త్రీల (హంసాంగనల) సముదాయములతో, నిత్యమ్ = ఎల్లప్పుడును, స్వేచ్ఛావిహారమ్ = స్వతంత్రవిహారమును కురు = చేయుము. అలం. రూపకము.

తా. మనస్సనెడి ఓ రాజహంసా ! నీవు గోళ్ళవరుసలకాంతిసంపదలచే కూడి నదియు, ప్రసరించు అమృత ప్రవాహముచే (ప్రకాశించు సున్నపు కాంతులచే)

కడుగబడినదియు, పద్మరాగమణులచే (పద్మము యొక్క కెంపువర్ణముచే) సుందరమైనదియు; పరమహంస సమూహములచే (అంచపిందులచే) ఆశ్రయింపబడి నదియు, పార్వతీ నాథుడైన శివుని; పాదమనెడి మేడలోపలిభాగమున ఉండి, ఏకాంతమున భక్తియనెడి స్త్రీల (హంసాంగనల) సమూహములతో నెల్లప్పుడును ఇచ్చవచ్చినట్లు విహారమొనరింపుము.

శ్లో॥ శంభుధ్యాన వసంతసంగిని హృదారామేఽఘ జీర్ణ చ్ఛదాః
ప్రస్తాః భక్తిలతాచ్ఛటా విలసితాః పుణ్యప్రవాళశ్రితాః,
దీప్యంతే గుణకోరకా జపవచః పుష్పాశ్చ సద్వాసనాః
జ్ఞానానంద సుధామరందలహరీ సంవిత్ఫలాభ్యున్నతిః. 47

అ. హృత్, ఆరామే = హృదయమనెడి తోట, శంభు, ధ్యాన, వసంత సంగిని = శివునిధ్యానమనెడి వసంతకాలముతో కూడినదికాగా, అఘ, జీర్ణ, చ్ఛదాః = పాపములనెడి ఎండుటాకులు, ప్రస్తాః = రాలిపోయినవి, భక్తిలతా, చ్ఛటాః = భక్తియనెడిలతల సముదాయములు, విలసితాః = ప్రకాశించినవి. పుణ్య, ప్రవాళ, శ్రితాః = పుణ్యమనెడి చిగురుటాకుల నాశ్రయించియున్న, సత్, వాసనాః = మంచి సంస్కారములనెడి పరిమళములుగల, జపవచః పుష్పాః చ = జపవచనములనెడి పూవులుగల, గుణకోరకాః = గుణములనెడి మొగ్గలను, దీప్యంతే = ప్రకాశించుచున్నవి. జ్ఞాన, ఆనంద సుధా, మరంద, లహరీ = జ్ఞానమువలనగల్గు ఆనందామృతమనెడి మకరందప్రవాహము (ప్రకాశించుచున్నది) సంవిత్-ఫల, అభ్యున్నతిః = జ్ఞానమనెడి (సమాధియనెడి) అభ్యుదయము ప్రకాశించుచున్నది. అలం. రూపకము.

తా. హృదయమనెడి తోట శివుని ధ్యానమనెడి వసంతఋతువుతో కూడినదికాగా పాపమనెడి ఎండుటాకులు రాలిపోయినవి. భక్తిలతల సముదాయము విరాజిల్లినది. పుణ్యములనెడి చిగురుటాకులందున్నవి. మంచి సంస్కారములనెడి సువాసనలుగలవి. జపవచనములనెడి పుష్పములుకలవి అగు గుణములనెడి మొగ్గలును, జ్ఞానమువలనగల్గు ఆనందామృతమనెడి మకరంద ప్రవాహమును ధ్యాన సమాధియనెడి ఉత్తమఫలముయొక్క అభ్యుదయమును విలసిల్లుచున్నవి.

శ్లో॥ నిత్యానందరసాలయం సురమునిస్వాంతాంబుజాతాశ్రయం
స్వచ్ఛం సద్విజ సేవితం కలుషహృత్స ద్వాసనావిష్కృతం,

శంభుధ్యాన సరోవరం వ్రజ మనోహంసావతంస ! స్థిరం
కిం క్షుద్రాశ్రయ పల్వల భ్రమణ సంజాతశ్రమం ప్రాప్స్యసి. 48

అ. మనః, హంస, అవతంస = మనస్సనెడి ఓ హంసశ్రేష్ఠమా ! నిత్య, ఆనంద, రస, ఆలయం = శాశ్వతమైన ఆనందమనెడి రసమునకు (నీటికి) నిలయమును, సుర, ముని, స్వాంత, అంబుజాత, ఆశ్రయం = దేవతల యొక్కయు మునుల యొక్కయు పద్మములవంటి హృదయములకు (హృదయములనెడి పద్మములకు) ఆధారమును, స్వచ్ఛం = మిక్కిలి నిర్మలమైనదియు, సత్, ద్విజ, సేవితం = ఉత్తమములైన జలపక్షులనెడి ఉత్తమ బ్రాహ్మణులచే సేవింపబడునదియు, కలుష, హృత్, వాసనా, ఆవిష్కృతం = పాపమునెడి మాలిన్యమును హరించు మంచి సంస్కారములనెడి సత్పరిమళములచే వ్యక్తముచేయబడినదియు, అగు, శంభు ధ్యాన, సరోవరం = శివునిధ్యానమనెడి సరస్సును, స్థిరం = శాశ్వతముగా, వ్రజ = పొందుము. క్షుద్ర, ఆశ్రయ, పల్వల, భ్రమణ, సంజాత, శ్రమం = అల్పుల ఆశ్రయమనెడి నీటిపడియలందు తిరుగుటవలన పుట్టు నాయాసమును, కిం = ఎందుకు, ప్రాప్స్యసి = పొందుదువు ? శివుడు మహాదేవుడు, అతనిని స్థిరముగా నాశ్రయింపుము. నీచుల నాశ్రయించుటవలన కలుగు శ్రమనేల పొందెదవనిభావము. అలం. శ్లేషానుప్రాణితమైన రూపకము.

తా. మనస్సనెడి ఓ హంసశ్రేష్ఠమా ! శాశ్వతమైన బ్రహ్మానందరసమనెడి నీటికినిలయమును, దేవమునుల హృదయములనెడి పద్మములకాధారమును, అతినిర్మలమును, పాపమనెడిమాలిన్యమును పోగొట్టు నుత్తమసంస్కారములనెడి సువాసనలచే వ్యక్తీకృతమైనదియునగు శివుని ధ్యానమనెడి సరస్సును స్థిరముగా నాశ్రయింపుము. నీచుల ఆశ్రయమనెడి చిన్ననీటిపడియలందు తిరుగటవలన గలుగు శ్రమనేలపొందుదువు ? క్షుద్రులై మానవులను దేవతలను ఆశ్రయించి శ్రమ పడుటకంటె దేవతాసార్వభౌముడైన శివుని ధ్యానించుట శ్రేయస్కరమని భావము.

శ్లో॥ ఆనందామృత పూరితా హర పదాం భోజాలవాలాన్వితా
స్థైర్యో పఘ్నముపేత్య భక్తిలతికా శాఖోపశాఖాఽన్వితా,
ఉచ్చైఃజూష్ట ఫలప్రదా భవతు మే సత్కర్మ సంవర్ధితా. 49

అ. ఆనంద, అమృత, పూరితా = ఆనందమనెడి నీటితో (అమృతమువంటి

అ. ఆనంద, అమృత, పూరితా = ఆనందమనెడి నీటితో (అమృతమువంటి ఆనందముతో) నిండినదియు, హర, పద, అంభః + జ, ఆలవాల, అన్వితా = శివుని పద్మములవంటి పాదములనెడి పాదునుండి మొలచినదియు, స్థైర్య ఉపఘ్నం = స్థిరత్వమనెడి ప్రాకుడుకొయ్యను, ఉపేత్య = పొంది, శాఖా, ఉపశాఖా, అన్వితా = కొమ్మలతోడను రెమ్మలతోడను కూడినదియు, ఉచ్చైః మానస, కాయమాన, పటలీం = ఉన్నతములైన (ఉదాత్తమానవుల) మనస్సులనెడి పందిళ్ళసముదాయమును, ఆక్రమ్య = ఆక్రమించి, నిష్కల్మషా = మాలిన్యములేనట్టిదియు (పవిత్రమైనట్టిదియు) సత్, కర్మ, సంవర్ధితా = మంచిదోహదాదికార్యములచే (పుణ్యకార్యములచే) వృద్ధినొందినదియు, అగు, భక్తి, లతికా = శివభక్తియనెడిలత, మే = నాకు, నిత్య, అభీష్ట, ఫల, ప్రదా = శాశ్వతములైన కోరికలనెడి ఫలములనొసంగునది, భవతు = అగుగాత ! అలం. రూపకము.

తా. ఆనందమనెడి నీటితో (అమృతమువంటి ఆనందముతో) నిండినదియు,. శివుని పాదపద్మములనెడి పాదునుండి మొలచినదియు, స్థిరత్వమనెడి ప్రాకుడు కొయ్యనుపొంది కొమ్మలతోడను రెమ్మలతోడను గూడినదియు, ఉన్నతములైన మానసములనెడి పందిళ్ళ సముదాయము నాక్రమించి మాలిన్యరహితమైనదియు (పవిత్రమైనదియు) నగు భక్తియనెడు లత మంచి దోహదకార్యములచే (పుణ్యకర్మలచే) వృద్ధినొందినదై నాకు శాశ్వతములైన కోరికలనెడి ఫలమునిచ్చునది అగుగాక. శివభక్తి నా హృదయమున పెంపొంది నాకుసర్వాభీష్టముల నొసంగుగాక.

శ్లో॥ సంధ్యారంభ విజృంభితం శ్రుతి శిరః స్థానాంతరాధిష్ఠితం
సప్రేమ భ్రమరాళి రామ మసకృత్స ద్వాసనా శోభితం,
భోగీంద్రా భరణం సమస్త సుమనః పూజ్యం గుణావిష్కృతం
సేవే శ్రీగిరిమల్లికార్జున మహాలింగం శివాఽలింగితం. 50

అ. ఈ శ్లోకమున మల్లికాలతతో కూడిన మద్దిచెట్టునకును, తెల్లని వర్ణము గల మల్లికార్జున మహాలింగమునకును అన్వయించునట్లుగా రెండర్థములు చెప్పబడినవి.

సంధ్యా, ఆరంభ, విజృంభితం = (సంధ్యాకాలముమొదట వికసించునదియు) సంధ్యాకాలారంభమునందు తాండవముచే విజృంభించునట్టియు, శ్రుతి, శిరః, స్థాన, అంతర, అధిష్ఠితం = (చెవి, తల అను ప్రదేశములయొక్క మధ్యనున్నట్టిదియు) వేదాంతములనెడి (ఉపనిషత్తులనెడి) ప్రదేశముల మధ్యభాగమున నున్నదియు, స, ప్రేమ,

భ్రమర, అభిరామం = (ప్రీతితో కూడిన తుమ్మెదలచే మనోహరమైనదియు) అనురాగముతో కూడిన భ్రమరాంబికామహాదేవితో మనోహరమైనట్టిదియు, అసకృత్, సత్‌వాసనా, శోభితం = (మాటిమాటికిని మంచి పరిమళముతో ప్రకాశించునట్టిదియు) అనేక విధములయిన మంచి సంస్కారముతో ప్రకాశించునట్టిదియు, భోగి, ఇంద్ర, ఆభరణం = (శ్రేష్ఠులయిన భోగులకు భోగములననుభవించువారికి అలంకారమైనదియు), సర్పరాజైన వాసుకి ఆభరణముగా గల్గినట్టిదియు, సమస్త సుమనః పూజ్యం = అన్నిపువ్వులలో శ్రేష్ఠమైనదియు, (సర్వపండితులచే గౌరవింపబడునదియు) సర్వదేవతలకు పూజింపదగినదియు, గుణ, ఆవిష్కృతం = సద్గుణములచే వెల్లడిచేయబడినదియు, శివా, ఆలింగితం = (జమ్మిచెట్టుతోకూడినట్టిదియు) పార్వతిచే కౌగిలించుకొనబడినదియు, అగు శ్రీగిరి, మల్లికార్జున మహాలింగం = (శ్రీశైలమునందలి మల్లికాలతతో కూడిన, లింగమువంటి, మద్దిచెట్టును,) (చంద్రగుప్తుడనురాజుకూతురైన చంద్రవతిచే నర్పింపబడిన మల్లెపూవులదండచే ఒక విధమయిన తెల్లని వర్ణముగల, మల్లికార్జున నామముగల శివుని జ్యోతిర్లింగమును), సేవే = సేవింతును. అలం. శ్లేష.

పూర్వగాథ :- శ్రీశైలప్రాంతదేశమును పాలించు చంద్రగుప్తుడను రాజు రతిసుందరియగు చంద్రవతియను నామముగల తన కూతునే మోహించెను. ఆ విషయమెఱింగి చంద్రవతి గృహము విడచి శ్రీశైలమునకరిగి శివుని గూర్చి తపస్సొనరించెను. అంత శివుడు ప్రత్యక్షము కాగా నామె భక్తితో మల్లెపూల దండ నర్పించి తనకు సాయుజ్యము ప్రసాదింపుమని వేడుకొనెను. ఆ మల్లికామాల తీసికొని శివుడర్జున (తెల్లని) వర్ణము పొందెను. అప్పుడామె ఆతనిని మల్లికార్జున సార్థక నామము ధరింపవలెనని ప్రార్థించెను. శివుడంగీకరించి లింగరూపుడయ్యెను. అప్పటి నుండియు శ్రీశైలమునందలి శివలింగమునకు మల్లికార్జున నామము కలిగెను.

తా. సంధ్యాకాలము మొదట తాండవ నృత్యముచే విజృంభించునట్టియు (సాయంకాలమున పూలచే వికసించునట్టియు) వేదశీర్షములైన ఉపనిషత్తులందు వర్ణింపబడునట్టియు (భక్తులచే చెవులందును తలలందును ధరింప బడునట్టియు) ప్రేమతో కూడిన భ్రమరాంబికచే మనోహరమైనట్టియు (ప్రీతితో కూడిన తుమ్మెదలచే సుందరమైనట్టియు) మాటిమాటికిని యోగ్యములై సంస్కారములచే (మంచి సువాసనలచే) ప్రకాశించునట్టియు సర్పరాజైన వాసుకి ఆభరణముగా గల్గినట్టియు (భోగప్రియులైనవారికా భరణమైనట్టియు) అందఱు దేవతలకు (పండితులకు) పూజ నీయమైనట్టియు,

(అన్నిపూవులలో శ్రేష్ఠమైనట్టియు) సద్గుణములచే వ్యక్తముచేయబడునట్టియు, పార్వతిచే కౌగిలించుకొనబడినట్టియు, జమ్మిచెట్టుతో గలిసియున్నట్టియు, శ్రీశైలమందలి చంద్రవతీసమర్పిత మల్లికాదామముచే ధవళ వర్ణముగల మల్లికార్జున నామక జ్యోతిర్లింగమును (శ్రీశైలమందలి మల్లికాలతతో కూడినలింగము వంటి మద్దిచెట్టును) సేవింతును.

శ్లో॥ భృంగీచ్ఛానటనోత్కటః కరిమద గ్రాహీస్ఫురన్మాధవా
హ్లాదో నాదయుతో మహోసితవపుః పంచేషుణా చాదృతః,
సత్పక్షస్సుమనోవనేషు స పునస్సాక్షాన్మదీయే మనో
రాజీవే భ్రమరాధిపో విహరతాం శ్రీశైలవాసీ విభుః. 51

ఆ. ఈ శ్లోకము నందలి విశేషణము భ్రమరాంబాపతియై శ్రీశైలమల్లికార్జునునకును, తుమ్మెదల అధిపతికిని – ఇరువురికిని అన్వయించును, భృంగి(భృంగీ) ఇచ్ఛా, నటన, ఉత్కటః = తన భక్తుడైన భృంగీశ్వరుడు స్వేచ్ఛగా నొనరించు (లేక భృంగీశ్వరుని కోరికనను సరించిచేయు) నాట్యము నందధిక సంతోషముకలవాడును (ఆడుతుమ్మెదల కోరికనను సరించి స్వేచ్ఛగా చేయు) నాట్యమునందు ప్రీతికలదియు; కరి, మద, గ్రాహీ = గజాసురుని మదము నడచినవాడును (ఏనుగుల కపోలములందలి మదజలమును గ్రహించునట్టియు) స్ఫురత్, మాధవ, ఆహ్లాదః = జగన్మోహినీ రూపమును ధరించి ప్రకాశించునారాయణునందు ఆనందము కలిగినట్టియు; (ప్రకాశించు వసంతర్తువుచే నానందము పొందునట్టియు), మహా, సిత, (అసిత) వపుః = మిక్కిలి తెల్లని దేహముగలవాడును (మిక్కిలి నల్లని మేను కలదియు) పంచ + ఇషుణా, చ, ఆదృతః = ఐదు బాణములుగల మన్మథునిచే భయగౌరవ పూర్వకముగా కొట్టబడినవాడును (మన్మథబాణములైన అరవింద, అశోక, చూత, నవమల్లికా, ఇందీవరపుష్పములచే ఆకర్షింపబడునదియు (మన్మథునిచే నిజ పరివారమునందుండుటచే నాదరింపబడునదియు) సుమనః అవనేషు (వనేషు) = దేవతలను రక్షించుటయందు (పూలతోటలందు) సత్, పక్షః = మంచిపక్షపాతము కలవాడును (తిరుగుటచే సురభిళములైన తెక్కలు గలదియు, మంచి అభిమానము కలదియు) సః = ఆ; విభుః = జగత్ప్రభువైన (ప్రకాశించునట్టి శ్రీశైల, వాసీ = శ్రీ శైలమునందు వసించు, భ్రమరా, అధిపః = భ్రమరాంబికాపతియైన, శివుడు (తుమ్మెదలతేడు) పునః = మాటిమాటికి; మదీయే = నాకు సంబంధించిన

(నాయొక్క) మనః, రాజీవే = పద్మము, వంటిమనస్సునందు (మనస్సనెడి పద్మమునందు) సాక్షాత్ = సాక్షాత్తుగా (సాక్షాత్కరించి), విహరతామ్ = విహరించుగాక. అలం. శ్లేష.

తా. తన భక్తుడైన భృంగీశ్వరుని కోరికననుసరించి నాట్యము చేయుటయందు (స్వేచ్ఛానటనమందు) ప్రమోదముకలవాడును, (ఆడుతుమ్మెదల కోరికననుసరించి (స్వేచ్ఛానటన మందు) మిక్కిలి ప్రీతికలదియు) గజాసురుని మదమడచినట్టియు (ఏనుగుల కపోలములందలి మదమును గ్రోలునట్టియు) జగన్మోహినీ రూపము ధరించి ప్రకాశించు విష్ణువునెడ అనురాగము కలిగినట్టియు (ప్రకాశించు వసంతర్తువునం దధిక ప్రీతి కలిగినట్టియు) మిక్కిలి తెల్లని (నల్లని) మేనుకలిగినట్టియు, మన్మథునిచే భయ గౌరవపూర్వకముగా కొట్టబడినట్టియు (అరవిందాది కుసుమములు బాణములుగాగల మన్మథునిచే నాదరింపబడునట్టియు) దేవతలను పండితులను, (సజ్జనులను) రక్షించుట యందు పక్షపాతము కలవాడును (పూలతోటలం దధికాదరము కలదియు) నగు నాజగత్ప్రభువైన (ప్రకాశించు) శ్రీ శైలమున నివసించు భ్రమరాంబాపతియైన శివుడు (తుమ్మెదలజేడు) నా మనః పద్మమునందు సాక్షాత్కరించి (స్వయంగా) విహరించుగాక !

శ్లో॥ కారుణ్యామృత వర్షిణం, ఘనవిపద్గ్రీష్మచ్ఛిదాకర్మఠం
విద్యాసస్య ఫలోదయాయ సుమనస్సంసేవ్య మిచ్ఛాకృతిమ్,
నృత్యద్భక్త మయూర మద్రినిలయం చంచజ్జటామండలం
శంభో ! వాంఛతి నీలకంధర ! సదా త్వాం మే మనశ్చాతకః. 52

అ. శంభో = శివా ! నీల, కంధర = నల్లనికంఠము కలవాడా ! నీటిని ధరించు నీలమేఘుడా ! కారుణ్య, అమృత, వర్షిణం = దయయనెడినీటిని కురియునట్టియు, ఘన, విపత్, గ్రీష్మ, ఛిదా, కర్మఠం = గొప్ప ఆపదలనెడి వేసవికాలమును (వేడిని) భేదించు కర్మయందు కుశలుడవును; విద్యాసస్య, ఫల, ఉదయాయ = జ్ఞానమనెడి పైరుపంటయొక్క ఉత్పత్తికి, సుమనః, సంసేవ్యం = దేవతలనెడి (పండితులులేక సజ్జనులనెడి) సుహృదయులైన రైతులచే, సంసేవ్యం = లెస్సగా సేవింపదగినవాడవును; ఇచ్ఛా, ఆకృతిం = ఇచ్చవచ్చిన రూపముకలవాడవును (కామరూపుడవును) నృత్యత్, భక్త, మయూరం = నృత్యముచేయు భక్తులనెడి నెమిళ్ళు కలవాడవును, అద్రి, నిలయం = పర్వతమే నిలయముగా గల వాడవును, చంచత్, జటా, మండలం = కదలుచున్న జడలనెడి మండలము సమూహము (మేఘములు మండలాకారముగా నుండి చంచలముగా

నుండును మేఘమండలమను పదము వాడుకలో నున్నది) కలవాడవును, (చంచత్ అనుపదము మెఱపులను స్మృతికి తెచ్చుచున్నది. మెఱుపు లనే జటామండలము) కలవాడవును; అగు; త్వాం = నిన్ను, మే = నాయొక్క, మనః, చాతకః = మనస్సనెడిచాతకపక్షి, సదా = ఎల్లప్పుడును, వాంఛతి = కోరుచున్నది. అలం. రూపకము.

తా. నల్లనికంఠముగల శివుడనెడి నీటినిచ్చు నల్లని ఓ మేఘుడా ! దయా మృతమనెడినీటిని వర్షించు నట్టియు, గొప్ప ఆపదలనెడి గ్రీష్మకాలమును తొలగించుట యందు కుశలుడవును, జ్ఞానముయొక్క ఫలోత్పత్తి కొఱకు దేవతలనెడి సజ్జనులైన వ్యవసాయదారులచే లెన్నగా సేవింపదగినవాడవును, కామరూపుడవును, నృత్యముచేయుచున్న భక్తులనెడి నెమిళ్ళుకలవాడవును, పర్వతము నిలయముగాగల వాడవును, ప్రకాశించు (కదలాడు) జడలనెడిమండలము కలవాడవును అగు నిన్ను నా మనస్సనెడి చాతక పక్షి యెప్పుడును, వాంఛించుచున్నది. మనస్సునకు చాతకముతోడను శివునికి మేఘముతోడను పోలిక చెప్పబడినది. చాతకము మేఘమునుండి పడు నీటినేకాని త్రాగదనియు మేఘాగమనమునకై యెదురుచూచుచుండుననియు కవిసమయము.

శ్లో॥ ఆకాశేన శిఖీ సమస్త ఫణినాం నేత్రా కలాపీ నతా
నుగ్రాహీ ప్రణవోపదేశ నినదైః కేకీతి యో గీయతే,
శ్యామాం శైలసముద్భవాం ఘనరుచిం దృష్ట్వా నటంతం ముదా
వేదాంతోపవనే విహారరసికం తం నీలకంఠం భజే. 53

అ. ఆకాశేన = ఆకాశముచేత, శిఖీ = శిఖండముకలవాడును (శివుడువ్యోమ కేశుడు, నెమలికి నెత్తిపై (శిఖ) శిఖండముండును కావుననది శిఖియనబడును (సమస్త ఫణినాం = సర్వసర్పములకును, నేత్రా = నాయకుడైన (వాసుకిచే), కలాపీ = అలంకారముకలవాడును (శివుడు వాసుకిభూషణుడు, నెమలిపింఛమునకు కలాపమని పేరు, అదికలది కావున నెమలి కలాపి. (నెమలి సర్పములను ముక్కుతో పొడుచును. కాళ్ళతో గ్రహించును.అందుచే సర్పరాజుచే నది అలంకారముకలదగును) నత, అనుగ్రాహీ = అశ్రితులననుగ్రహించువాడును, (నెమలి వంగినడచువారి ననుసరించును. లేక వారికిచిక్కును) ప్రణవ, ఉపదేశ, నినదైః = ఓంకార మంత్రముయొక్క ఉపదేశమునకు సంబంధించిన ధ్వనులచే, కేకీ, ఇతి = క్రేంకారధ్వని కలవాడని, యః = ఎవడు, గీయతే నుతింపబడుచుండునో, (నెమలికూతలకు కేకలనిపేరు. షడ్జస్వరమనియ నెమలిధ్వనికిపేరు.

అది ఉచ్చైర్నాదముచే ఓం కారధ్వనిని పోలియుండును. అట్టికేకలచేనది కేకి అని పిలువబడును), శ్యామాం = నల్లని వర్ణము కలదియు, శైలసముద్భవాం = పర్వతమునకు పుట్టినదియు, (హిమవంతుని కూతురును) అగు, ఘన, రుచిం = (మేఘముయొక్క కాంతిని) గొప్పకాంతి కల లేక మేఘముయొక్క కాంతివంటి కాంతిగల పార్వతిని) దృష్ట్వా = చూచి, ముదా = సంతోషముతో, నటంతం = నటించువాడును (నృత్యము చేయునదియు) వేదాంత, ఉపవన, విహార, రసికం = ఉపనిషత్తులనెడి ఉద్యానవనమందు విహరించుట యందు ప్రీతికలవాడును (కలదియు) అగు, తం = ఆ, నీలకంఠం = శివుని (నెమలిని), భజే = భజింతును. అలం, శ్లేషతో కూడిన రూపకము.

తా. ఆకాశముచే జుట్టుకలవాడును (శిఖండము కలదియు) సర్వసర్పరాజైన వాసుకిచే నలంకారముకలవాడును (సర్పరాజులను కాళ్ళతో తన్నుకొని పోవుటచే వానిచే నలంకారము కలదియు, పింఛముకలదియు) ఆశ్రితుల ననుగ్రహించువాడును (వంగినడచువారికి చిక్కునదియు) ఓంకారోపదేశధ్వనులచే కేకియని స్తుతింపబడువాడును (ఓంకార ధ్వనినిపోలిన కేకలచే కేకియని పిలువబడునదియు) నల్లనివర్ణముకలదియు, శైలతనయయు (హిమవత్తనూజయు) గొప్ప కాంతి కలదియునగు మేఘముయొక్క కాంతిని) చూచి నాట్యము చేయువాడును (చేయునదియు) ఉపనిషత్తులనెడి (లువంటి) ఉద్యానవనమందు విహరించుట యందు ప్రీతికలవాడును (కలదియు) నగు ఆ నల్లని కంఠముకల శివుని (నెమలిని) భజింతును.

శ్లో॥ సంధ్యా ఘర్మ దినాత్యయో హరికరాఘాత ప్రభూతానక
ధ్వానో వారిదగర్జితం, దివిషదాం దృష్టిచ్ఛటా చంచలా,
భక్తానాం పరితోష బాష్పవితతిర్వృష్టిర్మయూరీ శివా
యస్మిన్ను జ్జ్వల తాండవం విజయతే తం నీలకంఠం భజే. 54

అ. సంధ్యా = సంధ్యాకాలము, ఘర్మ, దిన, అత్యయః = గ్రీష్మకాలము యొక్క అంతము (వర్షాకాలారంభము) హరి, కర, ఆఘాత, ప్రభూత, ఆనక ధ్వానః = విష్ణువుయొక్క చేతులతో వాయింపబడిన మద్దెల (తప్పెట) యొక్క ధ్వని, వారిద, గర్జితం = మేఘముయొక్క గర్జ (ఉరుము). దివిషదాం = దేవతలయొక్క, దృష్టి, చ్ఛటా = చూపుల సముదాయము, చంచలా = మెఱుపు, భక్తానాం = భక్తులయొక్క, పరితోష, బాష్ప, వితతిః = సంతోషమువలన కలిగిన ఆనందబాష్పసముదాయము, వృష్టిః = వర్షము, శివా =

పార్వతి, మయూరీ = ఆడనెమలి, యస్మిన్ = ఏ శివునియందు (నెమలియందు) తాండవం = ప్రకాశమానమైన తాండవనృత్యము, విజయతే = ప్రవర్తిల్లునో, తం = ఆ, నీలకంఠం = నల్లనికంఠము గల శివుని (నెమలిని), భజే = భజింతును. నెమలి వర్షాకాలారంభముకాగానే ఆడునెమలితో కూడి నృత్యము చేయును. శివుడు సంధ్యాకాలమున పార్వతితో కూడి నాట్యము చేయును. అలం. రూపకము.

తా. సంధ్యాసమయము, వేసవికాలముయొక్క అంతము, విష్ణువుచేతులతో వాయింపబడు మద్దెలధ్వని, మేఘగర్జ, దగ్గఅనుండి చూచుచుండు దేవతలచూపుల సమూహము మఱపు భక్తుల ఆనందబాష్పముల సమూహము వాన, పార్వతి ఆడునెమలి ఇట్టిపరిస్థితులలో ఆనందతాండవమాచరించు శివుని (నెమలిని) భజింతును. (నెమలి వంటి శివుని అని చెప్పుకొనవలెను)

శ్లో॥ నిత్యాయ, త్రిగుణాత్మనే, పురజితే, కాత్యాయనీ ప్రేయసే
సత్యాయాది కుటుంబినే, మునిమనఃప్రత్యక్ష చిన్మూర్తయే,
మాయాసృష్టజగత్త్రయాయ సకలామ్నాయాంతసంచారిణే
సాయం తాండవసంభ్రమాయ జటినే, సేయం నతిశ్శంభవే. 55

అ. నిత్యాయ = శాశ్వతుడును, త్రిగుణ, ఆత్మనే = సత్వ, రజః, తమో గుణ స్వరూపుడును, పుర, జితే = త్రిపురములను జయించినవాడును, కాత్యాయనీ, ప్రేయసే = పార్వతీవల్లభుడును, సత్యాయ = సత్యమునకు నిలయమైనవాడును, ఆది, కుటుంబినే = జగత్తునంతను సృష్టించిన వాడగుటచే మొదటి సంసారియైనవాడును, ముని, మనః, ప్రత్యక్ష, చిత్; మూర్తయే = మునులయొక్క మనస్సులకు గోచరించు జ్ఞానస్వరూపుడును, మాయా, సృష్ట, జగత్, త్రయాయ = మాయచేత సృజింపబడిన మూడులోకములు కలవాడును, సకల, ఆమ్నాయ, అంత సంచారిణే = సర్వవేదాంతములందును (ఉపనిషత్తులయందును) సంచరించువాడును, సాయం, తాండవ; సంభ్రమాయ = సాయంకాలమునందు తాండవము చేయుటకు వేగిరపడువాడును, జటినే = జడలుకలవాడును, అగు, శంభవే = శివుని కొఱకు, సా, ఇయం, నతిః = ఆ, ఈ నమస్కారము.

తా. శాశ్వతుడును, సత్త్వము తమము, రజస్సు అను మూడుగుణముల

రూపముకలవాడును. త్రిపురములను జయించినవాడును, కాత్యాయనీవల్లభుడును, నత్యమునకు నిలయమైనవాడును, జగత్తులకు మొదటి నంసారియు, మునిమానసములందు జ్ఞానస్వరూపముతో గోచరించువాడును, మాయచేత సృజింపబడిన ముల్లోకములుకలవాడును. ఎల్లఉపనిషత్తులయందును నంచరించువాడును. ప్రదోషకాలమున తాండవమొనరించుటయందు ఆదరము కలవాడును, జడలను ధరించినవాడును, అయిన శివునికి ఇదే నా నమస్కారము.

శ్లో॥ ఆద్యాయామితతేజసే, శ్రుతిపదై ర్వేద్యాయ సాధ్యాయ తే
విద్యానందమయాత్మనే, త్రిజగతస్సంరక్షణోద్యోగినే,
ధ్యేయాయాఖిలయోగిభి స్సురగణై ర్గేయాయ మాయావినే
సమ్యక్తాండవసంభ్రమాయ జటినే సేయం నతి శ్శంభవే. 56

అ. ఆద్యాయ = సర్వసృష్టికిని మొదటివాడవును, అమిత, తేజసే = అధికమైన తేజస్సు కలవాడవును, శ్రుతి, పదైః = వేదములందలి పదములచే, వేద్యాయ = తెలిసికొనఁదగినవాడవును, సాధ్యాయ = ఎల్లసాధనములచే (తపోధ్యానాదులచే) సాధింపఁదగినవాడవును, విద్యా ఆనంద మయ, ఆత్మనే = జ్ఞానానందములతో నిండిన స్వరూపముకలవాడవును, త్రిజగతః సంరక్షణ ఉద్యోగినే = ముల్లోకములను రక్షించుట యందు ప్రయత్నముకలవాడవును, అఖిల, యోగిభిః = ఎల్లయోగులచే, ధ్యేయాయ = ధ్యానముచేయఁదగినవాడవును, సుర, గణైః = దేవతాసమూహములచే, గేయాయ = స్తుతింప (కీర్తింప) దగినవాడవును, మాయావినే = మాయకలవాడవును (మాయచే పెక్కు ఉపాధులు ధరించువాడవును) సమ్యక్ తాండవ, సంభ్రమాయ = లెస్సగా (యథాశాస్త్రముగా) తాండవము చేయుటయందు ఆదరము కలవాడవును, జటినే = జడలుకలవాడవును, అగు, శంభవే, తే = శంభుడవైన నీకు, సా, ఇయం, నతిః = ఆ యీ నమస్కారము. (ఇదే నమస్కారము).

తా. సర్వలోకాద్యుడవును, అధికతేజస్సంపన్నుడవును, వేదపదములచే తెలిసికొనదగినవాడవును, తపోధ్యానాధి సాధనములచే సాధింపఁదగిన వాడవును, జ్ఞానానంద స్వరూపుడవును, ముల్లోకములను రక్షించుటకు నిత్యయత్నమొనర్చువాడవును, నర్వయోగులచే ధ్యానముచేయఁదగినవాడవును, దేవతానమూహములచే కీర్తింపఁదగినవాడవును, మాయచే ననేకోపాధుల ధరించువాడవును, యథాశాస్త్రముగా

తాండవమొనర్చుట యందాదరము కలవాడవును జటాధారివియు, శంభుడవునగు నీకిదే నా నమస్కారము. ఇందు శివుని గుణస్వరూప మహిమలు లెస్సగా వర్ణింపబడినవి.

శ్లో॥ నిత్యం స్వోదరపోషణాయ సకలానుద్దిశ్య విత్తాశయా
వ్యర్థం పర్యటనం కరోమి, భవతస్సేవాం న జానే విభో !
మజ్జన్మాంతర పుణ్య పాక ఫలతస్త్వం శర్వ సర్వాంతర
స్తిష్ఠస్యేవ హి తేన వా పశుపతే తే రక్షణీయోఽస్మ్యహమ్. 57

అ. విభో = ప్రభూ ! శర్వ = శివా ! పశుపతే = సర్వజీవాధిపతీ, నిత్యం = సంతతమును, స్వ, ఉదర, పోషణాయ = నా కడుపు నింపుకొనుట కొఱకు, విత్త, ఆశయా = ధనమునందలి ఆశచే, సకలాన్ = అందఱిని, ఉద్దిశ్య = ఉద్దేశించి, వ్యర్థం = నిష్ప్రయోజనమైన, పర్యటనం = తిరుగుటను, కరోమి = చేయుచున్నాను, భవతః = నీయొక్క, సేవాం = సేవను, న, జానే = ఎఱుగను, మత్, జన్మ, అంతర పుణ్య, పాక, ఫలతః = నా పూర్వజన్మ మందలి పుణ్యపరిపాకముయొక్క ఫలము వలన, త్వం = నీవు, సర్వ, అంతరః = అన్నిటిలోపలనున్న వాడవై (నాలోకూడ) తిష్ఠసి, ఏవ, హి = ఉండనే ఉందువు కదా, తేన, వా = ఆకారణముచేనైన, అహం = నేను, తే = నీకు రక్షణీయః, అస్మి = రక్షింపఁదగినవాడ నగుచున్నాను, నేను నిన్ను సేవించుట యెఱుగనివాడనైనను సర్వాంతర్యామివగు నీవంతటను, నాయందును ఉన్నవాడవగుటచే నేను రక్షణీయుడనే అగుచున్నాను.

తా. ప్రభూ, పశుపతీ, శివా! నాకడుపునింపుకొనుటకై ధనమునందలి యాశచే నిత్యమును అందఱినుద్దేశించి వ్యర్థమైన పరిభ్రమణ మొనరించుచున్నాను. నీ సేవ నెఱుగను. కాని నా పూర్వజన్మ పుణ్యపరిపాక ఫలముచే సర్వాంతర్యామివైన నీ వన్నిటి యందు వలె నాయందు కూడ నుండనే యున్నావు. అందుచేనైన (నాయందు కూడనున్న వాడవగుటచే) నన్నుపేక్షించుటకు వీలులేదు. నేను కూడ నీకు రక్షింపఁదగిన వాడ నగుచున్నాను.

శ్లో॥ ఏకో వారిజబాంధవః క్షితి నభో వ్యాప్తం తమోమండలం
భిత్వా లోచన గోచరోఽపి భవతి, త్వం కోటి సూర్యప్రభః,

వేద్యః కిం న భవస్యహో ఘనతరం కీదృగ్భ వేన్మత్తమ
స్తత్సర్వం వ్యపనీయ మే పశుపతే ! సాక్షా త్ర్పసన్నో భవ. 58

అ. పశుపతే = పశుపతివైన ఓ శివా, ఏకః = ఒక్క (డైనను) వారిజ బాంధవః = పద్మమిత్రుడైన సూర్యుడు, క్షితి, నభః, వ్యాప్తం = భూమియందును, ఆకాశమందును వ్యాపించిన; తమః మండలం = అంధకార సముదాయమును; భిత్వా = భేదించి (నశింపఁజేసి); లోచన, గోచరః, అపి = కన్నులకు కనబడువాడుకూడ, భవతి = అగుచున్నాడు, త్వం = నీవు, కోటి, నూర్యప్రభః = కోటినూర్యులకాంతి వంటికాంతికలవాడవు, వేద్యః = తెలియఁదగినవాడవు (కనఁబడువాడవు) కిం, న, భవసి = ఎందుకు కాకున్నావు. అహో = ఏమాశ్చర్యము, మత్, తమః = నా అజ్ఞానము (చీకటి), కీదృక్ = ఎట్టిది (ఎంతగాఢమైనది) భవేత్ = అగునో కదా ! తత్, సర్వం = ఆ నా అజ్ఞానాంధకారమునంతటిని, వ్యపనీయ = తొలగించి, మే = నాకు, సాక్షాత్, ప్రసన్నః = సాక్షాత్కరించి అనుగ్రహించువాడవు, భవ = కమ్ము.

తా. పశుపతీ ! శివా ! సూర్యుడొక్కడేయైనను భూమ్యాకాశముల నావరించిన గాఢాంధకారసమూహమును భేదించి జనులకు లోచనగోచరుడు కూడ నగుచున్నాడు. నీవో కోటిసూర్యులకాంతిగలవాడవు. మాకెందుకో గోచరింపకున్నావు. ఇది చాల ఆశ్చర్యముగా నున్నది. అదిగాక నాయందలి అజ్ఞానమనెడి చీకటి యెంత గాఢమైనదో కదా, ఆ అజ్ఞానాంధకారమునంతటిని తొలగించి నాకు సాక్షాత్కరించి ప్రసన్నుడవు కమ్ము, సూర్యుడొక్కడేయయ్యు భూమ్యాకాశవ్యాప్తమైన చీకటిని భేదించి జననయన గోచరుడగుచున్నాడు. నీవో కోటి సూర్యప్రభుడవు. కనబడకుండుట అచ్చెరువుగా నున్నది. బహుశః నా అజ్ఞానాంధకారము గాఢమైయున్నది కాబోలును. అయినను దానిని తొలగించి నాకు సాక్షాత్కరించి ప్రసన్నుడవగుము.

శ్లో॥ హంసః పద్మవనం సమిచ్ఛతి యథా నీలాంబుదం చాతకః
కోకః కోకనదప్రియం ప్రతిదినం చంద్రం చకోరస్తథా,
చేతో వాంఛతి మామకం, పశుపతే చిన్మార్గ మృగ్యం విభో!
గౌరీనాథ, భవత్పదాబ్జయుగళం కైవల్య సౌఖ్యప్రదమ్. 59

అ. పశుపతే = పశుపతీ ! విభో = ప్రభూ ! గౌరీనాథ = పార్వతీప్రియా, శివా! హంసః = హంస, పద్మ, వనం = పద్మషండముతోకూడిన తామరకొలనును, చాతకః = చాతకపక్షి; నీల, అంబుదం = నల్లని మేఘమును, కోకః = చక్రవాకము, కోకనద ప్రియం = సూర్యుని, చకోరః = చకోరపక్షి, చంద్రం = చంద్రుని, ప్రతిదినం = నిత్యము, యథా = ఏవిధముగా; వాంఛతి = కోరునో; తథా = ఆ విధముగా మామకం = నాకు సంబంధించిన (నాయొక్క) చేతః = మనస్సు; చిత్, మార్గ, మృగ్యం = జ్ఞానమార్గముచే వెదకఁదగిన, కైవల్య సౌఖ్య, ప్రదం = మోక్షసుఖమునొసంగు, భవత్, పద, అబ్జ, యుగళం = నీ పద్మములవంటి పాదముల జంటను, వాంఛతి = కోరును. అలం. ఉపమ.

తా. పశుపతీ ! ప్రభూ ! పార్వతీనాథ ! శివా ! హంస తామరకొలనును, చాతకపక్షి, వర్షాకాలమేఘమును, చక్రవాకము సూర్యుని, చకోరపక్షి చంద్రుని ప్రత్యహమును కోరునట్లు నా మనస్సు జ్ఞానమార్గముచే వెదకఁదగినట్టియు, మోక్షసౌఖ్యము నొసంగునట్టియు నీ పద్మములవంటి పాదములజంటను కోరుచున్నది. పై ఉపమానములన్నియు కవిమనస్సునకు శివపాదపద్మములయెడగల గాఢమైన ప్రీత్యుత్కంఠలను సూచించుచున్నవి.

శ్లో॥ రోధస్తోయవృతః శ్రమేణ పథికశ్ఛాయాం తరో, ర్వృ ష్టితో
భీతః స్వస్థ గృహం, గృహస్థమ తిథి ర్దీనః ప్రభుం ధార్మికమ్,
దీపం సంతమసాకులశ్చ శిఖినం శీతావృతస్త్వం తథా
చేతస్సర్వ భయాపహం వ్రజ సుఖం శంభోః పదాంభోరుహమ్. 60

అ. చేతః = ఓ మనసా, త్వం = నీవు, తోయ, వృతః = నీటిచే హరింప బడువాడు, నీటిలో కొట్టుకొనిపోవువాడు, రోధః = తీరమును (వలె), శ్రమేణ = శ్రమచే, పథికః = బాటసారి, తరోః = చెట్టుయొక్క, ఛాయాం = నీడను (వలె), వృష్టితః = వానవలన, భీతః = భయపడినవాడు, స్వస్థః = సుఖ కరమైన, గృహం = ఇంటిని (వలె) అతిథిః = అతిథి, గృహస్థం = గేస్తును (వలె), దీనః = ఆర్తుడైన దరిద్రుడు, ధార్మికం = ధర్మాత్ముడైన, ప్రభుం = రాజును (ధనికుని) వలె, సంతమస, ఆకులః = గాఢాంధకారమున కలతనొందువాడు, దీపం = దీపమును (వలె), శీత, ఆవృతః = చలితో కూడినవాడు, శిఖినం = అగ్నిని (వలె), తథా = ఆవిధముగా, సర్వ, భయ,

అపహం = అన్నిభయములను తొలగించునట్టియు, సుఖం = సౌఖ్యకరము, (పవిత్రము) అయినట్టియు, శంభోః = శివునియొక్క, పద, అంభోరుహం = పద్మమువంటి పాదమును, వ్రజ = పొందుము, (సుఖం అనుదానికి సుఖముగా అని అవ్యయార్థమైన చెప్పవచ్చును. సుఖముగా పొందుము) అలం. ఉపమ.

తా. ఓ మనసా ! నీవు నీటిలో కొట్టుకొనిపోవువాడు తీరమును వలె, శ్రమచే (అలసట నొందుటచే) బాటసారి చెట్టునీడను వలె, వానవలన భయపడువాడు సుఖకరమైన యింటిని వలె, అతిథి గేస్తునువలె, ఆర్తుడైన దరిద్రుడు ధనిక ప్రభువును వలె, చీకటిచే నావరింపబడినవాడు దీపమును వలె, చలితో బాధపడువాడు అగ్నినివలె సర్వభయములను పోగొట్టునట్టియు సౌఖ్యకరమైనట్టియు శివుని పదపద్మమును చేరుము, తోయవ్యాతాదుల లక్షణములన్నియు మనసునందును తీరాదులలక్షణము లన్నియు శంభు పాదపద్మమునందును గలవు.

శ్లో॥ అంకోలం నిజబీజసంతతి, రయస్కాంతోపలం సూచికా,
సాధ్వీ నైజవిభుం, లతా క్షితిరుహం, సింధుస్సరిద్వల్లభమ్,
ప్రాప్నోతీహ యథాతథా పశుపతేః పాదారవింద ద్వయం
చేతో వృత్తిరుపేత్య తిష్ఠతి సదా సా భక్తిరిత్యుచ్యతే. 61

అ. ఈశ్లోకమున శ్రీ శంకరులు భక్తిని నిర్వచించుచున్నారు. యథా = ఏ విధముగా, నిజ, బీజ, సంతతిః = ఊడుగు చెట్టు యొక్క గింజల (విత్తనముల) సముదాయము, అంకోలం = ఊడుగు చెట్టును, (ఊడుగు చెట్టు పండ్ల గింజ లెండి నేలరాలి వర్షకాలమున మేఘుడు గర్జింపగనే చెట్టు మొదటకి పోవుననియు లేక చెట్టు కొమ్మల నంటుకొను ననియు చెప్పుదురు.) సూచికా = సూది, అయస్కాంత, ఉపలం = సూదంటురాతిని, సాధ్వీ = పతివ్రత, నైజ, విభుం = తన భర్తను, లతా = తీగ, క్షితిరుహం = చెట్టును, సింధుః = నది, సరిత్, వల్లభం = నదీ భర్తయైన సముద్రుని, ఇహ = ఈ లోకమున, ప్రాప్నోతి = పొందునో, తథా = ఆ విధముగా, చేతః, వృత్తిః = మనోవ్యాపారము, పశుపతేః = పశుపతి యైన శివునియొక్క, పాద, అరవింద, ద్వయం = పద్మముల వంటి పాదముల జంటను, ఉపేత్య = చేరి, సదా = ఎల్లప్పుడును, తిష్ఠతి = ఉండునో, సా = ఆస్థితి, భక్తిః, ఇతి = భక్తి అని, ఉచ్యతే = చెప్పఁబడును. అలం. ఉపమ.

తా. ఈడుగు చెట్టు గింజలు నేలరాలి వర్షాకాలమురాగానే ఆ చెట్టునే చేరునట్టును, సూది సూదంటురాతిని అంటుకొనునట్లును, పతివ్రత పతియెట్టివాడైనను అతనినే వదలక యుండునట్లును, లత వృక్షము నంటిపెట్టుకొని యుండునట్లును,నది సముద్రమును చేరునట్లును భక్తుని చిత్తవృత్తి పశుపతియైన శివుని పాదపద్మయుగళము నెల్లప్పుడును చేరి యుండు స్థితిని భక్తి యందురు. శంకరులు భక్తిని నిరసించి యుండలేదు. మోక్షసాధన సామగ్రిలో భక్తియే గరిష్ఠమని వారు వివేక చూడామణిలో చెప్పియుండిరి. "స్వస్వరూపానుసంధానం భక్తిరిత్యభిధీయతే" అని వారొండుచో చెప్పియుండిరి. ఈ శ్లోకముల వారుపమానసామర్థ్యముచే భక్తుడు సామీప్య, సాలోక్య సారూప్య, సాయుజ్య ముక్తులనందజాలునని చెప్పుచు భక్తి యందలి దశలను చక్కగా సూచించియున్నారు.

శ్లో॥ ఆనందాశ్రుభిరాతనోతి పులకం, నైర్మల్యతశ్ఛాదనం
వాచాశంఖముఖ స్థితైశ్చ జఠరా పూర్తిం చరిత్రా మృతైః,
రుద్రాక్షైర్భసితేన, దేవ, వపుషో రక్షాం భవద్భావనా
పర్యంకే వినివేశ్య భక్తిజననీ భక్తార్భకం రక్షతి. 62

అ. దేవ = స్వామీ ! శివా ! భక్తి, జననీ = భక్తి యనెడు తల్లి, ఆనంద, అశ్రుభిః = సంతోషబాష్పములచే, పులకం = రోమాంచమును, నైర్మల్యతః = నిర్మలత్వమువలన, ఛాదనం = తెల్లని గుడ్డతోకప్పుటను, వాచా, శంఖ, ముఖ, స్థితైః = వాక్కనెడి శంఖము (ఉగ్గుగిన్నె) యొక్క ముఖమునందున్న, చరిత్ర, అమృతైః = నీ చరిత్రయనెడి అమృతములచే, జఠర, ఆపూర్తిం = కడుపునింపుటను, రుద్రాక్షైః = రుద్రాక్షలచేతను, భసితేన = విభూతిచేతను, వపుషః = శరీరముయొక్క, రక్షాం = రక్షణమును, ఆతనోతి = కలిగించును, భవత్ , భావనా , పర్యంకే = నీ భావనయనెడు మంచమునందు, వినివేశ్య = ఉంచి, పరుండబెట్టి, భక్త, అర్భకం = భక్తుడనెడి శిశువును, రక్షతి = రక్షించును. అలం. రూపకము.

ఈ శ్లోకమును తల్లి శిశువును పలువిధముల పోషించునట్లుగా భక్తి భక్తుని కాపాడునని చెప్పబడినది.

తా. స్వామీ ! శివా ! భక్తియనెడుతల్లి ఆనందబాష్పములచే మేనపులకలను, నిర్మలత్వమనెడి తెల్లనిగుడ్డచే కప్పుటను, వాక్కులనెడి శంఖాకృతిగల ఉగ్గుగిన్నెలందుండు నీ చరితామృతములచే ఆకలిని పోగొట్టి కడుపునింపుటను రుద్రాక్షలచేతను

విభూతిచేతనుఅరిష్టములను పోద్రోలి శరీరరక్షణమును కలిగించి భక్తుడను శిశువును నీభావనమనెడి మంచమున పరుండఁబెట్టి రక్షించును.

శ్లో॥ మార్గావర్తితపాదుకా పశుపతే రంగస్య కూర్చాయతే
గండూషాంబునిషేచనం పురరిపోర్దివ్యాభిషేకాయతే,
కించిద్భక్షితమాంసశేషకబళం నవ్యోపహారాయతే
భక్తిః కిం న కరోత్యహో ! వనచరో భక్తావతంసాయతే ! 63

అ. మార్గ, ఆవర్తిత, పాదుకా = దారియందు పలుమార్లుతిరిగినచెప్పు; పశుపతేః = శివునియొక్క; అంగస్య = శరీరమునకు; కూర్చాయతే = కుంచెవలె నగుచున్నది; గండూష అంబు, నిషేచనం = నోటపుక్కిలించిన నీటితో చల్లుట; పుర, రిపోః = త్రిపురసంహారియైన శివునకు; దివ్య అభిషేకాయతే = ఉత్తమమైన అభిషేకమగుచున్నది. కించిత్; భక్షిత, మాంస, శేష, కబళం = కొంచెముగా తినఁబడిన మాంసముయొక్క మిగిలినభాగపుముద్ద; నవ్య, ఉపహారాయతే = క్రొత్తనైవేద్యమగుచున్నది; అహో = ఏమాశ్చర్యము; భక్తిః = భక్తి; కిం = దేనిని; న, కరోతి = చేయదు ? అది ఏమైనను చేయఁజాలును; వనచరః = వనమునందు సంచరించు నాటవికుడు; భక్త, అవతంసాయతే = భక్తశిరోమణి అగుచున్నాడు.

ఈ శ్లోకమున కన్నప్పయను తిన్నడు భక్తితోడను భక్తితోచేసిన కార్యములు వర్ణింపఁబడినవి. దోషమని తెలియక అతడు తన కాలిచెప్పుతో శివలింగమును తుడిచెను. పుక్కిలించి ఉమిసిన నీటితో స్వామికభిషేక మాచరించెను; తాను కొంచెము తినగా మిగిలిన అడవిపంది మాంసము శివునికి నైవేద్యముగా పెట్టెను. భక్తి చేయలేనిదేమున్నది. జ్ఞానహీనుడైన అతడు శివభక్తులలో శిరోమణి అయ్యెను.

తా. అడవిదారులందు తిరిగి తిరిగి అపరిశుద్ధమైన చెప్పు శివునిలింగమును తుడుచు కుంచె అయ్యెను. నోటితో పుక్కిలించిన నీటితో చల్లుట శివునికి దివ్యమైన అభిషేకమయ్యెను. కొంచెము తినగా మిగిలిన మాంసఖండము క్రొత్త నైవేద్యమయ్యెను. ఏమాశ్చర్యము ! భక్తియేమి చేయలేదు ? ఆటవికుడు భక్తులకు తలమానికమయ్యెను.

శ్లో॥ వక్షస్తాడనమంతకస్య, కఠినాపస్మార సంమర్దనం
భూభృత్పర్యటనం, నమత్సురశిరఃకోటీరసంఘర్షణం,

కర్మేదం మృదులస్య తావకపదద్వంద్వస్య గౌరీపతే !
మచ్చేతో మణి పాదుకా విహరణం శంభో సదాంగీకురు. 64

అ. గౌరీ, పతే = పార్వతీపతీ ! శివా ! అంతకస్య = యమునియొక్క; వక్షః, తాడనం = తొమ్మునుతన్నుట; కఠిన, అపస్మార సంమర్దనం = క్రూరుడైన అపస్మారుడను రాక్షసుని కాలితోమర్దించుట; భూ, భృత్, పర్యటనం = కైలాసపర్వతమున తిరుగుట, నమత్, సుర, శిరః , కోటీర, సంఘర్షణం = నమస్కరించుచున్న దేవతల తలలందలి కిరీటముల రాపిడి; ఇదం = ఇదంతయు; మృదులస్య =మృదువైన; తావక, పద, ద్వంద్వస్య = నీపాదముల జంటయొక్క, కర్మ = పని (ఇవన్నియు నీవు మృదుపాదములతో చేసినపనులు) శంభో = శివా ! మత్, చేతః, మణి, పాదుకా, విహరణం = నా చిత్తమనెడి మణిమయపాదుకలతో విహరించుట; సదా = సంతతమును; అంగీకురు = అంగీకరింపుము, నా చిత్తమనెడి మణిపాదుకలను ధరించి విహరించుచో నీమృదు పాదములకెట్టి హానియు జరుగదని భావము.

తా. పార్వతీపతీ ! మార్కండేయ రక్షణసమయమున యముని తొమ్ము తన్నుట, కఠినుడైన అపస్మార రాక్షసుని కాలితో మర్దించుట, నమస్కరించు దేవతల తలలందలి కిరీటములతో నొఅయుట; ఇవన్నియు నీమృదువైన పాదముల జంట యొనరించిన పనులు. అందుచే వానికి బాధకలుగును. అట్లు కలుగకుండుటకై ప్రభూ ! శివా! నా చిత్తమనెడి రత్నమయ పాదుకలతో విహరించుటను సర్వదా అంగీకరింపుము.

శ్లో॥ వక్షస్తాడనశంకయా విచలితో వైవస్వతో నిర్జరాః
కోటీ రోజ్జ్వల రత్న దీపకలికా నీరాజనం కుర్వతే,
దృష్ట్వా ముక్తి వధూస్తనోతి నిభృతాశ్లేషం, భవానీపతే !
యచ్చేత స్తవ పాదపద్మ భజనం, తస్యేహ కిం దుర్లభమ్ ? 65

అ. భవానీపతే = పార్వతీ పతీ ! శివా ! యత్, చేతః = ఎవనిచిత్తము, తవ = నీయొక్క, పాద, పద్మభజనం = పద్ములవంటి పాదములభజనము (కలదో) చేయునో, తస్య = అతనికి, ఇహ = ఈ లోకమున, దుర్లభం = పొందశక్యము కానిది, కిం = ఏమి, ఏదియులేదు. వైవస్వతః = సూర్యనందనుడైన యముడు, వక్షః, తాడన, శంకయా = తొమ్ము తన్ను నను భయముచే, విచలితః = చలించిన

వాడగును. నిర్జరాః = దేవతలు, కోటీర, ఉజ్జ్వల, రత్న, దీప, కలికా, నీరాజనం = కిరీటములందు ప్రకాశించురత్నములనెడి మొగ్గలవంటి దీపములతోడి నీరాజనమును, కుర్వతే = చేయుదురు. ముక్తి, వధూః = ముక్తియనెడుకాంత, దృష్ట్వా = చూచి, నిభృత, ఆశ్లేషం = గాఢమైన కౌగిలిని, ఆతనోతి = చేయును.

తా. పార్వతీపతీ ! ఎవనిచిత్తము నీపాదపద్మ భజనమొనర్చునో ఆతని కీలోకమున పొందశక్యము కానిదేమున్నది. యముడు కూడ నీవుపూర్వమువలెనే మొమ్మ్మతన్నుదవను భయముతో కంపించును. అతడు దరికిరాడు. దేవతలు తమ కిరీటములందు ప్రకాశించు రత్నములనెడి దీపములతో నీరాజనమొనరింతురు. ముక్తికాంత అతనిని చూచి బిగియార కౌగలించుకొనును.

శ్లో॥ క్రీడార్థం సృజసి ప్రపంచమఖిలం క్రీడా మృగాస్తే జనాః
యత్కర్మాచరితం మయా చ భవతః ప్రీత్యై భవత్యేవ తత్,
శంభో ! స్వస్య కుతూహలస్య కరణం మచ్చేష్టితం నిశ్చితమ్
తస్మాన్మామకరక్షణం పశుపతే కర్తవ్య మేవ త్వయా ! 66

అ. పశుపతే, శంభో = జీవులకధిపతివైన ఓ శివా ! అఖిలం = సమస్తమైన, ప్రపంచం = జగత్తును, క్రీడా, అర్థం = వినోదమునిమిత్తము, సృజసి = సృష్టింతువు. జనాః = జనులు, తే = నీకు, క్రీడా, మృగాః = ఆటకొఅకుపయోగపడు జంతువులు, ఆటబొమ్మలు, మయా = నా చేత, యత్, కర్మ = ఏ కర్మము, ఆచరితం = చేయబడినదో, తత్, చ= అదియును, భవతః = నీ యొక్క, ప్రీత్యై, ఏవ = ప్రీతి కొఅకే, భవేత్ = అగును, మత్, చేష్టితం = నేను చేయుపనియంతయు, స్వస్య = నీ యొక్క, కుతూహలస్య = వేడుకకు, కరణం = సాధనము, నిశ్చితమ్ = ఇది నిశ్చయము, తస్మాత్ = అందుచే, మామక, రక్షణం = నా రక్షణము, త్వయా ఏవ = నీ చేతనే, కర్తవ్యం = చేయవలసియున్నది. అలం. కావ్యలింగము.

తా. పశుపతివగు శివా ! నీవు నీ వినోదముకొఅకే సర్వ ప్రపంచమును సృష్టించుచున్నావు. జనులందఱును నీ కీలుబొమ్మలు. నే నే యే కర్మముల నాచరింతునో అవియన్నియు నీవేడుకకొఅకే. నా చేష్టలన్నియు నీ కుతూహలమునకు సాధనములే. అందుచే పిల్లలు తమ ఆటబొమ్మలను తామురక్షించుకొనునట్లు నీవే నారక్షణము చేయవలసియున్నది. అది నీ కర్తవ్యము.

శ్లో॥ బహువిధ పరితోష బాష్ప పూర
స్ఫుట పులకాంకిత చారు భోగభూమిమ్,
చిరపద ఫలకాంక్షి సేవ్యమానాం
పరమ సదాశివ భావనాం ప్రపద్యే. 67

అ. బహు, విధ, పరితోష, బాష్ప, పూర, స్ఫుట, పులక, అంకిత, , చారు, భోగ, భూమిం = అనేకవిధములైన ఆనందాశ్రుప్రవాహములచే స్పష్టములగు రోమాంచ చిహ్నములచే హృద్యమగు సౌఖ్యానుభవమునకు నిలయమును, చిర, పద, ఫల,కాంక్షి, సేవ్యమానాం = శాశ్వతమైనమోక్షపదమును కోరువారిచే సేవింపబడునదియు అగు, పరమ, సదా, శివ, భావనాం = ఉత్తమమైన సదాశివమయమైన భావనను, ప్రపద్యే = ఆశ్రయింతును.

తా. పలువిధములైన ఆనందబాష్పప్రవాహములచేతను, స్పష్టములగు రోమాంచ చిహ్నములచేతను హృద్యమగు సౌఖ్యానుభూతికి నిలయమును, శాశ్వతమైన మోక్షపదమును కోరువారిచే సేవింపఁబడునదియునగు సర్వోత్తమమైన సదాశివమయమైన భావనాస్థితి నాశ్రయింతును.

శ్లో॥ అమిత ముదమృతం ముహుర్దుహంతీం
విమల భవత్పద గోష్ఠ మావహంతీమ్,
సదయ పశుపతే ! సుపుణ్య పాకాం
మమ పరిపాలయ భక్తి ధేనుమే కామ్. 68

అ. సదయ, పశుపతే = దయతోఁగూడిన ఓ పశుపతీ ! శివా ! అమిత, ముద్, అమృతం = అధికమైన మోదమనెడి అమృతమును, ముహుః = మాటిమాటికిని, దుహంతీం = పితుకునట్టిదియు, విమల, భవత్, పదగోష్ఠం = నిర్మలమైన నీ పాదములనెడి గోశాలను, ఆవహంతీం = ఆశ్రయించుచున్నదియు, సు, పుణ్య, పాకాం = మంచిపుణ్యమను ఫలమును పండించునదియు, ఉత్తమ పుణ్య పరిపాకము కలదియు, అగు, మమ = నాయొక్క ఏకాం = ఒకేఒక, భక్తి, ధేనుం = భక్తియనెడి ఆవును, పరిపాలయ = కాపాడుము. పోషింపుము, అలం. రూపకము.

తా. దయానిధివగు నో పశుపతీ ! మాటిమాటికిని ఆనందమనెడి అమృతమును (పాలను) పితుకునదియు, పవిత్రమైన నీపాదములనెడి గోశాలను చేరగోరునదియు

యోగ్యమైనపుణ్యమునకు ఫలమైనదియు, నగు నా ఒకేయొక భక్తియనెడి ఆవును కాపాడుము.నాకు నీ పాదములందు భక్తిని వృద్ధినొందింపుము.

శ్లో॥ జడతా పశుతా కళంకితా
కుటిల చరత్వం చ నాస్తి మయి దేవ!
అస్తి యది రాజమౌళే
భవదాభరణస్య నాస్మి కిం పాత్రమ్. 69

అ. రాజ, మౌళే =చంద్రశేఖరా ! శివా ! దేవ = స్వామీ ! జడతా = జడత్వము (జలత్వము), పశుతా = మృగత్వము, కళంకితా = కళంకమును కలిగియుండుట, కుటిల, చరత్వం, చ = వంకరగా- సంచరించుట యను దుర్గుణము, మయి = నా యందు, న, అస్తి = లేదు. అస్తి యది = ఉన్నప్పటికిని*, భవత్ ఆభరణస్య = నీకాభరణముగా నుండుటకు, పాత్రం = అర్హుడను, న, అస్మి, కిం = కానా యేమి ? అగుదును. శివుడు గంగను తలపై ధరించును. గంగ జలమయస్వరూపిణి జడత్వము (లడలకభేదము) కలది. జడత్వమనగా మాంద్యము, అజ్ఞానము. శివుడు లేడిని ధరించును. అదిమృగము పశుత్వము కలది. పశుత్వమనగా మూఢత్వము. శివుడు చంద్రుని పై ధరించును. అతని యందు మచ్చ కలదు. అందుచే కళంకి కళంకిత్వమనగా పాపము కలిగి యుండుట. శివుడు పాములను ధరించును, అవి వంకర నడక గలవి, కుటిల చరములు కుటిలచరత్వమనగా కపట వర్తనము.

తా. శివా ! చంద్రశేఖరా ! నీవు ధరించిన ఆభరణములైన గంగ, లేడి, చంద్రుడు, సర్పములు, అనువాటిలో నొక్కొక్క దానియందు క్రమముగా జడత్వము, పశుత్వము, కళంకిత్వము, కుటిలచరత్వము అనుదోషములు కలవు. అందొకటియు నాయందు లేదు. ఉన్నప్పటికిని నేను నీకాభరణత్వము వహించుటకు యోగ్యుడను కానా ? [1]నీవు ధరించు నాభరణములం దవికలవు కదా ! అలం. శ్లేష, పరికరము.

శ్లో॥ అరహసి రహసి స్వతంత్ర బుద్ధ్యా
వరివసితుం సులభః ప్రసన్న మూర్తిః,

---

* అస్తి యది = ఉన్నట్లైతే , 1.ఉన్నట్లైతే ధరించియుండెడివాడవు అనికూడ భావము.

అగణిత ఫలదాయకః ప్రభుర్మే
జగదధికో హృది రాజశేఖరోఽస్తి. 70

అ. అరహసి = రహస్యము కాని చోట (పదిమందియున్నచోట), రహసి = ఏకాంత మందు, స్వతంత్ర, బుద్ధ్యా = స్వేచ్ఛతో కూడినబుద్ధితో; ఇచ్ఛవచ్చినట్లు ; వరివసితుం = సేవించుటకు, సులభః = సులభుడును, ప్రసన్న, మూర్తిః = నిర్మలమగు (అనుగ్రహముతోఁగూడిన) ఆకారము కలవాఁడును, అగణిత, ఫల, దాయకః = ఇంతింతయనరాని ఫలము నొసంగువాఁడును, జగత్, అధికః = జగమున, అందరి కంటె మహత్తరుడును, ప్రభుః = అధిపుడును, అగు; రాజ, శేఖరః = చంద్రుడు శిరోభూషణముగాఁగల శివుడు, మే = నా యొక్క హృది= హృదయమందు, అస్తి = కలడు.

తా. బహిరంగ స్థలమందును, ఏకాంతస్థలము నందును, స్వతంత్రబుద్ధితో సేవించుటకు సులభుడును, అనుగ్రహముతోఁగూడిన శాంతమైన మూర్తికలవాడును, ఇంతింతనరాని ఫలమునొసంగువాడును, లోకమున సర్వాధికుడును, విభుడును, చంద్రావతంసుడును అగు శివుడు నా హృదయ మందున్నాడు. అందుచే నాకేమియు భయములేదని భావము.

శ్లో॥ ఆరూఢ భక్తిగుణ కుంచిత భావ చాప
యుక్తైః శివస్మరణ బాణ గణై రమోఘైః,
నిర్జిత్య కిల్బిషరిపూన్ విజయీ సుధీంద్రః
సానంద మావహతి సుస్థిరరాజ్యలక్ష్మీమ్. 71

అ. సుధీ, ఇంద్రః = పండిత శ్రేష్ఠుడు (బుద్ధిమంతులలో నగ్రగణ్యుడు) ఆరూఢ, భక్తి, గుణ, కుంచిత, భావ, చాప, యుక్తైః = ఎక్కుపెట్టబడిన భక్తియనెడు నల్లెత్రాటితో వంపఁబడిన భావనయనెడి (చిత్తమనెడి) ధనుస్సునందు కూర్పబడిన, అమోఘైః = వ్యర్థములుకాని (తిరుగులేని), శివ, స్మరణ, బాణ, గణైః = శివనామస్మరణమనెడి, బాణములసమూహములచే, కిల్బిష, రిపూన్ = పాపములనెడిశత్రువులను,నిర్జిత్య = జయించి, విజయీ = విజయముకలవాడై, న, ఆనందం = ఆనందముతో కూడుకొనియున్నట్లుగా, సుస్థిర, రాజ్య, లక్ష్మీం = శాశ్వతమైన మోక్షమనెడి రాజ్యలక్ష్మిని, ఆవహతి = పొందును. అలం. రూపకము.

తా. పండితశ్రేష్ఠుడనెడి ప్రభువు ఎక్కుపెట్టఁబడిన భక్తియనెడి వారితో పంపఁబడిన చిత్తమనెడి ధనుస్సు నంధింపఁబడిన, తిరుగులేని, శివనామ స్మరణమనెడి బాణసమూహములతో, కామక్రోధాదులను ఓడించి, విజయశోభితుడై శాశ్వతమైన మోక్షమనెడి రాజ్యలక్ష్మిని మహానందసహితుడై అనుభవించును.

శ్లో॥ ధ్యానాంజనేన సమవేక్ష్య తమః ప్రదేశం
భిత్వా మహాబలిభి రీశ్వరనామ మంత్రైః,
దివ్యాశ్రితం భుజగభూషణ ముద్వహన్తి
యే పాదపద్మమిహ తే శివ ! తే కృతార్థాః. 72

అ. శివ = శంకరా ! తమః, ప్రదేశం = చీకటితోఁగూడిన నిధియున్న ప్రదేశమును, ధ్యాన, అంజనేన = ధ్యానమనెడి కాటుకతో, సమవేక్ష్య = చూచి, మహత్ బలిభిః = గొప్పబలములుకల, ఈశ్వర, నామ, మంత్రైః = శివనామమంత్రములతో, భిత్వా = భేదించి (త్రవ్వి) (నిధులను కాపాడు రక్షకులకు బలులొసంగవలసిన అక్కఱయున్నది) యే = ఎవరు , ఇహ = ఈ లోకమున, దివ్య, ఆశ్రితం = దివ్యులచే (దేవతలచే) ఆశ్రయింపఁబడినదియు, భుజగ, భూషణం = పాములలంకారముగా గల్గినట్టియు (నిధులను మహాభుజంగములు చుట్టుముట్టికాపాడుచుండును.) తే = నీ యొక్క పాద, పద్మం = పద్మములవంటి పాదమును (పాదమనెడి పద్మనిధిని, పద్మము నవనిధులలో నొకటి) ఉద్వహంతి = గ్రహించుచున్నారో, తే = వారు, కృతార్థాః = ధన్యులు. ఇహ శబ్దమునిక్కడకూడ చెప్పనగును. ఈ లోకమునందే కృతార్థులు. ధ్యానాంజనేన అనుదానికి జ్ఞానాంజనేన అనుపాఠాంతరము కలదు. అలం. రూపకము.

తా. శంకరా ! ఎవరు ధ్యాన (జ్ఞాన) మనెడి కాటుకచే అంధకారమయమైన నిధి ప్రదేశమును గుర్తించి గొప్పబలులచేతను (మహాశక్తిసంపన్నములైన) శివనామ మంత్రములచే భేదించి దేవతలచే నాశ్రయింపఁబడినదియు, పాములలంకారములుగాఁ గలదియు (సర్పరక్షితమును) అగు నీ పాదపద్మమనెడి పద్మనిధిని గ్రహింపఁజాలుదురో వారీలోకమందే కృతార్థులు కాఁజాలుదురు.

శ్లో॥ భూధారతా ముదవహ ద్యదపేక్షయా శ్రీ
భూదార ఏవ కిమతః సుమతే ! లభస్వ

కేదార మాకలిత ముక్తిమహౌషధీనాం
పాదారవింద భజనం పరమేశ్వరస్య. 73

అ. సుమతే = మంచిమనస్సా ! (బుద్ధిమంతుడా!) యత్, అపేక్షయా = దేనిని దర్శింపవలెనను కోరికచే, శ్రీ, భూ దారః, ఏవ = లక్ష్మియు భూమియు భార్యలు గాఁగల విష్ణువే, భూ, దారతాం = వరాహత్వమును (భూమిని ముట్టెతో త్రవ్వునది వరాహము. ఆ అవతారమున భూమి విష్ణువునకుభార్య అప్పుడే నరకుడు జనించెను) ఉదవహత్ = తాల్చెనో, ఆకలిత, ముక్తి, మహా, ఓషధీనాం = నిండిన మోక్షమనెడి గొప్ప ఓషధులకు, కేదారం = పంటభూమియైన, (ముక్తినొంసగెడు) పరమేశ్వరస్య = శివునియొక్క, పాద, అరవిందం = పద్మమువంటి (ఆ) పాదమును, భజస్వ = కొలువుము, అతః కిం = ఇంతకంటె నధికమేమున్నది ?

తొల్లి శివలింగముయొక్క అగ్రమును అడుగుభాగమును చూడవలెనని బ్రహ్మ హంసవాహనుడై ఆకాశమున కరుగ, విష్ణువు వరాహత్వమును దాల్చి పాతాళమునకేగెను. కాని యిరువురును వానిని గాంచలేకపోయిరి.

తా. మంచిమనస్సా ! ఏ పాదమును చూడవలెనని లక్ష్మీ (భూ) భర్తయగు విష్ణువే వరాహత్వమును దాల్చెనో ముక్తియనెడు గొప్ప ఓషధులను పండించుపంట భూమియైన పరమేశ్వరుని పద్మములవంటి ఆ పాదమును భజింపుము అంతకంటె నేమికావలయును?

శ్లో॥ ఆశాపాశక్లేశ దుర్వాసనాది
భేదో ద్యుక్తైర్దివ్యగంధైరమందైః,
ఆశాశాటీకస్య పాదారవిందం
చేతః పేటీం వాసితాం మే తనోతు. 74

అ. ఆశా, పాశ, క్లేశ, దుర్వాసనా, ఆది, భేద, ఉద్యుక్తైః = త్రాళ్ళవంటి ఆశలును, కష్టములు దుష్ట సంస్కారములు (చెడువాసనలు) మున్నగు వాని భేదించుటకు (పొగొట్టుటకు) సమర్థములు (సిద్ధము) లైన, అమందైః = గొప్ప, దివ్య, గంధైః = దివ్యములైన సువాసనలచే, ఆశా, శాటీకస్య = దిక్కులే వస్త్రముగాఁగల శివుని, పాద, అరవిందం = పాదమనెడిపద్మము, మే = నాయొక్క, చేతః పేటీం = మనస్సనెడి పెట్టెను, వాసితాం =

సువాసనకలదానినిగా, తనోతు = చేయుఁగాక !

అ. ఆశాపాశములు, మనోదేహక్లేశములు, దుష్టసంస్కారములు మున్నగు వానిని భేదించుటకు సిద్ధములైన (సమర్థములైన) అమోఘములు దివ్యములునైన తన సువాసనలచే దిగంబరుడైన శివునియొక్క పాదమనెడి పద్మము నాచిత్తమనెడి పెట్టెను సువాసనకల దానినిగా చేయుగాక !

శ్లో॥ కల్యాణినం, సరసచి త్రగతిం, సవేగం
సర్వేంగితజ్ఞ మనఘం ధ్రువలక్షణాధ్యమ్,
చేతస్తురంగ మధిరుహ్య చర స్మరారే
నేతః సమస్త జగతాం వృషభాధిరూఢ. 75

అ. సమస్త, జగతాం = అన్ని లోకములకును, నేతః = నాయకుడా ! వృషభ, అధిరూఢ= వృషభవాహనుడా ! స్మర, అరే = మన్మథునికి శత్రువవైన ఓ శివా ! కల్యాణినం = మంగళప్రదమును (పంచకల్యాణములుకూర్చునదియు), సరస, చిత్ర, గతిం = ఆనందముతోకూడిన చిత్ర విచిత్రములై గతిభేదములు కలదియు, సవేగం = వేగముతో కూడినదియు, సర్వ, ఇంగిత, జ్ఞం = సమస్తములైన మనోభావములను ఎఱిగినదియు, అనఘం = పాపరహితమైనదియు, సాముద్రికశాస్త్రముననుసరించి సర్వశుభలక్షణములు కలదియు, ధ్రువ, లక్షణ, ఆధ్యం = స్థిరములైన లక్షణములతో సంపన్నమైనదియు (స్థిరత్వశోభితమును), అగు, చేతః, తురంగం = మనస్సనెడి గుఱ్ఱమును, అధిరుహ్య = ఎక్కి, చర = సంచరింపుము, ఇందలి విశేషణములు మనస్సునకు గుఱ్ఱమునకును కూడ అన్వయించును. అలం. రూపకము.

తా. సర్వలోకనాయకుడవు, వృషభవాహనుడవు, మదనాంతకుడవునైన ఓ శివా! భువనత్రయ శాసకుడవైన నీకు వృషభవాహన ముచితముకాదు అది వేగముగా నడవఁజాలదు. నామనస్సనెడి గుఱ్ఱము కల్యాణప్రదమైనది ఆనందముతోఁగూడి చిత్రవిచిత్రములైన గతులుకలది. అతివేగముతోకూడినది, అన్ని (అందఱి) మనోభావములను తెలిసికొననేర్చినది. పాపరహితము. సాముద్రికశాస్త్రముననుసరించి సర్వస్థిరలక్షణములతో కూడినది. నీవు దానినెక్కి సుఖముగా సంచరించుచు లోకములను పాలింపుము.

శ్లో॥ భక్తిర్మహేశపదపుష్కర మావస న్తీ
కాదంబినీవ కురుతే పరితోషవర్షమ్,
సంపూరితో భవతి యస్య మనస్తటాక
స్తజ్జన్మసస్య మఖిలం సఫలం చ నాన్యత్. 76

అ. మహేశ, పద, పుష్కరం = పరమశివుని పాదమనెడి ఆకాశమును, ఆవసన్తీ = ఆశ్రయించియున్నదై, భక్తిః = భక్తి, కాదంబినీ, ఇవ = మేఘమాలవలె, పరితోష, వర్షం = ఆనందమనెడి వర్షమును, కురుతే = చేయును (కురియును). యస్య = ఎవనియొక్క, మనః, తటాకః = మనస్సనెడి సరస్సు, సంపూరితః = ఆ వర్షముతో నిండినది, భవతి = అగునో, తత్, జన్మ, సస్యం = అతనియొక్క పుట్టుకయనెడి పైరు, అఖిలం = సర్వమును, సఫలం = ఫలముతో కూడినది (సార్థకమైనది అగును), అన్యత్ = ఇతరమైనది, న = సఫలముకాదు. అలం. ఉపమ, రూపకము.

తా. భక్తి పరమేశ్వరుని పాదములనెడి ఆకాశమునాశ్రయించి మేఘమాలవలె నానందవర్షమును కురియును. ఎవనిమనస్సనెడి తటాక మా యానందవర్షముతో నిండినదగునో, అతనిపుట్టుక యనెడి పైరంతయు సఫలమగును. ఇతరమైనది నిష్ఫలము. పరమేశ్వర పాదములందు భక్తికలిగి యుండువారి జన్మ మానందమయమై సార్థక్యము చెందును. ఇతరులది కాదు.

శ్లో॥ బుద్ధిః స్థిరా భవితు మీశ్వరపాదపద్మ
సక్తావధూ ర్విరహిణీవ సదా స్మరంతీ,
సద్భావనాస్మరణ దర్శన కీర్తనాది
సంమోహితేవ శివమంత్రజపేన వింతే. 77

అ. బుద్ధిః = మతి , విరహిణీ, వధూః, ఇవ = భర్తనుండి వియోగమును పొందిన స్త్రీ (భార్య) వలె, ఈశ్వర, పాద, పద్మ, సక్తా = శివుని (భర్తయొక్క) పద్మముల వంటి పాదముల యందు తగుల్కొన్నదై, సదా = ఎల్లప్పుడును, స్మరంతీ = అతనినే తలంచుచు, శివ, మంత్ర, జపేన = శివునిమంత్రమును జపించుటచే, సత్, భావనా, స్మరణ, దర్శన, కీర్తన, ఆది సంమోహితా ఇవ = ఆతనినే లెస్సగా భావించుట, స్మరించుట, అంతరముగా చూచుట, సంకీర్తించుట మున్నగు వానిచే మోహము నొందిన దానివలె, వింతే = వర్తించుచున్నది (విద్ 7 ఆత్మనే) అలం. ఉపమ.

తా. బుద్ధి భర్తృవియోగమును పొందిన సాధ్వివలె శివుని పద్మముల వంటి పాదములయందాసక్తి కలదై యెల్లప్పుడును ఆతనినే స్మరించుచు శివ మంత్రముచే అతనిని లెస్సగా భావించుట, ధ్యానించుట, కీర్తించుట మున్నగు వానిచే మోహము నొందిన దానివలె వర్తించుచున్నది. శివభక్తి పరాయణుల బుద్ధి విరహిణియైన సాధ్వి సదా భర్తనే స్మరించుచు పిచ్చిదానివలె నుండునట్లు ఎప్పుడును శివునే భావించుచు ధ్యానించుచు కీర్తించుచు నుండునని భావము.

శ్లో॥ సదుపచారవిధి ష్వను బోధితాం
సవినయాం సుహృదం సముపాశ్రితామ్,
మమ సముద్ధర బుద్ధి మిమాం ప్రభో !
వరగుణేన నవోఢవధూమివ. 78

అ. ప్రభో = ప్రభూ, శంకరా ! సత్, ఉపచార, విధిషు = సజ్జనుల కుపచారముచేయు విధానములందు, అనుబోధితాం = బాగుగా శిక్షింపఁబడినదియు, స, వినయాం = వినయముతో కూడినదియు, సుహృదం = మంచిహృదయము కలది'ము, సముపాశ్రితాం = దృఢముగా నాశ్రయించి నదియు అగు, మమ = నాయొక్క, ఇమాం = ఈ, బుద్ధిం = బుద్ధిని, వర, గుణేన = వరునియొక్క సద్గుణముచే (వర ధర్మముచే) నవోఢ, వధూం, ఇవ = నూత్నముగా పెండ్లి చేసికొనఁబడిన వధువును వలె, సముద్ధర = ఉద్ధరింపుము. అలం, ఉపమ. ఇందుగల బుద్ధివిశేషణములు వధువునకును అన్వయించును.

తా. ప్రభూ ! శంకరా ! పెద్దల కుపచారములొనరించు విధానములందు శిక్షణముపొందినదియు, వినయసంపన్నయు, మంచి మనస్సు కలదియు, దృఢముగా నాశ్రయించినదియునగు నాయీ బుద్ధిని వరుని సద్గుణముచే (వరధర్మముచే) క్రొత్తగా పెండ్లాడిన వధువును వలె నుద్ధరింపుము.

శ్లో॥ నిత్యం యోగి మనస్సరోజదల సంచారక్షమ స్త్వత్క్రమః
శంభో ! తేన కథం కఠోరయమరాడ్వక్షః కవాటక్షతిః,
అత్యంతం మృదులం త్వదంఘ్రియుగళం హా మే మనశ్చింతయ
త్యేతల్లోచన గోచరం కురు విభో ! హస్తేన సంవాహయే. 79

అ. విభో ! శంభో = ప్రభువైన శంకరా ! త్వత్, క్రమః = నీ పాదవిన్యాసము, నిత్యం = ఎల్లప్పుడును, యోగి, మనః, సరోజ, దళ, సంచార, క్షమః = యోగీంద్రుల

మనస్సనెడి పద్మపత్రమునందు (పద్మపత్రమువంటి మనస్సునందు) సంచరించుటకు తగినట్టిది. తేన = ఆపాదక్రమముచే, కఠోర, యమరాట్, వక్షః, కవాట క్షతిః = అతికఠినమైన యమధర్మరాజుయొక్క తలుపువంటి ఱొమ్మును తాడించుట (తన్నుట) కథం = ఎట్లు, మార్కండేయ రక్షణ సమయమున శివుడు యముని వక్షః కవాటమును తన్నెను, త్వత్, అంఘ్రి, యుగళం = నీ పాదయుగళము, అత్యంతం = మిక్కిలి, మృదులం = మెత్తనిది, అందుచే, హా = అయ్యో, మే = నాయొక్క, మనః = మనస్సు, చింతయతి = ఆలోచించుచున్నది (ఆబాధపోవుట యెట్లాయని ఉపాయము నాలోచించుచున్నది) ఏతత్ = దీనిని (నీపాదయుగమును) లోచన, గోచరం = కనులకుకనబడుదానిని, కురు = చేయుము, హస్తేన = చేతితో, సంవాహయే = పిసికెదను, ఒత్తెదను.

తా. ప్రభూ ! శంకరా ! నీ పాదవిన్యాసము నిత్యమును పద్మదళము వలె మెత్తని యోగీంద్రుల మనస్సులందు సంచరించుటకు తగినట్టిది. దానిచే నతి కఠినమైన యముని వక్షఃకవాటమును తన్నుట యెట్లు జరిగినది ? నీపాద యుగము మిక్కిలి మృదువైనది. అందుచే నామనస్సు అయ్యో ! ఆ బాధయెట్లు తీరునాయని ఆలోచించు చున్నది. నీ పాదద్వంద్వమునొకసారి నాకనులకు కనఁబడునట్లు చేయుము. దానిని నాచేతితో నొత్తి శ్రమతీర్చెదను.

శ్లో॥ ఏష్యత్యేష జనిం మనోస్య కఠినం తస్మిన్నటా నీతి మ
ద్రక్షాయై గిరిసీమ్ని కోమల పదన్యాసః పురాఽభ్యాసితః,
నో చేద్దివ్యగృహాంతరేషు సుమనస్తల్పేషు వేద్యాదిషు
ప్రాయఃసత్సు ! శిలాతలేషు నటనం శంభో కిమర్థం తవ. 80

అ. శంభో = శంకరా ! ఏషః = ఇతడు, జనిం = పునర్జన్మమును, ఏష్యతి = పొందఁగలడు. అస్య = ఇతనియొక్క, మనః = మనస్సు, కఠినం = కఠినమైనది, తస్మిన్ = దానియందు, నటాని = భక్తుడగుటచే నేనుండవలయును, ఇతి = అని, మత్, రక్షాయై = నారక్షణముకొరకు, గిరి, సీమ్ని = పర్వతప్రదేశమందు, కోమల, పద, న్యాసః = మృదువైన నీ పాదములనుంచుట, పురా = పూర్వము (ముందుగనే) అభ్యాసితః = అభ్యసింపఁబడినది, నో చేత్ = అట్లుకానిచో, దివ్య, గృహ, అంతరేషు = దివ్యములైన భవనాంతర్భాగములును (ఇతర గృహములును) సుమనఃతల్పేషు = పూలపాన్పులును, వేది, ఆదిషు = అరుగులు (వేదికలు) మొదలైనవి, ప్రాయఃసత్సు = బహుళముగా, సత్సు

= ఉండగా, తవ = నీకు, శిలా, తలేషు = రాతిప్రదేశములందు, నటనం = నటించుట కిమర్థం = ఎందునిమిత్తము ?

తా. శంకరా ! "వీడు పునర్జన్మమును పొందును, ఇతని మనస్సు కఠినమైనది. భక్తుడగుటచే నందు నటింపవలసి వచ్చును" అని నారక్షణముకొఱకై పర్వత ప్రదేశమున నీచే మృదుపదవిన్యాస మభ్యాసము చేయఁబడినది. అట్లు కానిచో దివ్యములైన యితరగృహములును, పూలపాన్పులును, వేదికలు మున్నగునవియు బహుళములై యుండగా శిలాప్రదేశములందు నటించుట నీ కెందుకు ? ముందుచేయవలసివచ్చు కఠినమైన నాహృదయమందలి నివాసము నూహించియే నీవు కఠిన శిలాప్రదేశములందు నటించుట నభ్యసించితివని భావము.

శ్లో॥ కంచిత్కాల ముమామహేశ ! భవతః పాదరవిందార్చనైః
కంచి ద్ధ్యానసమాధిభిశ్చ నతిభిః కంచి త్కథాకర్ణనైః ,
కంచి త్కంచి దవేక్షణైశ్చ నుతిభిః కంచి ద్దశామీదృశీం
యః ప్రాప్నోతి ముదా త్వదర్పితమనా జీవన్స ముక్తః ఖలు. 81

ఆ. ఉమా , మహేశ = పార్వతీనాథుడవైనశివా ! కంచిత్, కాలం = కొంతకాలము; భవతః = నీయొక్క; పాద, అరవింద, అర్చనైః = పద్మముల వంటి పాదములను పూజించుటచేతను; కంచిత్, కాలం = కొంతకాలము; ధ్యాన, సమాధిభిః = నిన్ను ధ్యానించుట సమాధిపొందుటనువానిచేతను; నతిభిః, చ = నమస్కరించుటచేతను; కంచిత్, కాలం = కొంతకాలము; కథా, ఆకర్ణనైః = నీకథలనువినుటచేతను; కంచిత్, కాలం = కొంత కొంతకాలము; అవేక్షణైః = నిన్ను దర్శించుటచేతను; కంచిత్, కాలం = కొంతకాలము; నుతిభిః చ = స్తుతించుటచేతను; ఈదృశీం = ఇట్టి; దశాం = స్థితిని; యః = ఎవడు; ముదా = నంతోషముతో; త్వత్, అర్పిత, మనాః = నీయందర్పింపబడినమనస్సుకలవాడై; ప్రాప్నోతి = పొందునో; సః = అతడు; జీవన్ = జీవించుచున్నను; ముక్తః, ఖలు = ముక్తుడు కదా ! (జీవన్ముక్తుడగును కదా).

తా. ఉమామహేశ్వరా ! కొంతకాలము పద్మములవంటి నీ పాదములను పూజించుటలచేతను, కొంతకాలము నిన్ను ధ్యానించుచు సమాధిస్థితి నొందుచుండుటల చేతను, నీకు నమస్కరించుటలచేతను, కొంతకాలము నీ కథలను వినుటలచేతను, కొంతకొంత కాలము నిన్ను దర్శించుచుండుటలచేతను, కొంతకాలము నిన్ను స్తుతించు

చుండుటలచేతను, ఇట్టి స్థితినెవడు సంతోషముతో నీ యందర్పింపఁబడిన మనస్సుకలవాడై పొందునో అతడు జీవించుచున్నను ముక్తుడే కదా!.

శ్లో॥ బాణత్వం వృషభత్వ మర్ధవపుషా భార్యాత్వ మార్యాపతే!
ఘోణిత్వం సఖితా మృదంగవహతా చేత్యాదిరూపం దధౌ,
త్వద్పాదే నయనార్పణం చ కృతవాం స్త్వద్దేహభాగో హరిః
పూజ్యాత్పూజ్యతరః స ఏవ హి నచే త్కోవా తదన్యోఽధికః. 82

అ. ఆర్యా, పతే = పార్వతీపతివైన ఓశంకరా! త్వత్, దేహ, భాగః = నీయొక్క దేహమునందలిభాగమైన (హరిహరమూర్తివికావున); హరిః = విష్ణువు; బాణత్వం = త్రిపురసంహార కాలమున నీకుబాణ భావమును, వృషభత్వం = వాహనమైన ఎద్దుతనము; అర్ధ, వపుషా = సగముశరీరముచే; భార్యాత్వం = కళత్రభావము; ఘోణిత్వం = నీఅడుగుభాగమును చూచుటకై వరాహత్వము; సఖితా = మిత్రత్వము; మృదంగ, వహతా, చ = తాండవ సమయమందు మద్దెలను వహించువానితనము; ఇతి, ఆది, రూపం = ఈమొదలైన రూపమును; దధౌ = ధరించెను; త్వత్, పాదే = నీపాదమందు; నయన, అర్పణం, చ = నేత్రము నర్పించుటయును (సహస్రకమలములతో పూజచేయనెంచి యొకటితక్కువగుటచే దాని బదులు తన నేత్రమును) కృతవాన్ = చేసినవాడాయెను; సః, ఏవ, హి = అతడే; పూజ్యాత్ = పూజింపఁదగినవానికంటె; పూజ్యతరః = ఎక్కువపూజింపఁ దగినవాడు కదా ! న, చేత్ = కానిచో; తత్, అన్యః = అతనికంటె నితరుడు; అధికః = అధికుడు; కః, వా = మఱియెవ్వరున్నారు.

తా. పార్వతీపతీ ! నీ దేహమునందు భాగమైన విష్ణువు త్రిపురసంహార కాలమున బాణభావమును, వృషభ భావమును, సగము శరీరముచే కళత్రత్వమును, లింగరూపుడైన నీ అడుగు భాగమును చూచుటకు వరాహత్వమును, మిత్రత్వమును, తాండవసమయమున మార్దంగికత్వమును ఈ మొదలైన రూపములను ధరించెను. నీ పాదమందు తన నేత్రమర్పించుటను గూడ చేసినవాడాయెను. అందుచేతనే ఇతడు పూజ్యునికంటెను ఎక్కువ పూజింపఁ దగినవాడు. అట్లుకానిచో అతనికంటె నధికుడింక మఱెవ్వరు ? ఎవ్వరునులేరు.

శ్లో॥ జననమృతియుతానాం సేవయా దేవతానాం
న భవతి సుఖలేశః సంశయో నాస్తి తత్ర,

అజని మమృతరూపం సాంబమీశం భజంతే
య ఇహ పరమసౌఖ్యం తే హి ధన్యా లభంతే. 83

అ. జనన, మృతి, యుతానాం = పుట్టుక, చావు అనువానితో కూడిన; దేవతానాం = దేవతలయొక్క; సేవయా = సేవచే; సుఖ, లేశః = అల్పమైన సుఖమైనను; న, భవతి = కలుగదు; తత్ర = ఆవిషయమున; సంశయః = సందేహము; న, అస్తి = లేదు; అజనిం = పుట్టుకలేనట్టియు; అమృత, రూపం = చావులేని రూపముకలవాడును, అగు; స, అంబం = పార్వతితోకూడిన; ఈశం = శివుని, యే = ఎవరు; ఇహ = ఈలోకమున; భజంతే = కొల్చుచున్నారో; తే, హి, ధన్యాః = ఆధన్యాత్ములే; పరమ, సౌఖ్యం గొప్పమోక్షసౌఖ్యమును; లభంతే = పొందుచున్నారు.

తా. పుట్టుకయు చావు కలిగినట్టి బ్రహ్మాదిదేవతల సేవచే కొంచెము సుఖమైనను కలుగదు. ఈ విషయమున సందేహములేదు. జనన మరణములులేని పార్వతీ సహితుడైన శివు నీ లోకమున నెవరు భజింతురో ధన్యులైన వారే మహత్తర సౌఖ్యమైన మోక్షమును పొందఁజాలుదురు.

శ్లో॥ శివ ! తవ పరిచర్యాసంవిధానాయ గౌర్యా
భవ ! మమ గుణధుర్యాం బుద్ధికన్యాం ప్రదాస్యే,
సకల భువనబంధో ! సచ్చిదానందసింధో !
సదయ హృదయ గేహే సర్వదా సంవస త్వమ్. 84

అ. సకల, భువన, బంధో = సర్వలోకములకును బంధుడవైన; సత్, చిత్, ఆనంద, సింధో = సచ్చిదానంద సముద్రుడవైన; స, దయ = దయతో కూడిన; భవ = లోకముల కాదికారణమైన; శివ = ఓ శంకరా ! తవ = నీకు; (గౌర్యా సహ= పార్వతితోకూడ) పరిచర్యా సంవిధానాయ = సేవచేయుట కొఱకు, గుణ, ధుర్యాం = సద్గుణ సంభృతయైన; మమ = నాయొక్క; బుద్ధి, కన్యాం = (బుద్ధియనెడి) కన్యను; ప్రదాస్యే = ఈయఁగలను; త్వం = నీవు; గౌర్యా = పార్వతితోఁగూడ; హృదయ, గేహే = హృదయమనెడి గృహమందు; సర్వదా = ఎల్లప్పుడును; సంవస = సుఖముగానివసింపుము. అలం. రూపకము.

తా. సర్వలోకబంధుడవును, సచ్చిదానంద సముద్రుడవును, దయతో కూడిన

వాడవును, సర్వమున కాది కారణమవును అయిన ఓశివా ! నీ కుపచారములు చేయుటకొఅకు సర్వసద్గుణ ధురీణయైన నా బుద్ధియను కన్యనిచ్చెదను. నీవు పార్వతితో కూడ నా హృదయమనెడి గృహమందు సదా సుఖముగా నివసింపుము.

శ్లో॥ జలధిమథన దక్షో నై వ పాతాళభేదీ
న చ వనమృగయాయాం నై వలుబ్ధః ప్రవీణః,
అశన కుసుమభూషా వస్త్రముఖ్యాం సపర్యాం
కథయ కథ మహం తే కల్పయా నీందుమౌళే. 85

అ. ఇందు, మౌళే =చంద్రుఁడు శిరస్సునందుఁగల ఓశివా! అహం = నేను జలధి, మథన, దక్షః = సముద్రమును మథించుటకు సమర్థుడను, న, ఏవ = కానేకాను, అప్పుడు హాలహలము పుట్టెను. దానిని శివుడు భక్షించెను. పాతాళ, భేదీ = పాతాళమును భేదించువాడను (వరాహావతారము దాల్చిన నారాయణుడను. అతడు తన కన్ను శివునకు భూషణముగా నర్పించెను) న, చ = కాను, ప్రవీణః = నేర్పుగల, లుబ్ధః = వేటకాడను, న, ఏవ= కాను (వేటాడి గజచర్మమును నీకు వస్త్రముగా నర్పింవజాలను) అశన, కునుమ, భూషా వస్త్ర, ముఖ్యాం = ఆహారము పుష్పాలంకారము, వస్త్రము మొదలైన, సపర్యాం = ఉపచారమును, తే = నీకు, కథం = ఎట్లు, కల్పయాని = సమకూర్తునో, కథయ = తెల్పుము.

తా. రాజమౌళివైన శివా ! నేను సముద్రమును త్రచ్చుటకు సమర్థుడను కాను. అందుచే నీ కాహారమైన విషమును సమర్పింప నేరను. పాతాళమును భేదించు వరాహరూపుడైన విష్ణువునుకాను, నేత్రమును కుసుమాలంకారముగా నొసంగజాలను. నేర్పుగల వేటకాడను (తిన్నడను) కాను. నీకు గజచర్మమును నొనంగజాలను. షోడశోపచారములలోనివైన నైవేద్య పుష్పపూజా వస్త్రాదులైన సపర్యను నీకెట్లు సమకూర్తునో చెప్పుము. అట్లుచేసెదను.

శ్లో॥ పూజా ద్రవ్య సమృద్ధయో విరచితాః పూజాం కథం కుర్మహే
పక్షిత్వం న చ వా కిటిత్వమపి న ప్రాప్తం మయా దుర్లభమ్,
జానే మస్తక మంఘ్రి పల్లవ ముమాజానే! న తేఽహం విభో
న జ్ఞాతం హి పితామహేన హరిణా తత్త్వేన తద్రూపిణా. 86

అ. విభో = ప్రభూ ! ఉమా, జానే = పార్వతిభార్యగా కలవాడా ! ఓశివా ! పూజా, ద్రవ్య, సమృద్ధయః = పూజలకొఅకైన వస్తువుల విస్తారములు, విరచితాః = సేకరింపఁబడినవి. కాని వానిని ఈపాదములందు కాని తలమీదకాని యుంచవలయును. పూజాం = పూజను, కథం = ఎట్లు, కుర్మహే = చేయుదుము, దుర్లభం = పొందశక్యముకాని, పక్షిత్వం, వా = హంసత్వముకాని, కిటిత్వం, అపి = వరాహత్వముకాని, మయా = నాచే, న, ప్రాప్తం = పొందఁబడలేదు, హంస నెక్కిబ్రహ్మ లింగము అగ్రభాగమును వరాహత్వమునొంది హరి లింగము యొక్క అడుగుభాగమును చూడఁజాలక పోయిరి. అహం = నేను, తే = నీయొక్క, మస్తకం = శిరస్సును, అంఘ్రి పల్లవం = చిగురాకువంటి పాదమును, న, జానే ఎఱుంగను, తత్, రూపిణా = ఆహంస రూపము దాల్చి నట్టియు వరాహ రూపమునొంది నట్టియు, పితామహేన = బ్రహ్మచేతను, హరిణా = విష్ణువుచేతను, తత్త్వేన = తత్వముచే (యథార్థముగా) న, జ్ఞాతం, హి = ఎఱుగ బడియుండ లేదుకదా. అందుచే నేను హంసనైనను వరాహమునైనను మాత్రము లాభమేమి ?

తా. పార్వతీప్రియుడవైన ఓ ప్రభూ, పూజకుకావలసిన వస్తు సమృద్ధులన్నియు సమకూర్ఁబడినవి. కాని నీపూజనెట్లుచేయుదుము ? పొందశక్యముకాని పక్షిత్వము (హంసత్వము) కాని, వరాహత్వముకాని నాచే పొందఁబడియుండలేదు. నేను నీతలను కాని చిగురాకు వంటి పాదమును కాని చూడఁజాలను. హంసరూపము దాల్చిన బ్రహ్మచేతను వరాహరూపమందిన విష్ణువుచేతను యథార్థముగా నీరూపము తెలియబడి యుండలేదు. అందుచే పక్షిత్వకిటిత్వములను పొందినను లాభములేదని భావము.

శ్లో। **అశనం గరళం ఫణీ కలాపో**
వసనం చర్మ చ వాహనం మహోక్షః,
మమ దాస్యసి కిం కిమస్తి శంభో !
తవ పాదాంబుజభక్తి మేవ దేహి. **87**

అ. శంభో = శివా ! గరళం = విషము, అశనం = ఆహారము, ఫణీ = పాము, కలాపః = ఆభరణము, వసనం = వస్త్రము, చర్మ, చ = గజచర్మము, వాహనం = ఎక్కెడి వాహనము, మహత్, ఉక్షః = ముసలియెద్దు, అందుచే, మమ = నాకు, కిం = ఏమి, దాస్యసి = ఈయ గలవు ? అసలు; కిం = ఏమి, అస్తి కలదు. కావున; తవ = నీయొక్క, పాద, అంబుజ, భక్తిం ఏవ = పద్మముల వంటి పాదములందలి భక్తినే, దేహి = ఇమ్ము.

తా. శివా ! నీకు విషమాహారము, పామలంకారము, వస్త్రము గజచర్మము. వాహనము ముసలి ఎద్దు. నాకేమి ఈయగలవు ? అసలు నీకేమున్నది ? అందుచే పద్మములవంటి నీ పాదములందలి భక్తినే ఇమ్ము. ఇది చమత్కారముగా చెప్పుమాట. శివుడు విషము భక్షించెను. గజ చర్మము, ధరించును. వృషభవాహనుడు. నిజమున కిదియేదియు నల్పములుకావు అనన్యసాధ్యములు. అవి శివుడిచ్చినను ఇతరులు భరించుట కష్టము. అందుచే పాదపద్మ భక్తినే యిమ్మని ఆచార్యులవారు వేడుచున్నారు.

శ్లో॥ యదా కృతాంభో నిధిసేతుబంధనః
కరస్థలాధఃకృత పర్వతాధిపః,
భవాని తే లంఘిత పద్మసంభవ
స్తదా శివార్చాస్తవ భావనక్షమః. 88

అ. శివ = శంకరా ! అహం = నేను, యదా =ఎప్పుడు, కృత, అంభోనిధి, సేతు బంధనః = చేయఁబడిన సముద్రము యొక్క వారధి కట్టుట కలవాడను (రాముడను), భవాని = అగుదునో, కర, స్థల, అధఃకృత, పర్వత, అధిపః = కరతలముచే (అరచేతితో) క్రిందు చేయబడిన పర్వతరాజు కలవాడను (అగస్త్యుడు వింధ్య గర్వాపహరణ మొనరించెను), భవాని = అగుదునో, లంఘిత పద్మసంభవః = అతిక్రమింపబడిన బ్రహ్మకలవాడను (రావణుడను) భవాని = అగుదునో, తదా = అప్పుడు, తే = నీ యొక్క, అర్చా, స్తవ, భావన, క్షమః = పూజించుట, స్తుతించుట, భావించుట అనువానియందు సమర్థుడను, భవాని = కాగలను.

తా. శంకరా ! నేనెప్పుడు సముద్రమునకు సేతువు కట్టగలరాముడను, అఅచేతిలో నణపఁబడిన పర్వతరాజముకల అగస్త్యుడను, అతిక్రమింపఁబడిన బ్రహ్మశక్తికల రావణుడను అగుదునో అప్పుడు నిన్ను పూజించుటకు, నుతించుటకు, భావించుటకు సమర్థుడను కాగలను. రామాదులు మహాభక్తులు. వారి వంటి వారుకాని శివునికి పూజాదు లొనరించుటకు సమర్థులు కారు.

శ్లో॥ నతిభి ర్నుతిభి స్త్వమీశ ! పూజా
విధిభి ర్ధ్యానసమాధిభి ర్న తుష్టః,

ధనుషా ముసలేన చాశ్మభిర్వా
వదతే ప్రీతికరం తథా కరోమి ! 89

అ. ఈశ = ఈశ్వరా ! త్వం = నీవు, నతిభిః = నమస్కారములచేతను, నుతిభిః = స్తోత్రములచేతను, పూజా, విధిభిః = పూజా విధానములచేతను, ధ్యాన, సమాధిభిః, చ = ధ్యానము సమాధి మున్నగువానిచేతను, న తుష్టః = తుష్టిని పొందువాడవు గావు. ధనుషా = వింటిచేతను, ముసలేన = రోకటిచేతను, అశ్మభిః, వా = రాలచేతను గాని, తుష్టుడవగుదువేమో, తే = నీకు, ఏది, ప్రీతికరం = ప్రీతికలిగించునో, వద = తెల్పుము, తథా = అట్లు, కరోమి= చేయుదును.

తా. స్వాములవారిందు హాస్యపూర్వకమైన చమత్కారమును ప్రదర్శించుచున్నారు. ఈశ్వరా ! నీవు నమస్కారములచేతను, స్తుతులచేతను, వివిధ పూజా విధానములచేతను, ధ్యాన సమాధులచేతను సంతుష్టుడవగునట్లు కనిపించుటలేదు. అర్జునాదులొనర్చినట్లు వింటిచేతను, రోకటిచేతను, రాలచేతను పూజించుచో తుష్టుడవగుదువేమో ? నీ కేది ప్రీతికరమో తెల్పుము. అట్లే చేయుదును.

శ్లో॥ వచసా చరితం వదామి శంభో
రహ ముద్యోగవిధాసు తేఽప్రసక్తః,
మనసాఽఽకృతి మీశ్వరస్య సేవే
శిరసా చైవ సదాశివం నమామి ! 90

అ. శంభో = శివా ! అహం = నేను; తే = నీయొక్క; ఉద్యోగ, విధాసు= సంతోషింప జేయుపూజాది విధానములందు ; అప్రసక్తః = సమర్థుడను (వ్యాపృతుడను) కాను ; అందుచే; వచసా = వాక్కుచే ; చరితం = నీచరిత్రను ; వదామి = చెప్పుదును; మనసా = మనస్సుచే ; ఈశ్వరస్య = ఈశ్వరుడవైన నీయొక్క ; ఆకృతిం = ఆకారమును; సేవే = సేవింతును; శిరసా చ , ఏవ = శిరస్సు చేతనే ; సదాశివం = సదాశివుడవైననిన్ను ; నమామి = నమస్కరింతును, (శంభోరహం అను పాఠముకలదు. అప్పుడు సంబోధన ఉండదు. శంభోః తే = కల్యాణకరుడవైన నీ యొక్క అనిచెప్పవలెను.)

తా. శివా ! నేను కల్యాణకరుడవైన నీ పూజాది విధానములందు (నీవు చేయు వ్యాపారాది విధానములందు) నేర్పుకలవాడను కాను. అందుచే వాక్కుచే నీ చరిత్రను

చెప్పుదును, మనస్సుచే ఈశ్వరుడవైన నీ ఆకారమును సేవింతును. శిరస్సుచే సదాశివుడవైన నీకు నమస్కరింతును.

శ్లో॥ ఆద్యాఽవిద్యా హృద్గతా నిర్గతాసీ
ద్విద్యా హృద్యా హృద్గతా త్వ ప్రసాదాత్,
సేవే నిత్యం శ్రీకరం త్వత్పదాబ్జం
భావే ముక్తే ర్భాజనం రాజమౌళే ! 91

అ. రాజమౌళే = చంద్రశేఖరా, శివా ! త్వత్, ప్రసాదాత్ = నీయను గ్రహమువలన; ఆద్యా = అనాదిసిద్ధమైన; హృత్, గతా = హృదయమును పొందిన; అవిద్యా = అజ్ఞానము; నిర్గతా = తొలగిపోయినది; ఆసీత్ = ఆయెను; హృద్యా = మనోహరమైన; విద్యా = జ్ఞానము; హృత్ గతా = హృదయమును పొందినది; ఆసీత్ = ఆయెను; అందుచే; నిత్యం = ఎల్లప్పుడు; శ్రీకరం = లక్ష్మిని (శోభను) కలిగించు; త్వత్, అబ్జం = నీపద్మమువంటి పాదమును; సేవే = సేవింతును; ముక్తేః = ముక్తికి ; భాజనం = పాత్రమని (దీనిని కూడ పదాబ్జమునకు విశేషణముగా చెప్పవచ్చును ముక్తికి నిలయమగు నీపదాబ్జమును) భావే = భావింతును.

తా. చంద్రశేఖరుడవైన ఓశివా! నీదయవలన ననాది సిద్ధమైన అజ్ఞానము తొలగిపోయినది. మనోహరమైన జ్ఞానము హృదయమును పొందినది. అందుచే సంపత్కరమగు పద్మము వంటి నీ పాదమును నిత్యమును సేవింతును; ముక్తికి పాత్రమని భావింతును.

శ్లో॥ దూరీకృతాని దురితాని దురక్షరాణీ
దౌర్భాగ్య దుఃఖ దురహంకృతి దుర్వచాంసి,
సారం త్వదీయచరితం నితరాం పిబంతం
గౌరీశ ! మామిహ సముద్ధర సత్కటాక్షైః. 92

అ. గౌరీ, ఈశ = పార్వతీనాథా ! శివా ! దురితాని = పాపకరములును, దుర్, అక్షరాణి = చెడ్డ అక్షరములతో కూడినవియు, దౌర్భాగ్య, దుఃఖ, దుర్, అహంకృతి, దుర్, వచాంసి = దౌర్జన్యము, దుఃఖము, దురహంకారము అనువానిచే కూడిన దుష్టములైన వాక్కులు, దూరీకృతాని = దూరముగా చేయఁబడినవి, సారం = సారవంతమైన

(వేదోపనిషదాదులసారమైన), త్వదీయ, చరితం = నీ చరిత్రను, నితరాం = అధికముగా, పిబంతం = త్రాగుచున్న, మాం = నన్ను, ఇహ = ఇచ్చట, సత్, కటాక్షైః = ఉత్తమములైన నీ కడకంటి చూపులతో, ఉద్ధర = ఉద్ధరింపుము(తరింపఁజేయుము)

తా. పార్వతీనాథా ! శివా ! పాపావహములును, చెడ్డ అక్షరములతో కూడినవియు, దౌర్భాగ్యము, దుఃఖము, దురహంకారము మున్నగువానితో కూడినవియు నగు దుష్టవచస్సులు దూరముచేయబడినవి. పవిత్రమైన వాక్కు చేకూరినది. వేదోపనిషదాదుల సారమైన నీ చరితమును నిత్యమును అధికముగా త్రాగుచున్న నన్నిపుడుత్తమములైన నీక్రీఁగంటి చూపులచే నుద్ధరింపుము.

శ్లో॥ సోమకళాధరమౌళౌ
కోమల ఘనకంధరే మహామహసి,
స్వామిని గిరిజానాథే
మామక హృదయం నిరంతరం రమతామ్ ! 93

అ. మామక, హృదయం = నా హృదయము, సోమ, కళా, ధర మౌళౌ = చంద్రుని కళనుధరించు శిరముకలవాడును, కోమల, ఘన, కంధరే = స్నిగ్ధమైన; మేఘమువంటికంఠముకలవాడును (శ్రీకంఠుడును) మహత్, మహసి = గొప్పతేజఃస్వరూపమైనవాడును, స్వామిని = ప్రభువును, అగు, గిరిజా, నాథే = పార్వతీపతియైన శివునియందు, నిరంతరం =ఎల్లప్పుడును, రమతామ్ = రమించుఁగాక, క్రీడించుగాక !

తా. నా హృదయము చంద్రకళనుధరించు శిరస్సు కలవాడును, సుందరమైన మేఘమువంటి మచ్చతోఁగూడిన కంఠముకలవాడును, గొప్ప తేజస్సు యొక్క స్వరూపమైనవాడును, ప్రభువును అగు పార్వతీనాథునియందు ఎల్లప్పుడును రమించుఁగాక. (పై విశేషణములన్నియు మహామహసి అనుదానికి చెప్పి అట్టి గొప్ప జ్యోతిస్సునందు నా హృదయము రమించుగాక యనియు చెప్పనగును.)

శ్లో॥ సా రసనా తే నయనే
తావేవ కరౌ స ఏవ కృత కృత్యః,
యా యే యౌ యో భర్గం
వద తీక్షేతే సదార్చతః స్మరతి. 94

అ. యా = ఏది, భర్గం = శివుని, వదతి = చెప్పునో (శివనామము నుచ్చరించునో) యే = ఏ రెండు, ఈక్షేతే = శివుని చూచునో, యౌ = ఏరెండు, సదా = ఎల్లప్పుడును, అర్చతః = శివునిపూజించునో, యః = ఎవడు, స్మరతి = శివుని స్మరించునో, క్రమముగా, సా = ఆదియే, రసనా = నాలుక, తే = ఆరెండే, నయనే = కన్నులు, తే, ఏవ = ఆరెండే, కరౌ = హస్తములు. సః, ఏవ = అతడే కృతార్థుడు. మానవులు సర్వేంద్రియములతో శివునర్చించి కృతార్థులు కావలెనని భావము.

తా. ఏది శివనామము నుచ్చరించునో అదే నాలుక, ఏవి శివునిచూడజాలునో అవే కన్నులు, ఏవి ఎల్లప్పుడును శివునర్చించునో అవే చేతులు, ఎవడు శివుని స్మరించునో అతడే కృతార్థుడు. మానవులు సర్వేంద్రియములతో శివునర్చించి కృతార్థులు కావలెనని భావము.

శ్లో॥ అతిమృదులౌ మమ చరణా
వతి కఠినం తే మనో భవానీశ !
ఇతి విచికిత్సాం సంత్యజ
శివ ! కథమాసీ ద్గిరౌ తథావేశః. 95

అ. భవానీ, ఈశ = పార్వతీనాథా ! శివా ! మమ = నాయొక్క; చరణౌ = పాదములు, అతి, మృదులౌ = మిక్కిలి మృదువైనవి, తే = నీయొక్క, మనః = మనస్సు, అతి, కఠినం = మిక్కిలి కఠినమైనది, ఇతి = అని (ఇంత కఠినమైన హృదయమందెట్లు ప్రవేశించుట అని) విచికిత్సాం = సందేహమును, సంత్యజ = విడిచిపెట్టుము, అట్టి సందేహమే నీకున్నచో, గిరౌ = కఠినమైన కైలాసగిరియందు, తథా, (ఆ) వేశః[1] = అట్లు నివసించుట, కథం = ఎట్లు, ఆసీత్ = అయ్యెను.

తా. పార్వతీపతీ ! శివా ! నాపాదము లత్యంత మృదులములు. నీ మన స్సత్యంత కఠినము. అందు నివసించుటఎట్లను సందేహమును విడువుము. అట్టి సందేహమేయున్న కఠినమైన కైలాన వర్వతమం దెట్లావిధముగా నివానమైనది ? (నివాన మేట్లేర్పఱుచుకొంటివి).

శ్లో॥ ధైర్యాంకుశేన నిభృతం
రభసాదాకృష్య భక్తిశృంఖలయా !

1. "వేశ్మ" (గృహము) అని పాఠాంతరము.

పురహర చరణాలానే
హృదయమదేభం బధాన చిద్యంత్రైః. 96

అ. హృదయ, మద, ఇభం = హృదయమనెడి మదపుటేనుగును, ధైర్య, అంకుశేన = ధైర్యమనెడి అంకుశముచేతను, చిత్ ; యంత్రైః = జ్ఞానమనెడి యంత్రములతోడను, నిభృతం = రహస్యముగా, నేర్పుగా, రభసాత్ = వేగముగా, ఆకృష్య = ఆకర్షించి, పురహర, చరణ, ఆలానే = త్రిపుర సంహారుడైన శివుని పాదమనెడి కట్టుకంబమున, భక్తి, శృంఖలయా = భక్తియనెడి గొలుసుతో, బధాన = కట్టివేయుము. అలం. రూపకము.

తా. మదపుటేనుగులను గోతులపై సన్నని గడలువేసి వానిమీద పచ్చగడ్డి మొలచునట్లు చేసి ఆకర్షింతురు. అవి అచ్చటికి గడ్డి తినుటకై వచ్చును. అడుగు వేయగానే గడలు విఱుగును. అవి గోతిలోపడును. అట్లు కొన్ని నాళ్ళుంచి యితర గజముల సాయమునగాని యంత్రముల సాయమునగాని పైకి తీసి మచ్చికచేయుదురు. పురహర అనుదానిని శివునికి సంబోధనమునైన గ్రహింపవచ్చును. లేదా శ్లోకమును పాఠకునుద్దేశించే చెప్పినట్లు గ్రహింపవచ్చును.

తా. హృదయమనెడి మదపుటేనుగును నేర్పుతో వేగముగా జ్ఞానమనెడి యంత్రములచేతను, ధైర్యమనెడి అంకుశముచేతను ఆకర్షించి త్రిపుర సంహారుడైన శివుని పాదమనెడి కట్టు కంబమున భక్తి యనెడి గొలుసుతో బంధింపుము.

శ్లో॥ ప్రచరత్యభితః ప్రగల్భవృత్త్యా
మదవానేష మనఃకరీ గరీయాన్,
పరిగృహ్య నయేన భక్తి రజ్జ్వా
పరమస్థాణుపదం దృఢం నయాముమ్. 97

అ. ఏషః = ఈ, గరీయాన్ = మిక్కిలి గొప్పవాడైన (బలముకల), మదవాన్ = మదముకల, మనః , కరీ = మనస్సనెడి యేనుగు, అభితః = అంతటను, ప్రగల్భవృత్త్యా = గర్వముతోఁగూడిన వ్యాపారముతో, ప్రచరతి = తిరుగుచున్నది. అముం = దీనిని, నయేన = నీతితో, పరిగృహ్య = గ్రహించి, భక్తి, రజ్జ్వా = భక్తియనెడి త్రాటితో, పరమ, స్థాణు, పదం = ఉత్కృష్టమైన శివుని పాదమును గూర్చి (మిక్కిలి బలమైన కట్టుకొయ్య

స్థానమును, మిక్కిలి ధ్రువమైన స్థానమునుగూర్చి) నయ = నడపుము. అలం. రూపకము.

తా. మిక్కిలి గొప్పదియు, మదించినదియునగు నీ మనస్సనెడి గజము విశృంఖల వ్యాపారముతో చరించుచున్నది. దీనిని భక్తియనెడి త్రాటితో నీతితో గ్రహించి పరబ్రహ్మస్వరూపుడైన శివుని పాదమనెడి కట్టుకంబమును (మిక్కిలి ధ్రువమైన మోక్షస్థానమును) చేర్పుము.

శ్లో॥ సర్వాలంకారయుక్తాంసరళపదయుతాం సాధువృత్తాంసువర్ణాం
సద్భిః సంస్తూయమానాం సరసగుణయుతాం లక్షితాం లక్షణాఢ్యామ్,
ఉద్యద్భూషా విశేషాముపగతవినయాం ద్యోతమానార్థరేఖాం
కళ్యాణీం దేవ! గౌరీ ప్రియ మమ కవితా కన్యకాం త్వం గృహాణ. 98

అ. ఈ శ్లోకమునందలి విశేషణములు కృతికిని కృతి కన్యకును అన్వయించును. గౌరీ, ప్రియ = పార్వతికి ప్రియుడవైన, దేవ = స్వామీ, శివా ! సర్వ, అలంకార యుక్తాం = అన్ని శబ్దార్థాలంకారములతో కూడినదియు (అన్ని భూషణములతో కూడినదియు), నరళ, పద, యుతాం = సాధువులైన శబ్దములతో కూడినదియు (వంకరకాని పదగమనముతో కూడినదియు), సాధు, వృత్తాం = అందమైన శార్దూలాది వృత్తములు కలదియు (మంచి చరిత్ర (నడవడి) కలదియు), సువర్ణాం = మంచి అక్షరములు కలదియు (బంగారువంటి మంచియైన వన్నె కలదియు), సద్భిః = పండితులచే (మంచివారిచే), సంస్తూయమానాం = పొగడఁబడుచున్నదియు, సరస, గుణయుతాం = రసములతోకూడి మాధుర్యాది కావ్యగుణములతో నొప్పారునదియు (సరసురాలును గుణవంతురాలును), లక్షితాం = ప్రముఖమైనదియు, లక్ష్యార్థముతో కూడినదియు (సుపరీక్షితురాలైనదియు గౌరవింపబడునదియు), లక్షణ, ఆఢ్యాం= సర్వకావ్య లక్షణ సంపన్నమైనదియు (సర్వ కన్యాసాముద్రిక లక్షణములతో కూడినదియు), ఉద్యద్, భూషా, విశేషాం = ప్రకాశించు నలంకారముల అతిశయము కలదియు (ప్రకాశించు నగల ఆధిక్యము కలదియు) ఉపగత, వినయాం = పొందఁబడిన ఔచిత్యము కలదియు, (పొందఁబడిన క్రమశిక్షణము , సద్వర్తనముకలదియు) ద్యోతమాన, అర్థరేఖాం = స్పష్టముగా గోచరించుచున్న వాచ్యార్థమున మించిన వ్యంగ్యార్థ లక్షణములు కలదియు, (స్పష్టముగా కనఁబడుచున్న

అఱచేతియందలి ధనరేఖ కలదియు), కల్యాణీం = శివేతరక్షతి యొనర్చుటచే మంగళమైనదియు (మంగళ ప్రదురాలును) అగు, మమ = నా యొక్క, కవితాకన్యకాం = కన్యకవంటి కవిత్వమును (కవిత్వమనెడి కన్యకను), త్వం = నీవు, గృహాణ = కృతిగా స్వీకరింపుము, పరిగ్రహింపుము. అలం. శ్లేష, రూపకము.

తా. పార్వతీ ప్రియుడవైన ఓ స్వామీ ? అన్ని శబ్దార్థాలంకారములతో కూడినదియు (అన్ని ఆభరణములతో కూడినదియు), సాధుశబ్దములతో కూడినదియు (వక్రముకాని ఋజుమార్గము కలదియు), మంచి శార్దూలాది వృత్తములతో కూడినదియు (మంచి నడవడి కలదియు) మంచి అక్షరవిన్యాసము కలదియు (బంగారుమేని ఛాయ కలదియు) పండితులచే (సజ్జనులచే) స్తుతింపబడునదియు, రసములతోడను, మాధుర్యాది గుణములతోడను కూడినదియు (సరసురాలును గుణవంతురాలును ప్రముఖమైనదియు, లక్ష్యార్థముతో కూడినదియు (పలువురిలో నెన్నికకెక్కినదియు) సర్వకావ్య లక్షణ సంపన్నయు (సర్వసాముద్రిక లక్షణములతో నొప్పునదియు) (ప్రకాశించు నలంకారము కలదియు) పొందబడిన ఔచిత్యము కలదియు (పొందఁబడిన క్రమశిక్షణమును ఋజువర్తనమును కలదియు) విస్పష్టమైన అర్థస్ఫూర్తి కలదియు (స్పష్టముగా గోచరించు ధనరేఖ కలదియు) శివేతరక్షతి యొనరించునదియు (మంగళప్రదురాలును) అగు నా కన్యకవంటి కవిత్వమును (కావ్యమును) కవిత్వమనెడి కన్యను నీవు పరిగ్రహింపుము.

శ్లో॥ ఇదం తే యుక్తం వా పరమశివ కారుణ్యజలధే
గతౌ తిర్య గ్రూపం తవ పద శిరో దర్శనధియా,
హరిబ్రహ్మాణౌ తౌ భువి దివి చరంతౌ శ్రమయుతౌ
కథం శంభో ! స్వామి న్కథయ మమ వేద్యోఽసి పురతః. 99

అ. పరమ శివ = పరమేశ్వరా ! శంభో = శివా ! తవ = నీ యొక్క, పద, శిరః, దర్శన, ధియా = పాదమును, శిరస్సును చూడవలెనను బుద్ధితో, తిర్యక్, రూపం = పశు (వరాహ) పక్షి (హంస) రూపమును, గతౌ = పొందిన, తౌ = ఆ, హరి, బ్రహ్మాణౌ = విష్ణువును బ్రహ్మయు, శ్రమ, యుతౌ = ఆయాసముతో కూడిన వారైరి (నీ పాద శిరస్సులను చూడజాలకపోయిరి) స్వామిన్ = స్వామీ, మమ = నాయొక్క, పురతః = ఎదుట. కథం = ఎట్లు, వేద్యః = తెలియఁదగినవాడవు, అసి = అయితివో, కథయ =

తెల్పుము, కారుణ్య, జలధే =దయాసముద్రుడా ! ఇదం = ఇది, తే = నీకు, యుక్తం, వా = ఉచితమే కదా ! (దయాసముద్రుడవగుటచే పెద్ద పెద్దవారికి గోచరింపకపోయినను దీనుడనైన నాకు గోచరించుట ఉచితమే.

తా. పరమేశ్వరా ! శివా ! స్వామీ ! నీ పాదమును శిరస్సును చూడవలెనను తలంపుతో పశుపక్షి రూపములను ధరించి (హంసనెక్కియు వరాహరూపమును ధరించియు) మహనీయులైన ఆ విష్ణువును బ్రహ్మయు చాల శ్రమపడియుండిరి. నా యెదుట నీవెట్లు సాక్షాత్కరించి వేద్యుడవైతివో తెల్పుము. ఔను, దయాసముద్రుడవైన నీకిది తగియేయున్నది సుమా !

శ్లో॥ స్తోత్రేణాల మహం ప్రవచ్మి న మృషా, దేవా విరించాదయః
స్తుత్యానాం గణనాప్రసంగసమయే, త్వామగ్రగణ్యం విదుః,
మాహాత్మ్యాగ్రవిచారణ ప్రకరణే, ధానాతుషస్తోమవ
ద్ధూతాస్త్వాం విదురుత్తమో త్తమఫలం శంభో ! భవత్సేవకాః. 100

అ. శంభో = మంగళస్వరూపుడవైన శివా ! స్తోత్రేణ = ఈ స్తుతిచేతను, అలం = చాలును (నేనింక స్తుతిచేయ నవసరములేదు), అహం = నేను, ప్రవచ్మి = చెప్పుచున్నాను, న, మృషా= అబద్ధముకాదు, విరించ, ఆదయః = బ్రహ్మ మొదలైన, దేవాః = దేవతలు, స్తుత్యానాం = స్తుతింపఁదగినవారియొక్క, ప్రసంగ, సమయే = ప్రసక్తివచ్చిన సమయమందు, త్వాం = నిన్ను, అగ్ర, గణ్యం = మొదట లెక్కింపదగిన వానినిగా, విదుః = ఎఱింగిరి, మాహాత్మ్య, అగ్ర, విచారణ, ప్రకరణే = మహత్త్వమునందు శ్రేష్ఠులెవరని పరిశీలించు సందర్భమున, భవత్, సేవకాః = నీ సేవకులైనవారు, ధానా, తుష, స్తోమవత్ = తూర్పారబట్టునప్పుడు ధాన్యపుపొట్టు సమూహమువలె, ధూతాః = ఎగురఁగొట్టబడిన వారై, త్వాం = నిన్ను, ఉత్తమ, ఉత్తమ, ఫలం = పరమోత్తమమైన ఫలముగా (గట్టిగింజగా), విదుః = ఎఱింగిరి.

తా. మంగళస్వరూపుడవైన శివా ! ఈ సుత్తి యింక చాలును, నేను చెప్పుచున్నాను. అబద్ధముకాదు. బ్రహ్మాదులైన దేవతలు స్తోత్రము చేయఁదగినవారి ప్రసక్తి వచ్చినప్పుడు నిన్ను ప్రథమగణ్యునిగా నెఱింగిరి. నీ సేవకులైనవారు మహత్త్వమునందు

అగ్రేసరులెవరని పరిశీలించు సందర్భమున తూర్పారబట్టు సమయమున ధాన్యపుపొట్టు సమూహమువలె నెగురగొట్టఁబడిన వారై నిన్ను శేషించిన పరతత్త్వ స్వరూపమైన శ్రేష్ఠమైన ఫలముగా (గట్టిగింజగా) గుర్తింప జాలిరి. నీవు పరబ్రహ్మవు. మహత్త్వమున నీకన్న నగ్రగణ్యులు లేరు.



శ్రీ

శ్రీ సౌందర్యలహరి

శ్లో॥ శివః శక్త్యా యుక్తో యది భవతి శక్తః ప్రభవితుం
న చేదేవం దేవో న ఖలు కుశలః స్పందితుమపి,
అతస్త్వామారాధ్యాం హరిహర విరించ్యాదిభి రపి
ప్రణంతుం స్తోతుం వా కథ మకృత పుణ్యః ప్రభవతి. 1

అ. తల్లీ ! శివః = శివుడు, శక్త్యా = శక్తితో, యుక్తః, యది = కూడుకొనియున్నవాడగుచో, ప్రభవితుమ్ = ప్రభుత్వమునిర్వహించుటకు, శక్తః = సమర్థుడు, భవతి = అగును, ఏవం = ఇట్లు (శక్తితోకూడుకొన్నవాడు) న, చేత్ = కానిచో, దేవః = దేవుడైన శివుడు, స్పందితుం, అపి = కదలుటకుకూడ, కుశలః = సమర్థుడు, న, ఖలు = కాడుకదా ! అతః = అందుచే, హరి, హర, విరించి, ఆదిభిః, అపి = విష్ణువు, శివుడు, బ్రహ్మమొదలైనవారిచేకూడ, ఆరాధ్యాం = పూజింపదగిన, త్వాం = నిన్ను, ప్రణంతుం = నమస్కరించుటకుకాని, స్తోతుం వా = స్తుతించుటకు కాని, అకృత, పుణ్యః = గత జన్మములందు చేయబడని పుణ్యములు కలవాడు, కథం = ఎట్లు, ప్రభవతి = సమర్థుడగును.

తా. శివుడు శక్తితో కూడియున్నప్పుడే ప్రభుత్వమును నిర్వహించుటకు సమర్థుడగును, అట్లుకానిచో అనగా, శక్తిరహితుడైనచో, కదలుటకుకూడ సమర్థుడు కాకుండును, అందుచే హరిహర బ్రహ్మలకు కూడ పూజనీయురాలవైన నీకు నమస్కరించుటకు కాని, నిన్ను స్తోత్రము చేయుటకు కాని పుణ్యముచేయని వాడెట్లు శక్తుడు కాజాలును ? కాజాలడనిభావము. శ్రీ జగద్గురువులు కృతపుణ్యులు కావుననే స్తుతి కావించుట కర్హులైరి.

శ్లో॥ తనీయాంసం పాంసుం తవ చరణ పంకేరుహ భవం
విరించిః సంచిన్వన్ విరచయతి లోకా నవికలం,

వహ త్యేనం శౌరిః కథ మపి సహస్రేణ శిరసాం
హరః సంక్షుద్యైనం భజతి భసితోద్ధూలన విధిమ్. 2

అ. తవ = నీ యొక్క, చరణ , పంకేరుహ, భవం = పాదపద్మముల యందు పుట్టిన, తనీయాంసం = మిక్కిలిచిన్నదైన, పాంసుం = రజోలేశమును, సంచిన్వన్ = సేకరించుచు, విరించిః = బ్రహ్మ, లోకాన్ = లోకములను, అవికలం = ఏలోపములు లేకుండగ, సుందరముగ, విరచయతి = సృజించును, శౌరిః = విష్ణువు, ఏవం = ఈపాదరజోలేశమును (ప్రపంచమును), శిరసాం = శిరస్సుల యొక్క (తలలయొక్క), సహస్రేణ = వేయింటిచే, కథమ్ + అపి = అతికష్టముగ, వహతి = వహించును, మోయును, హరః = శివుడు , ఏనం = దీనిని, సంక్షుద్య = చూర్ణముచేసి, భసిత, ఉద్ధూలన, విధిం = విభూతిని ధరించు విధానమును, భజతి = పొందును.

తా. దేవీ ! నీ పాదమనెడి పద్మములనుండి పుట్టిన మిక్కిలి చిన్న ధూళిలేశమును సేకరించుచు బ్రహ్మ లోకములను సమగ్రసుందరముగ సృష్టించును. విష్ణువు దానిని అనంతరూపమున వేయితలలతో అతికష్టముతో వహించును. శివుడు దానిని చూర్ణముచేసి భస్మధారణ విధానమును పొందును. అనగా భస్ముగా ధరించును. అందుచేతనే ఈశ్వరుడయ్యెను, ఈశ్వరుని భావమైశ్వర్యము.

శ్లో॥ అవిద్యానా మంత స్తిమిర మిహిర ద్వీప నగరీ
జడానాం చైతన్యస్తబక మకరంద స్రుతిఝరీ,
దరిద్రాణాం చింతామణి గుణనికా, జన్మజలధౌ
నిమగ్నానాం దంష్ట్రా మురరిపువరాహస్య భవతి. 3

అ. దేవీ ! నీపాదరజోలేశము, అవిద్యానామ్ = అజ్ఞానులకు, అంతః = తిమిర, మిహిర, ద్వీప, నగరీ = లోపలనున్న అజ్ఞానమనెడి చీకటికి సూర్యుని యొక్క ద్వీపమునందలి పట్టణము (సూర్యుడు ఆకాశమును వెలుగుచు లోకమునందలి చీకటిని పోద్రోలునట్లు దేవి పాదరజోలేశము అజ్ఞానులహృదయమందు అజ్ఞానమనెడి చీకటిని పో ద్రోలును), జడానాం = మందులకు, (మందబుద్ధులకు) చైతన్య స్తబక, మకరంద, స్రుతి, ఝరీ = చైతన్యమనెడి పూగుత్తుల నుండి కారు మకరంద స్రావముయొక్క ప్రవాహము, దరిద్రాణాం = పేదవారికి, చింతామణి, గుణనికా = కోరికలను తీర్చు చింతామణులయొక్క దండ,

జన్మ, జలధౌ = సంసారమనెడి సముద్రమునందు, నిమగ్నానాం = మునిగినవారికి, మురరిపు, వరాహస్య = నారాయణుని అవతారమైన వరాహముయొక్క, దంష్ట్రా = కోర, భవతి = అగును, పూర్వము హిరణ్యాక్షుడు భూమిని చాపచుట్టగాచుట్టి సముద్రమున ముంచ బోవుచుండగా విష్ణువు వరాహావతారమునెత్తి తనకోరకొనచే భూమినెత్తి ఉద్ధరించెను. అట్లే సంసారసముద్రమునందు మునుగుచున్న జనులను దేవియొక్క పాదరజోలేశము మునిగిపోకుండ ఉద్ధరించును.

'భవతి అనుచోట' భవతీ ' అను పాఠాంతరము కలదు. అప్పుడు పై విశేషము లన్నియు దేవికే చెల్లును.

అలం. ఉల్లేఖము, రూపకము,

తా. దేవీ ! నీ పాద రజోలేశము అజ్ఞానుల హృదయమందుండు అజ్ఞానమనెడి చీకటికి సూర్య ద్వీప పట్టణము. జడులకు చైతన్యమనెడి పుష్పగుచ్ఛము యొక్క మకరందస్రావముయొక్క ప్రవాహము. దరిద్రులకు చింతామణులదండ. సంసార సముద్రమున మునిగిన జనులనుద్ధరించు నారాయణుని అవతారమైన కోరయొక్కకొన అగుచున్నది.

శ్లో॥ త్వ దన్యః పాణిభ్యా మభయ వరదో దైవతగణ
స్త్వమేకా నైవాసి ప్రకటితవరాభీత్యభినయా,
భయాత్రాతుం దాతుం ఫలమపి చ వాంఛా సమధికం
శరణ్యే లోకానాం తవ హి చరణావేవ నిపుణౌ. 4

అ. లోకానాం = సర్వలోకములకు, శరణ్యే = శరణు చొరదగిన ఓదేవీ, త్వత్ + అన్యః = నీ కంటె భిన్నమైన, దైవత, గణః = దేవతాసమూహము, పాణి భ్యామ్ = రెండుచేతులతో , అభయ, వరదః = అభయమును వరమును ఇచ్చునట్టిది, త్వం = నీవు, ఏకా, ఏవ = ఒక్కదానవే, ప్రకటిత, వర + అభీతి + అభినయా = ప్రకటింపబడిన వరముయొక్కయు, అభయముయొక్కయు, అభినయము (నటనము) కలదానవు. న + అసి = కావు, భయాత్ = భయమునుండి, త్రాతుం = రక్షించుటకును, వాంఛా, సమధికం = కోరికకంటె ఎక్కువైన, ఫలం = ఫలమును, దాతుం, అపి, చ = ఇచ్చుటకును కూడ, తవ = నీయొక్క చరణౌ, ఏవ = రెండుపాదములే, నిపుణౌ, హి = నేర్పుకలవి కదా !

తా. సర్వలోకములకు శరణ్యురాలనైన ఓ దేవీ ! నీకంటె భిన్నమైన దేవతా సమూహము ఒక చేతితో అభయముద్రను, రెండవచేతితో వరమును వహించి తన్ను పూజించుటకు భక్తులనాహ్వానించుచున్నది. అట్లు వరమును కాని, అభయమును కాని ఇత్తునని అభినయమును ప్రకటింపనిదానవు నీవొక్కతెవే. భయము నుండి రక్షంచుటకును, కోరికకంటె అధికమైన ఫలమునిచ్చుటకును నీ పాదయుగళమే నేర్చుకలిగియున్నది. నీ పాదములమీద పడినచో భక్తుల భయము తొలగును. వారికి కోరినదానికంటె ఎక్కువ ఫలము కలుగును. నీ పాదములకే ఇట్టి శక్తియుండగ నీవు చేతులతో వరమిత్తును, అభయమిత్తును అని అభినయము చేయవలసిన అక్కఱలేదని భావము.

శ్లో॥ హరి స్త్వా మారాధ్య ప్రణత జనసౌభాగ్య జననీం
పురా నారీ భూత్వా పురరిపు మపి క్షోభ మనయత్,
స్మరోఽపి త్వాం నత్వా రతినయనలేహ్యేన వపుషా
మునీనా మప్యంతః ప్రభవతి హి మోహాయ మహతామ్. 5

ఆ. హరిః = విష్ణువు, ప్రణత, జన, సౌభాగ్య, జననీం = మ్రొక్కు వారలకు సౌభాగ్యము కలిగించునట్టి, త్వాం = నిన్ను, ఆరాధ్య = భజించి, పురా = పూర్వము, నారీ = స్త్రీ (మోహిని), భూత్వా = అయి , పుర, రిపుం, అపి = త్రిపురసంహారియైన శివునికూడ, క్షోభమ్ = కలతను, అనయత్ = పొందించెను, స్మరః, అపి = మన్మథుడు కూడ, రతి, నయన లేహ్యేన = రతీదేవియొక్క కన్నులకు ఆనందము కలిగించు, వపుషా = శరీరముతో, త్వాం = నిన్ను, నత్వా = కొలిచి, మహతామ్ = గొప్పవారైన, మునీనామ్, అపి = మునులయొక్కకూడ, అంతః = హృదయమును, మోహాయ = మోహముకొఅకు (మోహపెట్టుటకు), ప్రభవతి హి = సమర్థుడగుచున్నాడు కదా !

తా. దేవీ ! పూర్వము విష్ణువు మ్రొక్కెడి జనులకు సౌభాగ్యమునొసంగు నిన్ను కొలిచి మోహినీ రూపమును ధరించి త్రిపుర సంహారుడైన శివునికూడ కలత పొందించెను. మన్మథుడు కూడ రతీదేవియొక్క నేత్రములకు ఆనందకరమైన శరీరముచే నిన్ను కొలిచి గొప్పవారైన మునీశ్వరులయొక్క హృదయముకూడ మోహపెట్టుటకు సమర్థుడగుచున్నాడు.

శ్లో॥ ధనుః పౌష్పం మౌర్వీ మధుకర మయీ పంచ విశిఖాః
వసన్తః సామంతో మలయ మరు దాయోధనరథః,

తథాప్యేకః సర్వం హిమగిరి సుతే కామపి కృపా
మపాంగా త్తే లబ్ధ్వా జగదిద మనంగో విజయతే. 6

అ. హిమగిరి , సుతే = హిమపర్వతముయొక్క కూతురవైన పార్వతీ !(మన్మథునికి) ధనుః = విల్లు, పౌష్పం = పుష్పమయమైనది, మౌర్వీ = నారి, మధుకరమయీ = తుమ్మెదల వికారమైనది, విశిఖాః = బాణములు, పంచ = ఐదే (అరవిందాశోకాదులు), వసంతః =వసంతుడు, సామంతః = సామంతరాజు, మలయ, మరుత్ = మలయవాయువు, ఆయోధన, రథః = యుద్ధముకొఅకైన రథము. పైని పేర్కొనబడినవన్నియు నల్పములైనవి, తథా , అపి = అయినప్పటికిని, అనంగః, ఏకః = మన్మథుడొక్కడే, తే = నీయొక్క, అపాంగాత్ =కటాక్షమునుండి, కాం, అపి = అనిర్వచనీయమైన, కృపాం = దయను, లబ్ధ్వా = పొంది, ఇదం = ఈ సర్వం, జగత్ = సమస్త జగమును, విజయతే, జయించుచున్నాడు.

తా. దేవీ ! పార్వతీ ! మన్మథుని విల్లు పుష్పమయమైనది, నారి తుమ్మెదలతో చేయబడినది. బాణములైదే, వసంతుడు సామంతుడు, మలయవాయువు యుద్ధమున కుపయోగపడు రథము, అయినను ఏకాకియు శరీరరహితుడును అయిన అతడు నీ కటాక్షమునుండి అనిర్వచనీయమైన దయను పొంది ఈ సమస్త జగమును జయించుచున్నాడు.

శ్లో॥ క్వణత్కాంచీదామా కరికలభకుంభ స్తననతా
పరిక్షీణా మధ్యే పరిణత శరచ్చంద్ర వదనా,
ధనుర్బాణాన్ పాశం సృణి మపి దధానా కరతలైః
పురస్తా దాస్తాం నః పురమథితు రాహో పురుషికా. 7

అ. క్వణత్, కాంచీ దామా = ధ్వనించుచున్న ఒడ్డాణము కలదియు, కరి, కలభ, కుంభస్తన, నతా = పిల్లఏనుగు కుంభస్థలమువంటి కుచములచే వంగినదియు, మధ్యే = నడుమునందు, పరిక్షీణా = కృశించినదియు , పరిణత, శరత్, చంద్ర వదనా = పూర్ణమైన శరత్కాలమందలి చంద్రుని వంటి ముఖముకలదియు, కరతలైః = చేతులతో, ధనుః = వింటిని, బాణాన్ = అమ్ములను, పాశం = త్రాటి వంటి ఆయుధమును,

సృణిమ్, అపి = అంకుశమును, దధానా = ధరించుచున్నదియు అగు, పురమథితుః = త్రిపురసంహారుడైన శివుని యొక్క , ఆహోపురుషికా = గర్వ (అహంకార) రూపమైన దేవి, నః = మాయొక్క, పురస్తాత్ = అగ్రభాగమున. ఆస్తాం = నిలుచుగాక.

తా. మెరయుచున్న (మొలనూలు) ఒడ్డాణముకలిగినట్టియు, గున్నయేనుగు కుంభస్థలమువంటి కుచములబరువుచే వంగినట్టియు, కృశించిన నడుము కలిగి నట్టియు, శరత్కాలమందలి నిండుచంద్రునివంటి ముఖము కలిగినట్టియు, నాలుగుచేతులతో విల్లమ్ములను, పాశమును, అంకుశమును ధరించునట్టియు, త్రిపురసంహారియైన శివుని అహంకారరూపిణియగు దేవి మా ముందు సాక్షాత్కరించుగాక! శివునికే దేవి భార్యయై ఉండుటయే అహంకార కారణము (మహత్త్వదాయకము)

శ్లో॥ సుధా సింధోర్మధ్యే సురవిటపివాటీ పరివృతే
మణిద్వీపే నీపోపవనవతి చింతామణిగృహే,
శివాకారే మఞ్చే పరమశివ పర్యంక నిలయాం
భజంతి త్వాం ధన్యాః కతిచన చిదానందలహరీమ్. 8

అ. సుధాసింధోః = అమృతసముద్రము యొక్క, మధ్యే = నడుమ, సుర, విటపి, వాటీ, పరివృతే = కల్పవృక్షములవరుసచే చుట్టబడిన, మణిద్వీపే = మణిద్వీపమందు , నీప, ఉపవన, వతి = కడిమి చెట్ల వనముగల, చింతామణి గృహే = చింతామణులతో చేయబడిన గృహమందు, శివాకారే = శివునియొక్క ఆకారముగల, మఞ్చే = మంచమందు, పరమశివ, పర్యంక, నిలయామ్ = సదాశివుడను పఱుపు (సదా శివుని తొడ) నిలయముగాగల, చిదానందలహరీమ్ = జ్ఞానానందస్వరూపిణివైన, త్వాం = నిన్ను, కతిచన = కొందరు, ధన్యాః = ధన్యులు మాత్రమే, భజంతి = సేవించుచున్నారు. ఇందు శ్రీ చక్రమందలి బిందుస్థానమే చింతామణి గృహము . సుధాసింధువు సహస్రారము. అందలిబ్రహ్మ రంధ్రస్థానము చింతామణి గృహము. దేవి పండుకొనుమంచము శివాకారము. బ్రహ్మ విష్ణు రుద్రేశ్వరులు వానికి నాలుగుకోళ్ళు. ఈ శ్లోకమున లలితా సహస్రనామ స్తోత్రమునందలి అయిదారునామములు చొప్పింపబడినవి.

తా. అమృతసముద్రమునందలి కల్పవృక్షములచే చుట్టబడిన మణిద్వీపమునందు

కడిమి చెట్ల వనముతో కూడిన చింతామణి గృహమందు శివాకారమైన మంచమున సదాశివుని తొడయే (సదాశివుడనుపరుపే) నిలయముగా గల జ్ఞానానంద స్వరూపిడివైన నిన్ను ధన్యులైన కొందరుమాత్రమే భజింపజాలుదురు. లోహాదులందు, దారు పత్రాదులయందు దేవిని ఆవాహనము చేసి బాహ్యార్చనము చేయువారు కాని యోగమార్గముననుసరించి సహస్రారమందలి బైందవస్థానమున, జ్ఞానానంద స్వరూపిణియై యుండు దేవిని అంతర్యాగ ప్రక్రియచే ఆరాధించి ధన్యులగువారు అరుదుగా నుందురని భావము

శ్లో॥ మహీం మూలాధారే, కమపి మణిపూరే, హుతవహం
స్థితం స్వాధిష్ఠానే, హృది మరుత, మాకాశ ముపరి,
మనోఽపి భ్రూమధ్యే, సకలమపి భిత్వా కులపథం
సహస్రారే రమ్యే (పద్మే) సహ రహసి పత్యా విహరసే. 9

అ. మహీం = భూమిని, మూలాధారే = మూలాధారచక్రమందు, కమ్, అపి = నీటిని, మణిపూరే = మణిపూర చక్రమందు, స్వాధిష్ఠానే = స్వాధిష్ఠానచక్రమందు, స్థితం = ఉన్న, హుతవహం = అగ్నిని, హృది = హృదయమునందు (అనాహత చక్రమందు), మరుతమ్ = గాలిని, ఉపరి = దానికి పైని (విశుద్ధచక్రమందు), ఆకాశమ్ = ఆకాశమును, (భ్రూమధ్యే = కనుబొమల నడుమ, (ఆజ్ఞాచక్రమందు) , మనః అపి = మనస్సునుకూడ, ఈ విధముగా, సకలమ్, అపి = సమస్తమైన , కులపథం = కులమార్గమును (మూలాధారము నుండి ఆజ్ఞాచక్రమువరకును కల మార్గమునకు కులమార్గమని పేరు), భిత్వా = భేదించి, రమ్యే = సుందరమైన, సహస్రారే = సహస్రార చక్రమునందు, రహసి = ఏకాంత మందు , పత్యా , సహ = భర్తయగు సదాశివునితో, విహరసే = విహరింతువు.

ఆ. త్రిపురసుందరి బ్రహ్మాండమునావరించు మహాశక్తి సమష్టి రూపిణి. ఆమెయే పిండాండమందు వ్యష్టిరూపకుండలి శక్తిగా నుండును. మానవశరీరమున, మూలాధారము, మణిపూరము, స్వాధిష్ఠానము, అనాహతము, విశుద్ధము, ఆజ్ఞ అను ఆరు చక్రములు కలవు. ఇందు మూలాధారము పృథ్వీతత్త్వముతోడను, మణిపూరము జలతత్త్వముతోడను, స్వాధిష్ఠానము అగ్ని తత్త్వముతోడను, అనాహతము వాయుతత్త్వముతోడను, విశుద్ధము ఆకాశతత్త్వముతోడను, ఆజ్ఞ మనస్తత్త్వము తోడను కూడియుండును. యోగులు

కుండలినీశక్తిని మూలాధారాది చక్రములద్వారా పైకి ప్రసరింపచేసి సహస్రారమందలి పరాశక్తిని దర్శింతురు. కుండలిని, ఆయా చక్రములను చేర్చునప్పుడు వారా తత్త్వములను జయించి అద్భుతమైన శక్తిని పొందుదురు. నిజమునకు యోగులీశక్తులతో తృప్తిపడినచో యోగభ్రష్టులగుదురు. పరాశక్తిదర్శనమే వారికి పరమావధిగా నుండవలయును.

తా. దేవీ ! నీవు కుండలినీ శక్తి స్వరూపమున మూలాధారమందు భూమిని, మణిపూరమందు జలమును, స్వాధిష్ఠానమందు అగ్నిని, అనాహతమందు వాయువును, విశుద్ధమందు ఆకాశమును, కనుబొమలనడుమనున్న ఆజ్ఞాచక్రమందు మనసును, ఈవిధముగా కులమార్గమునంతను భేదించి సుందరమైన సహస్రార చక్రమున ఏకాంతమునందు పతియైన సాదాశివునితో విహరింతువు. ' సహస్రారే పద్మే ' అను పాఠమునందు సహస్రార పద్మమునందని అర్థముచెప్పవలెను.

అవ. తొమ్మిదవ శ్లోకమున కుండలినీ శక్తి మూలాధారమునుండి సహస్రారమును చేరుట చెప్పబడినది. ఈ శ్లోకమున మరల క్రిందకు దిగి స్వస్థానమైన మూలాధారమును చేరుట వివరింపబడుచున్నది.

శ్లో॥ సుధా ధారాసారై శ్చరణ యుగ లాంతర్విగలితైః
ప్రపంచం సించంతీ పునరపి రసామ్నాయ మహసః,
అవాప్య స్వాం భూమిం భుజగ నిభ మధ్యుష్ట వలయం
స్వమాత్మానం కృత్వా స్వపిషి కులకుండే కుహరిణి. 10

అ. ఓ దేవీ, నీవు, చరణ, యుగళ, అంతః, విగలితైః = పాదద్వంద్వము నడుమనుండి జారిన, సుధా, ధారా, ఆసారైః = అమృతపుధారల జడివానలచే, ప్రపంచం = 72, 000 నాడుల సముదాయమును, సించంతీ = తడుపుచున్నదానవై, పునః, అపి = మరల, రస ఆమ్నాయ, మహసః = చంద్రమండలముగా నెన్నబడు సహస్రారమందలి అమృతమైన ఆనందమునుండి, స్వాం, భూమిం = స్వీయమైన చోటును, అవాప్య = పొంది, స్వం, ఆత్మానం = నీ రూపమును, అధ్యుష్టవలయం = మూడున్నర చుట్లుకల, భుజగనిభం = పాముతో సమానమైన దానినిగా, కృత్వా = చేసి, కుహరిణి = రంధ్రముగల, కులకుండే = మూలాధారమునందు, స్వపిషి = నిద్రింతువు.

తా. ఓ దేవీ ! నీవు నీ చరణములరెంటి నడుమనుండి జారెడి అమృతపు ధారల జడివానచే డెబ్బది రెండువేల నాడులతోకూడిన పిండాండము నంతను తడుపుచున్నదానవై తిరిగి చంద్రమండలమని ఎన్నబడు సహస్రారమందలి అమృతమయమైన ఆనందమునుండి నీ స్థలమును పొంది నీరూపమును మూడు చుట్లుకల సర్పాకారముగ చేసి రంధ్రముగల మూలాధారమునందు నిద్రింతువు.

శో॥ చతుర్భిః శ్రీ కంఠైః శివ యువతిభిః పంచభిః రపి
ప్రభిన్నాభిః శంభోర్నవభిరపి మూలప్రకృతిభిః,
చతుశ్చత్వారింశ ద్వసుదళ కలాశ్ర త్రివలయ
త్రిరేఖాభిః సార్ధం తవ శరణకోణాః పరిణతాః. 11

అ. శ్రీ కంఠైః = శివునికి సంబంధించిన, చతుర్భిః = నాలుగు కోణములతోడను, శంభోః = శివుని వానికంటె, ప్రభిన్నాభిః = వేఱైన, శివ, యువతిభిః = శివునిభార్యయైన శక్తికి సంబంధించిన, పంచభిః, అపి = ఐదుకోణముల తోడనుకూడ, మూల, ప్రకృతిభిః = శ్రీ చక్రనిర్మాణమునకు మూలకారణములైన, నవభిః, అపి = తొమ్మిదింటితోడను, (ఇవే ప్రపంచనిర్మాణమునకు కారణములు, అందుచేతనే వీనిని యోనులందురు. పిండాండనిర్మాణమున కగు తొమ్మిది ధాతువులివి) వసుదళ, కలాశ్ర, త్రివలయ త్రిరేఖాభిః, సార్ధం = అష్టదళ పద్మము (వసువు లెనమండుగురు కావున వసుపదమష్ట సంఖ్యా వాచకము). షోడశదశ పద్మము, (చంద్రకళలు 16) మూడు వలయములు , మూడురేఖలు (భూపురము) అనువానితోకూడ, చతుః, చత్వారింశత్ = నలువది నాలుగు (త్రయః, చత్వారింశత్ అనుపాఠమునకు 43 అని అర్థము. అప్పుడు మధ్యనున్న బిందువులెక్కకురాదు), తవ = నీయొక్క, శరణ, కోణాః = నిలయమైన శ్రీచక్రము నందలి కోణములు, పరిణతాః = ఏర్పడినవి.

ఈ శ్లోకమును బట్టి 44 లేక 43 కోణములేవి అని తెలిసికొనుట కవకాశముకలుగదు. కావున ఈ క్రింది శ్లోకమును పరికింప వలయును

శ్లో. బిందు, త్రికోణ, వసుకోణ, దశారయుగ్మ మన్వస్రనాగదళ సంయుత షోడశారం.
వృత్తత్రయం చ ధరణీ సదనత్రయం చ శ్రీచక్రమేత దుదితం పరదేవతాయాః

బిందువు అదికల త్రికోణము 1. అష్టకోణములు 8, 10+10 రెండు

పదులకోణములు 20, 14 కోణములు (మనువులు పదునల్గురు) మొత్తము 44వాని చుట్టు అష్టదళ పద్మము, షోడశదళ పద్మము, మూడు వృత్తములు, మూడు రేఖలతో కూడిన భూపురము ఉండును.

తా. శివునికి సంబంధించిన నాల్గుకోణములతోడను తద్భిన్నములైన శక్తికి సంబంధించిన అయిదుకోణములతోడను, మూలకారణములైన తొమ్మిది కోణములతోడను, అష్టదళపద్మ షోడశదళపద్మ వృత్తత్రయ రేఖాత్రయముల తోడను కూడ మొత్తము 44 కోణములతో దేవీ ! నీకు నిలయమైన శ్రీచక్రరాజముయొక్క కోణములు ఏర్పడినవి.

శ్లో॥ త్వదీయం సౌందర్యం తుహనగిరికన్యే తులయితుం
కవీంద్రాః కల్పంతే కథమపి విరించి ప్రభృతయః
యదాలోకౌత్సుక్యా దమరలలనా యాన్తి మనసా
తపోభి ర్దుష్ప్రాపా మపి గిరిశ సాయుజ్య పదవీమ్. 12

అ. తుహినగిరికన్యే = హిమవత్పర్వతము కూతురవైన ఓ తల్లీ, త్వదీయం = నీకు సంబంధించిన, సౌందర్యం = అందమును, తులయితుం = పోల్చుటకు, విరించి, ప్రభృతయః = బ్రహ్మ మొదలైన, కవీంద్రాః = కవిపుంగవులు, కథమ్ = ఎట్లు, కల్పంతే, అపి = సమర్థులగుదురు, యత్, ఆలోక, ఔత్సుక్యాత్ = దేనినిచూచుటయందలి ఉత్కంఠవలన, అమరలలనాః = అప్సర స్త్రీలు, తపోభిః = తపస్సులచే, దుష్ప్రాపామ్ = పొందశక్యముకాని, గిరిశ, సాయుజ్య, పదవీమ్ = శివునితో సాయుజ్యముపొందుటయను పదవిని, మనసా = మనస్సుచే, యాన్తి = పొందుచున్నారు.

తా. ఓ హిమాచలనందినీ ! నీ చక్కదనమును పోల్చుటకు బ్రహ్మమొదలైన కవీంద్రులు కూడ ఎట్లు సమర్థులగుదురు ? ఏలయన దానిని చూచుట యందలి ఉత్కంఠ వలన అచ్చరలు కూడ తపస్సులచే పొందశక్యము కాని శివసాయుజ్యపదవిని మనసుచే పొందుచున్నారు.

శ్లో॥ నరం వర్షీయాంసం నయనవిరసం నర్మసు జడం
తవాపాంగా లోకే పతిత మనుధావంతి శతశః,
గలద్వేణీ బంధాః కుచకలశ విస్రస్తసిచయా
హరాత్మృట్యత్కాంచ్యో విగళిత దుకులా యువతయః. 13

అ. నయనవిరసం = చూచుటకు వికృతుడును, నర్మసు = ప్రణయ వాక్యము లందును, జడం = మందుడును, వర్షీయాంసం = ముసలివాడును అగు, నరం = మానవుని, తవ = నీయొక్క , అపాంగ +ఆలోకే = కడకంటి చూపునందు, పతితమ్ = పడినవానిని, గలత్, వేణీ, బంధాః = జారుచున్న జడముడులు కలిగినట్టియు, కుచ, కలశ, విస్రస్త, సిచయాః = కలశములవంటి స్తనములనుండి జారిన కొంగులుకలిగి నట్టియు, హఠాత్, తృట్యత్, కాంచ్యః = ఆకస్మికముగ తెగుచున్న ఒడ్డాణములు కలిగినట్టియు, విగళితదుకూలాః = జారిన కట్టిన పట్టు బట్టలు కలిగి నట్టియు,యువతయః = తరుణులు, శతశః = వందలకొలది, అనుధావంతి = వెంటాడుచున్నారు.

తా. ఓతల్లీ ! నీ కడగంటి చూపులందు పడిన మానవుని చూచుటకు వికృతుడైనవానినైనను, ప్రణయాలాపములందు మందుడైనను, ముసలివాడైనను జారుచున్న జడముడులు కలిగినట్టియు, కలశములవంటి స్తనములనుండి జారుచున్న పైటకొంగులు కలిగినట్టి ఆకస్మికముగ తెగుచున్న మొలనూళ్ళుకలిగినట్టియు, జారినపట్టు పట్టములు కలిగినట్టియు జవ్వనులు వందలకొలదిగా వెంటాడుదురు.

శ్లో॥ క్షితౌ షట్పంచాశద్ ద్విసమధిక పంచాశదుదకే
హుతాశే ద్వాషష్టి శ్చతురధిక పంచాశ దనిలే,
దివి ద్విః షట్త్రింశ న్మనసి చ చతుఃషష్టిరితి యే
మయూఖా స్తేషా మప్యుపరి తవ పాదాంబుజయుగమ్. 14

అ. దేవీ, క్షితౌ = భూతత్వముగల మూలాధారమునందు, షట్, పంచాశత్ = యాభైయారు కిరణములును, ఉదకే = జలతత్వముగల మణిపూర మందలి, ద్వి, సమధిక పంచాశత్ = ఏబదిరెండుకిరణములును, హుతాశే = అగ్నితత్వముగల స్వాధిష్ఠానమందు, ద్వాషష్టిః = అరువదిరెండు కిరణములును, అనిలే = వాయుతత్వముగల అనాహతమందు, చతుః, అధిక, పంచాశత్ = ఏబది నాల్గు కిరణములును, దివి = ఆకాశతత్వముగల విశుద్ధమందు, ద్విః, షట్, త్రింశత్ = డెబ్బదిరెండు కిరణములును (ముప్పదియారు × రెండు), మనసి = మనస్తత్వముగల ఆజ్ఞాచక్రమునందు, చతుః, షష్టిః = అరువదినాలుగు కిరణములును, ఇతి = అని, యే = ఏ, మయూఖాః = కిరణములున్నవో, తేషామ్, అపి = వానియొక్క కూడ, ఉపరి = మీద, అనగా సహస్రారచక్రమునందు, తవ = నీ యొక్క, పాద, అంబుజ, యుగమ్ = పద్మములవంటి

పాదములయొక్క జంట (కలదు).

తా. తల్లీ ! పద్మములవంటి నీపాదముల జంట భూతత్త్వముగలమూలా ధారచక్రమునందలి యాబదిఆరును, జలతత్త్వముగల మణిపూరమునందలి యాబదిరెండును, అగ్నితత్త్వముగల స్వాధిష్ఠానమునందలి అరువదిరెండును, వాయుతత్త్వముగల అనాహతచక్రమునందలి యాబదినాల్గును, ఆకాశతత్త్వము గల విశుద్ధచక్రమునందలి డెబ్బదిరెండును, మనస్తత్త్వముగల ఆజ్ఞాచక్రము నందలి అరువదినాల్గును అను మొత్తము మూడువందల అరువది కిరణముల పైని కూడ, అనగా సహస్రారచక్రమునందు వెలయుచున్నది.

శ్లో॥ శరజ్జ్యోత్స్నా శుభ్రాం శశియుత జటాజూటమకుటాం
వరత్రాసత్రాణ స్ఫటిక ఘుటికా పుస్తక కరాం,
సకృ న్న త్వా నత్వా కథమివ సతాం సన్నిదధతే
మధుక్షీర ద్రాక్షా మధురిమ ధురీణాః ఫణితయః. 15

అ. శరత్ + జ్యోత్స్నా, శుభ్రాం = శరత్కాలమందలి చంద్రునివెన్నెల వలె తెల్లదానవు, శశియుత, జటాజూట మకుటాం = చంద్రునితోకూడిన జటాజూటమే కిరీటముగ కలిగినట్టియు, వర, త్రాసత్రాణ, స్ఫటికఘటికా, పుస్తకకరాం = వరముద్ర, అభయముద్ర, స్ఫటికాక్షమాల, పుస్తకము నాలుగుచేతులయందు కలిగినట్టియు, త్వా = నిన్ను, సకృత్ = ఒకమారు అయిన, న, నత్వా = మ్రొక్క కుండ, సతాం = పండితులకు, మధుక్షీరద్రాక్షా, మధురిమధురీణాః = తేనె, పాలు, ద్రాక్షరసము అనువానితీయదనము వహించు, ఫణితయః = వాక్ భంగులు, కథమ్, ఇవ = ఎట్లుగా, సన్నిదధతే = అలవడును.

తా. శరత్కాలమునందలి వెన్నెలవలె తెల్లనిదానవు. చంద్రునితో కూడిన జటాజూటము కిరీటముగా కలిగినట్టియు, వరముద్ర, అభయముద్ర, స్ఫటికాక్షమాల, పుస్తకము చేతులందు కలిగినట్టియు నిన్నొక్కమారైనను మ్రొక్కకుండ పండితులకు తేనె, పాలు, ద్రాక్షరసము అనువాని తీయదనముతో నిండిన వాక్ భంగులు ఎట్లు లభించును? లభింపవని భావము.

శ్లో॥ కవీంద్రాణాం చేతః కమల వన బాలాతపరుచిం
భజంతే యే సంతః కతిచి దరుణామేవ భవతీమ్,

విరించి ప్రేయస్యాస్తరుణ తర శృంగార లహరీ
గభీరాభి ర్వాగ్భిర్విదధతి సతాం రంజన మమీ. 16

అ. యే, సంతః, కతిచిత్ = ఏ కొందరు పండితులు, కవీంద్రాణాం = కవిపుంగవులయొక్క, చేతః, కమల, వన, బాల, ఆతప, రుచిం = చిత్తములనెడి పద్మవనములకు లేతసూర్యుని కాంతివంటి కాంతిగల, అరుణామ్, ఏవ = ఎఱ్ఱని వర్ణముకల, భవతీమ్ = నిన్ను, భజంతే = సేవింతురో, కొలుతురో, అమీ = అట్టివీరు, విరించి, ప్రేయస్యాః = బ్రహ్మదేవుని ప్రియురాలైన సరస్వతి యొక్క, తరుణతర, శృంగార, లహరీ, గభీరాభిః = మిక్కిలి మృదువైన శృంగారరసప్రవాహములచే గంభీరములైన, వాగ్భిః = వాక్కులతో, సతాం = పండితులయొక్క, రంజనమ్ = రంజించుటను, విదధతి = చేయుదురు.

తా. ఏకొందరు పండితులు కవీంద్రుల హృదయ పద్మవనములకు లేత సూర్యునివంటికాంతికల నిన్ను అరుణవర్ణము కలదానిగనే కొలుతురో వారు బ్రహ్మప్రియురాలైన సరస్వతియొక్క మిక్కిలి మృదువైన శృంగారరసప్రవాహములచే గంభీరములైన, వాక్కులతో పండితులకు మనోరంజనముచేయుదురు.

శ్లో॥ సవిత్రీభి ర్వాచాం శశిమణి శిలాభంగ రుచిభి
ర్వశిన్యాద్యాభిస్త్వాం సహ జనని సంచింతయతి యః,
స కర్తా కావ్యానాం భవతి మహతాం భంగిసుభగై
ర్వచోభి ర్వాగ్దేవీ వదన కమలామోద మధురైః. 17

అ. జనని = ఓతల్లీ, యః = ఎవరు, వాచాం = వాక్కులకు, సవిత్రీభిః = జనులైనట్టియు, శశిమణి, శిలాభంగ, రుచిభిః = చంద్రకాంతిమణిఖండము యొక్క కాంతివంటి కాంతిగల, వశినీ, ఆద్యాభిః సహ = వశిని, కామేశ్వరి మొదలగు దేవతలతో కూడ, త్వాం = నిన్ను, సంచింతయతి = ధ్యానముచేయునో, సః = అతడు, భంగి, సుభగైః = రీతిమనోహరములైన, వాగ్దేవీ, వదన, కమల, ఆమోద మధురైః = సరస్వతియొక్క వదనపద్మముయొక్క సువాసనచే తీయనివైన, వచోభిః = వాక్కులతో, మహతాం = గొప్ప, కావ్యానాం = కావ్యములకు, కర్తా = చేయువాడు, భవతి = అగును.

తా. తల్లీ! వాక్కులకు జననులై నట్టియు, చంద్రకాంతమణిశిలా ఖండకాంతివంటి

కాంతి కలిగినట్టియు, వశినీమొదలైన దేవతలతో గూడ నిన్నెవడు ధ్యానించునో అతడు రీతి సుందరము లైనట్టియు, సరస్వతీదేవీముఖపద్మవాసనలచే మధురములైనట్టియు వాక్కులతో గొప్పకావ్యములకు కర్తయగును.

ఈ శ్లోకము సారస్వత ప్రయోగము

శ్లో॥ తనుచ్ఛాయాభిస్తే తరుణతరణి శ్రీసరణిభి
ర్దివం సర్వా ముర్వీ మరుణిమ నిమగ్నాం స్మరతి యః,
భవం త్యస్య త్రస్య ద్వనహరిణ శాలీన నయనాః
సహోర్వశ్యా వశ్యాః కతి కతి న గీర్వాణ గణికాః. 18

అ. యః = ఎవరు, తే = నీయొక్క, తరుణ, తరణిశ్రీసరణిభిః = లేత సూర్యునియొక్క కాంతిసంపదయొక్క వైఖరిగల, తనుచ్ఛాయాభిః = శరీరముయొక్క కాంతులచే, దివం = స్వర్గమును, సర్వామ్, ఉర్వీమ్ = సర్వభూమిని, అరుణిమ, నిమగ్నామ్ = ఎఱ్ఱదనమునందు మునిగిన దానినిగా, స్మరతి = స్మరించునో, అస్య = అతనికి, త్రస్యత్, వన, హరిణ, శాలీన, నయనాః = భయపడుచున్న అడవియందలి లేడియొక్క కనులతో సమానమైన కనులుగల, గీర్వాణగణికాః = అప్సరసలు, కతి కతి = ఎందరెందరో, ఊర్వశ్యా సహ = ఊర్వశితో కూడ, వశ్యాః = వశమైనవారు, న భవంతి = కాకుందురు, అగుదురని భావము.

తా. లేతసూర్యుని శోభవంటి శోభకల నీ శరీరముయొక్క కాంతులచే స్వర్గమును, భూమిని సర్వమును ఎఱ్ఱదనముతో కూడిన దానినిగా నెవడు స్మరించునో అతనికి భయపడుచున్న అడవి లేళ్ళవంటి నేత్రములుగల అప్సర లెంతెంతమంది ఊర్వశితో కూడ వశమైన వారు కాకుందురు.

శ్లో॥ ముఖం బిందుం కృత్వా కుచయుగ మధస్తస్య తదధో
హరార్ధం ధ్యాయేద్యో హరమహిషి తే మన్మథ కలామ్,
స సద్యః సంక్షోభం నయతి వనితా ఇత్యతిలఘు
త్రిలోకీ మప్యాశు భ్రమయతి రవీందుస్తన యుగామ్. 19

అ. హరమహిషి = శివునిపట్టమహిషివైన ఓదేవీ, యః = ఎవరు, ముఖం = ముఖమును, బిందుం = బిందువుగ, కృత్వా = చేసి, తస్య అధః = దాని క్రింద,

కుచయుగం = స్తనములజంటను, తత్, అధః = ఆ క్రిందిభాగమును, హర, అర్ధం = హరార్ధముగను (త్రికోణముగను) కృత్వా = చేసి, తే = నీయొక్క, మన్మథకలామ్ = కామకళను, ధ్యాయేత్ = ధ్యానముచేయునో, సః = అతడు, వనితాః = స్త్రీలను, సద్యః, సంక్షోభం = వెంటనే కలతను, నయతి = పొందించును, ఇతి = అనునది, అతిలఘు = మిక్కిలిఅల్పము, రవి, ఇందు, స్తన, యుగామ్ = సూర్యచంద్రులనెడిస్తనముల జంటగల, త్రిలోకీమ్, అపి = మూడు లోకములను కూడ, ఆశు = శీఘ్రముగ, భ్రమయతి = భ్రమింపచేయును.

దేవనాగరి లిపి యందలి 'క్లీం' అనుదానిలో బిందువును ముఖముగను, దానిక్రింద కకారమునకు అటు ఇటునున్న గుర్తులను, చిహ్నములను, స్తనయుగముగాను, దానిక్రిందనున్న భాగమును హరార్ధముగాను (హకారముయొక్క క్రిందిభాగము ఏ కారమువలె నుండి త్రికోణాకృతిలో నుండును. హరార్ధమనగా పార్వతి, శివ, ఇందలి శ్‌వ్ అను అక్షరములను తొలగించినపుడు ఇ+ అ = ఏ ఇదే త్రికోణము) మిగులును. ఈ కామకళను ఎవడు ధ్యానించునో అతడు స్త్రీలను వెంటనే కలత నొందించుననుట అత్యల్పమైనకార్యము. అతడు సూర్యచంద్రులు స్తనయుగముగా గల త్రిలోకినే (మూడులోకముల సమూహమునే) శీఘ్రముగ భ్రమింపజేయును.

తా. బిందువును ముఖముగాను, దాని క్రిందనున్న కకార భాగములను కుచయుగముగాను, దాని క్రింది భాగము హరార్ధముగాను చేసి ఓ శివుని పట్టమహిషీ నీ కామకళను ఎవడు ధ్యానము చేయునో అతడు వెంటనే స్త్రీలను కలత పొందించుననుట మిక్కిలి స్వల్ప విషయము. అతడు రవిచంద్రులు స్తనయుగముగా గల త్రిలోకీవనితను కూడ శీఘ్రముగ భ్రమింపచేయును, మోహపెట్టును.

శ్లో॥ కిరంతీ మంగేభ్యః కిరణ నికురుంబామృత రసం
హ్యాది త్వా మాధత్తే హిమకర శిలామూర్తి మివ యః,
స సర్పాణాం దర్పం శమయతి శకుంతాధిప ఇవ
జ్వర ప్లుష్టాన్ దృష్ట్యా సుఖయతి సుధా ధారసిరయా. 20

అ. యః = ఎవడు, అంగేభ్యః = అవయవములనుండి, కిరణ, నికురుంబ, అమృత, రసం = కిరణములయొక్క సముదాయమునందలి అమృతరసమును, కిరంతీమ్

= వెదజల్లుచున్న, హిమకర, శిలామూర్తిమ్, ఇవ = చంద్రకాంత శిలతో చేయబడినమూర్తినివలె, త్వామ్ = నిన్ను, హృది = హృదయమునందు, ఆధత్తే = భావించునో, సః = అతడు, శకుంత, అధిపః, ఇవ = పక్షులకు రాజైన గరుత్మంతునివలె, సర్పాణాం = పాములయొక్క, దర్పం = దర్పమును, శమయతి = శమింపచేయును, జ్వర, ప్లుష్టాన్ = జ్వరముచేత తప్తులైనవారిని, సుధా, ఆధార, సిరయా = అమృతమునకు ఆధారమైన నాడులుగల, దృష్ట్యా = చూపుచే, సుఖయతి = సుఖింపజేయును. అలం. ఉపమ.

తా. ఇందు సర్పవిషమును, జ్వరమును హరించు ప్రయోగము సూచింపబడినది. ఎవడు అవయవములనుండి కిరణసముదాయమునందలి అమృతరసమును వెదచల్లు నిన్ను చంద్రకాంతశిలామూర్తివలె హృదయమునందు ధ్యానము చేయునో, అతడు గరుత్మంతునివలె సర్పముల మదమడంచును. జ్వరము వేడిచే బాధపడువారిని అమృతమయమునైన నాడులుగల చూపుచే సుఖింపజేయును.

శ్లో॥ తటిల్లేఖాతన్వీం .తపనశశివైశ్వానరమయీం
నిషణ్ణాం షణ్ణా మప్యుపరి కమలానాం తవ కలామ్,
మహాపద్మాటవ్యాం మృదితమలమాయేన మనసా
మహాన్తః పశ్యంతో దధతి పరమాహ్లాదలహరీమ్. 21

అ. తటిత్+లేఖా తన్వీం = మెరుపుతీగవలె సూక్ష్మమైన, తపన, శశి, వైశ్వానర, మయీం = సూర్యుడు, చంద్రుడు, అగ్ని అనువారితో కూడినట్టిదియు, షణ్ణామ్ = ఆరయిన, కమలానాం అపి = పద్మములయొక్క (చక్రములయొక్క) కూడ, ఉపరి = పైభాగమున, మహా, పద్మ, అటవ్యాం = గొప్పపద్మముల అడవి వంటిదైన సహస్రారచక్రమునందు, నిషణ్ణాం = కూర్చున్న (ఉన్న), తవ = నీయొక్క, కలామ్ = కళను, మృదిత, మల మాయేన = తొలగింపబడిన పాపమును, కపటమునుకల, మనసా = మనస్సుతో, పశ్యంతః = చూచుచున్నవారై, మహాన్తః = గొప్పవారైన యోగులు, పరమ, ఆహ్లాద, లహరీమ్ = ఉత్కృష్టమైన, ఆనందప్రవాహమును, దధతి = ధరింతురు, అనగా ఆనందప్రవాహమున ఓలలాడుదురు.

తా. ఓదేవీ! మెరుపు తీగవలె సూక్ష్మమైనట్టిదియు, సూర్య చంద్రాగ్ని మయమైనట్టిదియు, శరీరమునందలిమూలాధారాదిషట్చక్రములకు కూడ పైన ఉన్న సహస్రార పద్మమునందు ప్రకాశించునీకళను, పాపముకాని కపటముకాని లేని మనసుతో చూచుచు మహానుభావులైన యోగులు బ్రహ్మానంద ప్రవాహమున నోలలాడుదురు.

శ్లో॥ భవాని త్వం దాసే మయి వితర దృష్టిం సకరుణా
మితి స్తోతుం వాంఛ న్కథయతి భవాని త్వమితి యః,
తదైవ త్వం తస్మై దిశసి నిజసాయుజ్య పదవీం
ముకుంద బ్రహ్మేంద్రస్ఫుట మకుట నీరాజితపదామ్. 22

అ. యః = ఎవడు, భవాని = భవునిభార్యవైన ఓపార్వతీ! త్వం = నీవు, దాసే = దాసుడనైన, మయి = నాయందు, సకరుణామ్ = దయతో కూడిన, దృష్టిం = చూపును, వితర = ప్రసరింపజేయుము, ఇతి = అని, స్తోతుం = స్తుతించుటకు, వాంఛన్ = కోరుచు, భవాని, త్వమ్ ఇతి = ఓ పార్వతీ, నీవు అని (భవాని అనునది భూధాతువుయొక్క లోట్. ఉత్తమ పురుషైక వచనము. అప్పుడు భవానిత్వమ్ అనగా నేను నీవగుదునుగాక అనునర్థము వచ్చును. అద్వైతసారాంశమైన జీవబ్రహ్మైక్యమిదియే), కథయతి = పల్కునో, తస్మై = అతనికొరకు, తదా + ఏవ = అప్పుడే, తత్క్షణమందే, త్వం = నీవు, ముకుంద, బ్రహ్మ+ఇంద్ర, స్ఫుట, మకుట, నీరాజిత, పదామ్ = విష్ణువు, బ్రహ్మ, ఇంద్రుడు అనువారియొక్క ప్రకాశించు కిరీటములచే నీరాజనము చేయబడిన పదములుగల, నిజసాయుజ్యపదవీం = నీయొక్క సాయుజ్యమనెడి (నీతో నైక్యమగుట అనెడి) పదవిని దిశసి = ఇత్తువు.

తా. భవుని భార్యవైన ఓ పార్వతీ! ఎవడు దాసుడనైన నాయందు నీవు దయతోగూడిన చూపును ప్రసరింపజేయుమని స్తోత్రముచేయుటకు కోరుచు "భవాని త్వం" = (నేను నీ వగుదును గాక) అను రెండు పదములను పల్కునో వానికి నీవు తత్క్షణమందే విష్ణువు, బ్రహ్మ, ఇంద్రుడు అనువారి ప్రకాశమానములగు రత్నకిరీటములచే హారతి ఈయబడిన పదములుగల నీ సాయుజ్యపదవి నిచ్చెదవు. ఇందు దేవి దయావిశేషము వర్ణింపబడినది. దానుని వాక్యము పూర్తికాకుండగనే అతని అభిప్రాయమును గ్రహించి ఆమె అతనికి సాయుజ్యమొసంగును. అని భావము.

శ్లో॥ త్వయా హృత్వా వామం వపు రపరితృప్తేన మనసా
శరీరార్ధం శంభో రపరమపి శంకే హృత మభూత్,
యదేతత్త్వద్రూపం సకల మరుణాభం త్రినయనం
కుచాభ్యా మానమ్రం కుటిలశశి చూడాల మకుటమ్. 23

అ. ఓదేవీ! యత్ = ఏకారణముచేత, ఏతత్, త్వత్, రూపం = ఈ నీరూపము,

సకలమ్ = సమస్తమును, అరుణాభం = ఎఱ్ఱని కాంతిగలదియు, త్రినయనం = మూడు కన్నులు కలదియు, కుచాభ్యామ్ = స్తనయుగముచే, ఆనమ్రం = వంగినదియు, కుటిల, శశి, చూడాల, మకుటమ్ = వంకరయైన చంద్రుడు శేఖరముగా కల కిరీటము కలదియు అగుచున్నదో, (తత్ = ఆ కారణముచే), త్వయా = నీచేత, వామం, వపుః = శివునియొక్క ఎడమ మేనిభాగము, హృత్వా = హరించి, అపరితృప్తేన = తృప్తిపొందని, మనసా= మనసుచే, శంభోః = శివునియొక్క , అపరమ్ = రెండవదైన, శరీర, అర్ధం+అపి = దేహము యొక్క సగముభాగము కూడ, అనగా కుడిభాగముకూడ, హృతమ్ = హరింపబడినది, అభూత్ = అయ్యెను అని, శంకే = తలంచుచున్నాను.

తా. ఓ పార్వతీ! ఏ కారణముచేత నీ యీ రూపమంతయును ఎఱ్ఱనికాంతి కలదియు, మూడునేత్రములు కలదియు, కుచయుగముచే వంగినదియు, వంకరచంద్రుడు శిరోలంకారముగాగల కిరీటము కలదియు అగుచున్నదో అందుచే నీచే శివుని ఎడమమేని నగము హరించి తృప్తిపొందని మననుచే రెండవదైన కుడి నగముకూడ హరింపబడినదయ్యెనని శంకింతును.

(ఉత్తర కౌళ మతమునకు చెందిన శాక్తేయులు శివతత్త్వము, శక్తితత్త్వమునందు కలసిపోవును కావున శక్తి తత్త్వముకంటె భిన్నముగ శివతత్త్వము వేఱే లేదనియు అదే భక్తులచే ఉపాసింపదగినదనియు చెప్పుదురు).

శ్లో। **జగత్సూతే ధాతా హరి రవతి రుద్రః క్షపయతే**
తిరస్కుర్వన్నేతత్ స్వమపి వపురీశస్తిరయతి,
సదా పూర్వః సర్వం తదిద మనుగృహ్ణాతి చ శివ
స్తవాజ్ఞా మాలంబ్య క్షణ చలితయో ర్భ్రూలతికయోః. 24

అ. ధాతా = బ్రహ్మ, జగత్ = ప్రపంచమును, సూతే = సృష్టించుచున్నాడు. హరిః = విష్ణువు, అవతి = రక్షించుచున్నాడు. రుద్రః = రుద్రుడు, క్షపయతే = లయముచేయుచున్నాడు, ఏతత్ = ఈ మూడింటిని, తిరస్కుర్వన్ = తిరస్కరించుచు, ఈశః = ఈశుడు, స్వమ్, అపి, వపుః = తన శరీరమునుకూడ, తిరయతి = లయమొందించుచున్నాడు, అప్పుడు, సదా పూర్వః, శివః = సదాశబ్దము పూర్వమందుగల శివుడు. అనగా పరమశివుడు, క్షణచలితయోః = క్షణకాలము చలించిన, భ్రూలతికయోః = లతలవంటి కనుబొమలయొక్క, ఆజ్ఞామ్ = ఆజ్ఞను, ఆలంబ్య= అవలంబించి, పొంది,

అనుగృహ్ణాతి = అనుగ్రహించుచున్నాడు, మరల సృష్టిజేయుచున్నాడని అర్థము.

తా. బ్రహ్మ జగత్తును సృష్టించును, విష్ణువు రక్షించును, రుద్రుడు లయముచేయును. ఈ మూడింటిని తిరస్కరించి తనశరీరమును కూడ మాటుపడజేయును. అప్పుడు క్షణకాలము చలించిన లతలవంటి నీ కనుబొమలయొక్క ఆజ్ఞను గ్రహించి (నీ కనుసైగలనే ఆజ్ఞగా గ్రహించి) సదాశివుడు ఆయీ సకల జగమును అనుగ్రహించుచున్నాడు. అనగా మరల సృష్టించుచున్నాడు. సదాశివుడు సర్వతత్త్వములను బీజరూపముగ తనలో లీనము చేసికొని సర్వసాక్షియై యుండుననియు దేవి కీయైదుగురును ఆజ్ఞానువర్తులనియు భావము. దేవి పంచకృత్యపరాయణ. బ్రహ్మాదుల కృత్యములన్నియు ఆమె కృత్యములే.

శ్లో॥ త్రయాణాం దేవానాం త్రిగుణ జనితానాం తవ శివే
భవేత్పూజా పూజా తవ చరణయో ర్యా విరచితా,
తథాహి త్వత్పాదోద్వహన మణిపీఠస్య నికటే
స్థితా హ్యేతే శశ్వన్ముకులిత కరోత్తంసమకుటాః. 25

అ. శివే = దేవీ, తవ చరణయోః = నీపాదయుగమునందు, యా, పూజా = ఏపూజ, విరచితా = చేయబడినదో అది, తవ = నీయొక్క, త్రిగుణజనితానాం = సత్త్వ, రజః తమము లనుగుణములవలన పుట్టిన, త్రయాణాం, దేవానాం = ముగ్గురు దేవలతయొక్క త్రిమూర్తులయొక్క, పూజా = పూజ, భవేత్ = అగుచున్నది. తథా = అది సత్యము. హి = ఎందుచేతనన, ఏతే = ఈ ముగ్గురును, త్వత్, పాద, ఉద్వహన, మణి, పీఠస్య = నీ పాదములనువహించు మణిమయ పీఠముయొక్క, నికటే = సమీపమందు, శశ్వత్ ముకులిత, కర, ఉత్తంస, మకుటాః = ఎప్పుడును మోడ్చిన (అంజలించిన) చేతులచే అలంకారముగాగల కిరీటములుకలవారై, స్థితాః = ఉందురు.

తా. దేవీ! నీ గుణములగు సత్త్వరజస్తమో గుణములవలన పుట్టిన త్రిమూర్తులైన బ్రహ్మవిష్ణుమహేశ్వరులు నీపాదములను వహించు మణిమయ మైన పీఠము సమీపమున దోయిలించిన చేతులే అలంకారముగాగల కిరీటములుగల వారై ఎప్పుడు నుందురు. కావున నీపాదములందు చేయబడిన పూజ వారిపూజయు నగుచున్నది. ఇది సత్యము.

శ్లో॥ విరించిః పంచత్వం వ్రజతి హరి రాప్నోతి విరతిం
వినాశం కీనాశో భజతి ధనదో యాతి నిధనం,

వితంద్రీ మాహేంద్రీ వితతి రపి సమ్మీలిత దృశా
మహాసంహారేఽస్మిన్ విహరతి సతి త్వత్పతి రసౌ. 26

అ. సతి = ఓ దేవీ! అస్మిన్ = ఈ, మహా సంహారే = ప్రళయమందు, విరించిః = బ్రహ్మ, పంచత్వం = మరణమును, వ్రజతి = పొందును, హరిః = విష్ణువు, విరతిం = మృతిని,ఆప్నోతి = పొందును, కీనాశః = యముడు, వినాశం = వినాశమును, భజతి = పొందును, ధనదః = కుబేరుడు, నిధనం = నాశమును, యాతి = పొందును, వితంద్రీ = అలసత్వములేని – కనులుమూయని, మాహేంద్ర, వితతిః, అపి = ఇంద్రులయొక్క సముదాయముకూడ, సమ్మీలితదృశా = మూయబడిన నేత్రములు కలది, భవతి = అగును, అసౌ, త్వత్పతిః = ఈ నీ భర్తయైన శివుడొక్కడే, విహరతి = ఆనందముతో విహరించును.

తా. సతీమతల్లీ ఓదేవీ! మహాప్రళయసమయమున బ్రహ్మ మరణము పొందును, విష్ణువు నాశనము పొందును. యముడు రూపరిపోవును. కుబేరుడు ధ్వంసము పొందును. అలసత్వమెరుగని (ఎపుడును కనులుమూయని) ఇంద్రుల యొక్క సముదాయముకూడ మూయబడిన కనులు కలిగినట్టిదగును. నీ పాతివ్రత్య మహిమవలన నీ భర్తయైన శివుడొక్కడే నాశనములేక ఆనందముతో విహరించును.

శ్లో॥ జపో జల్పః శిల్పం సకలమపి ముద్రా విరచనా
గతిః ప్రాదక్షిణ్య క్రమణ మశనాద్యాహుతి విధిః,
ప్రణామః సంవేశః సుఖమఖిల మాత్మార్పణ దృశా
సపర్యాపర్యాయస్తవ భవతు యన్మే విలసితమ్. 27

అ. దేవీ! ఆత్మ, అర్పణ, దృశా = బ్రహ్మార్పణదృష్టితో, నేనుచేయు, జల్పః= వాగుడు, జపః = మంత్రజపమును, సకలం, అపి, శిల్పం = సర్వమగు చిత్రలేఖనాది ముద్రలయొక్క ఆచరణమును, గతిః = తిరుగుట, ప్రాదక్షిణ్య, క్రమణం = ప్రదక్షిణముగా తిరుగుటయు (వలగొనుటయు), అశన, ఆది = తినుట మొదలైనది, ఆహుతి, విధిః= ఇష్టదేవతను గూర్చి హవిస్సు నర్పించుటయు, సుఖం = సుఖముగా, సంవేశః = దొర్లుట, ప్రణామః = నమస్కారమును, యత్, మే, విలసితం = ఈ విధముగా పైనిచెప్పబడిన ఏ యే నా చేష్టకలదో, అఖిలం = ఆ కార్యమంతయు, తే = నీయొక్క, సపర్యా, పర్యాయః = పూజాప్రకారమే, భవతు = అగుగాక.

తా. దేవీపలుకులెల్ల మాతృకా నిర్మాణములే కావున బ్రహ్మార్పణబుద్ధితో నే నొనర్చు వాగుడంతయు, జపమును, నేనుచేయు సర్వశిల్పరచనయు ముద్రాచరణమును, నా తిరుగుడంతయు నీవు సర్వాంతర్యామినివి కావున ప్రదక్షిణ చేయుటయు, నేను తినునదంతయు హవిస్సమర్పణమును, సుఖముగా దొర్లుట సాష్టాంగ నమస్కారమును ఈ విధముగా నా యే యే చేష్టకలదో ఆ కార్యసమూహమంతయు నీ పూజాప్రకారమే అగుగాక.

శ్లో॥ సుధా మప్యాస్వాద్య ప్రతిభయజరామృత్యు హరిణీం
విపద్యంతే విశ్వే విధిశతమఖాద్యా దివిషదః,
కరాలం యత్ క్ష్వేలం కబలితవతః కాలకలనా
న శంభో స్తన్మూలం తవ జనని తాటంకమహిమా. 28

అ. ప్రతిభయ జరామృత్యు, హరిణీం = భయమును, ముసలితనమును, మరణమును తొలగించునట్టి, సుధాం = అమృతమును, ఆస్వాద్య, అపి = త్రాగికూడ, విధి, శతమఖ ఆద్యాః = బ్రహ్మ, ఇంద్రుడు మొదలైన, దివిషదః = దేవతలు, విశ్వే = ఎల్లరును, విపద్యంతే = విపత్తును పొందుచున్నారు, కరాలం = భయంకరమైన, క్ష్వేలం = విషమును, కబలితవతః = కబళించిన, శంభోః = శివునికి, కాలకలనా = కాలగోచరత్వము, చావు, న = లేకపోవుట, యత్ = ఏదికలదో, జనని = తల్లీ. తత్, మూలం = దానికి కారణము, తవ = నీయొక్క , తాటంకమహిమా = చెవికమ్మలయొక్క మహిమయే, మాంగల్యలక్షణములైన నీకర్ణాభరణములే విషము త్రాగినను, శివుడు మరణించకుండుటకు కారణము.

తా. భయమును కలిగించు ముసలితనమును, మరణమును హరించు అమృతమును త్రాగికూడ, బ్రహ్మ ఇంద్రుడు మొదలగు దేవతలు ప్రపంచమున విపత్తు నొందుచున్నారు. భయంకరమైన విషము కబళించిన శివునికి, కాలధర్మము లేదనుట ఏదికలదో దానికి కారణ మా తల్లి మాంగల్యలక్షణమైన నీ చెవికమ్మల మహిమయే సుమా!.

శ్లో॥ కిరీటం వైరించం పరిహర పురః కైటభభిదః
కఠోరే కోటీరే స్ఖలసి జహి జంభారిమకుటం,
ప్రణమ్రే ష్వేతేషు ప్రసభ ముపయాతస్య భవనం
భవస్యాభ్యుత్థానే తవ పరిజనోక్తి ర్విజయతే. 29

అ. భవనం = గృహమునుగూర్చి, ప్రసభం = వేగముగ, ఉపయాతస్య = వచ్చిన, భవస్య = శివునియొక్క, అభ్యుత్థానే= ఎదుర్కొనుసమయమున, తవ = నీకు, ఏతేషు = బ్రహ్మ విష్ణువు మొదలైన వారు, ప్రణమ్రేషు = నమస్కరించుచుండగ, వైరించం = బ్రహ్మకుసంబంధించిన, కిరీటం = కిరీటమును, పరిహర = పరిహరింపుము, పురః = ముందు, కైటభ, భిదః = కైటభాసురునిసంహరించిన విష్ణువుయొక్క , కఠోరే, కోటీరే = కఠినమైన కిరీటమునందు, స్ఖలసి = తొట్రుపడుదువు, జంభారిమకుటం = ఇంద్రునియొక్క కిరీటమును, జహి = విడువుము, అను, పరిజన, ఉక్తిః = నీసేవకుల (చెలుల) పలుకు, విజయతే = ప్రకాశించుచున్నది.

తా. తల్లీ! గృహమును గూర్చి వేగముగా నరుదెంచిన శివుని నెదుర్కొనుటకై నీవెదురేగు సమయమున బ్రహ్మ, విష్ణువు, ఇంద్రుడు మొదలైనవారు నమస్కరించుచుండగ "అమ్మా! బ్రహ్మదేవుని కిరీటము పరిహరింపుము. ముందు కైటభాసుర సంహారియైన విష్ణువుయొక్క కఠినమైన కిరీటము కలదు. . తొట్రు పడుదువు సుమా! జాగ్రత్త. ఇంద్రుని యొక్క కిరీటమును పరిహరింపుము" అను నీ పరిజనులయొక్క పల్కులు ప్రకాశించును.

దేవికి బ్రహ్మ, విష్ణువు, ఇంద్రుడు మున్నగువారు సాష్టాంగ నమస్కారము చేయుదురని భావము.

శ్లో॥ స్వదేహోద్భూతాభిర్ఘృణిభి రణిమాద్యాభి రభితో
నిషేవ్యే నిత్యే త్వా మహమితి సదా భావయతి యః,
కిమాశ్చర్యం తస్య త్రిణయనసమృద్ధిం తృణయతో
మహా సంవర్తాగ్నిర్విరచయతి నీరాజన విధిమ్. 30

అ. స్వదేహ, ఉద్భూతాభిః = నీదేహమునుండి పుట్టిన, ఘృణిభిఃా కాంతులైన, అణిమ, ఆద్యాభిః = అణిమ, మహిమ, లఘిమ మొదలైన సిద్ధులచే, అభితః = అంతటను, నిషేవ్యే = సేవింపబడుదానా, నిత్యే = శాశ్వతురాలా, యః = ఎవడు, త్వాం = నిన్ను, అహం, ఇతి = నేనుఅని, సదా = ఎల్లప్పుడును, భావయతి = భావించునో, త్రిణయనసమృద్ధిం = ఈశ్వరుని యొక్క, ఐశ్వర్యమునుకూడ, తృణయతః = తృణమువలెచూచు, తస్య = అతనికి, మహా, సంవర్త అగ్నిః = మహాప్రళయాగ్ని కూడ, నీరాజనవిధిమ్ = హారతివిధానమును, విరచయతి = చేయును, కిమ్ + ఆశ్చర్యం = ఇందేమి ఆశ్చర్యముకలదు?

శ్రీచక్రమే దేవీ శరీరము. అందలి తొమ్మిది ఆవరణములందున్న దేవతలను దేవియొక్క శరీరకాంతులే. క్రమముగ భూపుర లేఖలు మూడింట అణిమాద్యష్ట సిద్ధులును, బ్రహ్మ మొదలైన అష్టమాతృకలును, సర్వసంక్షోభినీ మున్నగు దశముద్రా దేవతలును ఉందురు.

తా. దేవీ! నీ శరీరమునుండి పుట్టిన కాంతులైన అణిమ, లఘిమ మొదలైన సిద్ధులతో అంతటను సేవింపబడుచున్నదానా, శాశ్వతురాలా ! ఎవడు నిన్ను నేనే అని ఎల్లప్పుడును భావించునో ఈశ్వరునియొక్క ఐశ్వర్యమును కూడ గడ్డిపోచవలె చూచు అతనికి మహాప్రళయాగ్ని కూడ నీరాజన విధానము చేయుననుటలో ఆశ్చర్యమేమున్నది? లేదని భావము.

శ్లో॥ చతుష్షష్ట్యా తంత్రైః సకల మతి సంధాయ భువనం
స్థితస్తత్ తత్సిద్ధి ప్రసవ పరతంత్రైః పశుపతిః,
పునస్త్వన్నిర్బంధా దఖిల పురుషార్థైక ఘటనా
స్వతంత్రం తే తంత్రం క్షితితల మవాతీతరదిదమ్. 31

అ. చతుః, షష్ట్యా = అరువదినాలుగు, తంత్రైః = మహామాయాశంబరాది తంత్రములచే, సకలమ్, భువనం = సమస్తప్రపంచమును, అతిసంధాయ = మోసగించి, స్థితః = ఉన్న, పశుపతిః = శివుడు, పునః = తిరిగి, త్వత్, నిర్బంధాత్ = నీనిర్బంధమువలన, అఖిల, పురుషార్థ, ఏక, ఘటనాస్వతంత్రం = చతుర్విధ పురుషార్థములను ముఖ్యముగా నిచ్చుటయందు సమర్థమైన, తే = నీయొక్క , ఇదం = ఈ , తంత్రం = తంత్రమును (పంచదశాక్షరమంత్రమును) వామకేశ్వర తంత్రమని కొందరి అభిప్రాయము, క్షితితలం = భూతలమును గూర్చి, అవాతీతరత్ = అవతరింపచేసెను.

తా. దేవీ! ఆయా సిద్ధులనిచ్చుట యందు తత్పరములైన అరువది నాలుగు తంత్రములచే సర్వప్రపంచమును మోసగించియున్న శివుడు తిరిగి నీనిర్బంధము వలన చతుర్విధ పురుషార్థములను ఒసంగుటయందు సమర్థమైన యీ పంచదశాక్షరమంత్రమను తంత్రమును భూమి యందవతరింప జేసెను. శివుడు లోకమున 64 తంత్రములను కలిగింప క్షణికానందమును గూర్చు ఆ సిద్ధులను అనుభవించుచు జనులు వంచితులై

యుండగా దేవి శివుని నిర్బంధించి చతుర్విధపురుషార్థ సాధన సమగ్రమైన దేవీ తంత్రమును భూమి యందవతరింపజేసెను.

శ్లో॥ శివః శక్తిః కామః క్షితిరథ రవిః శీతకిరణః
స్మరో హంసః శక్రస్తదను చ పరా మార హరయః,
అమీ హృల్లేఖాభిస్తిసృభి రవసానేషు ఘటితా
భజంతే వర్ణాస్తే తవ జనని నామావయవతామ్. 32

అ. జనని = ఓతల్లీ, శివః = శివుడు (కకారము), శక్తిః = శక్తి (ఏకారము), కామః = మనస్సు (ఈకారము), క్షితిః = భూమి (లకారము), అథ = తరువాత, రవిః = సూర్యుడు (హకారము), శీతకిరణః = చల్లని కిరణములు కల చంద్రుడు (సకారము), స్మరః = మన్మథుడు (కకారము), హంసః = బ్రహ్మము (హకారము), శక్రః = ఇంద్రుడు (లకారము), తదను చ = అటుపిమ్మట, పరా, మార, హరయః = ఇతర శక్తులును, యముడును, హరియు (సకార, ककार లకారములును), అమీ = ఈ, వర్ణాః = అక్షరములు, తిసృభిః = మూడైన, హృల్లేఖాభిః = హ్రీంకారములచేత, అవసానేషు = మూడు చివరలయందును, ఘటితాః = కూర్పబడినవై, తవ = నీయొక్క, నామ, అవయవతామ్ = పేరునకు అంగములగుటను, భజంతే = పొందుచున్నవి.

తా. ఇందు శివాదులు ककరాదులకు చిహ్నములుగా చెప్పబడియున్నారు. ఇందు మొదటి నాలుగు అనగా క, ఏ, ఈ, లను ఒక తెగగాను, తరువాత అయిదింటిని అనగా హ, స, క, హ, ల అను వానిని రెండవతెగగాను, పిమ్మటి మూడింటిని అనగా స,క,ల అను వానిని మూడవ తెగగాను భావించి ఒక్కొక్క తెగచివర హ్రీం అని హృల్లేఖను చేర్చి ఉచ్చరించినచో పంచదశాక్షరీమంత్రము వచ్చును. దీనిని బట్టి పదునాఱవ యక్షరము లేదని భావింపరాదు. ఈ యొక్క అక్షరమును నాల్గవతెగ (చంద్రకళ) దీనిని యోగులును, పరిపక్వచిత్తులును మాత్రమే జపింపవలయును.

కొందఱు శివః అనునది హకారము, శక్తిః అనునది సకారమును సూచించు నందురు. మొదటిది కాది విద్య, రెండవది హాది విద్య.

శ్లో॥ స్మరం యోనిం లక్ష్మీం త్రితయ మిదమాదౌ తవ మనో
ర్నిధాయైకే నిత్యే నిరవధి మహాభోగరసికాః,
భజన్తి త్వాం చిన్తామణి గుణ నిబద్ధాక్ష వలయాః
శివాగ్నౌ జుహ్వంతః సురభిఘృతధారాహుతిశతైః. 33

అ. నిత్యే = శాశ్వతురాలవైన ఓ తల్లీ, తవ = నీయొక్క , మనోః = మంత్రమునకు, ఆదౌ = ఆరంభమున, స్మరం = కామరాజబీజమును, యోనిం = భువనేశ్వరీ బీజమును, లక్ష్మీం = శ్రీ బీజమును, నిధాయ = ఉంచి, నిరవధి , మహాభోగ రసికాః = అపారమైన గొప్ప అనుభవమునందు రసికులైన (రుచినెఱింగిన), ఏకే = కొందఱు (సమయాచార పరాయణులు) చిన్తామణి, గుణ, నిబద్ధ, అక్ష, వలయాః = చింతారత్నముల సరములచే కట్టబడిన జపమాలికలు కలవారై, శివాగ్నౌ = త్రికోణనిలయమగు సంస్కృతాగ్ని యందు (జాతకర్మము మొదలైన పదునారు సంస్కారములు చేయబడినది శివాగ్ని అనబడును), త్వాం = నిన్ను, సురభి, ఘృత, ధారా, ఆహుతి, శతైః = కామధేనువుయొక్క నేతిధారల ఆహుతుల వందలచే (అనేకాహుతులచే), జుహ్వంతః = వ్రేల్చుచున్నవారై, భజన్తి = భజింతురు.

తా. శాశ్వతురాలవైన ఓ జననీ, అపారమైన నిత్యానుభూతిని చవిచూచిన సమయాచారపరులు కొందరు నీమంత్రమునకు ముందు కామరాజు, భువనేశ్వరి, లక్ష్మి బీజములైన ఐం, హ్రీం, శ్రీం బీజాక్షరములను చేర్చి చింతామణుల సరములచే కట్టబడిన జపమాలికలు దాల్చి, కామధేనువుయొక్క నేతిధారల ఆహుతులు పెక్కింటిచే త్రికోణ నిలయమగు సంస్కృతాగ్నియందు నిన్నుంచి హోమము చేయుచు సేవింతురు.

శ్లో॥ శరీరం త్వం శంభోః శశి మిహిరవక్షోరుహయుగం
తవాత్మానం మన్యే భగవతి నవాత్మాన మనఘం,
అతః శేషః శేషీత్యయ ముభయ సాధారణతయా
స్థితః సంబంధో వాం సమరస పరానంద పరయోః. 34

అ. భగవతి = ఓదేవీ! త్వం = నీవు, శంభోః = ఆనందభైరవుడగు శివునకు, శశి, మిహిర, వక్షోరుహ, యుగం = సూర్యచంద్రులే స్తనములుగాగల, శరీరం = దేహమవు (అగుచున్నావు), తవ = నీయొక్క, ఆత్మానం = స్వరూపమును, అనఘం = పాపరహితమైన, నవ, ఆత్మానం = నవవ్యూహాత్మకమైన ఆనందభైరవుని ఆకారము కలదానినిగా, మన్యే =

తలచెదను. అతః = ఇందుచే; శేషః = అప్రధానమైనది, శేషీ = ప్రధానము, ఇతి = అనునట్టి, అయమ్ = ఈ, సంబంధః = శేష, శేషి, రూప సంబంధము, సమరస, పరానంద, పరయోః = సామరస్యముతో గూడిన ఆనందభైరవుడు, ఆనందభైరవి, అను ఆకారములు ప్రధానములుగా గల, వాం = మీకు, ఉభయసాధారణతయా = ఇద్దఱికినీ సమానముగా చెల్లునదిగా, స్థితః = ఉన్నది.

తా. తల్లీ, సూర్యచంద్రులు స్తనములుగాగల ఆనందభైరవీ రూపచిచ్ఛక్తి కళవైననీవు ఆనందభైరవుడైన శివునికి శరీరమగుదువు. పాపరహితమైన నీ స్వరూపమును నవవ్యూహాత్మకమైన ఆనందభైరవుని రూపముగా తలంతును. అందుచే అప్రధానము, ప్రధానము అను నీ శేష శేషి సంబంధము సామరస్యముతో కూడిన ఆనందభైరవుడు, ఆనందభైరవి అను సమానాకారములుగల మీ కిద్దఱికిని సాధారణమై చెల్లుచున్నది.

శ్లో॥ మనస్త్వం వ్యోమ త్వం మరుదసి మరుత్సారథి రసి
త్వమాపస్త్వం భూమి స్త్వయి పరిణతాయాం నహి పరం,
త్వమేవ స్వాత్మానం పరిణమయితుం విశ్వవపుషా
చిదానందాకారం శివ యువతి భావేన బిభృషే. 35

అ. శివయువతి = శివునియొక్క భార్యయైన దేవీ, త్వమ్ = నీవు, మనః = ఆజ్ఞాచక్రమునందలి మనస్తత్త్వమవు. అసి = అగుదువు, వ్యోమ = విశుద్ధ చక్రమందలి ఆకాశతత్త్వమవు, అసి = అగుదువు, మరుత్ = అనాహతచక్రమందలి వాయుతత్త్వమవు, అసి = అగుదువు, మరుత్సారథిః = స్వాధిష్ఠాన చక్రమందలి అగ్నితత్త్వమవు, అసి = అగుదువు, త్వం = నీవు, ఆపః = మణిపూరచక్రమందలి, జలతత్త్వమవు, అసి = అగుదువు; త్వం = నీవు, భూమిః = మూలాధార చక్రమందలి పృథ్వీతత్త్వమవు; అసి = అగుదువు, త్వయి = నీవు, పరిణతాయాం = ఈవిధముగా మనస్తత్త్వాది రూపములుగా పరిణామమును పొందినదానవగుచుండగా, పరం = ఇంతకన్న భిన్నమైనది, నహి = లేదు, త్వం, ఏవ = నీవే, స్వ ఆత్మానం = నీ స్వరూపమును, విశ్వవపుషా = జగత్తుయొక్క ఆకారముతో పరిణమయితుం = పరిణామమును పొందించుటకు, భావేన = చిత్తముతో, చిదానంద, ఆకారం = చిచ్ఛక్తియొక్కయు ఆనందభైరవునియొక్కయు రూపము; బిభృషే భరింతువు.

తా. శివునిభార్యయైన ఓ దేవీ ! ఆజ్ఞాచక్రమందలి మన స్తత్త్వమునువిశుద్ధి చక్రమందలి ఆకాశతత్త్వమును, అనాహత చక్రమందలి వాయుతత్త్వమును,

స్వాధిష్ఠానమందలి అగ్నితత్త్వమును, మణిపూరమందలి జలతత్త్వమును, మూలాధారమందలి భూతత్త్వమును నీవే. ఈ విధముగా నీవే ప్రపంచమున సర్వతత్త్వములుగా పరిణామమును పొందినదానవై యుండగా, నీకన్న భిన్నమైనదింకొకటి లేదు. నీవే నీరూపమును జగత్తుయొక్క ఆకారముతో పరిణామమును పొందించుటకొఅకు మనస్సుచే, చిచ్ఛక్తియొక్కయు, ఆనందభైరవుని యొక్కయు రూపమును భరించెదవు.

శ్లో॥ తవాజ్ఞా చక్రస్థం తపన శశికోటి ద్యుతిధరం
పరం శంభుం వందే పరిమిళిత పార్శ్వం పరచితా,
యమారాధ్య న్భక్త్యా రవి శశి శుచీనా మవిషయే
నిరాతఙ్కే లోకే నివసతి హి భాలోక భువనే. 36

అ. తల్లీ ! యం = ఎవనిని; భక్త్యా = భక్తితో; ఆరాధ్యన్ = ఆరాధించువాడు (భక్తుడు), రవి, శశి, శుచీనాం = సూర్యచంద్రాగ్నులకు, అవిషయే = గోచరము కాని, నిరాతంకే = తాపత్రయరహితమైన, (నిరాలోకే = దృగ్గోచరము కాని అని పాఠాంతరము) అలోకే = విజనమైన, భాలోక భువనే = వెన్నెలగల లోకమందు (సహస్రారమందు), నివసతి, హి = నివసించునో, అట్టి, తవ, ఆజ్ఞాచక్రస్థం = నీ ఆజ్ఞాచక్రమందున్న, తపన, శశి, కోటి, ద్యుతి, ధరం = కోటి సూర్యచంద్రుల కాంతిని ధరించు, పరచితా = పరాకార జ్ఞానరూపిణివైన నీ చేత, పరిమిళిత, పార్శ్వం = సంపృక్తమైన (కలసికొనిన) ఎడమప్రక్కగల, పరం = పరుడగు, ఉత్కృష్టుడగు, శంభుం = శివుని, వందే = నమస్కరింతును.

తా. తల్లీ ! ఏదేవుని భక్తితో ఆరాధించువాడు (భక్తుడు) సూర్యచంద్రాగ్నులకు గోచరముకానిదియు, తాపత్రయరహితమైనదియు, దృగ్గోచరము కానిదియు, నిజమైనదియు అగు వెన్నెలలోకమందు అనగా నహస్రారమందు నివసించునో, అట్టి నీ ఆజ్ఞాచక్రమందున్నట్టియు, సూర్యచంద్రాగ్నికాంతులవంటి కాంతిని ధరించునట్టియు, పరాకార జ్ఞానరూపిణివైన నీతోకూడిన ఎడమ ప్రక్క కల్గినట్టియు, సర్వోత్కృష్టుడైనట్టియు శివుని నమస్కరింతును. (భాలోకభవనే అని పాఠాంతరము సహస్రారము వెన్నెలతో నిండినది. అట్టి సహస్రారమనెడి భవనమందు అని చెప్పవలెను) ఆజ్ఞాచక్రమందు పరశంభు నాథుడును చిత్పరాంబయు ధ్యేయులు.

శ్లో॥ విశుద్ధౌ తే శుద్ధ స్ఫటిక విశదం వ్యోమజనకం
శివం సేవే దేవీ మపి శివసమానవ్యవసితాం,

యయోః కాంత్యా యాంత్యా శశికిరణ సారూప్యసరణిం
విధూతాంతర్ధ్వాంతా విలసతి చకోరీవ జగతీ. 37

అ. తల్లీ ! యయోః = ఏ శివాశివులయొక్క, శశి, కిరణ, సారూప్య, సరణిం = చంద్రునియొక్క కిరణముల సాదృశ్యపరిపాటిని, యాంత్యా = పొందుచున్న, కాంత్యా = కాంతిచే, విధూత, అంతః, ధ్వాంతా = ఎగురగొట్టబడిన లోపలి చీకటి (అజ్ఞానము) కలదై, జగతీ = జగత్తు, చకోరీ, ఇవ = ఆడు వెన్నెల పులుగువలె, విలసతి = ప్రకాశించునో (చకోరపక్షులు వెన్నెలను త్రాగి ఆనందముతో నుండును), తే = నీయొక్క, విశుద్ధౌ = నిర్మలమైన, విశుద్ధచక్రమందు, శుద్ధ, స్ఫటిక, విశదం = మాలిన్యములేని స్ఫటికమువలె, శుభ్రమైన, వ్యోమ, జనకం = ఆకాశతత్త్వమును జనింపజేయునట్టి, శివం = శివుని, శివ, సమాన, వ్యవసితాం = శివునితో సమానమైన యత్నముగల, దేవీం, అపి = దేవినికూడ, సేవే = సేవింతును.

తా. తల్లీ ! ఏ శివాశివులయొక్క చంద్రకిరణములతో పోలికను పొందుచున్న కాంతిచే తొలగింపబడిన లోపలి చీకటి (అజ్ఞానము) కలదై, జగత్తు చకోరపక్షివలె ఆనందమున ప్రకాశించుచున్నదో అట్టి నీ నిర్మలమైన విశుద్ధచక్రమందు మాలిన్యములేని స్ఫటికమువలె శుభ్రమైనట్టియు, ఆకాశతత్త్వమును జనింపజేయుచున్నట్టియు (విశుద్ధచక్ర మాకాశతత్త్వముతో కూడినది) శివుని, శివునితోసమానమైన ప్రయత్నముగల దేవిని సేవింతును. (విశుద్ధ చక్రమున వ్యోమేశ్వరుడును వ్యోమేశ్వరియు ధ్యేయులు).

శ్లో॥ సమున్మీలత్సంవిత్కమల మకరందైక రసికం
భజే హంస ద్వంద్వం కిమపి మహతాం మానసచరం,
యదాలాపా దష్టాదశ గుణిత విద్యా పరిణతి
ర్యదాదత్తే దోషాద్గుణ మఖిల మద్భ్యః పయ ఇవ. 38

అ. తల్లీ ! యత్, ఆలాపాత్ = ఏ హంసయుగళముయొక్క (మాట యనెడి) కూతవలన, అష్టాదశ, గుణిత, విద్యాపరిణతిః = పదునెనిమిదిచే లెక్కింపబడిన విద్యలయొక్క పరిణామము (కలుగునో) యత్ = ఏ హంసద్వంద్వము, అద్భ్యః = నీళ్ళ నుండి, పయ ఇవ = పాలనువలె, దోషాత్ = దోషమునుండి, అఖిలం, గుణం = సమస్త గుణమును,

ఆదత్తే= గ్రహించునో, సమున్మీలత్, సంవిత్ కమల, మకరంద, ఏక, రసికం = వికసించుచున్న జ్ఞానమను (అనాహతమను) పద్మమునందలి పూతేనెయందు ప్రధానముగా ఆసక్తికలిగియున్నట్టియు, మహతాం = మహానుభావులయిన యోగులయొక్క, మానస, చరం = మనస్సులందు సంచరించుచున్నట్టియు, (మనస్సనెడి మానస సరోవరమందు సంచరించుచున్నట్టియు) కిం, అపి = ఇట్టిదని, వర్ణింపరానట్టియు, హంస, ద్వంద్వం = హంస మిథునమును, భజే = సేవింతును.

వేదములు (4) శిక్ష, వ్యాకరణము, ఛందస్సు, నిరుక్తము, జ్యోతిషము, కల్పము అను వేదాంగములు (6) మీమాంస, న్యాయము, ధర్మశాస్త్రము, పురాణము, ఆయుర్వేదము, ధనుర్వేదము, గాంధర్వము, అర్థశాస్త్రము - ఇవి అష్టాదశవిద్యలు. అనాహతమున హంసేశ్వరీ హంసేశ్వరులు ధ్యేయులు.

తా. ఈ శ్లోకమున శివశక్తులు హంసమిథునముగా చెప్పబడియున్నారు. హంస పద్మమకరందమును గ్రోలును; మానససరోవరమున సంచరించును. నీటి నుండి పాలను వేఱుచేయును. ఏ హంసమిథునముయొక్క పల్కులనెడి కూతలవలన పదునెనిమిది విద్యలందును పరిణతత్వమబ్బునో, ఏ హంస మిథునము నీళ్ళనుండి పాలను వేఱుచేయునట్లు దోషమునుండి సమస్త గుణమును స్వీకరించునో, అట్టి వికసించుచున్న జ్ఞానమనెడి పద్మమునందలి మకరందమునందు ప్రధానముగా నాసక్తి కలిగియుండు నట్టియు, మహనీయులైన యోగుల మనస్సనెడి మానససరస్సున సంచరించునట్టియు, అనిర్వర్ణనీయమైనట్టియు హంసమిథునమును సేవింతును.

శ్లో।। తవ స్వాధిష్ఠానే హుతవహ మధిష్ఠాయ నిరతం
తమీడే సంవర్తం జనని మహతీం తాం చ సమయాం,
యదాలోకే లోకాన్ దహతి మహతి క్రోధకలితే
దయార్ద్రా యద్దృష్టిః శిశిర ముపచారం రచయతి. 39

అ. జనని = తల్లీ ! తవ = నీయొక్క, స్వాధిష్ఠానే = స్వాధిష్ఠాన చక్రమందు తం, సంవర్తం, హుతవహం = ఆప్రళయాగ్నిని, (రుద్రుని), అధిష్ఠాయ = ఆశ్రయించి, నిరతం = ఎల్లప్పుడును, ఈడే = స్తుతించెదను, మహతీం = మహతి అను పేరుగల, తాం, సమయాం, చ = అతనితో, అధిష్ఠాన, అవస్థాన అనుష్ఠానరూపములందు

సమానయగు ఆసమయాదేవిని (నిన్ను) కూడ, ఈడే = స్తుతింతును. క్రోధ, కలితే = కోపముతో కూడిన, మహతి = గొప్పదైన యత్, ఆలోకే = ఏరుద్రుని చూపు, లోకాన్ = లోకములను, దహతి = దహించుచుండగా, దయా, ఆర్ద్రా = దయతో తడిసిన (కూడిన), యత్, దృష్టిః = ఏ నీ దృష్టి , శిశిర = చల్లని, ఉపచారం = సేవను, రచయతి = చేయునో.

తా. స్వాధిష్ఠానమున సమయాంబాసంవర్తేశ్వరులు ధ్యేయులు. తల్లీ ! కోపముతో కూడిన గొప్పదైన యే సంవర్తాగ్ని రూపుదైన రుద్రునిదృష్టి లోకములను కాల్చుచుండ దయామయమైన సమయాంబారూపిణివైన యే నీ దృష్టి చల్లని ఉపచారమొనరించునో నీ స్వాధిష్ఠాన చక్రమం దా సంవర్తాగ్నిరూపుదైన ఆ రుద్రుని మహతి యను పేరుగల ఆ సమయాంబారూపిణివైన నిన్నును ఆశ్రయించి నిరంతరము స్తుతింతును.

శ్లో॥ తటిత్వంతం శక్త్యా తిమిర పరిపంథి స్ఫురణయా
స్ఫుర న్నానారత్నాభరణ పరిణద్ధేంద్ర ధనుషమ్,
తవ శ్యామం మేఘుం కమపి మణిపూరైక శరణం
నిషేవే వర్షన్తం హర మిహిర తప్తం త్రిభువనమ్. 40

అ. తల్లీ ! తవ = నీయొక్క, మణిపూర, ఏక, శరణం = మణిపూర చక్రమే ముఖ్యమైన నెలవుగాగల్లి నట్టియు, పరిపంథి, స్ఫురణయా = మణిపూర మందలి చీకటికి విరోధియగు కాంతిగల, శక్త్యా = శక్తిచే, తటిత్వంతం = మెఱుపు కలిగి నట్టియు, స్ఫురత్, నానా, రత్న, ఆభరణ, పరిణద్ధ ఇంద్రధనుషం = ప్రకాశించు పలువిధములైన రత్నమయములైన భూషణములచే కూర్పబడిన ఇంద్రధనుస్సుకల; హర, మిహిర, తప్తం = రుద్రుడను సూర్యునిచే తపింపచేయబడిన, త్రిభువనం = ముల్లోకములను, వర్షంతం = వర్షించితడువుచున్న (చల్లార్చుచున్న), శ్యామం = నల్లని, కం , అపి = ఇట్టిదట్టిదని చెప్పరాని, మేఘుం = మేఘమును, నిషేవే = సేవింతును.

మణిపూరచక్రమునందు మేఘేశ్వర సౌదామనులనెడి అమృతేశ్వరామృతేశ్వరులు ధ్యేయులు.

తా. ఇందు సదాశివుడు నీలమేఘమనియు, శక్తి మెఱుపనియు, స్వాధిష్ఠానాగ్ని హరుడనియు, అనాహతసూర్యుడు మిహిరుడనియు, నాడులే లోకములనియు,

కుండలినీకాంతులే ఇంద్రధనుస్సనియు, హరమిహిర దగ్ధమైన జగత్త్రయము ఆ నీలమేఘముచే తడుపబడి రక్షింపబడుచున్నదనియు చెప్పబడినది.

తల్లీ ! నీ మణిపూరచక్రమే ముఖ్యమైన నెలవుగా కల్గినట్టియు చీకటిని తొలగించుకాంతిగల శక్తిచే మెఱుపు కల్గినట్టియు, ప్రకాశించు పలురత్నముల భూషణములచే కూర్చబడిన ఇంద్రధనుస్సుగలిగినట్టియు, హరుడను సూర్యునిచే తపింపచేయబడిన ముల్లోకములను వర్షించి చల్లార్చునట్టియు, నల్లని అనిర్వర్ణనీయమైన సదాశివ మేఘమును సేవింతును.

శ్లో॥ తవాధారే మూలే సహ సమయయా లాస్యపరయా
నవాత్మానం మన్యే నవరస మహాతాండవ నటం,
ఉభాభ్యా మేతాభ్యా ముదయ విధి ముద్దిశ్య దయయా
సనాథాభ్యాం జజ్ఞే జనక జననీమజ్జగ దిదమ్. 41

అ. తల్లీ ! తవ = నీయొక్క, మూలే, ఆధారే = మూలాధార చక్రమందు, లాస్య, పరయా = (ఆడువారి నాట్యము లాస్యము) లాస్యమందాసక్తికల, సమయయా, సహ = సమయకళతోకూడ, నవరస, మహత్, తాండవ నటం = (మగవారి నాట్యము తాండవము) శృంగారాది నవరసములతో కూడిన తాండవ నాట్యము నొనరించు నటుని, నవ, ఆత్మానం = ఆనంద భైరవునిగా, మన్యే = తలంతును, ఉదయ, విధిం = అభ్యుదయ విధానమును (జగత్సృష్టి విధానమును), ఉద్దిశ్య = ఉద్దేశించి, దయయా = కరుణతో, సనాథాభ్యాం = కలసియున్న, ఏతాభ్యాం, ఉభాభ్యాం = ఈ మీ యిరువురిచేతనే, ఇదం, జగత్ = ఈ లోకము, జనక, జననీ, మత్ = తండ్రియు తల్లియు కలది, జజ్ఞే = అయినది.

మూలాధార చక్రమందు నటేశ్వరీ నటేశ్వరులు ధ్యేయులు. నవరస యుక్తమగు తాండవమే మహాతాండవము. అందాసక్తికలవాడు కావుననే శివుడు నవాత్ముడు, నటేశ్వరుడు.

తా. తల్లీ ! నీ మూలాధార చక్రమందు లాస్య నాట్యమందాసక్తి గల సమయ కళతో కూడ శృంగారాదులగు తొమ్మిది రసములతోకూడిన మహాతాండవమొనర్చు నటుని నవాత్మునిగా (నటేశ్వరుడైన ఆనంద భైరవునిగా) తలంతును. దగ్ధమైపోయిన జగత్తును మరల సృష్టించు విధానము నుద్దేశించి దయతో కలసియున్న యీ మీ యిరువురిచేతనే యీ జగత్తు తల్లిదండ్రులు కలది యైనది.

శ్లో॥ గతై ర్మాణిక్యత్వం గగన మణిభిః సాంద్రఘటితం
కిరీటం తే హైమం హిమగిరిసుతే కీర్తయతి యః,
స నీడేయచ్ఛాయాచ్ఛురణ శబలం చంద్రశకలం
ధనుః శౌనాసీరం కిమితి న నిబధ్నాతి ధిషణామ్. 42

అ. హిమగిరి, సుతే = హిమాచలనందినీ ! పార్వతీ ! యః = ఎవడు, మాణిక్యత్వం = మాణిక్యభావమును (మాణిక్యము లగుటను), గతైః = పొందిన, గగన, మణిభిః = సూర్యులచే, సాంద్ర, ఘటితం = దట్టముగా కూర్పబడిన, తే = నీయొక్క, హైమం = సువర్ణ వికారమైన, కిరీటం = కిరీటమును, కీర్తయతి = స్తుతించునో, సః = అతడు, నీడేయ, ఛాయా, ఛురణ, శబలం = కుదుళ్ళయందు బిగింపబడిన పలు రత్నముల కాంతుల ప్రసారముచే చిత్రవర్ణముగల, చంద్ర, శకలం = చంద్రఖండమును, శౌనాసీరం = ఇంద్రునికి సంబంధించిన, ధనుః = విల్లు, ఇతి = అని, ధిషణాం = బుద్ధిని, కిం, న, నిబధ్నాతి = ఎందుకు నిబంధింపడు (చేయడు) ? తప్పక చేయునని భావము.

ఆ. ఇచటనుండి సౌందర్యలహరి. మొదటి 41 శ్లోకములకు ఆనందలహరి అని వ్యవహారము. ఆచార్యులవారీ శ్లోకమునుండి దేవీ కిరీటముతో నారంభించి పాదనఖములవఱకును వర్ణనము కావించుచున్నారు.

ఓ హైమవతీ ! నవమణి భావమును పొందిన ద్వాదశ సూర్యులతో దట్టముగా కూర్పబడిన నీ బంగారు కిరీటము నెవడు వర్ణించునో, అతడు గుంటలు చేసి పొదిగిన పలు రత్నముల కాంతుల ప్రసారములచే చిత్రవర్ణములుగల చంద్రఖండమును ఇంద్ర ధనుస్సునుగా ఎందుకు భావన చేయకుండును ?

పండ్రెండుగురు సూర్యులు దేవీకిరీటమున మణులైయుందురు. అందు చంద్రఖండముకూడ నుండును. ఆ సూర్యుల కాంతుల ప్రతిఫలనముతోకూడిన చంద్రవంక వర్ణించువారి కింద్రధనుస్సును భావమును తప్పక కలిగించును.

శ్లో॥ ధునోతు ధ్వాంతం న స్తులితదలితేందీవరవనం
ఘనస్నిగ్ధం శ్లక్ష్ణం చికురనికురుంబం తవ శివే,
యదీయం సౌరభ్యం సహజ ముపలబ్ధుం సుమనసో
వసం త్యస్మి న్మన్యే బలమథన వాటీ విటపినామ్. 43

అ. శివే = పార్వతీ ! యదీయం = ఏ నీ కేశములకు సంబంధించిన, సహజం = ప్రకృతిసిద్ధమైన, సౌరభ్యం = పరిమళమును, ఉపలబ్ధుం = పొందుటకు, బలమథన, వాటీ విటపినాం = బలాసురుని సంహరించిన ఇంద్రుని నందనోద్యానమందలి కల్పవృక్షములయొక్క, సుమనసః = పువ్వులు, అస్మిన్ = ఈ నీ చికుర నికురుంబమునందు, వసంతి = ఉన్నవని, మన్యే = తలంతునో, తులిత, దళిత, ఇందీవర, వనం = పోల్చబడిన వికసించిన నల్లకలువల వనముకలదియు, ఘన, స్నిగ్ధం = వార్షిక మేఘమువలె నునుపైనదియు, శ్లక్ష్ణం = మృదువైనదియు, అగు, ఆ, తవ = నీయొక్క, చికుర నికురుంబం = కేశసముదాయము, నః = మా యొక్క, ధ్వాంతం = చీకటిని (అజ్ఞానమును) ధునోతు = పొగొట్టుగాక !

తా. సాధారణముగా కేశములకు సహజమైన సౌరభముండదు. కాని దేవి కేశపాశములకు సహజ పరిమళముండును. అది కల్పప్రసూనముల సువాసన కంటెకూడ మిన్నయైనది. అందుచే అవి ఆ సౌరభమును పొందుటకై దేవీ కేశములయందుండగోరును. "సింధుర గమనాధమ్మిల్లబంధంబు సహజ గంధమును" కథ శ్రీ కాళహస్తి మాహాత్మ్యమున నత్కీరుని వృత్తాంతమందున్నది. దేవి తన కేశములందలి కల్పప్రసూనముల నుంచుకొనుటకు ఆచార్యులవా రిట్లుత్ప్రేక్షించియున్నారు.

ఓ పార్వతీ ! వికసించిన నల్లకలువల వనమును పోలినదియు, వర్షాకాల మేఘమువలె నునుపైనదియు, సుకుమారమైనదియు అగు నీ కేశ సమూహము అజ్ఞానమను చీకటిని పోగొట్టుగాక ! ఆ నీ కేశపాశముల సహజమైన సువాసనను పొందుటకై యింద్రుని నందనోద్యానమందలి కల్పపాదపముల పూవులు వానియందు వసించుచున్నవని నేను భావించుచున్నాను. కేశములు నల్లనివి అవి చీకటిని పెంపొందించునుగాని పోగొట్టవు. కాని ఆచార్యులవారు దేవీకేశములు భక్తుల అజ్ఞానాంధకారమును పోగొట్టునని చెప్పుట విశేషము.

శ్లో॥ వహంతీ సిందూరం ప్రబల కబరీ భార తిమిర
ద్విషాం బృందైర్బందీకృత మివ నవీనార్క కిరణమ్,
తనోతు క్షేమం నస్తవ వదనసౌందర్యలహరీ
పరీవాహ స్రోతః సరణి రివ సీమంత సరణిః. 44

అ. తల్లీ ! ప్రబల, కబరీ, భార, తిమిర, ద్విషాం = అధికమైన కేశముల మొత్తమనెడి

చీకటులను శత్రువులయొక్క బృందైః = సమూహములచే, బందీకృతం = చెఱపెట్టబడిన, నవీన, అర్క కిరణం, ఇవ = లేత సూర్యునికిరణము వలె నున్నట్టియు, సిందూరం = సిందూరపు బొట్టును, వహంతీ = ధరించుచున్న, తవ = నీయొక్క, వదన, సౌందర్య, లహరీ, పరీవాహ, స్రోతః, సరణిః ఇవ = ముఖముయొక్క అందమనెడి ప్రవాహముయొక్క తూము (కలుగు) యొక్క జాలుయొక్క మార్గమువలె ఉన్నట్టియు, సీమంత సరణిః = నీ పాపటత్రోవ, నః = మాకు, క్షేమం = క్షేమమును, తనోతు = కలిగించుగాక ! అలం. ఉత్ప్రేక్ష.

తా. తల్లీ ! దట్టములైన నీ కేశపాశములు సాంద్రములైన చీకట్లవలె నున్నవి. ఆచీకట్లకును సూర్యునికిని విరోధముకావున అవి వెదకి వెదకి సూర్యుని లేత కిరణమును పట్టుకొని చెఱపట్టినవి. నీ నుదుటనున్న సిందూరపు బొట్టు ఆ సూర్యుని లేత కిరణమువలె నున్నది. నీ ముఖముయొక్క సౌందర్యమొక మహాప్రవాహము. నీపాపటలేఖ ఆ ప్రవాహమునందలి కలుగుయొక్క మార్గమువలె నున్నది. ఆ పాపటత్రోవ మాకు క్షేమమును కలిగించుగాక !

శ్లో॥ అరాలైః స్వాభావ్యా దలికలభ సశ్రీభి రలకై
పరీతం తే వక్త్రం పరిహసతి పంకేరుహరుచిమ్,
దరస్మేరే యస్మిన్ దశనరుచికింజల్కరుచిరే
సుగంధౌ మాద్యన్తి స్మరదహన చక్షుర్మధులిహః. 45

అ. తల్లీ ! దర, స్మేరే = చిఱునవ్వు నవ్వుచున్నట్టియు, దశన, రుచి, కింజల్క, రుచిరే = దంతముల కాంతియనెడి కేసరములచే సుందరమైనట్టియు, సుగంధౌ = మంచిసువాసన కలిగినట్టియు, యస్మిన్ = ఏ ఏముఖమునందు, స్మరదహన, చక్షుః, మధులిహః = మన్మథుని దహించిన శివునినేత్రములనెడి తుమ్మెదలు, మాద్యంతి = మోహపడుచున్నవో, స్వాభావ్యాత్ = స్వభావము వలననే, అరాలైః = వక్రములైనట్టియు, అలి, కలభ, సశ్రీభిః = తేటికొదమలతో సమానమైన శోభగల, అలకైః = ముంగురులతో, పరీతం = చుట్టబడిన (కూడిన), తే = నీ యొక్క , వక్త్రం = ముఖము, పంకేరుహ, రుచిం = పద్మముయొక్క కాంతిని, పరిహసతి = పరిహాసముచేయుచున్నది. అలం. రూపకము.

తా. తల్లీ ! సహజముగనే వక్రములైనట్టియు, తుమ్మెదకొదమలతో సమానమైన

శోభకలిగినట్టియు, ముంగురులతో కూడిన నీ ముఖము పద్మకాంతి నెకసక్కెము చేయుచున్నది. చిఱునవ్వుతో వికసించుచున్నట్టియు, దంతముల కాంతులనెడి కేసరములచే సుందరమైనట్టియు సువాసన కలట్టియు ఆ నీముఖమునందు మన్మథుని దహించినట్టి శివునియొక్క నేత్రములనెడి తుమ్మెదలు కూడ మోహపడుచున్నవి.

శ్లో॥ లలాటం లావణ్యద్యుతి విమల మాభాతి తవ యత్
ద్వితీయం తన్మన్యే మకుట ఘటితం చంద్రశకలమ్,
విపర్యాస న్యాసాదుభయ మపి సంభూయ చ మిథః
సుధాలేపస్యూతిః పరిణమతి రాకాహిమకరః. 46

అ. దేవీ ! తవ = నీయొక్క, యత్ = ఏ, లలాటం = ఫాలభాగము, లావణ్య, ద్యుతి, విమలం = సౌందర్యకాంతితో నిర్మలమై, ఆభాతి = ప్రకాశించుచున్నదో, తత్ = దానిని, మకుట, ఘటితం = కిరీటమందు కూర్చబడిన, ద్వితీయం = రెండవ, చంద్ర, శకలం = చంద్రరేఖగా, మన్యే = తలంతును, (దాని రెండగ్రములను దీని రెండగ్రములను) విపర్యాస, న్యాసాత్ = తారుమాఱుగా నుంచుటవలన, ఉభయం, అపి = రెండు చంద్రశకలములను కూడ, మిథః = ఒండొంటితో, సంభూయ = కలసి, సుధా, లేప, స్యూతిః = అమృతపుపూతను జనింపజేయు, రాకా, హిమకరః = పూర్ణిమాచంద్రుడు, పరిణమతి = పరిణమించును.

తా. దేవీ ! నీ యే ఫాలభాగము సౌందర్యకాంతిచే నిర్మలమై ప్రకాశించుచున్నదో దానిని నీ కిరీటమందు ఖచితమైన రెండవ చంద్రఖండముగా తలంచుచున్నాను. (రెండింటి నాలుగు కొమ్ములను) తారుమాఱుగా నుంచుటవలన రెండు చంద్రఖండములు నొండొంటితో కలిసి అమృతద్రవమును స్రవింపజేయు పున్నమిచంద్రుడుగా పరిణమించును (ఏర్పడును.)

శ్లో॥ భ్రువౌ భుగ్నే కించి ద్భువన భయ భంగ వ్యసనిని
త్వదీయే నేత్రాభ్యాం మధుకర రుచిభ్యాం ధృతగుణమ్,
ధనుర్మన్యే సవ్యేతరకర గృహీతం రతిపతేః
ప్రకోష్ఠే ముష్టౌ చ స్థగయతి నిగూఢాంతర ముమే. 47

అ. భువన, భయ, భంగ, వ్యసనిని = లోకముల భీతిని పోగొట్టుట యందాసక్తి

గల, ఉమే = పార్వతీ ! త్వదీయే = నీదగు, కించిద్, భుగ్నే = కొంచెముగా వంగిన, భ్రువౌ = కనుబొమలను, మధుకర, రుచిభ్యాం = తుమ్మెదలకాంతివంటి కాంతిగల, నేత్రాభ్యాం = రెండుకన్నులచే, ధృత, గుణం = ధరింపబడిన నారి కలిగినట్టియు, రతి, పతేః = మన్మథునియొక్క, సవ్య, ఇతర కర, గృహీతం = కుడి (ఎడమఅనికొందఱు) చేతితోగ్రహింపబడినట్టియు, ప్రకోష్ఠే = ముంజేయియు, ముష్టౌ = పిడికిలియు, స్థగయతి సతి = కప్పగా, నిగూఢ, అంతరం = కప్పబడినమధ్యభాగము కలిగినట్టియు, ధనుః = విల్లని, మన్యే = తలంతును. అలం. ఉత్ప్రేక్ష.

తా. స్త్రీలకనుబొమలను మన్మథుని ధనుస్సుతో పోల్చుట కవి సమయము. మన్మథుడు పట్టుకొనునప్పుడు దాని మధ్యభాగము నతని ముంజేయియు, పిడికిలియు కప్పివేయును. లోకముల భయమును బాపుటయందాసక్తి కల పార్వతీ ! కొంచెముగా వంగిన నీ కనుబొమ్మలను తుమ్మెదలకాంతివంటి కాంతి గల కన్నులచే ధరింపబడిన నారికలిగినట్టియు కుడిచేతితో పట్టుకొనబడినట్టియు ముంజేయి పిడికిలియు ఆచ్ఛాదింపగా కప్పబడిన నడిమిభాగము కలిగినట్టియు మన్మథుని విల్లుగా భావింతును.

శ్లో॥ అహః సూతే సవ్యం తవ నయన మర్కాత్మకతయా
త్రియామాం వామం తే సృజతి రజనీనాయకతయా,
తృతీయా తే దృష్టి ర్దరదలిత హేమాంబుజరుచిః
సమాధత్తే సంధ్యాం దివసనిశయో రంతర చరీమ్. 48

అ. దేవీ ! తవ = నీయొక్క, సవ్యం, నయనం = కుడికన్ను, అర్క, ఆత్మకతయా = సూర్యరూపమగుటచే, అహః = పగటిని, సూతే = కలిగించును, తే = నీ, వామం = ఎడమకన్ను, రజనీ, నాయకతయా = చంద్రరూపమగుటచే, త్రి, యామాం = రాత్రిని, సృజతి = సృజించును, దర, దలిత, హేమ, అంబుజ, రుచిః = సగమువికసించిన బంగారుపద్మమువంటి కాంతి గల, తే = నీ, తృతీయా, దృష్టిః = మూడవకన్ను, దివస, నిశయోః = దివారాత్రులకు, అంతర, చరీం = మధ్యవర్తించు, సంధ్యాం = సంధ్యాకాలమును, సమాధత్తే = కలిగించుచున్నది.

తా. దేవీ ! నీ కుడికన్ను సూర్యరూపమగుటచే పగటిని కలిగించుచున్నది. నీ యెడమకన్ను చంద్రరూపమగుటచే రాత్రిని సృజించుచున్నది. సగము వికసించిన బంగారు

తామరకాంతివంటి కాంతి గల నీమూడవ కన్ను పగటికిని రాత్రికిని మధ్యవర్తించు సంధ్యాకాలమును కలిగించుచున్నది.

శ్లో॥ విశాలా కల్యాణీ స్ఫుటరుచి రయోధ్యా కువలయైః
కృపాధారా ధారా కిమపి మధురా భోగవతికా,
అవన్తీ దృష్టిస్తే బహునగర విస్తార విజయా
ధ్రువం తత్తన్నామ వ్యవహరణ యోగ్యా విజయతే. 49

అ. దేవీ ! తే = నీయొక్క, దృష్టిః = చూపు; విశాలా = విస్తృతమైనదియు (అంతర్వికాసముకలది. శత్రుసంక్షోభకము); కల్యాణీ = మంగళకరమైనదియు (విస్మయసూచకము, శత్రువులనాకర్షించునది), స్ఫుట, రుచిః = స్పష్టమైన కాంతి కలదియు; కువలయైః = కలువలచే; అయోధ్యా = పోరనలవికానిదియు అనగా కలువలకంటె ఎక్కువకాంతికలదియు (స్మేరతారకము, శత్రువిద్రావణము) కృపా, ధారా, ఆధారా = కరుణారసమునకు నెలవైనదియు (అలసము, అరులకున్మాదకము), కిం, అపి = వర్ణింపనలవికాని; మధురా = మాధుర్యముకలదియు (చంచలము, సర్వశత్రువశంకరము) భోగవతికా = లోపల విశాలమైనదియు (మస్సృణము, శత్రుమండలోచ్చాటనము), అవంతీ = కాపాడునదియు (ముగ్ధము, శత్రుపుంజవిద్వేషణము), బహు, నగర, విస్తార, విజయా = పెక్కు నగరముల సమూహముయొక్క విజయముకలదియునై (చెంతలచేరిన నల్లగ్రుడ్లుకలది, శత్రువర్గమారకము), ధ్రువం = నిజముగా; తత్, తత్, నామ, వ్యవహరణ, యోగ్యా = ఆయానగరముల నామములచే వ్యవహరించుటకు తగినదై (జయింపబడిన వారి బిరుదనామాదులను విజేతలు గ్రహించుట లోకమున పరిపాటి), విజయతే = ప్రకాశించుచున్నది.

తా. దేవి ఎనిమిదిచూపులిందు వర్ణింపబడినవి. ఎనిమిదియు ఎనిమిదిలక్షణములు కలవి. ఎనిమిదికార్యములను చేయునవి. వైశాల్యమంగళకరత్వాదులు సర్వస్త్రీదృష్టి సామాన్యలక్షణములు. దేవీ! నీచూపు విశాలమును, మంగళకరమును, స్పష్టమైన కాంతికలదియు, కలువలకు పోరనలవికానిదియు, కృపారసమునకు నిలయమును, అవ్యక్తమాధుర్యము కలదియు, అంతర్వైశాల్యము కలదియు, రక్షించునదియు, పలునగరములయొక్క విజయముకలదియు, విశాల, కల్యాణి, అయోధ్య, ధార, మధుర,

భోగవతి (అమరావతి), అవంతి (ఉజ్జయిని), విజయనగరము అనునవి నగరములపేర్లు నై నిజముగా నాయానగరముల నామములతో పిలుచుటకు తగినదై ప్రకాశించుచున్నది.

శ్లో॥ కవీనాం సందర్భ స్తబక మకరం దైక రసికం
కటాక్ష వ్యాక్షేప భ్రమర కలభౌ కర్ణయుగలమ్,
అముంచన్తౌ దృష్ట్వా తవ నవరసాస్వాదతరలా
వసూయా సంసర్గా దలిక నయనం కించి దరుణమ్. 50

అ. తల్లీ ! కవీనాం = కవులయొక్క; సందర్భ, స్తబక, మకరంద, ఏక, రసికం = రచనలనెడి పూగుత్తుల తేనెయందే ప్రధానముగా నాసక్తమైన; కర్ణ, యుగళం = చెవులజంటను; అముంచంతౌ = విడువనట్టియు, నవ, రస, ఆస్వాద, తరళౌ = శృంగారాదులగు తొమ్మిదిరసముల నాస్వాదించుటయందు ప్రీతికలిగినట్టియు; కటాక్ష, వ్యాక్షేప, భ్రమర, కలభౌ = కడకంటిచూపులను వ్యాజముతో నున్న తుమ్మెద కొదమలను; దృష్ట్వా = చూచి; అసూయా, సంసర్గాత్ = ఈర్ష్యా సంబంధమువలన ; తవ = నీయొక్క; అలిక, నయనం = ఫాలనేత్రము; కించిత్, అరుణం = కొంచెమెఱ్ఱపడినది. అలం. ఉత్ప్రేక్ష.

తా. దేవీ ! కవులరచనలనెడి పూగుత్తుల మకరంద రసమునందు ప్రధానముగా నాసక్తములైనట్టియు, అందుచే చెవులజంటను విడువనట్టియు, తొమ్మిది రసముల నానుటయందు ప్రీతికలిగినట్టియు, నీ కడకంటిచూపుల మిషతోనున్న తుమ్మెదలజంటను చూచి అసూయాసంబంధమువలన నేమోయన నీ ఫాలనేత్రము కొంచెమెఱ్ఱవాఱినది.

శ్లో॥ శివే శృంగారార్ద్రా, తదితరజనే కుత్సనపరా
సరోషా గంగాయాం, గిరిశ చరితే విస్మయవతీ,
హరాహిభ్యో భీతా, సరసిరుహ సౌభాగ్య జయినీ
సఖీషు స్మేరా తే మయి జనని ! దృష్టిః సకరుణా. 51

అ. జననీ = తల్లీ ! శివే = శివునియందు, శృంగార, ఆర్ద్రా = శృంగారముచే తడిసినదియు (కూడినదియు), తత్, ఇతర, జనే = శివునికంటె భిన్నమైన జనమందు, కుత్సన, పరా = రోత (వైముఖ్యము) కలదియు, గంగాయాం = సవతి యైన గంగయందు, స, రోషా = కోపముతో కూడినదియు, గిరిశ, చరితే = శివుని చరిత్రయందు, (నయనే

అను పాఠాంతరము శివుని మూడవ కంటియందు), విస్మయవతీ = ఆశ్చర్యము కలదియు, హర, అహిభ్యః = శివుడుధరించినపాముల వలన, భీతా = భయపడినదియు, సఖీషు = చెలులయందు, స్మేరా = వికసించినదియు, సరసిరుహ, సౌందర్య, జయినీ = పద్మముల అందమును జయించునట్టిదియునగు, తే = నీ యొక్క , దృష్టిః = చూపు, మయి = నాయందు, సకరుణా = దయతో కూడినదగు గాక !

తా. తల్లీ ! శివునియందు ప్రేమచే శృంగారరసముతో కూడినదియు, శివుని కంటె భిన్నమైన జనమందు ఏవగింపు కలదియు, సవతియైన గంగయందు కోపముతో కూడినదియు, శివునిమూడవకంటియందు (చరిత్రయందు) అచ్చెరువుతో కూడినదియు, శివుడు ధరించిన పాములవలన భయపడినదియు, చెలులయందు చిఱునగవుతో వికసించునదియు, పద్మముల అందమును జయించు నదియు నగు నీ చూపు భక్తుడనైన నాయందు దయతో కూడిన దగుగాక.

శ్లో॥ గతే కర్ణాభ్యర్ణం గరుత ఇవ పక్ష్మాణి దధతీ
పురాం భేత్తుశ్చిత్త ప్రశమరసవిద్రావణ ఫలే,
ఇమే నేత్రే గోత్రాధరపతికులో త్తంసకలికే
తవాకర్ణాకృష్ట స్మర శరవిలాసం కలయతః. 52

అ. గోత్రాధర, పతి, కుల, ఉత్తంస, కలికే = పర్వతరాజైన హిమవంతుని వంశమునకు శిరోభూషణమైన మొగ్గా ! ఓ పార్వతీ ! కర్ణ అభ్యర్ణం = చెవులసమీపమును, గతే = పొందినట్టియు, గరుతః, ఇవ = బాణములకు కట్టు ఈకలవలె, పక్ష్మాణి = కనురెప్పల వెండ్రుకలను, దధతీ = ధరించునట్టియు ఇమే, తవ నేత్రే = ఈ నీ రెండు నేత్రములు, పురాం భేత్తుః = త్రిపురముల భేదించిన శివునియొక్క, చిత్త, ప్రశమరస విద్రావణ, ఫలే = హృదయము నందలి శాంతిని నశింపజేయుటయే ఫలముగాగలవై (ఫలశబ్దమునకు నినుపములికియను నర్థముకూడకలదు. నశింపజేయు నినుపములుకులు కలవై) ఆకర్ణ, ఆకృష్ట, స్మర, శర, విలాసం = చెవులవఱకును ఆకర్షింపబడిన మన్మథుని బాణములవిలాసమును, కలయతః = పొందుచున్నవి.

తా. పర్వతాధిపుడైన హిమవంతునికులమునకు శిరోభూషణమైన మొగ్గవైన ఓ పార్వతీ ! చెవుల సమీపమును పొందినట్టియు, బాణములకుకట్టు ఈకలవలె నున్న

కనురెప్పల వెండ్రుకలను ధరించినట్టియు, ఈ నీ రెండునేత్రములు త్రిపుర సంహారియైన శివునిచిత్తమునందలి శాంతిని నశింపజేయుటయే ఫలముగాగలవై, (నశింపజేయు నినువములుకులుకలవై) కర్ణములవఱకును, ఆకర్షింపబడిన మన్మథుని బాణములవిలాసమును పొందుచున్నవి. దేవికన్నులు శివునిచిత్తమును కలతపెట్టు మన్మథబాణములవలె నున్నవని భావము.

శ్లో॥ విభక్త త్రైవర్ణ్యం వ్యతికలిత లీలాంజనతయా
విభాతి త్వన్నే త్ర త్రితయ మిద మీశానదయితే,
పునఃస్రష్టుం దేవాన్ ద్రుహిణ హరిరుద్రా నుపరతాన్
రజఃసత్త్వం భిభ్రత్తమ ఇతి గుణానాం త్రయమివ. 53

అ. ఈశాన, దయితే = శివునిప్రియురాలా ! దేవీ ! వ్యతికలిత, లీలా, అంజనతయా = పెట్టబడిన విలాసముకొఱకైన కాటుక కలిగియుండుటచే, విభక్త, త్రైవర్ణ్యం = విభజింపబడినమూడు (ఎఱుపు, తెలుపు, నలుపు) రంగులుకలదైన; ఇదం, త్వత్, నేత్ర, త్రితయం = ఈ నీ కన్నులత్రయము (మూడు కన్నులు), ఉపరతాన్ =ప్రళయముపొందిన; ద్రుహిణ, హరి రుద్రాన్, దేవాన్ = బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు అను దేవతలను; పునఃస్రష్టుం = తిరిగి సృజించుటకు; రజఃసత్త్వం, తమఃఇతి = రజస్సు (ఎఱుపు) సత్త్వము (తెలుపు) తమస్సు (నలుపు) అను; గుణానాం త్రయం = గుణముల మూడింటిని; బిభ్రత్, ఇవ = ధరించుచున్నదా అనునట్లున్నది. అలం. ఉత్ప్రేక్ష.

తా. శివుని ప్రియురాలైన ఓ దేవీ ! విలాసముకొఱకు కాటుక పెట్టబడియుండుటచే విభజింపబడిన ఎఱుపు, తెలుపు, నలుపు, అను మూడుగుణములు కలదైన ఈ నీ నేత్రత్రయము ప్రళయమునందు నశించిన బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, అను దేవతలను తిరిగి సృజించుటకు రజస్సు, సత్త్వము, తమస్సు అను మూడు గుణములను ధరించుచున్నదా అననొప్పుచున్నది. బ్రహ్మ విష్ణురుద్రులు రజస్సత్త్వతమోగుణమయులు. దేవి కనులు సహజముగా ఎఱుపు తెలుపుకలవి కాటుకవలన నలుపుకూడ కలుగుటచే విభజింపబడిన మూడు గుణములుకలవివలె నున్నవి.

శ్లో॥ పవిత్రీకర్తుం నఃపశుపతిపరాధీనహృదయే
దయా మిత్రై ర్నే త్రై ర రుణ ధవళశ్యామరుచిభిః,

నదః శోణోగంగా తపనతనయేతి ధ్రువ మముం
త్రయాణాం తీర్థానా ముపనయసి సంభేద మనఘమ్. 54

అ. పశుపతి, పరాధీన, వ్యాదయే = శివునియందాసక్తమైన వ్యాదయము కలదేవీ ! నః = మమ్ము; పవిత్రీకర్తుం = పవిత్రులనుగాచేయుటకు; దయా, మిత్రైః = కృపకు మిత్రములైన (దయాపూర్ణములైన); అరుణ, ధవళ, శ్యామ, రుచిభిః = ఎఱుపు, తెలుపు, నలుపుకాంతులుగల, నేత్రైః = కన్నులతో; నదః, శోణః = శోణనదము (ఇదిఎఱ్ఱనిరంగు నీరుకలది); గంగా = గంగానది (తెల్లనినీరుకలది), తపన, తనయా = సూర్యునికూతురైన యమునానది (నల్లని నీరు కలది); ఇతి = అను; త్రయాణాం = మూడైన; తీర్థానాం = నదులయొక్క ; అముం = ఈ; అనఘం = పాపరహితమైన; సంభేదం = కలయికను; ఉపనయసి = సమకూర్చుచున్నావు. అనుట, ధ్రువం = సత్యము, గంగా యమునా శోణనదములందలి జలము తెలుపు, నలుపు, ఎఱుపువర్ణములు కలిగియుండును. వానియందు స్నానమొనరించుట పాపపరిహారకము. దేవి కన్నులయందు సైతమీ మూడు రంగులుండుటచే ఆచార్యులవారు దేవి తన చూపులు ప్రసరింపజేసి ఆ మూడు తీర్థములందు స్నానము చేసిన పుణ్యముకలిగించి భక్తులను పవిత్రులను చేయుటకై వానిని మూడింటి నొక్కచో చేర్చుచున్నదని చెప్పుచున్నారు.

తా. శివపరాధీన చిత్తమైన ఓ దేవీ ! మమ్ము పవిత్రులను చేయుటకై దయా పూర్ణములు, ఎఱుపు, తెలుపు, నలుపు, కాంతులుకలవి అగు నీ కన్నులచే శోణనదము, గంగ, యమున అను మూడు తీర్థముల పాపరహితమైన (పుణ్యప్రదమైన) యీ కలయికను సమకూర్చుచున్నావు. ఇది నిజము.

శ్లో॥ నిమేషో న్మేషాభ్యాం ప్రళయముదయం యాతి జగతీ
తవేత్యాహుః సంతో ధరణిధర రాజన్య తనయే!
త్వదు న్మేషా జ్జాతం జగదిద మశేషం ప్రళయతః
పరిత్రాతుం శంకే పరిహృత నిమేషా స్తవ దృశః. 55

అ. ధరణిధర, రాజన్య, తనయే = పర్వతరాజైన హిమవంతుని కూతురవగు ఓ దేవీ ! తవ = నీయొక్క, నిమేష, ఉన్మేషాభ్యాం = కనుఱెప్పలు మూయుట తెఱచుటఅనువాని వలన, వరుసగా, జగతీ = ప్రపంచము, ప్రళయం = నాశమును, ఉదయం = పుట్టుకను (సృష్టిని), యాతి = పొందుచున్నది. ఇతి = అని, సంతః = పండితులు, ఆహుః =

చెప్పుదురు, త్వత్, ఉన్మేషాత్ = నీకనుతెప్పలు తెఱచుట వలన, జాతం = పుట్టిన, అశేషం ఇదం జగత్ = సమస్తమైన యీ ప్రపంచమును, ప్రళయతః = నాశమునుండి, పరిత్రాతుం = రక్షించుటకు, తవ = నీయొక్క, దృశః = చూపులు (కన్నులు), పరిహృత, నిమేషాః = పరిహరింపఁ బడిన తెప్పపాటుకలవి, అని, శంకే = శకించుచున్నాను. దేవతలు అనిమిషులు. వారికన్నులకు తెప్పపాటుండదు. ఆవిషయమును ఆచార్యులవారిట్లు త్రోక్షించియున్నారు. శ్రీ లలితా సహస్ర నామస్తోత్రమున "నిమేషోన్మేషవిపన్నోత్పన్న భువనావళ్యై నమః" అనునామమున్నది. అది యిచ్చట విపులీకరింపఁబడినది.

తా. హిమాచలనందినీ ! దేవీ ! నీవు కనుతెప్పలు మూయుటవలన ప్రపంచము ప్రళయమును, తెఱచుట వలన ఉదయమును (సృష్టిని) పొందునని పండితులు చెప్పుదురు. నీవు కనుతెప్పలు తెఱచుటవలన జనించిన యీ సమస్త ప్రపంచము నీవు వానిని మూయుటవలన ప్రళయము పొందునని దానిని ప్రళయము నుండి రక్షించుటకే నీ కన్నులు పరిహరింపఁబడిన తెప్పపాటు కలవై (నిర్నిమేషములై) యున్నవని తలంచుచున్నాను.

శ్లో॥ తవాపర్ణే కర్ణేజప నయన పైశున్య చకితా
నిలీయంతే తోయే నియత మనిమేషాః శఫరికాః,
ఇయం చ శ్రీర్బద్ధచ్ఛదపుట కవాటం కువలయం
జహాతి ప్రత్యూషే నిశి చ విఘటయ్య ప్రవిశతి. 56

అ. అపర్ణే = ఆకులుకూడ తినకుండ తపమొనరించిన ఓ పార్వతీ ! తవ = నీయొక్క, కర్ణేజప, నయన, పైశున్య, చకితాః = (చెవులదాక వ్యాపించిన) కొండెములు చెప్పు స్వభావముగల నేత్రముల అపకీర్తికర భాషణ శీలముచే భయపడినవై, అనిమేషాః = రెప్పపాటులేని, శఫరికాః = చేపలు, తోయే = నీటియందు, నిలీయంతే = దాగుకొనుచున్నవి, నియతం = నిశ్చయము, ఇయం, చ, శ్రీః = కనబడు ఈనేత్రలక్ష్మికూడ, ప్రత్యూషే = ప్రాతఃకాలమందు, బద్ధ, ఛదపుట, కవాటం = మూయబడిన దొన్నెలవంటి దళములనెడి తలుపులు కలిగిన, కువలయం = కలువను, జహాతి = విడుచుచున్నది. నిశి చ = రాత్రియందు, విఘటయ్య = తెఱచి, ప్రవిశతి = ప్రవేశించును, అలం. ఉత్ప్రేక్ష.

తా. చేపలు తెప్పపాటులేనివి. దేవి కన్నులుకూడ రెప్పపాటులేనివే. ఆమె కనులు చెవుల దాక వ్యాపించి యుండును. అవి దేవి చెవులు చేరి రహస్యముగా తమ అనిమేషత్వమును చేపలు దొంగిలించినవని కొండెములు చెప్పునేమో అనుభయముచే చేపలు నీటిలో దాగుకొనుచున్నవి. ఇది నిజము. కలువలు రాత్రివికసించును. పగలు మూసుకొనును. స్త్రీల కనులను కలువలతో పోల్తురు. అందమైన ఆ నేత్రశోభ పగలు దేవికనులయందుండును. రాత్రి దేవి నిద్రించును. కావున కలువలను చేరును. అందుచే ఆచార్యులవారు నేత్రలక్ష్మి ఉదయమందు మూయబడిన దొన్నెలవంటి దళములనెడి తలుపులుగల కలువను విడిచి రాత్రి అది వికసించును. కావున దళకవాటమును తెఱచుకొని మరల అందుప్రవేశించునని చెప్పుచున్నారు.

శ్లో॥ దృశా ద్రాఘీయస్యా దరదళిత నీలోత్పలరుచా
దవీయాంసం దీనం స్నపయ కృపయా మామపి శివే,
అనే నాయం ధన్యో భవతి న చ తే హాని రియతా
వనే వా హర్మ్యే వా సమకరనిపాతో హిమకరః. 57

అ. శివే = పార్వతీ ! దర, తళిత, నీల, ఉత్పల, రుచా = సగము వికసించిన నల్లకలువల కాంతివంటి కాంతిగల; ద్రాఘీయస్యా = దీర్ఘతరమైన; దృశా = చూపుచే; దవీయాంసం = మిక్కిలి దూరమందున్న, దీనం = ఆర్తుడ నైన; మాం, అపి = నన్ను కూడ, కృపయా = దయతో; స్నపయ = స్నానము చేయింపుము; (తడుపుము); అనేన = ఇట్లు చేయుటచే, అయం = ఈ దీనుడు; ధన్యః భవతి = కృతార్థుడగును; ఇయతా = ఇంతమాత్రముచే; తే = నీకు; హానిః = కీడు; (లోపము) న, చ = కలుగదు; హిమకరః = చంద్రుడు; వనే వా = అటవియందైనను; హర్మ్యే, వా = సౌధమందైనను, సమ, కర, నిపాతః = సమానమైన కిరణముల ప్రసరణము కలవాడు కదా; అలం. అర్థాంతరన్యాసము.

తా. ఓ పార్వతీ ! అరవిరసిన నల్లకలువల కాంతివంటి కాంతి గల (చల్లదనమును సూచించును) దీర్ఘతరమైన నీ చూపుచే దూరతరస్థలమునందున్నవాడను, ఆర్తుడను అయిన నన్ను దయతో తడుపుము. చల్లని చూపులను దీనుడనగు నాపై ప్రసరింపచేయుము. ఇట్లొనర్చుటచే నీ దీనుడు ధన్యుడగును. ఇంత మాత్రముచే నీకెట్టి లోపమును కలుగదు చంద్రు డడవియందును, ప్రాసాదమందును తన చల్లని కిరణములను సమముగా

ప్రసరింప జేయును కదా. న్యూనాధిక్యములను చూడక అన్నిటి విషయమున సమముగా వర్తించును. అట్లే నీవును దీనుడు దూరన్నుడు అని నన్నుపేక్షించకుము. నీమకుటమందాభరణమైన చంద్రుడే అట్లు చేయుచుండ నీవట్లు చేయకుండుట తగదని భావము.

శ్లో॥ అరాలం తే పాలీయుగళ మగరాజన్య తనయే
న కేషా మాధత్తే కుసుమశరకోదండకుతుకం,
తిరశ్చీనో యత్ర శ్రవణ పథ ముల్లంఘ్య విలస
న్నపాంగవ్యాసంగో దిశతి శరసంధాన ధిషణామ్. 58

అ. అగ రాజన్య, తనయే = పర్వతరాజకుమారీ ! అరాళం = వంకరయైన; తే = నీయొక్క; పాళీ యుగళం = చెవితమ్మెలజంట; కేషాం = ఎవరికి, కుసుమశర, కోదండ, కుతుకం = మన్మథుని ధనుస్సునందలి కుతూహలమును, న ఆధత్తే = కలిగింపదు ? (తప్పక కలిగించును), యత్ర = ఏ చెవితమ్మెలజంట యందు; తిరశ్చీనః = అడ్డముగా తిరిగిన; తవ = నీయొక్క; అపాంగ, వ్యాసంగః = కటాక్షముల ప్రచారము; శ్రవణ, పథం = కర్ణమార్గమును; ఉల్లంఘ్య = దాటి; విలసన్ = ప్రకాశించుచున్నదై; శర, సంధాన, ధిషణాం = బాణములను సంధించుటయందలిబుద్ధిని; దిశతి = చేయును (ఇచ్చును).

తా. పర్వత రాజనందినీ ! వక్రమైన నీ చెవితమ్మెలజంట మన్మథుని ధనస్సునెడి కుతూహలము నెవరికి కలిగింపదు ? (నీ చెవి తమ్మెలజంట మన్మథునివింటి వలె నుండును.) అచ్చట అడ్డముగా తిరిగిన నీ కటాక్షప్రచారము కర్ణ మార్గము నుల్లంఘించి ప్రకాశించుచు బాణములను సంధించుట యందలి ఊహను కలుగచేయును. దేవి కడకంటి చూపులు ప్రక్కలకు ప్రసరించి బాణములవలె నుండునని భావము.

శ్లో॥ స్ఫురద్గండాభోగ ప్రతిఫలిత తాటంకయుగళం
చతుశ్చక్రం మన్యే తవ ముఖ మిదం మన్మథరథం,
యమారుహ్య ద్రుహ్యా త్యవనిరథ మర్కేందు చరణం
మహావీరో మారః ప్రమథపతయే సజ్జితవతే. 59

అ. తల్లీ ! యం = ఏరథమును, ఆరుహ్య = ఎక్కి, మహావీరః = గొప్ప వీరుడైన;

మారః = మన్మథుడు, అర్క, ఇందు, చరణం = సూర్యచంద్రులు చక్రములుగా గల, అవని,రథం = భూమి యనెడు రథమును, సజ్జితవతే = సిద్ధముచేసిన (పూన్చుకొనిన) ప్రమథ, పతయే = ప్రమథాధిపుడైన శివుని కొఅకు, ద్రుహ్యతి = ద్రోహముచేయునో (తనకు వశునిగా చేయుటకు యత్నించునో) , స్ఫురత్, గండఆభోగ, ప్రతిఫలిత తాటంక యుగళం = ప్రకాశించుచెక్కిళ్ళ విశాల ప్రదేశమందు ప్రతిబింబించిన కర్ణాభరణముల జంటగల, ఇదం, ముఖం = ఈ నీ ముఖమును, చతుః, చక్రం = నాల్గుచక్రములుగల, మన్మథ, రథం = ఆ మన్మథుని రథమునుగా, మన్యే = తలంతును.

తా. తల్లీ ! ప్రకాశించు చెక్కిళ్ళ విశాల ప్రదేశములందు ప్రతిబింబించిన చెవి దుద్దుల జంటగల నీముఖమును నాల్గుచక్రములుగల మన్మథుని రథమునుగా భావింతును. ఆ రథము నెక్కి మహావీరుడైన మన్మథుడు చంద్రసూర్యులు చక్రములుగాగల భూమియను రథమును, త్రిపురసంహారసమయమున పూన్చుకొనిన ప్రమథాధిపతియైన శివునికి ద్రోహము తలపెట్టెను. (అతనిని కూడ మోహ పెట్టుటకు యత్నించెను. అందుకు సుందరమైన దేవిముఖమతనికి తోడ్పడెను.)

శ్లో॥ సరస్వత్యాః సూక్తీ రమృత లహరీ కౌశల హరీః
పిబంత్యాః శర్వాణి ! శ్రవణ చులుకాభ్యా మవిరలం,
చమత్కార శ్లాఘా చలిత శిరసః కుండల గణో
ఋణత్కారై స్తారైః ప్రతివచన మా చష్ట ఇవ తే. 60

అ. శర్వాణి = పార్వతీ ! అమృత, లహరీ, కౌశల, హరీః = అమృత ప్రవాహముయొక్క మాధుర్యమును (నైపుణ్యమును) హరించునట్టి, సరస్వత్యాః = సరస్వతీదేవి యొక్క, సూక్తీః = సరసములైన పల్కులను, శ్రవణ చులుకాభ్యాం = చెవులనెడి పుడిసిళ్ళచే, అవిరలం = సంతతము, ఏడతెఅపి లేకుండ, పిబంత్యాః = త్రాగుచున్న (వినుచున్న), చమత్కార, శ్లాఘా, చలిత, శిరసః = సూక్తులందలి చమత్కారమును పొగడుటయందు చలించిన తలగల, తే = నీయొక్క, కుండల, గణః = కార్ణాభరణముల సమూహము, తారైః = ఉన్నతములైన (గొప్ప), ఋణత్కారైః = ఋణఋణధ్వనులచే, ప్రతివచనం = మాఱుమాటను, ఆచష్టే ఇవ = చెప్పుచున్నదా అనునట్లున్నది అలం. ఉత్ప్రేక్ష.

తా. దేవీ ! పార్వతీ ! అమృత ప్రవాహ మాధుర్యము వహించు సరస్వతి యొక్క

సరసములైన పల్కులను చెవులను పుడిసిళ్ళచే నెదతెఱపి లేకుండ త్రావుచున్న (వినుచున్న) ఆమాటలయందలి చమత్కారమును పొగడుటయందు కదలాడుచున్న తలగల నీ కర్ణాభరణముల సమూహము అచ్చములైన ఝణఝణధ్వనులచే మాఱుమాటలను చెప్పుచున్నదా అనునట్లున్నది. కొందఱు దేవి మధురవాక్కులను వినుచు తలయూపుచున్న నరస్వతి కర్ణాభరణముల ఝణఝణశబ్దములే ప్రశంసాప్రతివచనములను పల్కుచున్నట్లున్నవని అర్థము చెప్పుదురు.

శ్లో॥ అసౌ నాసావంశ స్తుహిన గిరివంశ ధ్వజ పటే
త్వదీయో నేదీయః ఫలతు ఫలమస్మాక ముచితం,
వహత్యంతర్ముక్తాః శిశిరకర నిశ్వాస గళితా
స్సమృద్ధ్యా య స్తాసాం బహిరపి చ ముక్తామణిధరః. 61

అ. తుహిన, గిరి, వంశ, ధ్వజ, పటే = హిమవత్పర్వతము యొక్క వంశమునకు జెండాగుడ్డయైన (హిమవంతుని వంశమునకు కీర్తినిదెచ్చు) ఓదేవీ ! యః = ఏ నీ నాసావంశము; అంతః = లోపల; శిశిరకర, నిశ్వాస, గళితాః = ఎడమవైపునగల చంద్రనాడియందలియూర్పు వలన జాఱిన, ముక్తాః = ముత్యములను; చల్లని అమృతబిందువులను; వహతి = ధరించునో, తాసాం = ఆ ముత్యములయొక్క; సమృద్ధ్యా= సమృద్ధిచే; బహిః అపి, చ = వెలుపలకూడ, ఎడమ నాసికయందు; ముక్తామణి; ధరః = ముత్యపుముక్కరను ధరించునదగునో; త్వదీయః, అసౌ, నాసావంశః = నీయొక్క ఈ ముక్కనెడి వెదురుగద; అస్మాకం = మాకు; ఉచితం = తగిన, నేదీయః = మిక్కిలిసమీపస్థమైన; ఫలం = ఇష్టలాభమును (ఫలమును), ఫలతు = ఫలించుగాక !

తా. దేవిముక్కు వెదురుగదగా చెప్పబడినది. వెదురు ముత్యముల ఉత్పత్తి స్థానములలో నొకటి. చంద్రనాడి యిడామార్గము. ఆనాడియందలి ఊర్పువలన ముత్యములవంటి శీతలామృత బిందువులు జాఱును. వానిసమృద్ధివలన దేవి ముక్కు ఎడమ భాగమున ముత్యాల ముక్కర ఏర్పడును. లోపలి కొన్ని బిందువులు పైకి కూడ వ్యాపించి ముక్తామణిభూషణముగా నయ్యెనని భావము. హిమాచలము కీర్తికి జెండావస్త్రమైన ఓదేవీ ! నీదగు ఈముక్కునెడి వెదురు మాకు సమీపస్థమైన ఫలమును తగినట్లుగా ఫలించుగాక ! నిజమునకు వెదురు ఫలింపదు. అందుచే ముక్తిని కాని మావంశమందు ముక్తపురుషులను కాని ఫలించుగాక అని భావింపవలెను. నీ

నాసావంశములోపల చంద్రనాడియందలి యూర్పువలన జాఱు ముత్యములవంటి శీతలామృత బిందువులను వహించును. వాని సమృద్ధిచే నాసిక ఎడమవైపున బయట కూడ ముక్తామయమై నాసాభరణ మేర్పడుచున్నదని ఉత్ప్రేక్ష.

శ్లో॥ ప్రకృత్యా రక్తాయా స్తవ సుదతి ! దంతచ్ఛదరుచేః
ప్రవక్ష్యే సాదృశ్యం జనయతు ఫలం విద్రుమలతా,
న బింబం తద్బింబ ప్రతిఫలన రాగాదరుణితం
తులా మధ్యారోఢుం కథమివ విలజ్జేత కలయా. 62

అ. సుదతి = చక్కనిపలువరుసగల యోపార్వతీ ! ప్రకృత్యా = ప్రకృతి (స్వభావము) చేతనే, రక్తాయాః = ఎఱ్ఱనిదైన, తవ = నీయొక్క, దంత, ఛద, రుచేః = పెదవియొక్క, కాంతికి, సాదృశ్యం = సామ్యమును (పోలికను), ప్రవక్ష్యే = చెప్పెదను. విద్రుమ, లతా = పవడపుతీగ, ఫలం = పండును, జనయతు = పుట్టించుగాక, అప్పుడు నీ పెదవికి సాదృశ్యము లభించును, తత్, బింబ, ప్రతిఫలన రాగాత్ = ఆ పెదవుల ఆకారము యొక్క ప్రతిబింబించుటచే కలిగిన ఎఱ్ఱదనము వలన, అరుణితం = ఎఱ్ఱపడిన, బింబం = దొండపండు, కలయా = పదునాఱవపాలుచేనైన , తులాం = సామ్యమును, ఆరోఢుం = పొందుటకు, కథం, ఇవ = ఎట్లుగా న, విలజ్జేత = సిగ్గిలకుండును ?

తా. స్త్రీల పెదవులను దొండపండుతోడను, పగడముతోడను పోల్చుచుందురు. కాని దేవిపెదవితో నారెండును పోలజాలవు. పగడపు తీగ పండుపండదు. పండినచో ఆపండొకవేళ ఆమె పెదవితో సామ్యము పొందవచ్చును. దొండపండునకు బింబమని పేరు. బింబమనగా ప్రతిఫలించిన రూపము. దొండపండు దేవిపెదవుల ప్రతిఫలనముచే కలిగిన ఎఱ్ఱరంగు కలది. అందుచేతనే దానికి బింబమను పేరుకలిగినది. అట్టిప్రతిబింబము దేవితో నెట్లు సామ్యము పొందగలదు ? పొందలేదు. చక్కని పలువరుసకల ఓ దేవీ ! స్వభావముచేతనే ఎఱ్ఱని నీ పెదవియొక్క కాంతికి సాదృశ్యము చెప్పెదను. ఒకవేళ పవడపు తీగ పండుపండినచో ఆపండు నీపెదవితో సాదృశ్యము పొందవచ్చును. ఇక దొండపండన్నచో నీ పెదవుల ప్రతిఫలముచే కలిగిన ఆరుణ్యముచే నెఱ్ఱపడినట్టిది. ప్రతిఫలించిన రూపమగుటచేతనే అది బింబమైనది. అది నీ పెదవితో పదునాఱవపాలుచే నైనను సామ్యము పొందుటకెట్లు సిగ్గిలకుండును ?

శ్లో॥ స్మితజ్యోత్స్నాజాలం తవ వదన చంద్రస్య పిబతాం
చకోరాణా మాసీ దతి రసతయా చంచుజడిమా
అతస్తే శీతాంశో రమృత లహరీమామ్ల రుచయః
పిబంతి స్వచ్ఛందం నిశినిశి భృశం కాంజికధియా. 63

అ. ఓ తల్లీ ! తవ = నీయొక్క, వదన చంద్రస్య = ముఖమనెడి చంద్రునియొక్క, స్మిత, జ్యోత్స్నా, జాలం = చిఱునవ్వనెడి వెన్నెలయొక్క సముదాయమును, పిబతాం = త్రాగుచున్న, చకోరాణాం = చకోరపక్షులకు (వెన్నెలపులుగులకు) అతిరసతయా అధికమాధుర్యమగుటచే, చంచు జడిమా = ముక్కులయందు మాంద్యము (అరుచి), ఆసీత్ = అయ్యెను, అతఃఁ= అందువలన, తే = ఆపక్షులు, ఆమ్లరుచయఃఁ = పుల్లనివస్తువునందు రుచిగలవై, శీతాంశోఃఁ = చంద్రునియొక్క, అమృతలహరీం = అమృతప్రవాహమును,కాంజికధియా =. పులికడుగను బుద్ధితో, స్వచ్ఛందం = స్వేచ్ఛగా, నిశినిశి = ప్రతిరాత్రియందును, భృశం = మిక్కిలి ప్రీతిగ (తనివితీరునట్లుగా), పిబంతి = త్రాగుచున్నవి.

తా. ఓ దేవీ ! నీముఖమనెడి చంద్రునియొక్క చిఱునవ్వనెడి వెన్నెల సముదాయమును త్రాగుచున్న చకోరపక్షులకు అతిమాధ్యురమగుటచే ముక్కులయందు అరుచి ఏర్పడెను. అందువలన ఆపిట్టలు పుల్లని రుచిగల వస్తువుపై ఆసక్తిగలవై, చంద్రుని అమృత ప్రవాహము పులికడు గనుబుద్ధితో ప్రతి రాత్రియందును వెన్నెలలయందును స్వేచ్ఛగ తృప్తిగ త్రాగుచున్నవి.

శ్లో॥ అవిశ్రాంతం పత్యుర్గుణ గణకథాఽఽమ్రేడనజపా
జపా పుష్ప చ్ఛాయా తవ జనని ! జిహ్వా జయతి సా,
యదగ్రాసీనాయాఃఁ స్ఫటికదృషదచ్ఛ చ్ఛవిమయీ
సరస్వత్యా మూర్తిఃఁ పరిణమతి మాణిక్య వపుషా. 64

అ. జనని = ఓ తల్లీ ! జపా, పుష్పచ్ఛాయా = ఎఱ్ఱనిదాసనపుపూవుయొక్క రంగువంటిరంగుగల; తవ = నీయొక్క, ; సా జిహ్వా = ఆ నాలుక; అవిశ్రాంతం = ఎడతెఱపిలేకుండునట్లుగ; పత్యుఃఁ = భర్తయైన శివునియొక్క; గుణ, గణ, కథా, ఆమ్రేడన,

జపా = త్రిపురాసురసంహారము మున్నగు గుణముల సమూహము యొక్క కథలను పెక్కుమార్లు వర్ణించుటయే జపముగాకలదియై; జయతి = అతిశయించుచున్నది. యత్, అగ్ర, ఆసీనాయాః = ఏనాలుకముందు కూర్చున్న; సరస్వత్యాః = సరస్వతియొక్క; స్ఫటిక, దృషత్ అచ్ఛ ఛవిమయీ = స్ఫటికపు రాయివలె తెల్లనికాంతిగల ; మూర్తిః = ఆకారము, మాణిక్య, వపుషా = పద్మరాగమణియొక్క రూపముతో; పరిణమతి = పరిణామము చెందుచున్నదో (మాఱుచున్నదో)

తా. తల్లీ ! జపాపుష్పముయొక్క రంగువంటిరంగుగల నీ యెఱ్ఱని నాలుక ఎడతెఱపిలేకుండ, భర్తయైన శివునియొక్క త్రిపురనంహారాదిగుణములయొక్క సమూహమునకు సంబంధించిన కథలను మాటిమాటికి వర్ణించుటయే జపముగా కలదియై ప్రకాశించుచున్నది. అట్లు నీవు వర్ణించుచుండగా నీ నాలుక ఎదుట (నీ ముందు) కూర్చున్న సరస్వతియొక్క పటికపురాతివలె తెల్లనికాంతిగల ఆకారము పద్మరాగమణియొక్క ఆకారముతో పరిణామముచెందుచున్నది. నీ నాలుక యొక్క ఎఱ్ఱదనముచే నెదుటకూర్చున్న సరస్వతియొక్క తెల్లనిఆకారము ప్రతిఫలనముచే ఎఱ్ఱగా కనిపించుచున్నదని భావము.

శ్లో॥ రణే జిత్వా దైత్యా నపహృత శిరస్త్రైః కవచిభి
ర్నివృత్తైశ్చణ్డాంశ త్రిపురహర నిర్మాల్య విముఖైః,
విశాఖేన్ద్రో పేన్ద్రై శ్శశివిశద కర్పూర శకలా
విలీయన్తే మాత స్తవ వదనతామ్బూలకబళాః. 65

అ. మాతః = ఓ తల్లీ; రణే = యుద్ధమునందు; దైత్యాన్ = రాక్షసులను; జిత్వా = జయించి; నివృత్తైః = మరలివచ్చినట్టియు; అపహృతశిరస్త్రైః = మ్రొక్కునప్పుడు తీయబడిన (తలను కాపాడు) పాగాను కలిగినట్టియు; కవచిభిః = తనుత్రాణములు (కవచములు) కలిగినట్టియు; చండ, అంశ, త్రిపుర, హార, నిర్మాల్య, విముఖైః = చండేశ్వరుని భాగమగుశివునిపూజించి తీసినైచిన వస్తువులయందు విముఖులైన; విశాఖ, ఇంద్ర, ఉపేంద్రైః = కుమారస్వామి, ఇంద్రుడు, విష్ణువు అనువారిచే; శశి, విశద, కర్పూర, శకలాః = చంద్రునివలె నిర్మలమైన కర్పూరపుముక్కలు గల; తవ = నీయొక్క; వదన, తాంబూల, కబళాః = ముఖమందలి విడియము యొక్క ముద్దలు; విలీయన్తే = వ్యయమైపోవుచున్నవి.

తా. తల్లీ ! యుద్ధమందు రాక్షసులజయించి తిరిగివచ్చినట్టియు, నీకు మ్రొక్కునప్పుడు తీసివేయబడిన శిరస్త్రాణములుకలిగినట్టియు, కవచములు కలిగి నట్టియు, చండేశ్వరుని భాగమైన శివునిపూజించి పరిహరించిన వస్తువులయందు విముఖులైనట్టియు, కుమారస్వామి, ఇంద్రుడు, విష్ణువు అనువారిచే చంద్రునివలె తెల్లని కర్పూరపు పలుకుగల నీ ముఖమందలి తాంబూలపు పిడచలు వ్యయమై పోవుచున్నవి. దేవి తన అనుగ్రహముచే విజయముగాంచి వచ్చిన కుమారాదులకు తన తాంబూలకబళముల నిచ్చునని భావము.

శ్లో॥ విపఞ్చ్యా గాయన్తీ వివిధ మపదానం పశుపతే
స్త్వయారబ్ధే వక్తుం చలిత శిరసా సాధువచనే,
త్వదీయైర్మాధుర్యై రపలపితతన్త్రీ కలరవాం
నిజాం వీణాం వాణీ నిచులయతి చోళేన నిభృతమ్. 66

అ. ఓ దేవీ ! వాణీ = సరస్వతి; పశుపతేః = శివునియొక్క , వివిధం = పలువిధములైన; అపదానం = త్రిపురాసుర విజయాది పూర్వవృత్తాంతములతోకూడిన పరాక్రమమును; విపంచ్యా = వీణతో, గాయంతీ = పాడుచున్నదై; చలిత శిరసా = సంతోషాతిశయముచే ఊపబడిన శిరస్సుగల; త్వయా = నీచే; సాధువచనే = ప్రశంసతో కూడిన వాక్యము; వక్తుం = పలుకుటకు, ఆరబ్ధే సతి = ప్రారంభింపబడగా, త్వదీయైః = నీ వాక్కులకు సంబంధించిన, మాధుర్యైః = తియ్యదనములచే; అపలపిత, తంత్రీ కల, రవాం = శ్రుతితప్పి పలుకబడిన (పరిహసింపబడిన) తీగల అవ్యక్త మధుర ధ్వనులుగల, నిజాం = తనదగు; వీణాం = వీణను; చోళేన = గవిసెనచేత (కప్పుడుగుడ్డచేత), నిభృతం = గూఢముగా; నిచులయతి = ఆచ్ఛాదించుచున్నది.

తా. దేవీ ! సరస్వతి శివుని పలువిధములైన పూర్వపరాక్రమ వృత్తాంతములను వీణతో పాడుచున్నదై ఆ పాటనుమెచ్చి తలయూపుచున్న నీచే ప్రశంసావాక్యము (లెస్స, బాగు, సెబాసు అనువచనము) పలుకుటకు ప్రారంభింపబడగా నీ వాక్కులకు సంబంధించిన తియ్యదనములచే తప్పుగా పలకబడిన (పరిహసింపబడిన) తీగల అవ్యక్తమధుర ధ్వనులుగల తన వీణను గవిసెనచే గూఢముగా కప్పివేయుచున్నది. దేవి పలుకులు సర్వతి వీణాధ్వనికంటె మధురతరమని భావము.

శ్లో॥ కరాగ్రేణ స్పృష్టం తుహినగిరిణా వత్సలతయా
గిరీశేనోదస్తం ముహు రధరపానాకులతయా,
కరగ్రాహ్యం శమ్భోర్ముఖముకురవృన్తం గిరిసుతే
కథంకారం బ్రూమస్తవ చుబుక మౌపమ్యరహితమ్. 67

అ. గిరిసుతే = హిమవన్నందినీ ! తుహిన, గిరిణా = మంచుకొండచే; వత్సలతయా = వాత్సల్యముతో; కర; అగ్రేణ = ముంజేతితో; స్పృష్టం = స్పృశింపబడినట్టియు, గిరీశేన = శివునిచే; అధర పాన, ఆకులతయా = అధరమానవలెననెడి (పానమందలి) తొందరపాటుచే; ఉదస్తం = పైకెత్తబడినదియు; అగు; శంభోః = శివునకు, కర, గ్రాహ్యం = చేతితో గ్రహింపదగిన; ముఖ, ముకుర, వృంతం = మొగముచూచుకొనెడి అద్దముయొక్క పిడియైన; ఔపమ్య, రహితం = సాదృశ్యములేని; తవ = నీయొక్క, చుబుకం = గడ్డమును; కథంకారం = ఎట్లు; బ్రూమః = చెప్పుదుము ? (వర్ణింతుము).

తా. హిమవన్నందినీ ! నీతండ్రియైన మంచుకొండచే వాత్సల్యమున ముంజేతితో స్పృశింపబడినదియు, శివునిచే అధరమునానుటయందలి సంభ్రమముచే పైకెత్తబడినదియు, శివునకు చేతితో గ్రహింపదగిన మొగము చూచుకొనెడి అద్దము యొక్క పిడియైనదియునగు సాటిలేని నీ గడ్డము ఎట్లు వర్ణింతుము ? దానిని వర్ణించుట అలవికానిపని అని భావము. దేవి చెక్కులద్దములవలె నుండును. శివుడందు మొగముచూచుకొనును. ఆమెగడ్డమా అద్దము పిడివలె నున్నదని చెప్పబడినది.

శ్లో॥ భుజాశ్లేషా న్నిత్యం పురదమయితుః కంటకవతీ
తవ గ్రీవా ధత్తే ముఖకమలనాళశ్రియ మియమ్,
స్వతశ్శ్వేతా కాలాగరుబహుళ జమ్బాలమలినా
మృణాళీలాలిత్యం వహతి యదధోహారలతికా. 68

అ. నిత్యం = సర్వదా; పురదమయితుః = త్రిపురసంహారియైన శివునియొక్క, భుజ, ఆశ్లేషాత్ = బాహువుల కౌగిలింతవలన; కంటకవతీ = ముండ్లవంటి గుర్తులుకల (గగుర్పాటుకల); తవ = నీ యొక్క; ఇయం = ఈ; గ్రీవా = కంఠము; ముఖ, కమల, నాళ, శ్రియం = ముఖమనెడి పద్మముయొక్క నాళము (కాడ) యొక్క శోభను; ధత్తే = ధరించుచున్నది; యత్ = ఏకారణమువలన; స్వతః, శ్వేతా = స్వతస్సిద్ధముగా

తెల్లనిదైనను; అధః = దానిక్రిందనున్న హారలతికా = లతవంటి హారము, కాలాగరు, బహుళ, జంబాల మలినా = నల్లనిఅగరుద్రవ్యమనెడి అధికమైన బురదచే నల్లనిదై; మృణాళీ, లాలిత్యం = తామరతూడుయొక్క సౌందర్యమును, వహతి = వహించుచున్నదో, అలం. కావ్యలింగము, రూపకము.

తా. దేవీ ! ఏకారణముచే స్వతస్సిద్ధముగా తెల్లనిదైనను క్రిందనున్న లతవంటి నీ ముత్యాలహారము నల్లని అగరనెడి అధికమైన బురదచే తామరతూడుయొక్క సౌందర్యమును వహించుచున్నదో ఆ కారణముచే నిత్యము త్రిపురసంహారియైన శివునిబాహువుల ఆలింగనముచే పులకాంకితమైన యీ నీ కంఠము ముఖమనెడి పద్మముయొక్క కాడయొక్క శోభను ధరించుచున్నది.

శ్లో॥ గళే రేఖా స్తిస్రో గతిగమక గీతైకనిపుణే !
వివాహవ్యానద్ధ ప్రగుణ గుణ సఙ్ఖ్యా ప్రతిభువః,
విరాజన్తే నానావిధమధుర రాగాకరభువాం
త్రయాణాం గ్రామాణాం స్థితి నియమసీమాన ఇవ తే. 69

అ. గతి , గమక , గీత, ఏక, నిపుణే = సంగీతవిధానమందలి మార్గదేశి గమకములను పాడుటయందు మిక్కిలినేర్పుగల ఓ తల్లీ , వివాహ, వ్యానద్ధ ప్రగుణ, గుణ, సంఖ్యా, ప్రతిభువః = వివాహమందు మెడయందు కట్టబడిన చాల పురులచే పేనబడిన మూడు సూత్రములసంఖ్యకు జ్ఞాపకములైన, తే = నీ యొక్క, గళే = కంఠమందలి, తిస్రః రేఖాః = మూడురేఖలు నానా, విధ, మధుర రాగ, ఆకర భువాం = అనేకవిధములైన తియ్యనిరాగముల గనులకు (మేళకర్తలకు) నెలవులగు, త్రయాణాం = మూడైన, గ్రామాణాం = షడ్జ, మధ్యమ, గాంధార గ్రామముల యొక్క స్థితి , నియమ, సీమానః, ఇవ = స్థిరమైన ఉనికిని నియమించుటకై (కదలకుండచేయుటకై) కల్పింపబడిన హద్దులవలె, విరాజంతే = ప్రకాశించుచున్నవి

తా. సంగీతవిధానమందలి మార్గదేశిపద్ధతుల ననుసరించి పాడుటయందు మిక్కిలి నిపుణురాలవైన ఓ దేవీ ! వివాహసమయమున శివునిచే కట్టబడిన చాల పేటలచే పెనవేయబడిన మూడు దారములలెక్కను స్మరింపజేయు నీకంఠమందలి మూడు రేఖలు పలువిధములైన మనోహరములైన రాగముల మేళకర్తలకు (గనులకు) నిలయములగు షడ్జమధ్యమ గాంధారములను మూడు గ్రామముల స్థిరమైన ఉనికిని కదలకుండ జేయుటకై

కల్పింపబడిన హద్దులవలె ప్రకాశించు చున్నవి. దేవి కంఠమునందలి మూడు రేఖలు పెండ్లి సమయమున శివుడామె మెడలో కట్టిన మూడుదారముల చిహ్నములవలె కనబడుచు అవి ఆమె కంఠమునుండి వెడలు చున్న రాగములకు ప్రభవములైన షడ్జమధ్యమ గాంధార గ్రామముల ఒండొకటితో కలియకుండ కల్పింపబడిన హద్దులవలె నున్నవి.

శ్లో॥ మృణాళీమృద్వీనాం తవ భుజలతానాం చతసృణాం
చతుర్భి స్సౌన్దర్యం సరసిజభవః స్తౌతి వదనైః,
నఖేభ్య స్సన్త్రస్యన్ ప్రథమమథనా దంధకరిపో
శ్చతుర్ణాం శీర్షాణాం సమ మభయహస్తార్పణధియా. 70

అ. ఓ దేవీ ! సరసిజ, భవః = పద్మసంభవుడైన బ్రహ్మ, ప్రథమ, మథనాత్ = దక్షాధ్వరధ్వంససమయమున పూర్వము తనను కోయుటవలన, అంధక, రిపోః = అంధకాసురునికిశత్రువైన శివునియొక్క , నఖేభ్యః = గోళ్ళవలన, సంత్రస్యన్ = భీతిపొందినవాడై, చతుర్ణాం , శీర్షాణాం = మిగిలిన నాలుగు తలలకును, సమం = ఒక్కమాఱే, అభయ, హస్త, అర్పణ ధియా = అభయహస్తముల నొసంగునను బుద్ధిచే, చతుర్భిః, వదనైః = నాలుగుముఖములచే, మృణాళీ, మృద్వీనాం = తామర తూండ్లవలె మృదువులైన, చతసృణాం = నాలుగగు, తవ = నీయొక్క , భుజలతానాం = తీగలవంటి బాహువులయొక్క , సౌందర్యం = అందమును , స్తౌతి = స్తుతించుచున్నాడు.

తా. ఓ దేవీ ! పూర్వము దక్షాధ్వర ధ్వంససమయమున శివుడు తన తల నొకదానిని త్రుంచుటచే బ్రహ్మదేవుడాతని గోళ్ళవలన భయమొందినవాడై మిగిలిన నాలుగు తలలకు నీవొక్కమాఱే అభయహస్తముల నొసంగుదువను తలపుచే నాలుగుముఖములచే తామరతూండ్లవలె మృదువులైన లతాసుకుమారములైన ఈ భుజముల అందమును స్తుతించుచున్నాడు.

శ్లో॥ నఖానా ముద్యోతైర్నవనళినరాగం విహసతాం
కరాణాం తే కాన్తిం కథయ కథయామః కథముమే,
కయాచిద్వా సామ్యం భజతు కలయా హస్త కమలం
యది క్రీడల్లక్ష్మ్యా చరణతలలాక్షారసచణమ్. 71

అ. ఉమే = పార్వతీ ! నఖానాం = గోళ్ళయొక్క, ఉద్యోతైః = కాంతులచే, నవ, నళిన, రాగం = క్రొత్తతామరల యెఱ్ఱదనమును, విహసతాం = గేలిసేయునట్టి, తే = నీయొక్క , కరాణాం = చేతులయొక్క , కాంతిం = కాంతిని, కథం ఎట్లు, కథయామః = వర్ణింతుము (చెప్పుదుము). కథయ = చెప్పుము , హంత = అయ్యో, కమలం = లక్ష్మీదేవి నివసించు పద్మము, క్రీడత్, లక్ష్మీ, చరణ, తల, లాక్షా, రస, చణం, యది = క్రీడించుచున్న లక్ష్మియొక్క పాదముల లత్తుకరసమును పొందుటకు దక్షమైనచో, కయాచిత్, కలయా = నీచేతియొక్క ఒకానొక అంశముతో, సామ్య = సాదృశ్యమును, భజతు, వా = పొందునేమో,

తా. పార్వతీ ! గోళ్ళకాంతులతో అప్పుడే వికసించిన పద్మముల ఎఱ్ఱతనమును గేలి సేయు నీచేతులకాంతిని ఎట్లు వర్ణింపజాలుదుమో చెప్పుము. అయ్యో ! పద్మము క్రీడించుచున్న లక్ష్మీదేవి పాదముల లత్తుక రసము పొందుటకు సమర్థమైనచో నీచేతుల కాంతుల ఏ లేశముతో నైనను పోలికను పొందునేమో? దేవి హస్తకాంతి అప్పుడే వికసించు పద్మముల ఆరుణ్యమును గూడ గేలిచేయు ననియు, క్రీడించు లక్ష్మీదేవి పాదముల పారాణి అంటినచో అది ఆమె చేతి కాంతుల ఏ లేశమునైనను పొందజాలునేమో అనియు భావము.

శ్లో॥ సమం దేవి స్కన్దద్విపవదనపీతం స్తనయుగం
తవేదం నః ఖేదం హరతు సతతం ప్రస్నుతముఖమ్,
యదాలో క్యాశఙ్కాకులిత హృదయో హాసజనకః
స్వకుమ్భౌ హేరమ్బుః పరిమృశతి హస్తేన ద్రుటితి. 72

అ. దేవి = ఓ పార్వతీ ! యత్ = ఏ నీపాలిండ్ల జంటను, ఆలోక్య = చూచి, ఆశంకా ఆకులిత, హృదయః = తల్లితన కుంభములను తీసికొన్న దేమోయను భయముచే కలత పొందిన చిత్తము కలవాడై, హాస , జనకః = చూచువారికి నవ్వు కలిగించుచు, హస్తేన = తన చేతితో, ద్రుటితి = వేగముగ, స్వకుంభౌ = తన కుంభ స్థలములను , పరిమృశతి = తడవుకొను చున్నాడో, సమం = ఏకసమయమున, స్కంద, ద్విపవదన, , పీతం = కుమారస్వామి చేతను, ఏనుగుమోముగల వినాయకునిచేతను, త్రాగబడిన, తవ = నీ యొక్క, ప్రస్నుత, ముఖం = కాఱుచున్న పాలతో కూడిన మొనలుగల , ఇదం = ఈ, స్తన, యుగం = కుచములజంట, నః = మాయొక్క, ఖేదం = దుఃఖమును,

సతతం = ఎలప్పుడును, హరతు = పోగొట్టుగాక.

తా. దేవీ ! విఘ్నేశ్వరుడును కుమారస్వామియును ఏక సమయమున నీ కుచములజంటను కుడుపుచున్నారు. వాని చూచుకములనుండి పాలుకాఱుచున్నవి. ఆ పాలిండ్లజంటనుచూచి విఘ్నేశ్వరుడు తల్లివైన నీవు తన కుంభములజంటను తీసికొంటివేమో అను భ్రాంతిచే వేగముగ వానిని తనచేతితో ఉన్నవో లేవో యని తడవుకొనుచు చూచువారికి నవ్వుపుట్టించుచున్నాడు. అట్టి నీస్తనయుగ్మము మా దుఃఖముల నెల్లప్పుడును తొలగించుగాక !

శ్లో॥ అమూ తే వక్షోజా వమృత రసమాణిక్యకుతుపౌ
న సన్దేహస్పన్దో నగపతిపతాకే ! మనసి నః ?
పిబన్తౌ తౌ యస్మా దవిదితవధూసఙ్గరసికౌ
కుమారా వద్యాపి ద్విరదవదనక్రౌఞ్చదళనౌ. 73

అ. నగపతి, పతాకే = పర్వతరాజైన హిమవంతుని విజయధ్వజమగు, ఓతల్లీ, యస్మాత్ = ఏకారణమువలన, తౌ = నీ స్తనములను , పిబంతౌ = త్రాగుచున్న, ద్విరదవదన, క్రౌంచదళనౌ = ఏనుగుమోముగల విఘ్నేశ్వరుడును, క్రౌంచాద్రిని భేదించిన కుమారస్వామియును, అవిదిత , వధూ, సంగరసికౌ = తెలియబడని తరుణుల కూటమియందలి రుచికలవారై, అద్య , అపి = ఇప్పటికిని, కుమారౌ = బాలురుగానే యుందురో, ఆకారణముచే, అమూ =ఈ, తే = నీయొక్క, వక్షోజౌ = స్తనములురెండును, అమృత, రస, మాణిక్య, కుతుపౌ = సుధారసముచే నిండిన మణిమయములైన సిద్దెలు , అని, నః = మాయొక్క , మనసి = మనస్సునందు, సందేహ, స్పందః = సంశయము యొక్క లేశమును, న = లేదు.

తా. నగరాజైన హిమవంతుని విజయధ్వజమగు నో తల్లీ ! ఈ నీ స్తనములు అమృతరసముతో నిండిన మణిమయములైన సిద్దెలనుటలో మా మనస్సునందు కొంచెము సందేహముకూడా లేదు. ఏలయన ఆస్తనముపాలుత్రాగుచున్న వినాయక కుమారస్వాములిరువురును, ఇప్పటికిని తరుణులకూటమియందలి రుచి తెలియని బాలురుగనే యున్నారు. (వారు దైహికమైన భార్యాసంగసౌఖ్యము నపేక్షింపక బ్రహ్మానందము ననుభవించుచున్నారని భావము.)

శ్లో॥ వహ త్యమ్బ ! స్తమ్బేరమదనుజ కుమ్భ ప్రకృతిభిః
సమారబ్ధాం ముక్తామణిభి రమలాం హారలతికామ్,
కుచాభోగో బిమ్బాధరరుచిభి రన్త శ్శబలితాం
ప్రతాపవ్యామిశ్రాం పురదమయితుం కీర్తి మివ తే. 74

అ. అంబ = ఓతల్లీ ! తే = నీయొక్క, కుచ, ఆభోగః = పాలిండ్లవిస్తారము, స్తంబేరమ, దనుజ, కుంభ, ప్రకృతిభిః = గజాసురునియొక్క కుంభములే ఉత్పత్తిస్థానములుగా గల, మణిభిః = ముత్యములచేత, సమారబ్ధాం = కూర్పబడినదియు, అమలాం = మణిదోషములు లేక నిర్మలమైనదియు, బింబ, అధర, రుచిభిః = దొండ పండువంటి అధరముయొక్క కాంతులచే, అంతః = లోపల, శబలితాం = చిత్రవర్ణముకలదిగా చేయబడినదియునగు, హార, లతికాం = లతవంటి హారమును, పుర, దమయితుః = శివునియొక్క, ప్రతాపవ్యామిశ్రాం = పరాక్రమముతో మిళితమైన, కీర్తిం , ఇవ= కీర్తినివలె; వహతి = ధరించుచున్నది.

తా. ఓ తల్లీ ! నీ స్తనవిస్తారము గజాసురుని కుంభస్థలమునుండి పుట్టిన ముత్యములచే కూర్పబడినదియు, మణిదోషములులేక, శుద్ధమైనదియు, దొండపండువంటి నీ అధరముయొక్క కాంతులచే లోపల చిత్రవర్ణముకలదిగా చేయబడినదియునగు లతవంటి హారమును త్రిపురసంహారి అయిన శివునియొక్క పరాక్రమముతోకూడిన కీర్తినివలె ధరించుచున్నది. (కీర్తి తెలుపనియు ప్రతాపమెఱుపనియు చెప్పుట కవిసమయము).

శ్లో॥ తవ స్తన్యం మన్యే ధరణి ధరకన్యే ! హృదయతః
పయః పారావారం పరివహతి సారస్వత మివ,
దయావత్యా దత్తం ద్రవిడ శిశు రాస్వాద్య తవ య
త్కవీనాం ప్రౌఢానా మజని కమనీయః కవయితా. 75

అ. ధరణిధర, కన్యే = హిమవంతుని కూతురవగు ఓ దేవీ ! తవ = నీయొక్క , స్తన్యం = చనుబాలను, హృదయతః = హృదయమునుండి పుట్టిన, పయః, పారావారం = పాలసముద్రము, సారస్వతం = వాఙ్మయవిలాసముగా మార్పుచెంది, పరివహతి, ఇవ = ప్రవహించుచున్నదేమో యని, మన్యే = తలచుచున్నాను, దయావత్యా = కరుణగల

నీచే, దత్తం = ఈయబడిన, తవ = నీయొక్క, యత్ = ఏస్తన్యమును, ద్రవిడశిశుః = అరవబాలుడు (నేను, శ్రీ శంకరాచార్యులు), ఆస్వాద్య = త్రాగి, ప్రౌఢానాం = ప్రౌఢులైన, కవీనాం = కవులయొక్క, కమనీయః = రంజింపచేయు, కవయితా = కవిగా, అజని = అయ్యెనో !

తా. హిమవంతుని కూతురవగు నో దేవీ ! నీచనుబాలను హృదయమునుండి పుట్టిన పాలకడలియే, వాఙ్మయ విలాసముగామారి ప్రవహించుచున్నదని నేను తలంతును. ఏలయన కరుణావంతురాలవైన నీచే నీయబడిన, ఆ పాలను త్రాగి ద్రవిడశిశువు (ఈ ద్రవిడశిశువు శంకరుడనికొందఱును, ప్రవరసేనుడని కొందఱును , మఱియొక ద్రవిడబాలుడని కొందఱును చెప్పుచున్నారు). ప్రౌఢులైన కవులలో జగన్మోహనుడైన (జగత్తునందలి రసికులను ముగ్ధులనొనరించు) కవిగా నయ్యెను.

శ్లో॥ హరక్రోధజ్వాలావళిభి రవలీఢేన వపుషా
గభీరే తే నాభీసరసి కృతసఙ్గో మనసిజః,
సముత్తస్థౌ తస్మా దచలతనయే ! ధూమలతికా
జనస్తాం జానీతే జనని ! తవ రోమావళి రితి. 76

అ. అచల , తనయే – హిమవన్నందినీ పార్వతీ ! జనని = తల్లీ, మనసిజః = మన్మథుడు , హర, క్రోధ, జ్వాలా, ఆవళిభిః = శివుని కోపపుమంటల సముదాయములచే, అవలీఢేన = కాల్చబడిన, వపుషా = శరీరముతో , తే = నీయొక్క , గభీరే = లోతైన, నాభీ, సరసి = నాభియను సరస్సునందు , కృత , సంగః = చేయబడిన సంసర్గముకలవాడు (మునిగినవాడు) అయ్యెను. తస్మాత్ = ఆనాభీసరస్సునుండి , ధూమ లతికా = లతవంటి పొగ, సముత్తస్థౌ = బయల్వెడలెను, జనః = జనుడు (లోకము), తాం = ఆ ధూమలతను, తవ = నీయొక్క, రోమావళిః , ఇతి నూగారుపంక్తియని, జానీతే = ఎఱుగుచున్నది (భావించుచున్నది) అలం. రూపకము, ఉత్ప్రేక్ష.

తా. హిమాచలతనయవైన ఓ తల్లీ ! మన్మథుడు శివునికోపాగ్ని జ్వాలల సమూహముచే దహింపబడిన దేహముతో నీ లోతైన నాభియనెడి సరస్సునందు మునిగెను. వేడివస్తువు నీటిలోపడినప్పుడు పొగ పైకివచ్చుట సహజము కావున అప్పుడాసరస్సునుండి లతవంటి పొగ బయల్వెడలెను. లోకము ఆ ధూమలతనే నీ నూగారుపంక్తియని తలంచుచున్నది. నూగారును ధూమరేఖతో పోల్చుట కవిసమయము.

శ్లో॥ యదేతత్కాళిన్దీ తను తరతరఙ్గాకృతి శివే
కృశే మధ్యే కిఞ్చిత్తవ జనని యద్భాతి సుధియాం,
విమర్దాదన్యోన్యం కుచకలశయో రన్తరగతం
తనూభూతం వ్యోమ ప్రవిశ దివ నాభిం కుహరిణీమ్. 77.

అ. జనని ! శివే = తల్లీ, ఓ పార్వతీ! తవ = నీయొక్క, కృశే, మధ్యే = సన్నని నడుమునందు, యత్, ఏతత్ = ఏయీ , కాళిందీ, తనుతర, తరంగ, ఆకృతి = యమునానదియొక్క మిక్కిలిచిన్నదగు కెరటముయొక్క ఆకారముగల, యత్, కించిత్ = ఏ (రోమావళియను) ఒకానొక అందమైనవస్తువు, సుధియాం = మంచిబుద్ధికలవారికి, భాతి = ప్రకాశించుచున్నదో (కనబడుచున్నదో), అది, కుచ, కలశయోః = కలశముల (పాత్రల) వంటి స్తనముల, అన్యోన్యం = పరస్పరము, ఒండొంటితో, విమర్దాత్ = ఒఱయుటవలన, అంతర, గతం = స్తనములనడుమనున్న, వ్యోమ = ఆకాశము, తనూభూతం = చిన్నదై, కుహరిణీం = రంధ్రముగల , నాభిం = బొడ్డును, ప్రవిశత్, ఇవ = ప్రవేశించుచున్నదివలె నున్నది. అలం. ఉత్ప్రేక్ష

తా. తల్లీ పార్వతీ ! నీ కృశించిన సన్నని నడుమునందు ఏ యీ యమునానదియొక్క మిక్కిలి చిన్నదైన కెరటముయొక్క ఆకారముగల ఆరును అందమైన యే ఒకానొక సూక్ష్మరేఖ విమర్శించి చూచువారికి కనబడుచున్నదో, అది కలశములవంటి స్తనములొండొంటితో ఒఱసికొనుటవలన నుండుటకు వీలులేని వాని మధ్యనున్న ఆకాశము మిక్కిలిచిన్నదై క్రిందకిజాఱి రంధ్రముగల బొడ్డులో ప్రవేశించుచున్నదేమో అనునట్లున్నది. ఆకాశము నల్లగానుండునని చెప్పుట కవిసమయము. కుచములనుండి నాభివరకును వ్యాపించు ఆరుకూడ నల్లగానుండును. అందుచే ఆచార్యులవారిట్లుత్ప్రేక్షించిరి.

శ్లో॥ స్థిరో గఙ్గావర్తస్తనముకుల రోమావళిలతా
కళావాలం కుణ్డం కుసుమశరతేజోహుతభుజః,
రతే ర్లీ లాగారం కిమపి తవ నాభిర్గిరిసుతే
బిలద్వారం సిద్ధే ర్గిరిశనయనానాం విజయతే . 78

అ. గిరిసుతే = హిమవత్కుమారీ ! తవ = నీయొక్క, నాభిః = బొడ్డు, స్థిరః = నిశ్చలమైన, గంగా, ఆవర్తః = గంగానది యందలిసుడి, (గంగావర్తము స్థిరముకాదు, ఇది

స్థిరము), స్తన, ముకుళ, రోమ, ఆవళి, లతా , కళా, ఆవాలం = కుచము లనెడి పూమొగ్గలకాధారమైన రోమారాజి యను తీగయొక్క రేఖకు ఆలవాలము (పాదు), కుసుమశర, తేజః హుతభుజః = మన్మథుని తేజస్సనెడి అగ్నికి , కుండం = హోమకుండము, రతేః = రతీదేవికి, లీలా, అగారం = విలాసభవనము, గిరిశ, నయనానాం = శివుని నేత్రములయొక్క, సిద్ధేః = సిద్ధికి (సాఫల్యమునకు) బిల, ద్వారం = గుహాముఖము అయి, కిం, అపి = ఇట్టిదని వర్ణించుట కలవి కానిదై, విజయతే = ప్రకాశించుచున్నది అలం. ఉల్లేఖము.

తా. పార్వతీ! నీ నాభి చలనములేని గంగానదినీటిసుడి. స్తనములనెడి పూమొగ్గలకాధారమైన రోమరాజియనెడి లతాపంక్తికి (రేఖకు) ఆలవాలము. మన్మథుని తేజస్సనెడి అగ్నికి హోమకుండము, రతీదేవికి విలాసభవనము, శివుని నేత్రములకు సాఫల్యము (సిద్ధి) కలిగించు గుహాద్వారము అయి, యిట్టిదని వర్ణించుట కలవికానిదై ప్రకాశించుచున్నది.

శ్లో॥ నిసర్గక్షీణస్య స్తనతటభరేణ క్లమజుషో
నమన్మూర్తేర్నారీ తిలక ! శనకై స్త్రుట్యత ఇవ,
చిరం తే మధ్యస్య త్రుటితతటినీ తీరతరుణా
సమావస్థాస్థేమ్నో భవతు కుశలం శైలతనయే. 79

అ. నారీ తిలక = స్త్రీరత్నమా ! శైల, తనయే = గిరికుమారీ ! నిసర్గ, క్షీణస్య = స్వభావముచేతనే కృశించినదియు, స్తన, తట, భరేణ = కుచ ప్రదేశముల బరువుచే, క్లమ, జుషః = ఆయాసమును పొందుచున్నదియు, నమత్, మూర్తేః = వంగుచున్న ఆకారముకలదియు, శనకైః = మెల్లగా, త్రుటతః ఇవ = తెగిపోవు చున్నటున్నదియు, త్రుటిత, తటినీ, తీర, తరుణా = ఒడ్డువిఱిగిన నదీతీరమునందలి చెట్టుతో, సమ, అవస్థా, స్థేమ్నుః, సమానమైన స్థితి యందు ఉనికికలదియు (అనగా స్థిరతలేనిదియు) అగు, తే = నీయొక్క, మధ్యస్య = నడుమునకు, చిరం = చిరకాలము, కుశలం = క్షేమము, భవతు = అగుగాక !

తా. స్త్రీరత్నమువైన ఓ పార్వతీ ! స్వభావము చేతనే సన్ననిదియు, కుచప్రదేముల బరువుచే బడలికను పొందుచున్నదియు, వంగుచున్న ఆకారము కలదియు, మెల్లమెల్లగా త్రెగిపోవుచున్నదో అనునట్లున్నదియు, ఒడ్డు విఱిగిన యేటి తీరము నందలి చెట్టుతో సమానమైన స్థితియందునికికలదియు (ఱిగిపడి పోవునేమో అనునట్లున్నదియు) అగు నీ నడుమునకు చిరకాలము క్షేమమగుగాక !

శ్లో॥ కుచౌ సద్యస్స్విద్య త్తట ఘటిత కూర్పాసభిదురౌ
కషన్తౌ దోర్మూలే కనకకలశాభౌ కలయతా,
తవ త్రాతుం భఙ్గా దలమితి వలగ్నం తనుభువా
త్రిధా నద్ధం దేవి త్రివళిలవలీవల్లిభిరివ. 80

అ. దేవి = పార్వతీ ! సద్యః స్విద్యత్, తట, ఘటిత, కూర్పాస, భిదురౌ = ఎప్పటికప్పుడే చెమర్చుచున్న ప్రక్కలయందు తొడగ బడిన రైకను పిగుల్చుచున్నవియు (చెమర్చుటకు కారణము శివుని ధ్యానించుటచే కలిగిన సాత్త్వికభావము) దోః, మూలే = కక్షభాగములను (చంకలను), కషంతౌ = ఒఱయుచున్నవియు, కనక, కలశ, ఆభౌ = బంగారుకుండలవంటి కాంతికలవియు, కుచౌ = స్తనములను, కలయతా = సృజించుచున్న, తనుభువా = మన్మథునిచే, భంగాత్ = అపాయమునుండి, త్రాతుం = రక్షించుటకు, అలం, ఇతి = సమర్థమని, తవ, వలగ్నం= నీనడుము, త్రివళి, లవలీ, వల్లిభిః = మూడుముడుతలనెడి లవలీలతలచే, నద్ధం, ఇవ = కట్టబడినదివలె నున్నది అలం. ఉత్ప్రేక్ష.

తా. ఓ దేవీ ! నీ స్తనములు ఎప్పటికప్పుడే శివుని స్మరించుచుండుటచే చెమర్చుచున్న ప్రక్కలందు తొడుగబడిన రైకను పిగులునట్లు చేయుచున్నవి. చంకలనొఱయుచున్నవి. బంగారుకుండలకాంతి వంటి కాంతి కలవి., వానిని అంతసుందరముగా సృజించుటకు వృద్ధుడైన బ్రహ్మకు నేర్పుచాలదు. కనుక మన్మథుడే వానిని సృజించెను. నీ నడుము సన్ననిది. కుచభారమును మోయజాలక అపాయము చెందవచ్చును. ఆ అపాయమునుండి రక్షించి మోయు సామర్థ్యము కలిగించుటకై మన్మథునిచే అది మూడుముడుతలనెడి లవలీ లతలచే కట్టబడినదేమో అన్నట్లున్నది.

శ్లో॥ గురుత్వం విస్తారం క్షితిధరపతిః పార్వతి నిజా
న్నితమ్బాదాచ్ఛిద్య త్వయి హరణరూపేణ నిదధే,
అతస్తే విస్తీర్ణో గురు రయ మశేషాం వసుమతీం
నితమ్బ ప్రాగ్భారః స్థగయతి లఘుత్వం నయతి చ. 81

అ. పార్వతి = దేవీ పార్వతీ ! క్షితిధర, పతిః = పర్వతరాజైన హిమవంతుడు నీ తండ్రి, నిజాత్ = తనదగు, నితంబాత్ = చఱియనుండి, గురుత్వం = బరువును, విస్తారం

= విస్తృతిని, ఆచ్ఛిద్య = ఛేదించి (తీసి), త్వయి = నీయందు , హరణ, రూపేణ, అరణము (వివాహకాలమున నాడు బిడ్డకు నిచ్చుధనము) రూపముచే, నిదధే = ఉంచెను, అతః = అందుచే , గురుః = గొప్పదియు, విస్తీర్ణః = విశాలమైనదియునగు, తే = నీయొక్క , నితంబప్రాగ్భారః = జఘనముయొక్క అతిశయము, అశేషాం = సమస్తమైన, వసుమతీం = భూమిని, స్థగయతి = కప్పుచున్నది, లఘుత్వం = తేలికతనమును, లాఘవమును, నయతి, చ = పొందించుచున్నది కూడ.

తా. దేవీ ! పార్వతీ ! నీ తండ్రియగు హిమవంతుడు తన చరియనుండి భారమును వైశాల్యమును గ్రహించి వివాహకాలమున నీ యందరణము రూపముగా నుంచెను. అందుచే భారవంతమును విశాలమును అగు నీ జఘనము (పిఱుదుల) యొక్క అతిశయము సమస్తమైన భూమిని ఆచ్ఛాదించి లాఘవమును కూడ పొందించుచున్నది (భూమియొక్క గురుత్వవిస్తారములనతిశయించి దానికి లాఘవము కలిగించుచున్నది.

శ్లో॥ కరీంద్రాణాం శుణ్డాన్ కనకకదళీ కాణ్డపటలీ
ముభాభ్యా మూరుభ్యా ముభయమపి నిర్జిత్య భవతీ,
సువృత్తాభ్యాం పత్యుః ప్రణతికఠినాభ్యాం గిరిసుతే !
విధిజ్ఞే జానుభ్యా విబుధకరికుమ్భద్వయ మసి. 82

అ. విధిజ్ఞే = శాస్త్రార్థమునెఱింగిన, గిరిసుతే = ఓపర్వతరాజనందినీ, భవతీ = నీవు, కరీంద్రాణాం = గజరాజులయొక్క, శుండాన్ = తొండములను, కనక, కదలీ, కాండ, పటలీం = బంగారుఅరటిచెట్లయొక్క మొదళ్ళసముదాయమును, ఉభయం అపి = ఈరెండింటిని, ఉభాభ్యాం = రెండైన, ఊరుభ్యాం = నీతొడలచేత, నిర్జిత్య = ఓడించి, సువృత్తాభ్యాం = మిక్కిలి గుండ్రమై అందమైన, పత్యుః = భర్త యైనశివునకు, ప్రణతికఠినాభ్యాం = మ్రొక్కుటచే గట్టిపడిన , జానుభ్యాం = మోకాళ్ళచేత, విబుధ, కరి, కుంభ, ద్వయం = దేవతల ఏనుగైన ఐరావతముయొక్క కుంభముల జంటను, నిర్జిత్య = జయించి, అసి = ఉందువు.

తా. శాస్త్రార్థమునెఱిగిన ఓ పార్వతీ ! నీవు గజేంద్రములయొక్క తొండములను, బంగారు అరటి చెట్లయొక్క, స్కంధముల సముదాయమును, ఈరెండిటిని నీరెండు తొడలచే జయించి భర్తయైన శివునకు మోకాళ్ళపైబడి మ్రొక్కుటచే గట్టిపడిన చక్కని

గుండ్రని నీరెండు మోకాళ్లచే దేవతల ఏనుగైన ఐరావతముయొక్క కుంభముల జంట నోడించి ప్రకాశించుచున్నావు. (దేవియొక్క తొడలు ఏనుగు దంతముల కంటెను అరిటి కంబములకంటెను. ఆమె మోకాళ్ళు ఐరావతము యొక్క కుంభములజంటకంటెను సుందరతరములుగా నున్నవని భావము.)

శ్లో॥ పరాజేతుం రుద్రం ద్విగుణ శరగర్భౌ గిరిసుతే !
నిషఙ్గౌ జంఘే తే విషమవిశిఖో బాఢ మకృత,
యదగ్రే దృశ్యన్తే దశశరఫలాః పాదయుగళీ
నఖాగ్రచ్ఛద్మాన స్సురమకుటశాణైక నికషాః (నిశితాః). 83

అ. గిరిసుతే = ఓపార్వతీ ! యత్, అగ్రే = ఏ నీపిక్కల చివర, పాద, యుగళీ, నఖ, అగ్ర, ఛద్మానః = అదుగులజంట యందలి గోళ్ళకొనలనెడి మిషగల, సుర, మకుట, శాణ, ఏకనికషాః = దేవతలయొక్క కిరీటములనెడి ఒఱపిడి రాళ్ళచే ముఖ్యముగా పదును పెట్టబడిన (నిశితాః అనుపాఠమున ఒఱపిడి రాళ్ళచే పదునుపెట్టబడి మిక్కిలి వాడియైన అని అర్థము దేవతలు దేవికడకరుదెంచి తమకిరీటములామె పాదములకు సోకునట్లుగ నమస్కరింతురనియు అందుచే ఆమె కాలిగోళ్ళు వాని రాపిడిచే పదును పెట్టబడినట్లుండు ననియు భావము). దశ శర, ఫలాః = పదిబాణపుటలుగులు, దృశ్యంతే = కనబడుచున్నవో, అవి, విషమవిశిఖః = బేసి బాణములుగల మన్మథుడు (పంచబాణుడు), రుద్రం = ఈ శ్వరుని, పరాజేతుం = గెలుచుటకు , తే = నీయొక్క , జంఘే = పిక్కలను, ద్విగుణ, శరగర్భౌ = రెండింతలైన (5+5= 10 అయిన) బాణములు మధ్యభాగమునగల, నిషంగౌ = అమ్ముల పొదులనుగా, అకృత = చేసెను. బాధం = నిశ్చయము.

తా. తల్లీ పార్వతీ ! అయిదు బాణములుగల మన్మథుడు శివుని గెల్చుటకు నీ పిక్కలను ద్విగుణీకృతములైన (10) బాణములతో కూడిన అమ్ములపొదులుగా చేసెనని భావింతును. అదినిజము. ఏలయన నీ పిక్కల చివరలందు పాదముల జంటయందలి గోళ్ళకొనలనెడి వ్యాజముగల బాణపుటలుగులు నీకు సమస్కారము చేయుటకై వచ్చిన దేవతల కిరీటములనెడి నికషోపలములచే వాడిచేయబడినట్లు కనబడుచున్నవి.

శ్లో. శ్రుతీనాంమూర్ధానో దధతి తవ యౌ శేఖరతయా
మమాప్యేతౌ మాత శ్శిరసి దయయా ధేహి చరణౌ,

యయోః పాద్యం పాథః పశుపతి జటాజుట తటినీ
యయోర్లాక్షాలక్ష్మీ రరుణ హరి చూడామణిరుచిః. 84

అ. మాతః = ఓ తల్లీ ! యయోః = ఏ నీ పాదములకు, పాద్యం, పాథః = కాళ్ళుకడుగుకొనుటకు తగిననీరు, పశుపతి జటా, జూట, తటినీ = శివుని జటాభారము నందలి నదియైన గంగయో, యయోః = వేనికి, లాక్షాలక్ష్మీః = లత్తుక యొక్క శోభ, అరుణ, హరి, చూడామణి, రుచిః = ఎఱ్ఱని విష్ణువుయొక్క శిరోమణియొక్క కాంతియో, యౌ = వేనిని, శ్రుతీనాం, మూర్ధానః = వేదశీర్షములైన ఉపనిషత్తులు, శేఖరతయా = శిరోభూషణములుగా , దధతి = ధరించునో, తవ , ఏతౌ, చరణౌ = ఈ నీ పాదములను, మమ శిరసి అపి = నా యొక్క శిరస్సు నందుకూడ, దయయా = దయతో, ధేహి = ఉంచుము.

తా. తల్లీ ! ఏ నీపాదములకు శివుని జటా భారమునందలి గంగానది పాద్యమైన జలమో, వేనికి విష్ణువుతలయందలి ఎఱ్ఱని మణులకాంతి లత్తుక శోభయో, వేనిని ఉపనిషత్తులు శిరోభూషణములుగా ధరించునో ఆ నీ పాదములను నాతల మీదకూడ నుంచుము. (ప్రణయకోపసమయమున శివుడు దేవిపాదములకు మ్రొక్కునప్పుడు అతని తలయందలి గంగ ఆమె అడుగులకు పాద్యోదక మగుగనియు, విష్ణువువచ్చి నమస్కరించునపుడు అతని తలయందలి ఎఱ్ఱని శిరోమణికాంతి ఆమె పాదములకు పారాణి శోభను కలిగించు ననియు భావము)

శ్లో॥ నమోవాకం బ్రూమో నయనరమణీయాయపదయో
స్తవాస్మై ద్వన్ద్వాయ స్ఫుటరుచిరసాలక్తకవతే,
అసూయ త్యన్తం యదభిహననాయ స్పృహయతే
పశూనా మీశానః ప్రమదవనకఙ్కేళితరవే. 85

అ. ఓదేవీ ! యత్, అభిహననాయ = ఏనీపాదములతాకుటకొఅకు, స్పృహయతే = కోరుచున్న, ప్రమద, వన, కంకేళి, తరవే = లీలోద్యానమునందలి అశోకవృక్షముకొఅకు, పశూనాం, ఈశానః = పశుపతియగుశివుడు, అత్యంతం = మిక్కిలి, అసూయతి = ఈర్ష్యవహించుచున్నాడో, అట్టి, స్ఫుట, రుచి రస, అలక్తకవతే = స్పష్టమైన కాంతిగల

తడిసిన లత్తుకరసముగల, నయనరమణీయాయ = కనులకుఅందమైన (చూచుటకింపైన) అస్మై, పదయోః, ద్వంద్వాయ = ఈ నీపాదములజంట కొఅకు, నమోవాకం = నమస్కారవాక్యమును, బ్రూమః =పలుకుదుము.

తా. అశోక వృక్షము స్త్రీల పాదతాడనముచే పుష్పించునని దోహద క్రియగా కవులు చెప్పుదురు. అందుచే లీలోద్యానము నందలి అశోకవృక్షము దేవి పాదములయొక్క తాడనము కొఅకు కోరును. ఆ తాడనము ప్రణయకోప సమయమున తనకు తప్ప నితరులకు లభింపరాదను అభిప్రాయముగల శివునికి అసూయ కలిగించును. అట్టి మెఅయుచున్న కాంతిగల తడిపారాణి కలదియు చూచుటకింపైనదియు నగు నీ పాదముల జంటకు నమస్కారవాక్యము పల్కుదుము.

శ్లో. మృషా కృత్వా గోత్రస్ఖలన మథ వైలక్ష్యనమితం
లలాటే భర్తారం చరణకమలే తాడయతి తే,
చిరా దన్తశ్శల్యం దహనకృత మున్మూలితవతా
తులాకోటిక్వాణైః కిలికిలిత మీశానరిపుణా. 86

అ. ఓదేవీ ! గోత్రస్ఖలనం = భార్యను మారుపేరుతో పిలుచుటను, మృషా = వేళాకోళముగా (అసత్యముగా), కృత్వా = చేసి, అథ = పిమ్మట, వైలక్ష్య, నమితం = సిగ్గుచే తలవంచుకొనియున్న, భర్తారం = భర్తయైనశివుని, తే = నీ యొక్క, చరణకమలే = పద్మమువంటిపాదము, లలాటే = ఫాలభాగమునందు, తాడయతి, సతి = తన్నినదికాగా, దహన, కృతం = శివునిమూడవకంటి మంటచే చేయబడిన, అంతఃశల్యం = హృద య తాపమును, చిరాత్ = చిరకాలమునకు, ఉన్మూలితవతా = తొలగించుకొనిన, ఈశాన, రిపుణా = శివుని శత్రువైనమన్మథునిచే, తులాకోటి క్వాణైః = అందెయొక్కధ్వనులచే, కిలికిలితం = కిలకిలనవ్వబడినది.

తా. ఓదేవీ ! వేళాకోళమునకు నిన్ను మాఱుపేరుతో పిలిచి సిగ్గుచే తలవంచుకొనియున్న భర్తయైన శివుని ఫాలభాగమున నీ పాద పద్మము తన్నినది కాగా ఆ ఫాలభాగము నందున్న మూడవకంటి మంటచేత తనే దహింపబడి హృదయతాపమును వహించుచున్న మన్మథుడు చిరకాలమునకా అవమానము తొలగింపబడిన దగుటచే నీ కాలి అందెధ్వనులచే కిలకిల నవ్వెనేమో అనుతలపు కలుగుచున్నది.

శో॥ హిమానీహన్తవ్యం హిమగిరినివాసైక చతురౌ
నిశాయాం నిద్రాణం నిశి చరమభాగే చ విశదౌ,
వరం లక్ష్మీపాత్రం శ్రియ మతిసృజన్తౌ సమయినాం
సరోజం త్వత్పాదౌ జనని ! జయత శ్చిత్ర మిహ కిమ్. 87

అ. జనని = ఓ తల్లీ ! హిమగిరి, నివాస, ఏక, చతురౌ = మంచుకొండపై నివసించుట యందు మిక్కిలి నేర్పరులై నట్టియు, నిశి = రాత్రియందును, చరమ భాగే చ = రాత్రిచివరభాగమందును, విశదే = నిర్మలమైనట్టియు, సమయినాం = సమయాచారమునవలంబించుభక్తులకు, శ్రియం = సంపదను, అతిసృజంతౌ = ఇచ్చుచున్నవియు అగు, త్వత్పాదౌ = నీచరణములు, హిమానీ, హంతవ్యం = మంచుగడ్డచే నశింప చేయదగినదియు, నిశాయాం = రాత్రియందు, నిద్రాణం = ముకుళించు చున్నదియు, వరం = అల్పముగా, లక్ష్మీపాత్రం = లక్ష్మికి (శోభకు) నిలయమైనదియు, అగు, సరోజం = పద్మమును, జయతః = జయించుచున్నవి, ఇహ = దీనియందు, కిం, చిత్రం = ఏమి విచిత్రము కలదు ?

తా. తల్లీ ! మంచుకొండపై నివసించుటయందు మిక్కిలి నేర్పరులై నట్టియు, రాత్రియందును, రాత్రి చివరి భాగమందును కూడ నిర్మలములై ప్రకాశించునట్టియు, సమయాచారపరులకు సంపదల నిచ్చునట్టియు నీ పాదములు, మంచుగడ్డచే తొలగింపబడిన శోభ కలిగినట్టియు, రాత్రియందు ముకుళించునట్టియు, అల్పమైన శోభకు నెలవైనట్టియు పద్మమును జయించుచున్నవి. ఇందు వింత ఏమున్నది ?

శో॥ పదం తే కీర్తీనాం ప్రపద మపదం దేవి విపదాం
కథం నీతం సద్భిః కఠినకమఠీకర్పరతులామ్,
కథం వా పాణిభ్యా ముపయమనకాలే పురభిదా
య దాదాయ న్యస్తం దృషది దయమానేన మనసా. 88

అ. దేవి = ఓదేవీ! యత్ = ఏనీపాదాగ్రము, ఉపయమన, కాలే = వివాహసమయమున, పురభిదా = త్రిపురసంహారియైన శివునిచేత, దయమానేన, మనసా = దయతోకూడినచిత్తముతో, పాణిభ్యాం = రెండు చేతులతో, ఆదాయ = ఎత్తి, దృషది = సన్నెకంటియందు, కథం వా = ఎట్లో, న్యస్తం = ఉంచబడినదో, కీర్తీనాం = కీర్తులకు,

పదం = నిలయమైనదియు, విపదాం = ఆపదలకు, అపదం = స్థానముకానట్టియు, తే = నీయొక్క, ప్రపదం = ఆకాలిచివర, సద్మిః = యోగ్యులైనకవులచే, కఠిన, కమఠీ, కర్పర, తులాం = కఠినమైన తాబేటియొక్క వీపుచిప్పతోపోలికను, కథం = ఏలాగున, నీతం = పొందింపబడినది.

తా. ఓ దేవీ ! వివాహకాలమున త్రిపురారియైన శివునిచే దయతో కూడిన చిత్తముతో ఏ నీ పాదముచివర రెండుచేతులతో నెత్తబడి సన్నెకంటిరాతిపై అతికష్టముతో నుంచబడినదో కీర్తులకు స్థానమైనట్టియు, ఆపదలకు స్థానముకానట్టియు ఆ నీ పాదాగ్రము యోగ్యులైన కవులచే కఠినమైన తాబేటివీపుచిప్పతోడి పోలికను పొందింపబడినది.

శ్లో॥ నఖై ర్నాకస్త్రీణాం కరకమలసఙ్కోచ శశిభి
స్తరూణాం దివ్యానాం హసత ఇవ తే చణ్డి చరణౌ,
ఫలాని స్వస్థేభ్యః కిసలయకరాగ్రేణ దదతాం
దరిద్రేభ్యో భద్రాం శ్రియ మనిశ మవ్నోయ దదతౌ. 89

అ. చండి = ఓ పార్వతీ ! దరిద్రేభ్యః = పేదలకొఅకు, భద్రాం = శుభకరమైన, శ్రియం = లక్ష్మిని, అనిశం ఎల్లప్పుడు, అవ్నోయ = వేగముగ, దదతౌ = ఇచ్చుచున్న, తే = నీయొక్క, చరణౌ = పాదములు, నాకస్త్రీణాం = దేవతాస్త్రీలయొక్క, కర, కమల,సంకోచ, శశిభిః = చేతులనెడి పద్మములను ముకుళింపజేయుటయందు చంద్రులైన (దేవీ చరణములను చూడగనే దేవతాంగనలు చేతులుజోడించురని భావము). నఖైః = గోళ్లచేత, స్వస్థేభ్యః = స్వర్గమందున్న (సుఖులైన) దేవతలకొఅకు, ఫలాని = ఫలములను (అభీష్టవస్తువులను) కిసలయ, కర, అగ్రేణ = చిగురాకులనెడిముంజేతితో, దదతాం = ఇచ్చుచున్న, దివ్యానాం, తరూణాం = దేవతావృక్షములను (కల్పవృక్షములను), హసతః, ఇవ = నవ్వుచున్న వో యనునట్లున్నవి. అలం. ఉత్ప్రేక్ష.

తా. ఓ పార్వతీ ! పేదలకొఅకు శుభకరమైన పుష్కలమైన సంపదల నెల్లప్పుడును శీఘ్రముగా నిచ్చుచున్న నీ పాదములు, దేవతా స్త్రీలయొక్క హస్తములనెడి పద్మములను ముకుళింపచేయుటయందు చంద్రులైన గోళ్లచే స్వర్గమందున్న సంపన్నులైన దేవతల కొఅకు అభీష్టవస్తువులను చిగుఁగాకులనెడి చేతులకొనలచే ఇచ్చుచున్న దేవతావృక్షములను (కల్పవృక్షములను) నవ్వుచున్నవా యనునట్లున్నవి.

శ్లో॥ దదానే దీనేభ్యః శ్రియ మనిశ మాశానుసదృశీ
మమన్దం సౌందర్య ప్రకరమకరన్దం వికిరతి,
త వాస్మిన్ మన్దార స్తబకసుభగే యాతు చరణే
నిమజ్జ న్మజ్జీవః కరణచరణైష్షట్చరణతామ్. 90

అ. ఓదేవీ ! దీనేభ్యః = ఆర్తులకొఅకు, ఆశా, అనుసదృశీం = అభిలాషకు తగిన, శ్రియం = సంపదను, అనిశం = ఎల్లప్పుడును, దదానే = ఇచ్చుచున్నదియు, అమందం = అధికమైన, సౌందర్య, ప్రకర, మకరందం = సౌందర్యసమూహమనెడి పూదేనెను, వికిరతి = చల్లుచున్నట్టియు, మందార, స్తబక, సుభగే = కల్పవృక్షపు పూలగుత్తివలె అందమైన, తవ = నీయొక్క, అస్మిన్, చరణే = పాదమందు, నిమజ్జన్ = మునుగుచున్నదైన, మత్, జీవః = నాజీవుడు, కరణచరణైః = పాదములవంటి (మనస్సు, మేను, కనులు, చెవులు, నాలుక, ముక్కు అను) ఆఱింద్రియములచేత, షట్, చరణతాం = ఆరుకాళ్లుగలతుమ్మెదతనమును, యాతు = పొందుగాక, అలం. రూపకము; ఉపమ.

తా. ఓదేవీ ! దీనులకొఅకెల్లప్పుడును కోరిక కనుగుణమైన సంపదనిచ్చు చున్నట్టియు, అధికమైన సౌందర్య సముదాయమనెడి పూదేనెను చల్లుచున్నట్టియు, కల్పవృక్షపు పూలగుత్తివలె అందమైనట్టియు, నీ యీ పాదమునందు మునుగుచున్నదై (తాకుచున్నదై) నా జీవుడు (నేననెడిజీవుడు) పాదములవంటి మనస్సుతో కూడిన యింద్రియములచేత ఆరు కాళ్లుగల తుమ్మెద తనమును పొందుగాక. (నా జీవుడనెడి తుమ్మెద నీ పాదపద్మ కుసుమ గుచ్ఛమునందు నిత్యము సక్తమై యుండుగాక అని భావము).

శ్లో॥ పదన్యాస క్రీడాపరిచయ మివారబ్ధుమనసః
స్ఖలన్త స్తే ఖేలం భవన కలహంసా న జహతి,
అతస్తేషాం శిక్షాం సుభగమణి మఞ్జీరరణిత
చ్ఛలా దాచక్షాణం చరణ కమలం చారుచరితే. 91

అ. చారుచరితే = మనోహరమైనచరిత్రకలదానా! దేవీ ! తే = నీ యొక్క, భవన, కలహంసాః = గృహమందలి పెంపుడుహంసలు, పద, న్యాస, క్రీడా, పరిచయం

= నడచునప్పుడు పాదములనుంచుటయను ఆటయందలి అభ్యాసమును, ఆరబ్ధమనసః, ఇవ = ఆరంభించుటకు వాంఛించుమనస్సు కలవివలె, స్థలంతః = తడబడుచు, ఖేలం = క్రీడను, న, జహతి = విడువకున్నవి, అతః = అందువలన, చరణ, కమలం = పద్మమువంటి నీపాదము, సుభగ, మణి, మంజీర, రణిత, ఛలాత్ = సుందరమైన మణులతో చేయబడిన, అందెల శబ్దమనెడి మిషవలన (తో), తేషాం = వానికి (హంసలకు) శిక్షాం = పాదన్యాసపాఠమును, ఆచక్షాణం (ఇవ) = చెప్పుచున్నదో యనునట్లున్నది, అలం. ఉత్ప్రేక్ష.

తా. మనోహరమైన చరిత్రగల ఓదేవీ ! నీ భవనమందలి పెంపుడు హంసలు అందముగా పదముల నిడుటయను విలాసము నందలి అభ్యాసమును మొదలుపెట్టగోరు మనస్సుకలవై అట్లుచేయజాలక తొట్రుపడుచున్న ఆ ఆటను విడువకున్నవి. అందుచే నీ పాదపద్మము సుందరమైనట్టియు మణిమయమైనట్టియు కాలి అందె శబ్దమనెడి వ్యాజముచే ఆ హంసలకు సుభగపాదన్యాసపాఠమును చెప్పుచున్నదేమో అనునట్లున్నది. దేవి నడక హంసలకు కూడ నడకను నేర్పుచున్నట్లుండుటచే ఆమె నడక హంసలనడక కంటెను సుందరమైనదనియు, హంసలు కూడ అంత అందముగా నడవజాలక తడబడుచున్నవనియు. భావము.

శ్లో॥ గతాస్తే మఞ్చత్వం ద్రుహిణహరిరుద్రేశ్వరభృతః
శివస్స్వచ్ఛ చ్ఛాయా కపటఘటిత ప్రచ్ఛదపటః,
త్వదీయానాం భాసాం ప్రతిఫలన రాగారుణతయా
శరీరీ శృఙ్గారో రస ఇవ దృశాం దోగ్ధి కుతుకమ్. 92

అ. ద్రుహిణ, హరి, రుద్ర, ఈశ్వర, భృతః = బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, ఈశుడు అనుఅధికారము వహించువారు (నల్గురును), తే = నీయొక్క, మంచత్వం = మంచపుతనమును, గతాః = పొందిరి, శివః = సదాశివుడు, స్వచ్ఛ, ఛాయా, కపట, ఘటిత, ప్రచ్ఛద, పటః = తెల్లనికాంతియనెడుమిషచే చేయబడిన కప్పుకొను వస్త్రము (దుప్పటి) యై, త్వదీయానాం = నీకుసంబంధించిన, భాసాం = కాంతులయొక్క, ప్రతిఫలన,

రాగ, అరుణతయా = ప్రతిబింబించుటవలన కలిగిన రంగుచే వచ్చిన ఎఱ్ఱతనముచే, శరీరీ = దేహముకలిగిన, శృంగారః రసః ఇవ = శృంగారరసమువలె, శృంగారరస మెఱుపని కవి సమయము. దృశాం = నేత్రములకు, కుతుకం = వేడుకను, దోగ్ధి = (పితుకుచున్నాడు) కలిగించుచున్నాడు.

తా. బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, ఈశుడు అనుఅధికారములను వహించు నలుగురును నీకు సన్నిహితముగానుండి సేవ చేయునవకాశమునకే నీకు మంచమగుటను పొందిరి. శివుడను నధికారి తెల్లని కాంతియనెడి మిషచే కల్పింపబడిన కప్పుకొను దుప్పటియై, నీకుసంబంధించిన అరుణకాంతుల ప్రతిబింబించుటవలన కలిగిన రంగుచే సమకూడిన యెఱ్ఱతనముచే దేహము దాల్చిన శృంగారరసము వలె కన్నులకు వేడుక కలిగించుచున్నాడు. శివుడు సహజముగా తెల్లనివాడైనను దేవి యెఱ్ఱని కాంతుల ప్రతిఫలనముచే అరుణుడై మూర్తమైన శృంగారరసమువలె కనబడుచున్నాడని భావము.

శ్లో॥ అరాళా కేశేషు ప్రకృతిసరళా మందహసితే
శిరీషాభా చిత్తే దృషదుపల శోభా కుచతటే,
భృశం తన్వీ మధ్యే పృథు రురసిజారోహ విషయే
జగత్త్రాతుం శమ్భోర్జయతి కరుణా కాచి దరుణా. 93

అ. దేవీ ! కేశేషు = వెండ్రుకలయందు, అరాళా = వక్రమైనదియు, మంద, హసితే= చిఱునవ్వునందు, ప్రకృతి, సరళా = స్వభావముచేత, సుకుమారమైనదియు, చిత్తే = హృదయమునందు, శిరీష, ఆభా = దిరెసెనపూవు కాంతివంటి కాంతికలదియు (దిరిసెనపూవువలె మృదువైనదియు), కుచ, తటే = స్తనముల ప్రాంతమునందు, దృషత్, ఉపల, శోభా = సన్నెకంటిశోభవంటి శోభకలదియు, (కఠినమైనదియు), మధ్యే = నడుమునందు, భృశం = మిక్కిలి, తన్వీ = సన్ననిదియు, ఉరసిజ, ఆరోహ, విషయే = కుచములయొక్కయు పిఱుదులయొక్కయు ప్రదేశమందు, పృథుః = గొప్పదియు, అరుణా = ఎఱ్ఱనైనదియు, అగు, శంభోః = శివునియొక్క , కాచిత్ = అనిర్వాచ్యమైన, కరుణా = దయ, జగత్ = జగత్తును, త్రాతుం = రక్షించుటకు,

జయతి = సర్వోత్కృష్టమై వెలయుచున్నది.

తా. దేవియే అరుణ అను పేరుగ కామేశ్వరి. ఆమె సదాశివుని కరుణా స్వరూపిణి. ఆమె సౌందర్యమిందు వర్ణింపబడుచున్నది. కేశములందు వంకరైనదియు, చిఱునగవునందు సహజసు కుమారమైనదియు, హృదయమునందు శిరీషకుసుమమువలె మృదువైనదియు, స్తనప్రాంతమందు సన్నెకంటివలె కఠినమైనదియు, నడుమునందు మిక్కిలి సన్ననిదియు, కుచజఘన భాగములందున్నతమైనదియు, ఎఱ్ఱనిదియు నగు శివునియొక్క ఒకానొక అనిర్వాచ్యమైనదయ జగత్తును రక్షించుటకై సర్వోత్కృష్టమై వెలయుచున్నది.

శ్లో॥ కళఙ్కః కస్తూరీ రజనికర బిమ్బం జలమయం
కళాభిః కర్పూరైర్మరకతకరణ్డం నిబిడితమ్,
అతస్త్వ ద్భోగేన ప్రతిదినమిదం రిక్త కుహరం
విధిర్భూయో భూయో నిబిడయతి నూనం తవ కృతే. 94

అ. తల్లీ! కళంకః = చంద్రునియందలిమచ్చ, కస్తూరీ = కస్తూరి, జలమయం = నీటితోనిండిన, రజనికర, బింబం = చంద్రబింబము, కళాభిః = కిరణరూపములైన, కర్పూరైః = కర్పూరములచే, నిబిడితం = దట్టముగానిండింపబడిన, మరకత, కరండం = మరకతమణులతో చేయబడిన పెట్టె, అతః = ఇందువలన, ప్రతిదినం = ప్రతిదినము, త్వత్, భోగేన = నీ అనుభవముచేత (నీవువాడుట చేత) రిక్త, కుహరం = వట్టిదిగాచేయబడిన లోపలిభాగముగల, ఇదం = ఈ పెట్టెను, విధిః = బ్రహ్మ, తవ కృతే = నీ కొఱకు, భూయః, భూయః = మాటిమాటికి, నిబిడయతి = నిండించును, నూనం = నిజము.

తా. తల్లీ ! చంద్రునియందలి మచ్చ కస్తూరి. జలమయమైన చంద్రబింబము కిరణములనెడి కర్పూరపు పలుకులచే నిండింపబడిన మరకతమణులపెట్టె. నీవు ప్రతిదినము వాడుటచేత వట్టిపోయిన ఆంతరముగల ఈ పెట్టెను బ్రహ్మ మాటి మాటికిని నింపుచుండును గదా! స్వభావముచే ప్రతిదినమును వెల్తిపడుచుండు చంద్రబింబమును బ్రహ్మ దేవికొఱకై నింపుచుండునని భావము.

శ్లో॥ పురారాతేరన్తః పురమసి తతస్త్వచ్చరణయో
స్సపర్యా మర్యాదా తరళ కరణానా మసులభా,
తథా హ్యేతే నీతా శ్శతమఖముఖాస్సిద్ధి మతులాం
తవ ద్వారోపా న్తస్థితిభి రణిమాద్యాభి రమరాः. 95

అ. ఓ తల్లీ ! నీవు , పుర, అరాతే ः = త్రిపురారియైన శివునకు , అంతఃపురం = రాణివాసమవు (పట్టమహిషివి), అసి = అగుదువు, తతः = అందువలన, త్వత్, చరణయోः = నీ పాదములయొక్క, సపర్యా, మర్యాదా = పూజావిధానము, తరళ, కరణానాం = చపలములైన యింద్రియములు కలవారికి, అసులభా = సుఖముగా లభ్యమగునది కాదు. తథా, హి = అదియట్లే కదా ! ఏతే = ఈ, శతమఖ, ముఖాः= ఇంద్రుడు మొదలుగా గల, అమరాः = దేవతలు, తవ = నీయొక్క, ద్వార, ఉపాంత, స్థితిభిः =ద్వారము యొక్క సమీపమందు ఉనికిగల, అణిమ, ఆద్యాభిः = అణిమ,మహిమ మొదలైన సిద్ధులచేతనే, అతులాం = సాటిలేని , సిద్ధిం = వాంఛాపూర్తిని, నీతాः = పొందింపఁబడిరి.

తా. ఓ తల్లీ ! నీవు త్రిపురవైరియైన శివునకు భార్యవు. అందువలన నీ పాదముల పూజావిధి చపలేంద్రియులైనవారికి సులభముగా లభించునదికాదు. అది సహజమే. ఇంద్రుడు మొదలగు దేవతలు నీ యొక్క ద్వారము సమీపమునందునికి గల అణిమాదులగు సిద్ధులచేతనే సాటిలేని మనోరథ సిద్ధిని పొందింపబడిరి. ఇంద్రాది దేవతలు చపలచిత్తులు, అందుచే వారష్టసిద్ధులతో తృప్తిపడి దేవిద్వారమునందే కావలియుందురు. వారికి దేవిని చేరి పూజించు భాగ్యము లేదు.

శ్లో. కళత్రం వైధాత్రం కతి కతి భజన్తే న కవయः
శ్రియో దేవ్యాः కో వా న భవతి పతిः కైరపి ధనైः,
మహాదేవం హిత్వా తవ సతి ! సతీనామచరమే !
కుచాభ్యా మాసఙ్గः కురవకతరో రప్య సులభः. 96

అ. సతీనాం = పతివ్రతలలో, అచరమే = అగ్రగణ్యురాలవగు, సతి = పార్వతీదేవీ, వైధాత్రం = బ్రహ్మకు సంబంధించిన, కళత్రం = భార్యను అనగా సరస్వతిని, కతికతి,

కవయః = ఎందరెందరు కవులు, న భజన్తే = సేవించుటలేదు, కః వా = ఏ పురుషుడైనను, కైః అపి = కొన్నియైన, ధనైః = ధనములచేత, శ్రియః దేవ్యాః = లక్ష్మీదేవియొక్క, పతిః = అధిపతియైన విష్ణువు, న భవతి = కాకుండును, మహాదేవం = శివుని, హిత్వా = విడిచి, తవ = నీ యొక్క, కుచాభ్యామ్ = స్తనములతోనైన , ఆసఙ్గః = సంపర్కము (పరిష్వంగము), కురవకతరోః అపి = గోరంటచెట్టునకుకూడ, అనులభః = సులభముకాదు, కురవకతరువునకు స్త్రీల కుచములతోడి కౌగిలింత దోహదము. అనగా పూలుపూచు నట్లుచేయు సాధనము. ఒక యువతి స్తనములతో కురవక వృక్షమును కౌగిలించుకొన్నచో అది పుష్పించునని కవి సమయము.

తా. పతివ్రతలలో అగ్రగణ్యురాలవైన ఓ సతీ , పార్వతీ, బ్రహ్మ భార్యయైన సరస్వతిని ఎంతెంతమంది కవులు భజించుటలేదు ? ఎవరు కొన్ని ధనములచే లక్ష్మీదేవికి భర్తయైన.విష్ణువు కాకుండును ? మహాదేవుడైన శివుని విడిచి నీకుచములతోడి ఆలింగనము గోరంట చెట్టునకు గూడ లభించుట దుర్లభము. ఎవ్వరైన సరస్వతికిని, లక్ష్మికిని, విద్యాసంపదలచే అధిపతులగుదురుగాని, నీకు మాత్రము కాజాలరు. ఏలయన, శివుని విడచి దోహద నిమిత్తమైన నీ కుచముల తోడి ఆలింగనము గోరంటచెట్టునకు కూడ నులభము కాదని భావము. దీనివలన దేవియొక్క అద్వితీయ పాతివ్రత్యము సూచింపబడుచున్నది.

శ్లో. గిరా మాహుర్దేవీం ద్రుహిణ గృహిణీ మాగమవిదో
హరేః పత్నీం పద్మాం హరసహచరీ మద్రితనయామ్,
తురీయా కాపి త్వం దురధిగమనిస్సీమ మహిమా
మహామాయా విశ్వం భ్రమయసి పరబ్రహ్మమహిషి. 97

అ. పరబ్రహ్మ మహి షి = పరమాత్మ స్వరూపుడగు సదాశివుని రాణీ, ఆగమవిదః = వేదములను తెలిసినవారు. త్వాం = నిన్ను, ద్రుహిణగృహిణీమ్ = బ్రహ్మయొక్క భార్య అగు, గిరాం, దేవీం = వాగ్దేవినిగ, అనగా సరస్వతినిగా, ఆహుః= చెప్పుదురు, నిన్నే, హరేః = విష్ణువుయొక్క , పత్నీం = భార్యయైన, పద్మాం = లక్ష్మినిగా, ఆహుః = చెప్పుదురు. నిన్నే , హర, సహ చరీమ్ = శివునితో విడువక సంచరించు, అద్రి, తనయామ్= పార్వతినిగ, ఆహుః = చెప్పుదురు, కాని, త్వం = నీవు, తురీయా =

పైమువ్వురునుగాక నాల్గవ దానవైన, కా. అపి = ఇట్టిదట్టిదని చెప్పరాని, దురధిగమనిస్సీమ మహిమా = పొందశక్యముగాని, హద్దులేని ప్రభావముగల, మహామాయా = గొప్పమాయవై, మూలప్రకృతివై, విశ్వ = సర్వప్రపంచమును, భ్రమయసి = మోహింపజేయుచున్నావు.

తా. పరబ్రహ్మ స్వరూపుడైన సదాశివునికి పట్టపు రాణివైన ఓ దేవీ, వేదవేత్తలైన పండితులు నిన్ను బ్రహ్మ భార్యవైన వాగ్దేవిగను, విష్ణువు భార్యయైన లక్ష్మిగను, ఎప్పుడును శివునితో కలిసితిరుగు హిమవంతుని కూతురు పార్వతిగాను చెప్పుదురు. కాని నీవాపై మువ్వురును కాదు. నాల్గవదానవు. ఇట్టి దట్టిదని చెప్పరానిదియు, పొందశక్యము కాని మేరలు లేని ప్రభావము కలదానవై, మహామాయా స్వరూపిణివై ప్రపంచమును మోహింప జేయుచున్నావు.

శ్లో॥ కదా కాలే మాతః ! కథయ కలితాలక్తక రసం
పిబేయం విద్యార్థీ తవ చరణ నిర్ణేజనజలమ్,
ప్రకృత్యా మూకానామపి చ కవితా కారణతయా
కదా ధత్తే వాణీముఖ కమల తామ్బూల రసతామ్ **98**

అ. హేమాతః = ఓతల్లీ, విద్యార్థీ = జ్ఞానమునర్థించునేను, కలిత, అలక్తక, రసం = కూడినలత్తుక ద్రవముగల, తవ = నీయొక్క, చరణ, నిర్ణేజన, జలమ్ = కాళ్ళు కడిగిననీటిని, కదా కాలే = ఎప్పుడు, పిబేయం = త్రాగుదును, అది, ప్రకృత్యా = స్వభావముచేతనే, మూకానామ్. అపి చ = మూగవారికి కూడా, కవితాకారణతయా = కవిత్వమునకు కూడ హేతువగుటచేత, వాణీముఖకమలతామ్బూలరసతామ్ = సరస్వతియొక్క ముఖపద్మమునందలి తాంబూలముయొక్క సారస్యమును కల్గియుండుటను. కదా = ఎప్పుడు , ధత్తే ధరించును.

తా. ఓ తల్లీ ! బ్రహ్మజ్ఞానమును పొందగోరు నేను లత్తుకరసముతో గూడిన నీ కాళ్ళు కడిగిన నీటిని ఎప్పుడు త్రాగుదునో కదా ! అది స్వభావసిద్ధముగనే మూగవారికి కూడ కవిత్వమును కలిగించు సామర్థ్యము కలదగుటచే, సరస్వతి ముఖపద్మము నందలి తాంబూలముయొక్క సారస్యమును ఎప్పుడు ధరించునో ! దేవికాళ్ళు కడిగిన నీరు మూగవారికి కూడ కవితాశక్తిని కలిగించును. కవిత్వము సరస్వతీ రూపము కావున అప్పుడు అది సరస్వతి యొక్క ముఖపద్మమునందలి తాంబూలరసము ధరించినది అగునని భావము.

శ్లో॥ సరస్వత్యా లక్ష్మ్యా విధిహరి సపత్నో విహరతే
రతేః పాతివ్రత్యం శిథిలయతి రమ్యేణ వపుషా,
చిరం జీవన్నేవ క్షపిత పశు పాశ వ్యతి కరః
పరానన్దాభిఖ్యం రసయతి రసం త్వద్భజనవాన్. 99

అ. ఓ దేవీ ! = త్వత్, భజనవాన్ = నీ సేవకలవాడు, నిన్ను భజించు వాడు, సరస్వత్యా = సరస్వతిచే, (విద్యచే), లక్ష్మ్యా = లక్ష్మిచే (సంపదచే) క్రమముగా, విధి, హరి, సపత్నుః = బ్రహ్మకును, విష్ణువునకును, శత్రువై (వారి భార్యలను వశీకరించు కొనుటచే వారికి విరోధియై), విహరతే = క్రీడించును, రమ్యేణ, వపుషా = సుందరమైన మేనిచే, రతేః = మన్మథుని భార్యయైన రతీదేవియొక్క , పాతివ్రత్యం = పాతివ్రత్యమును, శిథిలయతి = నశింపఁజేయును. (మన్మథుని కంటె నధిక సౌందర్యవంతుడగునని భావము) , చిరం = చిరకాలము, జీవన్ ఏవ = జీవించుచునే, క్షపిత, పశు, పాశవ్యతికరః = నశింపజేయఁబడిన జీవవిద్యాసంబంధము కలవాడై, (పశువు జీవుడు, సంసారము కట్టుకొయ్య, రాగ మోహాదులు త్రాళ్ళు) పర, ఆనంద అభిఖ్యం – బ్రహ్మానందమను పేరుగల, రసం = ఆనందమును, రసయతి = ఆస్వాదించును.

తా. దేవీ నిన్ను సేవించువాడు సరస్వతిచే (విద్యచే) బ్రహ్మకును , లక్ష్మిచే (సంపదచే) విష్ణువునకును విరోధియై క్రీడించును. లక్ష్మీ సరస్వతీ యుక్తుడగును, సుందరమైన శరీరముచే రతీదేవియొక్క పాతివ్రత్యమును నశింపఁజేయును, మన్మథాదిక సౌందర్య సముపేతుడగును, చిరకాలము జీవించుచునే జీవునికిని అతని సంసార బద్ధు నొనరించు రాగమోహాది పాశములకును గల నంబంధము విదళించిన వాడై బ్రహ్మానందమను పేరుగల ఆనందమను మహానందము నాస్వాదించును, సాదాఖ్యకళను సేవించు వాడిహపరానందములు రెండింటి ననుభవించునని భావము.

శ్లో॥ ప్రదీపజ్వాలాభిర్దివసకర నీరాజనవిధి
స్సుధా సూతేశ్చన్ద్రోపల జలలవైర్ధ్యర్ఘరచనా,
స్వకీయై రమ్భోభి స్సలిలనిధి సౌహిత్య కరణం
త్వదీయాభిర్వాగ్భిస్తవ జనని ! వాచాం స్తుతి రియమ్. 100

అ. జనని = తల్లీ! త్వదీయాభిః = నీకు సంబంధించిన (నీవు ప్రసాదించిన) వాగ్భిః = వాక్కులతో, తవ = నీయొక్క , వాచాం= వాక్కులయొక్క , ఇయం స్తుతిః = ఈ స్తోత్రము, ప్రదీప, జ్వాలాభిః = దివ్వెలయొక్క శిఖలతో (కాంతులతో), దివస, కర, నీరాజన, విధిః = సూర్యునికి నివాళి యొసంగుట , సుధా, సూతేః = అమృతమునకు పుట్టుచోటైన చంద్రునికి, చంద్ర, ఉపల, జల, లవైః = చంద్రకాంతశిలయందు చంద్రుడుదయించు నప్పుడూరిన నీటి లేశములతోc (బిందువులతో), అర్ఘ్య రచనా = అర్ఘ్యము కల్పించుట, స్వకీయైః = తనకు సంబంధించిన, అంభోభిః = ఉదకములతో , సలిలనిధి, సౌహిత్య, కరణం = సముద్రునకు సంతృప్తిని, చేయుట, (అగును)

తా. ఓ ! తల్లీ ! నీవు ప్రసాదించిన వాక్కులతోనే నీయీ వాగ్రూపమైన స్తుతి దివిటీ కాంతులతో సూర్యునికి నివాళి యొసంగుటయు, అమృతమునకు మూలస్థానమైన చంద్రునికి చంద్రకాంతశిలలయందూరిన నీటి బిందువులతో అర్ఘ్యము నిచ్చుటయు, సముద్రమున కందలి జలములతోనే (తర్పణాది క్రియలతో) తృప్తి చేయుటయు నగును. శ్రీమదాచార్యులవారిందు తమ ప్రతిభ యేమియు లేదనియు, దేవి ప్రసాదించిన వాక్కులతోనే ఆమెను స్తుతించుట జరిగినదనియు నిరహంకారులై చెప్పుచున్నారు.

కొన్ని ప్రతులలో ఈ రెండు శ్లోకములును అధికముగ కనుపించుచున్నవి.

శ్లో॥ సముద్భూత స్థూలస్తనభర మురశ్చారుహసితం
కటాక్షే కందర్పాः కతిచన కదంబద్యుతి వపుः !
హరస్య త్వద్ధ్యానం మనసి జనయంతి స్మ విమలా
భవత్యా యే భక్తాः పరిణతి రమీషామియమువే ? 101

తా. దేవీ ! పార్వతీ ! ఉన్నతములు స్థూలములునైన స్తనములు బరువు గల వక్షమును, అందమైన నవ్వును, కడగంటి చూపునందు కొందఱు మన్మథులను, కడిమిచెట్టువంటి కాంతిగల శరీరమును వహించి నిర్మలులైన నీభక్తులు శివునికి మనస్సునందు నీవను భ్రాంతిని కలిగించుచున్నారు. నిత్యము నిన్నే ధ్యానించుటచేత పవిత్రులగు నీ భక్తులు పొందు పరిణామమిదియే. (బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి అను సూక్తి ననుసరించి ఉపాసకులు ఉపాస్యదేవతయొక్క రూపమును పొందుదురు. ఇది సారూప్యముక్తి.)

శ్లో॥ నిధే ! నిత్యస్మేరే! నిరవధిగుణే ! నీతినిపుణే !
నిరాఘాటజ్ఞానే ! నియమపరచిత్తైకనిలయే !
నియత్యా నిర్ముక్తే! నిఖిలనిగమాంతస్తుత పదే !
నిరాతంకే ! నిత్యే ! నిగమయ మమాపి స్తుతి మిమామ్. 102

తా. భక్తులకు నిధానమైన ఓ తల్లీ ! నిత్యము చిఱునవ్వుకలదానా, అనంతగుణసంపదతో నొప్పుదానా ! నీతియందునేర్పరురాలా ! అమోఘమైన జ్ఞానసంపద కలదానా ! నియమము కలవారి మనస్సే నెలవుగా కలదానా, కట్టుబాటేదియు లేనిదానా ! సర్వోపనిషత్తులచే స్తుతింపబడిన పదములు కలదానా ! భయములేనిదానా ! శాశ్వతురాలా ! స్తుతి పూర్వకమైన కృతినర్పించుచున్నాను. గ్రహింపుము.

శివానన్దలహరి శ్లోకసూచి

శ్లోకసూచి	పేజీ	శ్లోకసూచి	పేజీ
అంకోలంనిజ	51	కారుణ్యామృత	43
అతిమృదులౌ	74	కింబ్రూమస్తవ	27
అమితముద	56	క్రీడార్థం	55
అరహసి	57	గభీరేకాసారే	6
అశనంగరళం	69	గళన్తీ	2
అసారేసంసారే	10	గాంభీర్యం	34
ఆకాశేన	44	గుహాయాం	9
అకీర్ణేన	37	ఘటోవా	5
ఆద్యాయామిత	47	ఛందఃశాఖి	36
ఆద్యా విద్యా	72	జడతా	57
ఆనందామృత	39	జననమృతి	66
ఆనందాశ్రుభి	52	జలధిమథన	68
ఆమ్నాయాంబు	29	జ్వాలోగ్రః	25
ఆరూఢభక్తి	58	త్రయీవేద్యం	2
ఆశాపాశ	60	త్వత్పాదాంబుజ	23
ఇదంతే యుక్తం	77	త్వమేకో	14
ఉపేక్షానోచేత్	12	దురాశా	14
ఏకోవారిజ	48	దూరీకృతాని	72
ఏష్యత్యేష	64	ధర్మోమే	31
కంచిత్కాల	65	ధీయన్త్రేణ	32
కదావా కై	19	ధృతిస్తంభా	16
కదావాత్వాం	20	ధైర్యాంకుశేన	74
కరలగ్న	35	ధ్యానాంజనేన	59
కరస్థే	21	నతిభిర్నుతిభిః	70
కరోమి	18	నరత్వందేవత్వం	8
కలాభ్యాం	1	నాలంవా పర	24
కల్యాణినం	61	నాలంవాసకృదేవ	26

శ్లోకసూచి	పేజీ	శ్లోకసూచి	పేజీ
నిత్యంయోగి	63	యోగక్షేమ	27
నిత్యంస్వోదర	48	రోధస్తోయ	50
నిత్యానంద	38	వక్షస్తాడనమంత	53
నిత్యాయత్రిగుణా	46	వక్షస్తాడన శంకయా	54
పాపోత్పాత	33	వచసాచరితం	71
పూజాద్రవ్య	68	వటుర్వా	9
ప్రచరత్యభితః	75	వస్త్రోద్ధూత	23
ప్రభుస్త్వం	11	విరించిః	11
ప్రలోభాద్యై	17	శంభుధ్యాన	38
ప్రాక్పుణ్యాచల	30	శివతవ	67
ఫలాద్యా	13	సదామోహా	15
బహువిధ	56	సదుపచార	63
బాడత్వం	66	సంధ్యాఘర్మ	45
బుద్ధిఃస్థిరా	62	సంధ్యారంభ	40
భక్తిర్మహేశ	62	సర్వాలంకార	76
భక్తోభక్తి	28	సహస్ర	3
భూదారతా	59	సారసనా	73
భృంగీచ్ఛా	42	సారూప్యం	22
మనస్తేపాదా	6	సోమకళా	73
మాగచ్ఛస్వ	34	స్తవైర్బ్రహ్మా	19
మార్గావర్తిత	53	స్తోత్రేణాల	78
యథాబుద్ధిః	7	స్మృతౌశాస్త్రే	4
యదాకృతాంఛో	70	హంసఃపద్మ	49

సౌన్దర్యలహరి శ్లోకసూచి

శ్లోకసూచి	పేజీ	శ్లోకసూచి	పేజీ
అమూతేవ	134	చతుర్భిః శ్రీ	88
అరాళం తే	123	జగత్సూతే	97
అరాళా కే	148	జపో జల్పః	99
అరాలైః స్వా	113	తటిల్లేఖా	95
అవిద్యానా	81	తటిత్వన్తం	109
అవిశ్రాంతం	127	తనీయాంసం	80
అసౌ నాసా	125	తనుచ్ఛాయా	93
అహఃసూతే	115	తవస్తన్యం	135
కదా కాలే	152	తవస్వాధిష్ఠా	108
కరాగ్రేణ	130	తవాజ్ఞా చ	106
కరీంద్రాణాం	140	తవాధారే	110
కళఙ్కః క	149	తవాపర్ణే	121
కళత్రం వై	150	త్రయాణాం దే	098
కవీనాంసం	117	త్వదన్యః పాణి	082
కవీంద్రాణాం	91	త్వదీయంసౌం	089
కిరంతీమం	94	త్వయాహృత్వా	096
కిరీటం వై	100	దదానే	146
కుచౌ సద్యఃl	139	దృశా ద్రాఘీ	122
క్వణత్కాంచీ	84	ధనుఃపౌష్పం	83
క్షితౌ షట్పం	90	ధునోతు ధ్వా	111
గతాస్తేమం	147	నఖానాము	132
గతే కర్ణా	118	నఖైర్నాక	145
గతైర్మాణి	111	నమోవాకం	142
గళే రేఖాः	131	నరం వర్షీయాం	89
గిరామాహుः	151	నిధే నిత్య	155
గురుత్వం వి	139	నిమేషోన్మేష	120
చతుఃషష్ట్యా	102	నిసర్గక్షీణ	138

శ్లోకసూచి	పేజీ	శ్లోకసూచి	పేజీ
పదం తే కీ	144	విశుద్ధే తే	106
పదన్యాస	146	శరజ్జ్యోత్స్నా	91
పరాజేతుం	141	శరీరం త్వం	104
పవిత్రీక	119	శివః శక్తిః	103
పురారాతే	150	శివః శక్త్యా	80
ప్రకృత్యార	126	శివేశ్వంగా	117
ప్రదీపజ్వాలా	153	శ్రుతీనాం మూ	141
భవాని త్వం	96	సమం దేవి	133
భుజాశ్లేషా	130	సమున్మీల	107
భ్రువౌ భుగ్నే	114	సరస్వత్యాః	153
మనస్త్వం వ్యో	105	సరస్వత్యా	124
మహీం మూలా	86	సముద్భూత	154
ముఖం బిందుం	93	సవిత్రీభిర్వా	92
మృడాణీమృ	132	సుధాధారా	87
మృషాకృత్వా	143	సుధామప్యా	100
యదేతత్కాళి	137	సుధాసింధోః	85
రడే జిత్వా	128	స్థిరో గంగా	137
లలాటం లా	114	స్ఫురద్గండా	123
వహత్యంబి	135	స్మరం యోనిం	104
వహన్తీ సిం	112	స్మితజ్యోత్స్నా	127
విపంచ్యాగా	129	స్వదేహోద్భూ	101
విభక్తత్రై	119	హరక్రోధ	136
విరించిః పం	98	హరిస్త్వామా	83
విశాలాక	116	హిమానీహ	144